‘జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 279

మంగళవారం 30-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

శాంతి ఒప్పందానికి చేరువలో..

ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ - 6లో

మెటల్స్.. క్రాష్

వెండి భారీ పతనం..
అదే బాటలో పసిడి, రాగి - బిజినెస్‌లో

MARUTI SUZUKI ARENA
VICTORIS
HYBRID
VICTORIS
VICTORIS
GOT IT ALL
SCAN AND CONNECT TO
A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT
WWW.MARUTISUZUKI.COM
CONTACT US AT 1800-102-1800
Applicable T&C available at your nearest dealership. Creative visualization. Car colour may vary due to printing on paper. Images used are for illustration purposes only. Features may vary by model/conditions.
VICTORIS

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 279

మంగళవారం 30-12-2025

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

వచ్చే ఏడాదైనా మేల్ ఎంచుదాం

2025లో పురుషుల పరిస్థితిపై ప్రత్యేక కథనం - 11లో

కొంచెం మోదం.. కొంచెం ఖేదం

2025లో అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడలకు మిశ్రమ ఫలితాలు - 12లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జైలులోనే సెంగార్

రేప్ కేసులో మాజీ ఎమ్మెల్యేకు జీవిత ఖైదును రద్దు చేసి బెయిల్ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది.

వివరాలు 6లో ▸



ఆరావళి వివాదంలో కీలక మలుపు

ఆరావళి పర్వత శ్రేణిలో 100 మీటర్లకుపైగా ఎత్తున్న వాటినే పర్వతాలుగా పరిగణిస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీం నిలుపుదల చేసింది.

వివరాలు 6లో ▸

సైనిక కొనుగోళ్లకు ఆమోదం

సైన్యం సామర్థ్యాన్ని పెంపొందించడానికి రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ కొనుగోళ్లకు కేంద్రం ఆమోదం తెలిపింది.

వివరాలు 6లో ▸

పది ఇండిగో విమానాల రద్దు

హైదరాబాద్ నుంచి విశాఖ, కొచ్చి, ఢిల్లీ, ఛండీగఢ్ మధ్య రాకపోకలు సాగించే పది ఇండిగో విమానాలు రద్దయ్యాయి.

వివరాలు 14లో ▸

న్యూస్‌రీల్

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం సోమవారం అర్ధరాత్రి ప్రారంభమైంది. టీటీడీ 10 రోజులపాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనుంది. టోకెన్లు కలిగిన భక్తులనే అనుమతిస్తున్నట్లు టీటీడీ తెలిపింది.

వివరాలు 5లో ▸

మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్

ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ–అడ్వాన్స్‌డ్ పరీక్షల తేదీలను ఐఐటీ రూర్కీ ప్రకటించింది. మే 17వ తేదీ ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

వివరాలు 14లో ▸

అమెరికాలో ఇద్దరు తెలుగు యువతులు మృతి

ఇద్దరు తెలుగు యువతులు కాలిఫోర్నియా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. విహారయాత్రకు వెళ్లి వస్తుండగా కారు లోయలో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది.

వివరాలు 14లో ▸

మూడు జెండాలు జతకట్టి ఊతకర్రల సాయంతో పాలన

రాష్ట్రంలో గత ఎన్నికల్లో మూడు జెండాలు జతకట్టి అరువు తెచ్చుకున్న ఆలోచనలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా అధికారంలోకి వచ్చారని, అందుకే ఊతకర్రల సాయంతో పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

వివరాలు 3లో ▸

ఇదండీ సంగతి



నోబెల్ వచ్చేదాకా ముగింపు ఉండదా సార్!

బాదుడే బాదుడు

కొత్త కొత్త పేర్లతో పన్నుల మోత మోగిస్తున్న చంద్రబాబు

తాజాగా వాహన కొనుగోళ్లపై 10శాతం భారీ సెస్ విధింపు

ఏటా రూ.270 కోట్ల మేర రాష్ట్ర ప్రజల జేబులకు చిల్లు

ఇటీవలి వరకు వాహనాల లైఫ్ ట్యాక్స్‌లో 28 శాతం జీఎస్టీ.. శ్లాబ్‌ల సరళీకరణలో దానిని 18 శాతానికి తగ్గించిన కేంద్రం

కానీ, ఇంతలోనే 10శాతం సెస్‌తో బాబు సర్కారు బాదుడు

ఇప్పటికే భూ క్రయవిక్రయాలపై రిజిస్ట్రేషన్ చార్జీల రెట్టింపు

ఏడాదిన్నరలో రూ.17,349 కోట్ల విద్యుత్ చార్జీల పెంపు..

తాగునీటిపై రూ.1,036.97 కోట్ల యూజర్ చార్జీల మోత

బాబు ప్రభుత్వ నిర్వాకంతో ప్రజలపై పెను ఆర్థిక భారం

2లో

విద్యుత్ చార్జీల వీర బాదుడు... భూముల క్రయవిక్రయాలపై రిజిస్ట్రేషన్ చార్జీల అదనపు మోత... తాగునీటిపై ఎప్పుడంటే అప్పుడు యూజర్ చార్జీల భారం! ఇవన్నీ చాలదన్నట్లు వాహనాల కొనుగోలుపై భారీగా సెస్ విధింపుతో సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలపై మళ్లీ పన్ను బాదుడుకు సిద్ధమయ్యారు.

వివిధ పేర్లతో అన్ని వర్గాల వారిపై పన్నుల మోత మోగిస్తున్న ఆయన ఈసారి వాహనదారులను లక్ష్యంగా చేసుకున్నారు. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చింది మొదలు ప్రజలపై ఎడాపెడా పన్నుల బాదుడే లక్ష్యంగా సాగుతోంది బాబు ప్రభుత్వ పాలన. అదనపు పన్నుల మోతతో వీలున్న ప్రతి రంగంలోనూ జనం జేబులకు చిల్లులు పెడుతూ వస్తున్నప్పటికీ చంద్రబాబు శాంతించలేదు. తాజాగా మంత్రివర్గ సమావేశం వేదికగా మరో రుసుముల కొరడా ఝుళిపించారు. తన మార్కు బాదుడుకు ఇదే నిదర్శనం అని చాటారు.

గ్రామ, వార్డు సచివాలయాల

పేర్లు మార్పు

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులుగా నామకరణం

- మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా
- ఇక రాయచోటి మదనపల్లెలో భాగం
- రంపచోడవరం నియోజకవర్గంతో పోలవరం జిల్లా.. నాలుగు నియోజక వర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు
- పలు మండలాలు అటు ఇటూ మార్పులు
- పెద్దాపురం మండలంలోకి సామర్లకోట.. రాజమండ్రిలోకి మండపేట మండలం
- పెనుగొండ మండలం పేరు వాసవి పెనుగొండగా మార్పు.. రైల్వేకోడూరు తిరుపతి జిల్లాకు.. రాజంపేట కడపలోకి..
- అద్దంకి నియోజకవర్గం ప్రకాశం జిల్లాకు

2లో

- బాపట్ల జిల్లాలో టీడీపీ ఆఫీసుకు రెండెకరాల ప్రభుత్వ భూమి లీజుకు..
- వైద్య కళాశాలల టెండర్ల గడువు పొడిగింపుపై పరిశీలన.. కేబినెట్ నిర్ణయాలు మీడియాకు వెల్లడించిన మంత్రులు అనగాని, నాదెండ్ల, సత్యకుమార్

కేబినెట్ భేటీలో హైడ్రామా

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు పెట్టుకున్నట్లు లీకులు

రాయచోటిని రద్దుచేస్తే రాజీనామా చేస్తానని తొలుత మంత్రి బీరాలు

ఇప్పుడు చంద్రబాబు చెప్పినట్లు తలూపుకుంటూ సంతకం

మంత్రిపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం

ఆయన్ని ఓదారుస్తున్నట్లు సీఎం నాటకాలు

2లో

జిల్లా కేంద్రాన్ని కొనసాగించకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధం

2లో

- రాయచోటిపై కూటమి కక్షలో భాగమే జిల్లా కేంద్రం రద్దు
- రేపు రాయచోటిలో ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ నేత గడికోట

1,500 ఏళ్ల నాటి ప్రాచీన పద్ధతిలో ఇండియన్ నేవీ తయారు చేసిన ఈ నౌక పేరు ఐఎన్ఎస్‌వీ కౌండిన్య. ఇది సోమవారం పోర్బందర్ నుంచి ఒమన్‌కు తన ప్రయాణం మొదలుపెట్టింది.

6లో

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు

ఒకరు మినహా అంతా సేఫ్

- అనకాపల్లి జిల్లా నర్సింగిబిల్లి-యలమంచిలి స్టేషన్ల మధ్య రెండు ఏసీ బోగీలు దగ్ధం
- బీ1 బోగీలో విజయవాడ వాసి సజీవ దహనం
- ఆదివారం అర్ధరాత్రి 12.45 గంటలకు ఘటన
- బ్రేక్ వేసినప్పుడు ప్రెజర్‌లో తేడాల వల్ల నిప్పు రాజుకుని మంటలు చెలరేగాయని ప్రాథమికంగా నిర్ధారణ
- ప్రయాణికుడు చైన్ లాగడంతో తప్పిన పెనుప్రమాదం

3లో

మంటల్లో కాలిపోతున్న బోగీలు

అంతటా దాడులూ..

దౌర్జన్యాలే..

రాష్ట్రంలో పూర్తిగా అదుపుతప్పిన శాంతిభద్రతలు

స్పష్టం చేసిన పోలీసు శాఖ వార్షిక నివేదిక

- ఫలించని కనికట్టుయత్నం
- తిరుపతికి లక్షల్లో భక్తులు వస్తే భద్రత కల్పించడం కష్టమన్న డీజీపీ గుప్తా
- మహిళల భద్రతపై జనరలైజ్ చేసి మాట్లాడటం సరికాదంటూ పవన్‌కళ్యాణ్‌కు కౌంటర్

14లో

క్లుప్తంగా...

ఎమ్మెల్యే విరూపాక్షికి వైఎస్ జగన్ పరామర్శ

ఆలూరు రూరల్: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో రెండు మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్న కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆర్యోగంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

హంపి, అర్జున్‌లకు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: దోహాలో జరిగిన వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్–2025లో కాంస్య పతకాలు గెలిచిన కోనేరు హంపి, ఇరిగేశి అర్జున్‌లకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. 'వారి దృఢ సంకల్పం, ఆటతీరు, పోరాట స్ఫూర్తి అందరికీ గర్వకారణం. వీరిద్దరి ఆటతీరు చాలామంది యువ చెస్ ఆటగాళ్లు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ప్రేరేపించింది' అని వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

మరో ముగ్గురు సలహాదారుల నియామకం

మాస్ కమ్యూనికేషన్స్ సలహాదారుగా ఈనాడు మాజీ కార్టూనిస్ట్ శ్రీధర్

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు సలహాదారుల పేరిట తమకు కావాల్సినవారికి పదవులను కట్టబెడుతూనే ఉంది. ఇప్పటికే 35 మందిని ప్రభుత్వ సలహాదారులుగా నియమించుకున్న చంద్రబాబు సర్కారు... తాజాగా మరో ముగ్గురిని సలహాదారులుగా నియమించింది. యోగా నేచురోపతి సలహాదారునిగా డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు, మాస్ కమ్యూనికేషన్స్ సలహాదారునిగా తెలంగాణకు చెందిన ఈనాడు మాజీ కార్టూనిస్ట్ పి.శ్రీధర్‌రావు(శ్రీధర్), దేవదాయ శాఖ సలహాదారునిగా చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు రెండేళ్లపాటు పదవుల్లో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్రానికి 8 మంది ఐపీఎస్ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి 2022 బ్యాచ్‌కు చెందిన 8మంది ఐపీఎస్ అధికారులను కేటాయిస్తూ కేంద్ర హోం శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో అశ్విన్ మణిదీప్ కాకుమాను, జీనుశ్రీ జశ్వంత్ చంద్ర, గణేశ్నా భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష, తరుణ్, జయ శర్మ, జాదవ్‌రావు నిరంజన్ మహేంద్రసింగ్, బన్న వెంకటేశ్, తరుణ్ ప్రతాప్ మౌర్య ఉన్నారు.

రాజకీయ కోణంలో జిల్లాల విభజన సరికాదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ కోణంలో జిల్లాల పునర్విభజనను ఇష్టానుసారంగా ముక్కచెక్కలుగా మార్చడం సరికాదని, ప్రభుత్వ చర్య స్థానిక ప్రజల మనోభావాలను కించపరిచేలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు, రాజంపేటను కడప జిల్లాకు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు, గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలుపుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబట్టారు. ఆయా ప్రాంతాల్లోని నిరసనలు, ఉద్యమాలు, ప్రజల అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్విభజనపై పున:పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. కాగా,ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణలో చట్ట విరుద్ధమైన చర్యలు, అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

జల వివాదాలపై కమిటీ ఏర్పాటులో కదలిక

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ అధికారుల నేతృత్వంలో ఇరు రాష్ట్రాల అధికారులతో సంయుక్త కమిటీ ఏర్పాటులో కదలిక వచ్చింది. ఆ కమిటీలో ఉండాల్సిన అధికారుల పేర్లను రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్ర జల్ శక్తి శాఖకు ప్రతిపాదించాయి. ఏపీ తరపున రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆ శాఖ సలహాదారుడు, జలవనరుల శాఖ ఈఎన్సీ (ఇరిగేషన్), అంతర్రాష్ట్ర జల వ్యవహారాల విభాగం సీఈలను కమిటీలో నియమించాలని ఈ నెల 15న కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. తెలంగాణ తరపున ఆ రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారుడు, శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి, ఈఎన్సీ (జనరల్), జాయింట్ సెక్రటరీ (టెక్నికల్), అంతర్రాష్ట్ర జల విభాగం ఎస్ఈ, డిప్యూటీ డైరెక్టర్ (గోదావరి బేసిన్)లను నియమించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తూ ఈ నెల 27న కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాసింది.

బాబు... బాదుడే బాదుడు

కొత్త కొత్త పేర్లతో పన్నుల మోత మోగిస్తున్న చంద్రబాబు

తాజాగా వాహన కొనుగోళ్లపై 10 శాతం భారీ సెస్ విధింపు

సాక్షి, అమరావతి అంతుపొంతు లేకుండా సాగుతున్న చంద్రబాబు సర్కారు పన్నుల మోత రాష్ట్ర ప్రజలపై పెనుభారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆర్థికంగా కుంగదీసే మరో బాదుడుకు సిద్ధమైంది. వాహనాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఊరటను రాష్ట్ర ప్రజలకు లేకుండా చేస్తోంది. ''రహదారి భద్రత సెస్'' పేరిట ఏటా ఏకంగా రూ.270 కోట్లు బాదేయనుంది. యథాప్రకారం ఇందులో సరికొత్త దోపిడీకి తెరవెనుక పావులు కదుపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రంలో విక్రయించే వాహనాలపై 10 శాతం రహదారి భద్రత సెస్ వేయాలని బాబు సర్కారు నిర్ణయించింది. వాహనాల లైఫ్ ట్యాక్స్‌లో ఈ సెస్ విధించాలని మంత్రివర్గ సమావేశంలో తీర్మానించింది. అందుకోసం ఆర్డినెన్స్ జారీ చేస్తామని ప్రకటించింది. దాదాపు పదేళ్లుగా వాహనాల లైఫ్ ట్యాక్స్‌లో 28 శాతం జీఎస్టీ విధించేవారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను సరళం చేసింది. వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. దీంతో కాస్త ఊరట లభించిందని రాష్ట ప్రజలు భావించారు. కానీ, ఈలోపే వాహనాలపై 10% రహదారి భద్రతా సెస్‌తో చంద్రబాబు పన్నుల కొరడా ఝుళిపించారు.

- ప్రభుత్వం చెప్పిన అధికారిక లెక్కలు ప్రజలపై పడనున్న భారీ ఆర్థిక భారాన్ని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఏటా 73 వేల వాహనాలను విక్రయిస్తారు. వాటిపై లైఫ్ ట్యాక్స్‌లో 10 శాతం సెస్ వేస్తే నెలకు రూ.22.50 కోట్లు కానుంది. ఆ ప్రకారం వాహన కొనుగోలుదారులపై ఏటా రూ.270 కోట్లు పన్ను మోత మోగనుంది. స్కూటర్ల నుంచి లారీల వరకు ముున్ముందు వాహన విక్రయాలు పెరిగితే అందుకు తగినట్లే పన్ను భారం పెరుగుతుంది.



రహదారి భద్రత ముసుగే... దోపిడీయే అసలు కథ

చంద్రబాబు ప్రభుత్వం వేసిన రహదారి భద్రత సెస్ అనేది దోపిడీ ఓ ముసుగు మాత్రమేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎలాగంటే... సెస్ బాదుడు ద్వారా వచ్చిన నిధులను ఎలా వెచ్చిస్తామన్నది మంత్రులు వెల్లడించలేదు. అంటే, సెస్ ద్వారా వచ్చిన మొత్తాన్ని దారిమళ్లిస్తారని పేర్కొంటున్నారు. రహదారి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను అందుకోసం ఖర్చు చేయని విషయాన్ని గుర్తు చేస్తున్నారు. హోం, వైద్యఆరోగ్య, ఆర్అండ్‌బీ శాఖల సంయుక్త కమిటీల ద్వారా నిధులను వెచ్చించాల్సి ఉండగా, ఆ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పాటించడమే లేదు. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం సెస్ పేరిట ఏటా వసూలు చేసే రూ.270 కోట్లను సద్వినియోగం చేస్తుందనే నమ్మకం ఏమాత్రం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు అస్మదీయులకు అడ్డదారిలో కాంట్రాక్టు పనుల పేరిట దోచిపెడతారని ఆరోపిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల చార్జీలు 50 శాతం పెంపు

చంద్రబాబు ప్రభుత్వం గత సంవత్సరం రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచింది. ప్రజలపై సుమారు రూ.వెయ్యి కోట్ల భారంపడింది. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువలను 50 నుంచి 60 శాతం పెంచారు. అర్బన్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రంగా కనిపించింది. భూముల విలువతో పాటు నిర్మాణాల విలువను అమాంతం పెంచి రిజిస్ట్రేషన్ చార్జీలు దండుకుంటున్నారు. పూరిళ్లు, రేకుల షెడ్లు, పెంకుటిళ్లు, గోడలు లేని ఇళ్లను కూడా వదలకుండా విలువను పెంచారు. ఫలితంగా అపార్టుమెంట్లలో ఫ్లాట్లు, ఇళ్లు కొన్నవారిపై భారంపడింది. భూముల విలువ పెంపును తక్కువగా చూపేందుకు ప్రస్తుతం భూముల క్లాసిఫికేషన్లను మార్చేశారు. దీంతో ఏరియాను బట్టి కాక స్థలాన్ని బట్టి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగిపోయాయి. గతంలో చార్జీలు రూ.2 లక్షలు ఉండగా, రూ.50 వేల వరకు పెరిగాయి.

బాబు వస్తూనే బాదుడు మొదలు

''అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేది లేదు. అవసరమైతే తగ్గిస్తాం. వినియోగదారులే విద్యుత్ అమ్ముకునేలా చేస్తాం'' అంటూ ప్రగల్భాలు పలికారు చంద్రబాబు. ఇంతలా నమ్మబలికిన ఆయన అధికారం చేతికి రాగానే అసలు స్వభావం బయట పెట్టుకున్నారు. బాబు వస్తూనే రూ.15,485.36 కోట్ల భారీ భారాన్ని ప్రజలపై వేసి చార్జీల బాదుడుకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది చివరి నుంచే రూ.6,072.86 కోట్లను వసూలు చేస్తుండగా, ఈ ఏడాది జనవరి బిల్లు నుంచి మరో రూ.9,412.50 కోట్ల భారాన్ని జోడించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది వసూలు చేసిన రూ.2,787.18 కోట్లలో రూ.1,863.64 కోట్లకు ఏపీ ఈఆర్‌సీ అనుమతి లభించింది. అంటే, బాబు ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే ఏకంగా రూ.17,349 కోట్ల భారం ప్రజలపై మోపినట్లైంది. దీంతో ప్రజలకు కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి. రూ.వేలల్లో వస్తున్న బిల్లులపై ప్రజలు మండిపడుతున్నా, ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా బాబు ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదు, సరికదా ఇంకా చార్జీల భారం వేస్తూనే ఉంది. దీంతో వాడిన విద్యుత్‌కు సమానంగా అదనపు చార్జీలు పడుతున్నాయి. ఇంతలేసి బిల్లులు కట్టలేం బాబూ అంటూ జనం గగ్గోలు పెడుతూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

తాగునీటిపై యూజర్ చార్జీలు అనుకున్నప్పుడు అమలు!

గ్రామాల్లో ప్రజలు తాగేందుకు రక్షిత పథకాల ద్వారా సరఫరా చేసే నీటిపైనా యూజర్ చార్జీలు వసూలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాల్లోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు, బోర్ల నిర్వహణ, మరమ్మతులకు ఏడాదికి రూ.1680.29 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి, అందులో రూ.1,036.97 కోట్లను ప్రజల నుంచి యూజర్ చార్జీలుగా పిండుకోవాలని చూస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదం తెలిపి, 'ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ' పాలసీ రూపొందించి నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. దీనిప్రకారం రెండు కంటే ఎక్కువ గ్రామాలకు ఒకే రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా జరిగేచోట ఒక్కో వ్యక్తిపై నెలకు రూ.26.66 చొప్పున ఏడాదికి రూ.320 భారం మోపనున్నారు. గ్రామ పరిధిలో అంతర్గతంగా చిన్న రక్షిత తాగునీటి పథకం ఉన్నచోట ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.20 వంతున ఏడాదికి రూ.240 యూజర్ చార్జీ వసూలు చేయాలని నిర్ణయించారు. కాగా, ''ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ'' పాలసీకి యూజర్ చార్జీల వసూలు ఎప్పటినుంచి అన్నది ప్రత్యేకంగా పేర్కొనలేదు. కానీ, నోటిఫికేషన్ ప్రభుత్వ జీవో రూపంలో జారీ అయినందున ఎప్పుడనుకుంటే అప్పటినుంచి యూజర్ చార్జీల వసూలు ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్పు

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులుగా నామకరణం

- మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా
- ఇక రాయచోటి మదనపల్లెలో భాగంగా ఉంటుంది
- రంపచోడవరం నియోజకవర్గంతో పోలవరం జిల్లా..
- నాలుగు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల పేరును చంద్రబాబు సర్కారు మార్చేయనుంది. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం పేర్లకు బదులు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులుగా నామకరణం చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ మేరకు నిర్ణయించింది. అలాగే, రెండు కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు పలు మండలాలను అటూ ఇటూ మార్చనున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చనున్నారు. మోటారు వాహనాల లైఫ్‌టాక్స్‌పై 10 శాతం చొప్పున రోడ్ సేఫ్టీ సెస్ విధించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు మోటార్ వాహనాల పన్నుల చట్టం–1963లో పలు వసరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు..

రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు..

జిల్లాల పునర్విభజనలో భాగంగా రెండు కొత్త జిల్లాలను ఏర్పాటుచేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రంపచోడవరం నియోజకర్గంతో పోలవరం జిల్లా.. నాలుగు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటు.

మంత్రులు అనగాని, నాదెండ్ల, సత్యకుమార్

- రాయచోటికి బదులుగా మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లాను మార్పుచేస్తున్నారు. రాయచోటి మదనపల్లిలో భాగంగా ఉంటుంది. తొమ్మిది జిల్లాల్లో ఎటువంటి మార్పులు చేయలేదని.. 17 జిల్లాల్లో 25 మార్పులు చేసినట్లు మంత్రి అనగాని తెలిపారు. పలు మండలాలను అటు ఇటూ మార్పులు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ మార్పులు చేర్పులతో ఈనెల 31న గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుందని, వచ్చేనెల 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తాయన్నారు.
- సామర్లకోటను పెద్దాపురం మండలంలోకి.. మండపేట మండలాన్ని రాజమండ్రిలో కలపనున్నారు. పెనుగొండ మండలం పేరు వాసవి పెనుగొండగా.. రైల్వేకోడూరు తిరుపతి జిల్లాకు.. రాజంపేట కడపలోకి.. సిద్దవటం ఒంటిమిట్ట కడపలోకి మారుస్తున్నారు. మడకసిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకానుంది. బాపట్ల నుంచి అద్దంకి నియోజకవర్గం తిరిగి ప్రకాశం జిల్లాకు మార్పు. గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాకు.. మరో రెండు మండలాలను తిరుపతి జిల్లాకు మార్పు. ఆదోని మండలాన్ని ఆదోని–1 మండలం, ఆదోని–2 మండలంగా మార్పు. గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలున్నాయి.
- మోటారు వాహనాల లైఫ్‌టాక్స్‌పై 10 శాతం చొప్పున రోడ్ సేఫ్టీ సెస్ విధింపు. ఈ సెస్ మొత్తాన్ని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీచేసి రోడ్ల మెరుగుదల, రోడ్డు భద్రతా చర్యలను చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ రోడ్ సేఫ్టీ సెస్ ద్వారా ఏటా రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించడంతో వాహన కొనుగోలుదారులకు కొంత ఆదా అవుతోంది. ఈ చిన్న సెస్ విధించడం వల్ల వాహన యజమానులపై ఆర్థిక భారం పెద్దగా ఉండదని ప్రభుత్వం భావిస్తోంది.
- దుగ్గరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, షిప్ బిల్డింగ్ క్లస్టర్ స్థాపనకు గ్రీన్‌సిగ్నల్.
- నెల్లూరు జిల్లా దామవరం గ్రామంలో 418.14 ఎకరాల భూమిని దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం సేకరించేందుకు ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అనుమతి. అలాగే, జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన దాని ప్రకారం శాశ్వత లీజ్ హోల్డర్లకు ఎకరాకు రూ.13 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు అంగీకారం.
- బాపట్ల మండలంలోని వెస్ట్ బాపట్ల గ్రామంలో ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిని బాపట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడికి లీజ్ పద్ధతిలో కేటాయించి, టీడీపీ జిల్లా కార్యాలయ భవనం నిర్మాణానికి అనుమతి. ఎకరాకు సంవత్సరానికి రూ.1,000 చొప్పున లీజ్ రుసుము చెల్లిస్తూ, 33 ఏళ్లపాటు లీజుకు ఆమోదం.
- ఎన్ఎస్సీఎఫ్‌డీసీ (జాతీయ షెడ్యూలు కులాల ఆర్థిక అభివృద్ధి సంస్థ) ద్వారా ఎస్సీలు తీసుకున్న రుణాలపై వడ్డీ రూ.41 కోట్లు మాఫీ.
- అమరావతిలో యోగా నేచురోపతి ఇనిస్టిట్యూషన్‌కు భూమి కేటాయింపు. అలాగే, విశాఖలో ఆసుపత్రి ఏర్పాటుకు కూడా..
- తొలుత ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం. అలాగే, విద్యుత్ రంగంలో మరిన్ని అప్పులకు అనుమతి.
- సీఆర్‌డీఏలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలుకు నాబార్డు నుండి రూ.7,387.70 కోట్ల రుణం పొందేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి.
- సీఆర్‌డీఏలో ఉండవల్లి వద్ద ఫ్లడ్ పంపింగ్ స్టేషన్–2 కమిషనింగ్ (కెపాసిటీ 8,400 క్యూసెక్) 15 ఏళ్ల ఆపరేషన్–మెయింటెనెన్స్‌తో లంప్‌సమ్ కాంట్రాక్టు ప్రాతిపదికన ఎల్–1 బిడ్ ఆమోదించేందుకు అనుమతి.
- మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.1,673.51 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రతిపాదనకు ఆమోదం.
- డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో 9.88 ఎకరాల లీజును మూడేళ్ల కాలానికి పునరుద్ధరించాలన్న రెవెన్యూ శాఖ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్. ఈ భూమిని వేదాంత లిమిటెడ్‌కు ఆన్‌షోర్ డ్రిల్లింగ్ కార్యకలాపాల కోసం కేటాయించనున్నారు.
- సీఆర్‌డీఏ ప్రాంతంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపునకు సంబంధించిన మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులకు ఓకే.
- హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు–ఫేజ్– ఐ–స్టేజ్– ఐలోని పంపింగ్ స్టేషన్లకు ఆమోదించిన డిజైన్లు/డ్రాయింగ్‌ల ప్రకారం ఇండక్షన్ మోటార్లలో పెరిగిన మెగావాట్ కెపాసిటీ కోసం అదనపు ఖర్చు రూ.76,80,000ల మొత్తానికి పరిపాలనా అంగీకారం.
- రాజముద్రతో త్వరలోనే 21.87 లక్షల మంది రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ.

పీపీపీ విధానంలోనే మెడికల్ కాలేజీలు..

ఇక వైద్య కళాశాలల నిర్మాణానికి పీపీపీ విధానంలోనే ముందుకెళ్తామని, వెనక్కు వెళ్లేదిలేదని మంత్రి సత్యకుమార్ స్పష్టంచేశారు. ఆదోని వైద్య కళాశాలకు రాజ్‌కుమార్ ప్రేమ్‌చంద్ షా బిడ్ దాఖలు చేశారని, మరికొన్ని సమర్పించడానికి గడువు కోరారని, అయితే.. గడువు పొడిగించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఒక్క బిడ్ వచ్చినాసరే ముందుకెళ్తామని మంత్రి తేల్చిచెప్పారు.

కేబినెట్ భేటీలో హైడ్రామా

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు పెట్టుకున్నట్లు లీకులు
- రాయచోటిని రద్దుచేస్తే రాజీనామా చేస్తానని తొలుత మంత్రి బీరాలు

సాక్షి, అమరావతి: జిల్లాల పునర్విభజనలో రాయచోటి ప్రాంతాన్ని చావుదెబ్బ కొట్టిన తర్వాత కూడా అక్కడి ప్రజలను మాయచేసేందుకు సీఎం చంద్రబాబు తనదైన శైలిలో డ్రామాకు తెరలేపారు. ఇందుకు సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశాన్ని వేదికగా చేసుకున్నారు. రాయచోటి ఎమ్మెల్యేగా మంత్రివర్గంలో ఉన్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కన్నీరు పెట్టుకున్నట్లు, చంద్రబాబు ఆయన్ను ఓదార్చినట్లు అనుకూల మీడియాకు లీకులిచ్చి ప్రచారం చేసుకున్నారు. నిజానికి.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాయచోటి నుంచి జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకి తరలిస్తున్నా రాంప్రసాద్‌రెడ్డి కళ్లప్పగించి చూడడం తప్ప ఏమీచేయలేకపోయారు. పునర్విభజన ప్రక్రియ ప్రారంభమైనప్పుడు రాయచోటి నుంచి జిల్లా కేంద్రాన్ని తరలిస్తే తన పదవులకు రాజీనామా చేస్తానని బీరాలు పలికిన ఆయన ఇప్పుడు కేబినెట్ భేటీలో అందుకు సమ్మతి తెలుపుతూ సంతకం పెట్టారు. తన సొంత ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతున్నా మాట్లాడకుండా చంద్రబాబు చెప్పిందల్లా చేసి ఇప్పుడు సానుభూతి కోసం కన్నీరు పెట్టుకున్నట్లు డ్రామాలాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి కోసం పోరాడారని.. అయినా జిల్లా కేంద్రాన్ని అక్కడి నుంచి తరలించాల్సి వచ్చిందని చంద్రబాబు చిలక పలుకులు పలికినట్లు లీకులు వచ్చాయి. ఆ ప్రాంతం గొంతు పిసికి తీరిగ్గా సంతాపం వ్యక్తంచేసినట్లుగా చంద్రబాబు తీరు ఉందని స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. తాజా నిర్ణయంతో మంత్రి స్థానికంగా తిరగలేని పరిస్థితి ఉంటుందని గ్రహించిన చంద్రబాబు ఈ డ్రామా ఆడించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు తగ్గట్లుగానే ఆయన మంత్రివర్గ సమావేశం నుంచి కళ్లు తుడుచుకుంటూ వచ్చి కారెక్కి వెళ్లిపోయారు. ఇక భావోద్వేగంతో ఆయన మాట్లాడలేకపోతున్నారని ఆయన సిబ్బంది సెలవిచ్చారు.

మంత్రి రాజీనామా శపథం ఏమైంది?

నిజంగా రాయచోటి ప్రాంతానికి మేలు చేయాలని ఉంటే మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తాను శపథం చేసినట్లు ఈ పాటికే రాజీనామా చేయాలి. కానీ, ఆ పని చేయకపోగా చంద్రబాబు ఎదుట తన ప్రాంతం గోడును కూడా వినిపించకుండా ఆయన చెప్పినచోట సంతకం పెట్టారు. తన నియోజకవర్గానికి అన్యాయం జరిగేలా చేసిన ప్రతిపాదనకు తానే సంతకం పెట్టి ఆమోదముద్ర వేసిన ఘనకీర్తి రాంప్రసాద్‌రెడ్డికే దక్కుతుందని విమర్శకులు మండిపడుతున్నారు. మంత్రిగా ఉండి తన నియోజకవర్గంలో ఉన్న జిల్లా కేంద్రాన్ని ఆయన కాపాడుకోలేకపోవడం అసమర్థతేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు కూడా ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీకి విరుద్ధంగా రాయచోటి నుంచి జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకి మార్చేసి ప్రజాభిప్రాయం అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు.

జనాగ్రహం నుంచి గట్టెక్కేందుకే ఓదార్పు నాటకం..

ఇక జనాగ్రహం నుంచి తప్పించుకునేందుకు మంత్రి మండిపల్లిని ఓదార్చినట్లు.. జిల్లా కేంద్రాన్ని మార్చడంపట్ల తాను కూడా బాధపడినట్లు చంద్రబాబు లీకులిచ్చి నాటకాన్ని మరింత రంజింపచేశారు. అంత బాధపడేటప్పుడు జిల్లా కేంద్రాన్ని ఎందుకు మార్చారు? ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేనప్పుడు ఎందుకు హామీ ఇచ్చారు? దురాలోచన లేకపోతే ప్రాథమిక నోటిఫికేషన్‌లో ఒకలా తర్వాత మరోలా ఎందుకు ప్రతిపాదన మార్చాల్సి వచ్చింది? అనే ప్రశ్నలకు సమాధానాలు కరువయ్యాయి. ఇదంతా కేవలం ప్రజాగ్రహం నుంచి తప్పించుకునే జిమ్మిక్కులేననే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రాన్ని కొనసాగించకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధం

- చంద్రబాబు సహజ ధోరణి వెన్నుపోటే
- రాయచోటిపై కూటమి కక్షలో భాగమే జిల్లా కేంద్రం రద్దు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని కొనసాగించకుండా, జిల్లా పరిధిని రద్దు చేస్తామంటే ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజనకు సంబంధించిన క్యాబినెట్ సమావేశం సోమవారం ముగిసిన తరువాత శ్రీకాంత్ రెడ్డి వీడియో విడుదల చేశారు. అందులో చంద్రబాబు సహజ ధోరణి వెన్నుపోటు పొడవటమేనని చెప్పారు. భౌగోళికంగా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నిపుణుల కమిటీ సూచన మేరకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్, 4 అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసిందన్నారు. తక్కువ కాలంలో పోలీసు పెరేడ్ గ్రౌండ్, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఇతర 95 శాఖలకు జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నామని గుర్తుచేశారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయచోటికి వచ్చిన చంద్రబాబు జిల్లా కేంద్రంగా ఉండాలంటే రాయచోటిలో తమ పార్టీని గెలిపించాలని ప్రజలను మభ్యపెట్టి చివరకు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాయచోటిపై కక్షతోనే జిల్లా కేంద్రాన్ని , జిల్లాను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాజకీయ కక్షతోనే ఈ విధంగా అన్నమయ్య జిల్లాను రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో ఈ ప్రాంత వాసిగా రాయచోటికి మద్దతుగా జిల్లా కేంద్రాన్ని రద్దు చేస్తుంటే వ్యతిరేకించకుండా, కనీసం రాతపూర్వకంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రభుత్వానికి తెలియజేయకుండా స్వతహాగా మద్దతు పలికి, బయటకు వచ్చి కన్నీరు కార్చడం సమంజసం కాదని మంత్రి రాంప్రసాద్ రెడ్డిని ఉద్దేశించి శ్రీకాంత్ రెడ్డి తను విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంపై కుట్రలు పన్నుతున్నారని చాలా కాలంగా చెబుతున్నానని, జిల్లా కేంద్రాన్ని యథాతథంగా కొనసాగించాలని సీఎం చంద్రబాబుకు పూర్తి వివరాలతో లేఖ సమర్పించిన విషయాన్ని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రం సాధనకు ప్రజాపోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. రాయచోటిని, అన్నమయ్య జిల్లా పరిధిని యథతథంగా కొనసాగించాలని కోరుతూ బుధవారం రాయచోటిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నికీలలు

అనకాపల్లి జిల్లా నర్సింగిబిల్లి-యలమంచిలి స్టేషన్ల మధ్య రెండు ఏసీ బోగీలు దగ్ధం

బీ1 బోగీలో విజయవాడ వాసి సజీవ దహనం

సాక్షి, అనకాపల్లి/సామర్లకోట: ఎర్నాకుళం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. జార్ఖండ్‌లోని టాటానగర్ నుంచి కేరళలోని ఎర్నాకుళం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్–18189)లో అనకాపల్లి జిల్లా యలమంచిలి వద్ద భారీగా మంటలు చెలరేగాయి. అగ్నికీలలు ఎగిసిపడడంతో బీ–1, ఎం–2 ఏసీ బోగీలు దగ్ధమయ్యాయి. పొగ విపరీతంగా కమ్ముకోవడంతో బీ–1 బోగీలో ప్రయాణిస్తున్న విజయవాడ వాసి చంద్రశేఖర్ సుందర్ (70) అనే వృద్ధుడు స్పృహ తప్పి పడిపోయి.. అగ్నికీలల్లో సజీవ దహనమయ్యాడు. ఈ ఘటనతో యలమంచిలి రైల్వేస్టేషన్‌లో రెండు గంటలపాటు భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అనకాపల్లి, యలమంచిలి, నక్కపల్లి నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈలోపు లోకో పైలట్లు కాలిపోతున్న రెండు బోగీలను వేరుచేసి మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా అడ్డుకున్నారు.

పరుగులు తీసిన ప్రయాణికులు

మంటలు చెలరేగిన రెండు ఏసీ బోగీల్లోని ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ రైలు దిగి యలమంచిలి రైల్వే స్టేషన్‌లోకి పరుగులు తీశారు. లగేజీలను కూడా వదిలేసి పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ మంటల్లో రెండు బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సజీవ దహనమైన ఒక్కరు మినహా అంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదానికి గురైన రెండు బోగీలతోపాటు ఎం–2 బోగీని కూడా తప్పించి ఉదయం 7 గంటలకు రైలు బయల్దేరింది. ఆ బోగీల నుంచి దింపేసిన సుమారు 125 మంది ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లో కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తరలించారు. అక్కడ మూడు కొత్త బోగీలు అటాచ్ చేసి ప్రయాణికులను అదే రైలులో వారి గమ్యస్థానాలకు పంపించారు.

రైలు కదలికలో తేడా రావడంతో..

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో నర్సింగిబిల్లి-యలమంచిలి స్టేషన్ల మధ్య బ్రేకుల్లో తలెత్తిన లోపాల కారణంగా.. ఏసీ బోగీలో అర్ధరాత్రి సమయంలో పొగ రావడం మొదలైంది. ఆ తరువాత కొద్దిసేపట్లోనే యలమంచిలి స్టేషన్‌కు రైలు చేరుకుంది. వాస్తవానికి ఇక్కడ ఆ ట్రైన్‌కు హాల్టు లేదు. ఈ రైల్వేస్టేషన్‌లో లోకో పైలట్ల విశ్రాంతి గది ఉండటంతో ఒక పైలట్‌ను దించేందుకు రైలును ఆపినట్టు రైల్వే సిబ్బంది చెప్పారు. ముందుగా రైలు వేగాన్ని తగ్గించి.. స్టేషన్‌కు రాగానే బ్రేక్ వేశారు. ఆ సమయంలో బ్రేకుల్లో లోపాలున్నట్టు అర్థమైంది. బ్రేక్‌లు పట్టేయడం, రైలు కదలికలో తేడాను పైలట్లు గమనించారు. దిగి చెక్ చేయాలని భావిస్తున్న సమయంలోనే.. ప్రయాణికులు చైన్ లాగిన సంకేతాలు వచ్చాయి. దీంతో లోకో పైలట్లు వేగంగా చైన్ లాగిన బోగీలవైపు పరుగులు తీశారు. బోగీల్లో మంటలు మొదలవడంతో ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ.. ప్లాట్‌ఫామ్ పైకి దిగి పరుగులు తీశారు. యలమంచిలి రైల్వే స్టేషన్‌లో రైలును నిలపడంతో ప్రయాణికులు తొందరగా సులువుగా ప్లాట్‌ఫామ్‌పైకి దిగగలిగారు. ఫైర్ ఇంజిన్లు త్వరితగతిన చేరుకోగలిగాయి. అక్కడ రైల్వే పోలీసు సిబ్బంది కూడా ఉండటం వల్ల వేగవంతంగా సహాయక చర్యలు చేపట్టగలిగారు. లేదంటే భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని అధికారులు చెప్పారు.

మృతుడి బ్యాగ్‌లో నగదు, బంగారం గుర్తింపు

ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్ సుందర్ బ్యాగులో నగదు, బంగారం ఉన్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల సమక్షంలో బ్యాగును తెరిచి చూడగా.. అందులో రూ.6.50 లక్షల నగదు, బంగారం ఉంది. చాలావరకు నోట్ల కట్టలు కాలిపోయి ఉన్నాయి. మృతుడు విజయవాడలో హోల్‌సేల్ వస్త్ర వ్యాపారం చేస్తుంటారు. విజయనగరంలో ఒక వస్త్ర దుకాణం నుంచి డబ్బు వసూలు చేసుకుని విజయవాడ వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి బ్యాగ్‌లో దొరికిన రూ.6.50 లక్షల నగదు, బంగారు ఆభరణాలను అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు వద్ద లభించిన కాలిన కరెన్సీ నోట్ల కట్టలు

దగ్ధమైన ఏసీ కోచ్‌ను పరిశీలిస్తున్న క్లూస్ టీం

బ్రేకులు పట్టేయడమే కారణమా?

ప్రమాదానికి కారణాలను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందంతో దర్యాప్తు చేయిస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. బ్రేకుల ఫెయిల్యూరే కారణమా లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా.. ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని తెలిపారు. ప్రమాద స్థలాన్ని సోమవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ, విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా, రైల్వే డీఐజీ బి.సత్య ఏసుబాబు, రైల్వే సేఫ్టీ అధికారులు పరిశీలించారు. డీఆర్‌ఎం మోహిత్ మాట్లాడుతూ.. బ్రేకులు పట్టేయడం వల్లే మంటలు చెలరేగాయని.. బోగీల్లో ఉన్న దుప్పట్లు అంటుకుని మంటలు శరవేగంగా వ్యాపించాయని భావిస్తున్నట్టు చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతుడి కుటుంబానికి రైల్వే శాఖ రూ.5 లక్షల పరిహారం ప్రకటించింది. ప్రమాదంపై రైల్వే సేఫ్టీ కమిషనర్ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవిని విచారణాధికారిగా నియమించారు.

వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా ఎలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగి రెండు బోగీలు పూర్తిగా దగ్ధమై ఒక ప్రయాణికుడు మృతిచెందడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుడి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

సీట్ల కింద నుంచి మంటలొచ్చాయి

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ బీ–1 బోగీలో ఆదివారం రాత్రి 10.30 గంటలకు అనకాపల్లిలో ఎక్కాను. రైలు యలమంచిలి చేరుకుంటున్న సమయంలో పైబెర్తులోని ప్రయాణికుడు టాయిలెట్‌కు వెళ్లా బోగీలోని సీట్ల కింద నుంచి మంటలు వస్తున్న విషయాన్ని గమనించి నాకు చెప్పాడు. ఆయన, నేను కేకలు వేస్తూ బోగీలోని ప్రయాణికులను నిద్రలేపి చైన్ లాగాం. అప్పటికే రైలు యలమంచిలి స్టేషన్‌కు వచ్చి ఆగింది. వెంటనే ప్రయాణికులు రైలులోంచి ప్రాణభయంతో దిగేశారు. అదే సమయంలో సమీపంలోని ఎం–2 బోగీకి కూడా మంటలు వ్యాపించాయి. యలమంచిలి రైల్వేస్టేషన్ ఆవరణ అంతా పొగతో నిండిపోయింది. ప్రమాదం జరిగిన బోగీల్లోని ప్రయాణికులను సామర్లకోట తీసుకు వచ్చారు. చాలామంది తమ లగేజీలను అక్కడే వదిలేసి ఇక్కడకు వచ్చారు.

–నాగేంద్ర, ప్రత్యక్ష సాక్షి

బాబు పాలనలో ఏ పంటకూ కనీస మద్దతు ధర దక్కట్లేదు

ఏపీ అగ్రికల్చర్ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి

సాక్షి,అమరావతి: అన్నదాతలను ఆదుకోవడంతోపాటు, కనీస మద్దతు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, (వ్యవసాయం, రైతు సంక్షేమం), ఏపీ అగ్రికల్చర్ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు తాడేపల్లిలో సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాగును పూర్తిగా విస్మరించిన కూటమి పాలనలో 2025 రైతుల పాలిట చీకటి సంవత్సరమని అభివర్ణించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టడంతోపాటు రైతులు పండించిన కంది పంటకు గిట్టుబాటు ధర లేక కంది రైతులు విలవిలలాడుతున్నారని ఆయన మండిపడ్డారు.

'2025 – 26లో రాష్ట్రంలో దాదాపు 7.96 లక్షల ఎకరాలలో కంది సాగు జరిగింది. కంది కనీస మద్దతు ధర క్వింటా రూ.8 వేలు. కానీ ఆ ధర దక్కడం లేదు. రైతులు క్వింటా రూ.6,500 నుంచి రూ.6,600 వరకు అయినకాడికి తెగనమ్ముకుని నష్టపోతున్నారు. అయినా రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదు. పొరుగున కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం స్వయంగా కంది కొనుగోలు కేంద్రాలు తెరిచి, క్వింటా కంది రూ.8 వేలకు కొంటున్నట్లు చెబుతున్నారు. కానీ రాష్ట్రంలో ఇప్పటికీ కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గత ఏడాది కంది పంట ఉత్పత్తి 1.71 లక్షల టన్నులు కాగా, ఈ ఏడాది అంచనా 1.17 లక్షల టన్నులు. అలాగే గత ఏడాది హెక్టారు సగటు దిగుబడి 473 కిలోలు కాగా, ఈ ఏడాది అది కూడా 401 కిలోలకు తగ్గింది.' అని నాగిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

మొక్కజొన్నదీ అదే దుస్థితి

'మొక్కజొన్న కనీస మద్దతు ధర క్వింటా రూ.2,400 కాగా, రైతులు క్వింటా మొక్కజొన్న రూ.1,500 నుంచి రూ.1,900 వరకు అమ్ముకోవాల్సిన దుస్థితి. ఈ పంటను రాష్ట్రంలో ఈ సీజన్‌లో 4.6 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, అదీ సగటు దిగుబడి తగ్గింది. తెలంగాణలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచినా, మన ప్రభుత్వానికి మాత్రం ఆ ఊసే లేకుండా పోయింది. మొక్కజొన్న గత ఏడాది హెక్టారు సగటు దిగుబడి 4,710 కిలోలు కాగా, ఈ ఏడాది 4,254 కిలోలు మాత్రమే అని అంచనా వేస్తున్నారు'

రైతు కంట కన్నీరు మంచిది కాదు.. అది అరిష్టం

'రాష్ట్రంలో ఏ పంటకూ కనీస మద్దతు ధర దక్కడం లేదు. ప్రకృతివైపరీత్యాలకు దిగుబడి తగ్గి, ధరలు పడిపోవడంతో దిక్కుతోచక విలపిస్తున్నారు. అయినా చంద్రబాబు సర్కారుకు చీమకుట్టినట్టయినా లేదు. 'రైతు కన్నీరు మంచిది కాదు. రాష్ట్రానికి అరిష్టం' అని ఏపీ అగ్రికల్చర్ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి హెచ్చరించారు.

ఆయువిచ్చిన అమ్మ వెంటే...

- బిడ్డకు జన్మనిచ్చి తీవ్ర రక్తస్రావంతో తల్లి మృతి
- ఆ బాలింత మృతదేహం తరలిస్తుండగా రోడ్డు ప్రమాదం
- ఘటనా స్థలిలోనే మృతిచెందిన నవజాత శిశువు

లారీని ఢీకొని నుజ్జయిన మహాప్రస్థానం వాహనం (ఇన్‌సెట్‌లో) నవజాత శిశువు మృతదేహం

హిందూపురం టౌన్/ పెనుకొండ : తీవ్ర రక్తస్రావంతో మృతిచెందిన తల్లి మృతదేహాన్ని తరలిస్తుండగా... ఆ వాహనానికి ప్రమాదం జరగడంతో అందులో ఉన్న నవజాత శిశువు ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచింది. హృదయాలను కలిచివేసే ఈ దుర్ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో జరిగింది. హిందూపురం ఆస్పత్రి నుంచి వైద్యులు అనంతపురం రిఫర్ చేయడం వల్లే తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం బసవనపల్లికి చెందిన నజ్మాకు బత్తలపల్లికి చెందిన కలీంతో రెండేళ్ల క్రితం వివాహమైంది. నజ్మాకు పురిటి నొప్పులు రావడంతో రెండో కాన్పు కోసం ఆదివారం హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. సాధారణ కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ప్రసవం జరిగిన కొద్ది సేపటికే నజ్మాకు తీవ్ర రక్తస్రావం కావడంతోపాటు బీపీ పెరగడంతో వైద్యులు అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ నజ్మా మృతి చెందింది. సోమవారం ఉదయం ప్రభుత్వ అంబులెన్స్‌లో నజ్మా మృతదేహంతోపాటు నవజాత శిశువును తీసుకుని కుటుంబ సభ్యులు బసవనపల్లికి బయలుదేరారు. మార్గంమధ్యలో పెనుకొండ వద్ద 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వీరి వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవజాత శిశువు అక్కడికక్కడే చనిపోయింది. వాహనంలోని ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు. హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలోనే మెరుగైన చికిత్స అందించి ఉంటే తల్లీబిడ్డ ప్రాణాలు నిలిచేవని... అనంతపురం రిఫర్ చేయడం వల్లే ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

జంగారెడ్డిగూడెం మరణాలపై కట్టు కతలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్

సాక్షి, అమరావతి: చంద్రబాబు జనకంటక విధానాల వల్ల ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు.సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ లేదని విమర్శించారు. పైగా సీఎం డైవర్షన్ పాలిటిక్స్ చేశారని ధ్వజమెత్తారు. జంగారెడ్డిగూడెంలో 2022లో జరిగిన మరణాలపై కట్టు కతలు మొదలు పెట్టారని దుమ్మెత్తి పోశారు. అప్పట్లో నకిలీ మద్యం మరణాలు అని తీవ్ర దుష్ప్రచారం చేసిన ఎల్లో మీడియా ఇప్పుడు నకిలీ సారా అంటూ కొత్త కతలు అల్లుతోందని శివశంకర్ మండిపడ్డారు. జంగారెడ్డిగూడెం మరణాలపై అప్పట్లోనే స్పందించిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ కమిటీ వేసి ఎస్పీ రాహుల్ దేవ్ శర్మతో విచారణ చేయించారని, ఖననం చేసిన మృతదేహాలనూ బయటకు తీసి శవపంచనామా చేసి, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి విచారణ పూర్తి చేయించారని గుర్తుచేశారు. అవి అసలు మద్యం, సారా మరణాలు కానేకావని వైద్యాధికారులు, విచారణ అధికారులు నిర్ధారించారని స్పష్టం చేశారు.

మూడు జెండాలు జతకట్టి ఊతకర్రల సాయంతో పాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి

కడప కార్పొరేషన్: దేశ చరిత్రలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా సొంత బలాన్ని నమ్ముకొని అన్ని ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. కడపలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించినప్పటి నుంచి తాను నమ్మిన సిద్ధాంతాలు, నైతికతతో రాజకీయ విలువలు పాటించారని, సొంత బలంతో అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అనేక సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో మూడు జెండాలు జతకట్టి అరువు తెచ్చుకున్న ఆలోచనలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా అధికారంలోకి వచ్చాయని, అందుకే ఊతకర్రల సాయంతో పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన రాజకీయ వైకల్యం కలిగిన పార్టీలని.. పొత్తు లేకుండా సొంత బలంతో అవి గెలవలేవని, నిర్దిష్ట రాజకీయ విలువలు వాటికి లేవని ధ్వజమెత్తారు. వీటికి సొంత ఎజెండా లేదని విమర్శించారు. ఇలాంటి కూటములతో ప్రజలకు ఒరిగేది శూన్యమన్నారు. భగత్‌సింగ్, చేగువేరా ఫొటోలు పెట్టుకొని రాజకీయ పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్.. చంద్రబాబు ఇచ్చే రూ.70 కోట్ల ప్యాకేజీకి అమ్ముడుపోయి నోరు మెదపడం లేదని రాచమల్లు ఎద్దేవా చేశారు. టీడీపీ, బీజేపీ లేకపోతే మనుగడే లేని పవన్.. వైఎస్ జగన్ చేతిలో రేఖలు తీసేస్తానని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వైఎస్ జగన్‌కు వెల్లువెత్తుతున్న ప్రజాభిమానాన్ని చూసి కూటమి పార్టీల్లో వణుకుపుడుతోందని, ఆ పార్టీల నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని రాచమల్లు ఎద్దేవా చేశారు. జిల్లాల పునర్విభజన రాజకీయ కుట్రేనని, అన్నమయ్య జిల్లా కేంద్రం, ఆ జిల్లా పరిధి రద్దు దారుణమని విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలన్న కక్షతోనే అన్నమయ్య జిల్లా పరిధి రద్దుకు చంద్రబాబు పూనుకుంటున్నారని రాచమల్లు ధ్వజమెత్తారు.

చట్టాలు అధికారపార్టీకి వర్తించవా?

వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అవుతు శ్రీధర్‌రెడ్డి



సాక్షి ,అమరావతి: రోడ్లపై కత్తులు, కొడవళ్లతో తిరుగుతూ ఉన్మాదం సృష్టించే వారిని ప్రభుత్వం ఉపేక్షించదన్న హోంమంత్రి అనిత హెచ్చరికలు తెలుగుదేశం పార్టీకి వర్తించవా అని వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అవుతు శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో టీడీపీ నాయకుల పుట్టినరోజు వేడుకల్లో ఆ పార్టీ కార్యకర్తలు బహిరంగంగా రోడ్లపై చేసిన జంతు బలులపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జంతు హింసా సంస్కృతి టీడీపీదేనన్న సంగతి మరిచి వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా జరిగిన పొట్టేళ్ల బలి గురించి హోం మంత్రికి తెలియదా? చట్టాలు అధికారపార్టీకి వర్తించవా? అని నిలదీశారు. మరోవైపు ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ ర్యాలీలో బహిరంగంగా జరిగిన జంతుబలిని హోంమంత్రి ఎందుకు ఖండించడం లేదని అవుతు ప్రశ్నించారు.

కదం తొక్కిన సహకార ఉద్యోగులు

- సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో ధర్నా
- వచ్చే నెల 5 నుంచి నిరాహార దీక్షలు చేస్తామని ప్రకటన
- అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెలోకి వెళతాం
- రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల, యూనియన్ల ఐక్య వేదిక అల్టిమేటం

ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు, యూనియన్ల ఐక్యవేదిక నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సహకార సంఘాల ఉద్యోగులు కదం తొక్కారు. సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సహకార ఉద్యోగులు.. సోమవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లో జరిగిన మహాధర్నాలో న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. సహకార ఉద్యోగుల ఆందోళనకు ఏఐబీఈఏ, సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏపీ ఎన్జీవో సంఘాలు మద్దతు ప్రకటించాయి. సమ్మె నోటీసు ఇచ్చి 20 రోజులు గడిచినా అటు ప్రభుత్వం ఇటు అధికారులు గాని స్పందించలేదని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని, సమ్మెలోకి వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఖజానాపై ఏ మాత్రం భారం పడని సహకార సంఘ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించడంలో తాత్సారం చేస్తున్నారన్నారు. తమ డిమాండ్లను సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారని మండిపడ్డారు. సహకార సంఘాల్లో 2019 సంవత్సరం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు తోట వెంకటరామయ్య, రవికుమార్ మాట్లాడుతూ వచ్చే నెల 5 నుంచి విజయవాడ వేదికగా నిరాహార దీక్షలు చేస్తామని ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెలోకి వెళ్తామని అల్టిమేటం జారీ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగుల ఆందోళనకు తమ పార్టీ పూర్తి మద్దతిస్తుందన్నారు. ధర్నాలో జేఏసీ నాయకులు మొవ్వ వెంకటేశ్వరరావు, సీహెచ్ నరసింహారావు, ఏఐబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ ప్రైవేటుకు ఇస్తే సీఎంగా చంద్రబాబు ఎందుకు?

మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఇప్పటికే విద్య, వైద్యం, వ్యవసాయం వంటి ప్రధాన రంగాల్లో ప్రైవేటీకరణ మంత్రం జపిస్తున్న చంద్రబాబు.. ఇప్పుడు పారిశ్రామీకరణకు మూలకేంద్రమైన ఏపీఐఐసీలోనూ అదే పంథాకు తెర తీశారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. రాష్ట్రంలో 22 ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధికి పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు పనులు అప్పగించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇలా అన్నీ ప్రైవేటుకు అప్పగిస్తే ఇక సీఎంగా చంద్రబాబు ఎందుకు? మంత్రివర్గం ఎందుకు? అని ప్రశ్నించారు. చంద్రబాబు చివరికి ప్రభుత్వాన్ని కూడా ప్రైవేట్‌కి ఇచ్చేలా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకోసమే చంద్రబాబు పాలన సాగుతోందంటూ మండిపడ్డారు. పారిశ్రామిక పార్కుల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములు అప్పగించడం కుంభకోణమని అన్నారు.

మీరు విదేశాలలో జాబ్ కోసం ప్రయత్నిస్తున్నారా!!
ఒకేసారి వేలాది ఖాళీలను
ముంబయి నుండి ప్రతి బుధవారం & శనివారం ప్రచురించబడే పేపర్‌లో చూడవచ్చు, ఈ-పేపర్ సబ్‌స్క్రిప్షన్ కోసం లాగాన్ చేయండి
www.assignmentsabroadtimes.co
పూర్తిగా ఉచితం

క్లుప్తంగా...

రేపు, ఎల్లుండి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలు

సాక్షి, అమరావతి: కొత్త ఏడాది ఆగమనం సందర్భంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారించేందుకు చంద్రబాబు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. డిసెంబరు 31, జనవరి 1 అర్ధరాత్రి దాటే వరకు రాష్ట్రంలో మద్యం విక్రయాలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. మద్యం దుకాణాలు రాత్రి 12 గంటల వరకు, బార్లు రాత్రి 1 గంట వరకు అమ్ముకునేందుకు అనుమతినిస్తూ సోమవారం ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ లీగల్: కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన 26 మంది మావోయిస్టులకు 2026 జనవరి 8 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయ మూర్తి లెనిన్‌బాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు. విజయవాడలోని పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన నలుగురు మావోయిస్టులకూ 2026 జనవరి 2 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

'25 ఎంఎస్‌ఎంఈ పార్కులు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ మోడల్లో అభివృద్ధి చేస్తోన్న 175 ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో 25 పార్కులను ఎస్సీ ఎస్టీ అసోసియేషన్‌లకు కేటాయించాలని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో పార్కు అభివృద్ధి చేస్తోంది కానీ కేటాయింపుల్లో రిజర్వేషన్ లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌లు, డెవలపర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోతున్నాయన్నారు. ఈ విషయంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రికి విన్నవించినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

ముగిసిన నకిలీ మద్యం కేసు నిందితుల కస్టడీ

మదనపల్లె: అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులోని ఐదుగురికి తంబళ్లపల్లె కోర్టు విధించిన మూడురోజులు కస్టడీ ముగియడంతో సోమవారం మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ నుంచి నిందితులను తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితులైన ఏ–1 జనార్దనరావు, జగన్‌మోహన్‌రావు, శ్రీనివాసరావుతోపాటు అల్లాబక్ష్, రమేష్‌ను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు శుక్ర, శని, ఆదివారాల్లో విచారణకు అనుమతి ఇచ్చింది. గడువు ముగియడంతో నిందితులను సోమవారం తంబళ్లపల్లె కోర్టుకు తీసుకెళ్లగా రిమాండ్ విధించారు.

'స్కిల్ స్కాం'ను మూసెయ్యొద్దు!

బెజవాడ ఏసీబీ కోర్టులో మెమో దాఖలు

సాక్షి, అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు దర్యాప్తును సీబీఐకి బదలాయించాలని కోరుతూ హైకోర్టులో తాను దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్నందున ఈ కేసును మూసివేసేందుకు సీఐడీ దాఖలు చేసే క్లోజర్ రిపోర్ట్‌పై ఎలాంటి నిర్ణయం వెలువరించవద్దని పాత్రికేయుడు కొట్టి బాలగంగాధర్ తిలక్ విజయవాడ ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. ఆ మేరకు ఆయన సోమవారం ఏసీబీ కోర్టులో ఓ మెమో దాఖలు చేశారు.

అమరావతే సర్వస్వం అనుకుంటే ప్రతిఘటన తప్పదు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని, సాగునీటి రంగానికి బడ్జెట్‌లో 20 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరిలో ప్రతిపాదించే బడ్జెట్‌లో సాగునీటి రంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ జనవరి 24న తిరుపతిలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అమరావతే సర్వస్వం అనుకుంటే వెనుక బడిన ప్రాంతాల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

సెక్రటేరియట్ సంఘ ఎన్నికలు.. కొనసాగుతున్న కౌంటింగ్

సాక్షి, అమరావతి: ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ సోమవారం జరగ్గా రాత్రి 11 గంటల తర్వాత కూడా కౌంటింగ్ కొనసాగుతోంది. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష పదవితోపాటు మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యుల పదవులకు, ఒక ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పదవికి పోలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వరకు జరిగిన కౌంటింగ్‌లో రామకృష్ణ ప్యానెల్ ముందంజలో ఉన్నట్లు తెలిసింది.

“ వినయం అన్ని సద్గుణాలకూ
బలమైన పునాది.
– రుడ్యార్డ్ కిప్లింగ్

సాక్షి
మంగళవారం, 30 డిసెంబర్ 2025

ఆరావళికి ఊపిరి

చరిత్రకు పూర్వమే కొన్ని నదులకు చిరునామాగా, వైవిధ్యభరిత ప్రకృతికి ఆలవాలంగా, రకరకాల జీవరాశులకు ఆలంబనగా నిలిచిన ఆరావళి ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నట్టే. ఆ పర్వత శ్రేణిపై గత నెల 20న తామిచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని సుప్రీంకోర్టు సోమవారం తీసుకున్న నిర్ణయం పర్యావరణ ఉద్యమకారులకూ, ఆ ప్రాంత ప్రజానీకానికీ ఉపశమనం కలిగించింది. 250 కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించి వాయవ్య భారత్‌ను 670 కిలోమీటర్ల పొడవునా కంటికి రెప్పలా చూసుకుంటున్న ఆరావళికి కష్టం వచ్చిందంటే జనం తల్లడిల్లారు. టేపు తీసుకుని కొలతలు కొలిచి, ఎన్ని డిగ్రీల కోణంలో వాలాయో గమనించి ఆ కొండల్ని కత్తిరించాలని చూసినవారి ఎత్తుగడలకు విస్తుపోయారు. అందుకే పర్యావరణ ఉద్యమకారుల నాయకత్వంలో పార్టీలకతీతంగా గొంతెత్తారు. చివరకు జనానిదే పైచేయి అయింది. ఈ అంశంలో మరిన్ని వివరణలు, భిన్న కోణాల్లో పరిశీలనలూ అవసరమవుతాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడి ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ మరింత సమగ్రంగా, మరింత సంపూర్ణంగా దీన్ని పరిశీలించాల్సి ఉంటుందని భావించింది.

ఎన్నో పురుటినొప్పులు పడి, ఎన్నెన్నో ఉత్పాతాలు చవిచూసి, ఎన్నో విధాల భౌగోళిక మార్పులు జరిగి ప్రకృతి సంపద ఈ రూపంలో మన కళ్లముందుంది. అధికారం ఉండొచ్చు, కుబేరుణ్ణి తలదన్నేంత ఐశ్వర్యం ఉండొచ్చు – కానీ ఈ సంపదను అవసరాలకు పొదుపుగా వినియోగించుకుంటూ సురక్షితంగా భవిష్యత్తరాలకు అప్పగించటం మనిషి జన్మెత్తినవారి బాధ్యత. ప్రపంచవ్యాప్తంగా పాలకులుగా ఉన్నవారూ, పారిశ్రామికవేత్తలూ దీన్నెక్కడా గమనించుకుంటున్నట్టు లేరు. అందుకే అడవులు మటుమాయమవుతున్నాయి. కొండలు కరిగిపోతున్నాయి. నదులు ఇంకిపోతున్నాయి. జీవ వైవిధ్యం గతి తప్పుతోంది. కొన్ని రకాల జంతువులు, పక్షులు ఇప్పటికే అంతరించిపోయాయి. నదుల గమనాలు మారాయి. రుతువులు తీరు మార్చుకుంటున్నాయి. రకరకాల కాలుష్యం కాటేస్తోంది.

ఆరావళి మాత్రమే కాదు... దేశంలో చిన్నా పెద్దా కొండలు, గుట్టలు దీనంగా వేడుకుంటున్నాయి. మానవాళికి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్న తమ ఉసురు తీయడానికి సిద్ధపడుతున్న వైనం చూసి దుఃఖిస్తున్నాయి. అయినా ఆగిందేమీ లేదు. బంగారం మొదలుకొని డోలమైట్, గ్రాఫైట్, మాంగనీస్, బొగ్గు, రాగి, బాక్సైట్ వంటి రకరకాల ఖనిజాలు వాటిల్లో నిక్షిప్తమై ఉండటమే అందుకు కారణం. అభివృద్ధికి అవసరమనుకుంటే పరిమిత స్థాయిలో వాటిని వినియోగించటాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ ప్రకృతి విపత్తులకు దారితీసే స్థాయికి అది చేరుకోవటం వల్ల అసలు అభివృద్ధి పరమార్థమే దెబ్బతింటోంది. ఆ ప్రాంతాల్లో నివసించే ఆదివాసుల జీవిక ధ్వంసమవుతోంది.

ఇన్ని దశాబ్దాలుగా మౌనంగా వీక్షించిన వాయవ్య భారతం ఇప్పుడైనా గొంతెత్తగలిగింది గనుకే ప్రస్తుతానికిది ఆగింది. ఆరావళి పర్వత పంక్తులు చంబల్, సబర్మతి, లూని వంటి నదులకు జీవం పోస్తున్నాయి. అక్కడ అడవులున్నాయి, గడ్డిభూములున్నాయి. సారవంతమైన నేలలు సరేసరి. అపురూపమైన జంతు, వృక్షజాలాలున్నాయి. దేశ రాజధాని నగరం ఈ మాత్రమైనా ఊపిరి పీల్చుకోగలుగుతున్నదంటే అది ఆరావళి చలవే. అంతేకాదు... భూగర్భ జలాలు సమృద్ధిగా లభించేలా చేస్తున్నాయి. ఇప్పటికే కొనసాగుతున్న మైనింగ్‌ను నిలిపేయటంతోపాటు కొత్తగా మైనింగ్ లైసెన్సులు జారీ చేయకుండా చర్యలు తీసుకుంటేనే ఈ మాత్రమైనా మిగులుతాయి. ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యల్లో సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులు తొలి అడుగు కావాలి. ఆరావళిలో కోల్పోయింది కోల్పోగా ప్రస్తుతం మిగిలినదాన్నయినా ఎలా రక్షించుకోవాలన్న ఆర్తి ఉంటే తప్ప ఇదంతా సాధ్యపడదు. వాయవ్య భారతమే కాదు... దేశంలోని అన్ని ప్రాంతాలూ తమ గొంతు బలంగా వినిపించినప్పుడే కొనసాగుతున్న విధ్వంసానికి తెరపడుతుందని తాజా పరిణామాలు చెబుతున్నాయి. భూ ఆకృతి సంబంధిత అంశంగా చూసి కొలతలతో, కోణాలతో యాంత్రికంగా చూడక, మనిషి ఇరుసుగా ప్రకృతిని వీక్షించగలిగితే తరతరాలపాటు ఈ అపురూప సంపద మానవాళికి ఆసరా అందిస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.1.29 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** భరణి రా.1.11 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ప.11.45 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.21 వరకు, తదుపరి రా.10.37 నుండి 11.29 వరకు, **అమృత ఘడియలు:** రా.8.40 నుండి 10.10 వరకు, **ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి.**

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.32
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

సామరస్యం

నాగరికులం అనుకుంటున్నవారు ఆదివాసీల నుండి నేర్చుకోవలసిన ముఖ్య విషయం ఒకటి ఉంది. ప్రకృతితో సామరస్యంగా ఉండటం వల్ల ఆధునిక ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఒత్తిడి సంబంధ అనారోగ్యాల నుండి ఆదివాసీలు విముక్తి పొందారు.

– హనుమప్ప సుదర్శన్, సోషల్ వర్కర్

బ్రేక్ వస్తే..!

నీకు అడ్డంకులు ఎదురైనంత మాత్రాన జీవితం నీ కోసం ఆగదు. ఇండస్ట్రీని విడిచిపెట్టాక నేను ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. తిరిగి మునుపటి స్థితిలోకి రావాలంటే, మళ్లీ మిమ్మల్ని మీరు రుజువు చేసుకోవాలి. మీలో కొత్తగా ఏదైనా ఉండాలి. ఏ కెరీర్ అయినా అంతే!

– కౌసల్య, నటి

పోలిక వద్దు



ఏదైనా సరే, మీ కంటే పదేళ్ల ముందు ప్రారంభించిన వారితో పోల్చుకోవటం మానేయండి. మీ సొంత ప్రయాణంపై ధ్యాస పెట్టండి. మీ లక్ష్యంపై గురి ఉంచండి. మీకు, మీ గమ్యానికి మధ్య మీరు తప్ప ఎవరూ ఉండరు కనుక ప్రతి దానికీ మీదే బాధ్యత అని మరువకండి.

– రస్సెల్ బ్రన్సన్, వ్యాపారవేత్త

ఆత్మవిమర్శ



ఆటలో గెలుపోటములను మాత్రమే ప్రజలు పట్టించుకుంటారు. మీరు ఎలా ఆడారన్నది మీకు తప్పక తెలియాల్సిన విషయం. ఎప్పుడూ కూడా విమర్శకులకు సమాధానం చెప్పటానికి ఆడకండి. మీలోని అథ్లెట్‌ను సంతృప్తి పరచటానికి ఆడండి.

– సౌరభ్ వర్మ, బ్యాడ్మింటన్ ప్లేయర్

ఆన్‌లైన్

గౌరవం అనేది ఆన్‌లైన్‌లో లైక్‌లు, షేర్‌లతో కొలవగలిగింది కాదు. వాస్తవ ప్రపంచంలో మీరు మీ చుట్టూ ఉన్నవారితో ఎలా ప్రవర్తిస్తారో అదే మీ గుర్తింపు. ఆన్‌లైన్‌లో మీరు హీరో అవటం తేలిక. కానీ బయట అందుకు భిన్నంగా ఉంటుంది.

– శామ్ ఆంటన్, తమిళ్ డైరెక్టర్

స్థానబలిమి

అస్థిరంగా ఉన్న ప్రపంచ పరిస్థితుల నుండి మనల్ని కాపాడేది, దేశీయంగా మన స్థిరత్వంపై మనం దృష్టి పెట్టడం! మనం బలంగా ఉంటే, బయటి నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటంలో మిగతా అందరి కంటే మెరుగైన స్థానంలో ఉంటాం.

– శ్వేతా ఆర్యా, 'కమిన్స్' ఇండియా ఎండీ

ఈ యేటి మేటి మాట... ట్రంపిజం

విశ్లేషణ



సంజయ బారు

ఈ ఏడాది ఎక్కువసార్లు పతాక శీర్షికలకు ఎక్కిన వ్యక్తి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపేననడంలో సందేహం లేదు. ఐదు భిన్నమైన కారణాల రీత్యా ఆయన వార్తల్లో అగ్రభాగాన నిలిచారు. ఒకటి– అమెరికా ఫస్ట్ విధానం. రెండు– ఆయన సుంకాల యుద్ధం. మూడు– దక్షిణం, పశ్చిమం, ఆగ్నేయాసియా నుంచి యూరప్ వరకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ద్వైపాక్షిక ఘర్షణల్లో తల దూర్చాలని కోరుకోవడం. నాలుగు– అమెరికా, చైనా, రష్యాల మధ్య సమీకరణలను మార్చడం. చివరగా, వ్యక్తిగత లైంగిక జీవితానికి సంబంధించి వార్తల కెక్కడమే కాకుండా, దర్యాప్తునకు లోనవడం!

భద్రతా వ్యూహంతో మరోసారి...

తాజాగా ట్రంప్ పాలనా యంత్రాంగం రూపొందించిన జాతీయ భద్రతా వ్యూహంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇది అమెరికా భద్రతా వ్యూహంలో పశ్చిమ అర్ధ గోళానికున్న ప్రాధాన్యాన్ని చాటడమే కాకుండా, ఆ ప్రయోజనాలను కాపాడుకునేందుకు సైనిక చర్యను ప్రతిపాదించింది.

దౌత్య, సైనికపరంగా అమెరికా వాస్తవిక ప్రవర్తనను ప్రభావితం చేయడంలో ఈ వ్యూహం ఎంత ముఖ్యమైనదిగా పరిణమిస్తుందనేది వేచి చూడవలసి ఉంది. మన దేశంలో చాలావరకు, మనతో సంబంధాలు నెరపడంలో వ్యూహ పత్రం దృక్కోణం ఏమిటి? ట్రంప్ ప్రపంచ వీక్షణం, 'పెద్ద వ్యూహం'లో భారత్ స్థానం ఎక్కడ? అమెరికా–భారత్ సంబంధాలు మున్నెన్నడూ ఎరుగనంతగా క్షీణించిపోయాయనే అందరూ అంటున్నమాట. ముఖ్యంగా, నాయకత్వ స్థాయి సాంగత్య స్వరూప స్వభావాలలో, ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి అపనమ్మకం తిరిగి చోటు చేసుకుంది.

ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో కూడా అప్పటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఆమె గురించి నీచంగా మాట్లాడారు. భారత్ కూడా దానికి తగ్గట్లుగానే తలుపులు బిడాయించుకుని కూర్చుంది. భారత్, దాని నాయకత్వం గురించి వాషింగ్టన్ చర్చలలో ఎంత హీనంగా ప్రస్తావనకు వచ్చిందీ, ఆ తర్వాత బహిరంగపరచిన రహస్య పత్రాలు, కొందరు రాసుకున్న జ్ఞాపకాల పుస్తకాల ద్వారా వెల్లడైంది. ఇపుడు టెలివిజన్, సోషల్ మీడియాలో క్షణాల్లో అవి వెలికి వస్తున్నాయి. కనుక, ఇది స్నేహ సంబంధాలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపి తీరుతుంది.

మూడు ముఖ్య సంగతులు

వ్యూహ పత్రం విషయానికొస్తే, ఇంతవరకు మూడు సంగతులు స్పష్టమయ్యాయి. ఒకటి–దాడులు, ప్రమాదాల నుంచి సామూహిక స్వీయ రక్షణకు 'ఒక గ్రూపు'గా ఏర్పడే ధోరణిని కొనసాగించాలని

◆ దాడులు, ప్రమాదాల నుంచి సామూహిక స్వీయ రక్షణకు 'ఒక గ్రూపు'గా ఏర్పడే ధోరణిని కొనసాగించాలని ట్రంప్ కోరుకుంటున్నారు. ఉత్తర, దక్షిణ అమెరికాలను 'బయటి' శక్తులకు 'అందని దుర్గాలు'గా ప్రకటించి, పశ్చిమ అర్ధ గోళంపై పట్టు సంపాదించాలనుకుంటున్నారు.

ట్రంప్ కోరుకుంటున్నారు. ఉత్తర, దక్షిణ అమెరికాలను 'బయటి' శక్తులకు 'అందని దుర్గాలు'గా ప్రకటించి, పశ్చిమ అర్ధ గోళంపై పట్టు సంపాదించాలనుకుంటున్నారు. కొన్ని విధాలుగా ఇది ఆసియాలోని అభిప్రాయాలనే ప్రతిబింబిస్తోంది. ప్రపంచంలోని ఈ భాగంవారు కూడా అమెరికాను 'బయటి' శక్తిగానే భావిస్తారు. అయితే, ఆసియా నుంచి అమెరికా సేనలను ట్రంప్ ఉపసంహరించుకుంటారనీ, ఈ ప్రాంత భద్రతను ప్రాంతీయ శక్తుల చేతులకే విడిచిపెడతారనీ అనడానికి ఆధారాలు కనిపించడం లేదు.

రెండు– మిగిలిన వాటన్నింటి కన్నా చైనాతో సంబంధాలకు ట్రంప్ ప్రాధాన్యం ఇస్తున్నారు. చైనా అటు సవాల్‌గానూ, ఇటు సమవుజ్జీగా పరిగణించి వ్యవహరించవలసిన శక్తిగానూ కూడా ఉంది. 'జి–2' ఆలోచనతో ఆయన చేసిన ట్వీట్ ఆసియాలో కలకలం సృష్టించింది. ఇంచుమించు రష్యా కోరుకుంటున్న విధంగానే, యూరప్‌లో యుద్ధం ముగియాలని ఆయన కోరుకుంటున్నారు. ప్రపంచంలోని మూడు పెద్ద (అమెరికా, రష్యా, చైనా) శక్తులు తమ భద్రత, పరపతి ఉన్న ప్రాంతాలకు పరిమితమయ్యే హక్కు ఉందనే లోపాయకారీ అవగాహనను బలపరుస్తున్నారు. కానీ, భారత్‌పై దీని పర్యవసానాలుంటాయి.

చివరగా, వ్యూహ పత్రాన్ని అమెరికా విరమణ ప్రకటనగా, దేశ, విదేశాలలో ముఖ్యంగా యూరప్‌లో చాలా మంది భాష్యం చెబుతున్నారు. కానీ, ఆ రకమైన నిర్ధారణకు రావడం ట్రంప్ ప్రపంచ వీక్షణాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవడమే అవుతుంది. అమెరికా సేనల ఉపసంహరణకు సంబంధించి దాని వ్యూహ పత్రంలో ఎక్కడా ఒక్క మాట లేదు.

అమెరికా శైలి మాఫియా

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 100కు పైగా దేశాలలో 750 సైనిక స్థావరాలలో 1,60,000కు పైగా అమెరికా సైనిక దళాలున్నాయి. అమెరికా సాయుధ దళాలున్న అత్యంత ముఖ్యమైన కేంద్రాలు జర్మనీ, జపాన్, ఇటలీ, కొరియాలలో ఉన్నాయి. అవి రెండవ ప్రపంచ యుద్ధకాలం నుంచి అమెరికా 'అధీనం'లో ఉన్నాయి. 'నాటో' కూటమి దేశాల్లోనూ, పశ్చిమాసియా 'క్లయింట్' దేశాల్లో ముఖ్యంగా బహరైన్, కువైట్‌లలోనూ అమెరికా సైనిక స్థావరాలున్నాయి.

ఈ స్థావరాల నిర్వహణకు ఏటా 5,000 నుంచి 6,000 కోట్ల డాలర్ల వరకు ఖర్చవుతున్నట్లు అంచనాలున్నాయి. సేనలు లేదా స్థావరాల సంఖ్యను తగ్గించుకోవడం గురించి వ్యూహ పత్రం ఎక్కడా మాట్లాడలేదు. మరింతగా 'భారాన్ని పంచుకోవలసిన' అవసరం గురించి మాత్రం అది ప్రస్తావించింది. 'నాటో' కూటమి దేశాలు, జపాన్, కొరియా, గల్ఫ్ దేశాలు వాటి రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని అమెరికా కోరుతోంది. ఇతర దేశాల్లో అమెరికా సేనల ఉనికి అవసరం ఏమిటో, అది ఎంతకాలమో, ట్రంప్ గానీ, రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుంచి అమెరికా అధ్యక్షులైన ఇతరులు గానీ వివరించిన పాపాన పోలేదు.

భారతదేశంతో సహా ఇంకా అనేక దేశాల్లోనూ ద్వైపాక్షిక ఒప్పందాల రీత్యా మాత్రమే అమెరికా సేనలు పరిమిత సంఖ్యలో కనిపిస్తాయి. రెండవ ప్రపంచ యుద్ధ ఫలితంగానే, కొన్ని దేశాల్లో అవి పెద్ద సంఖ్యలో ఉన్నాయన్నది వాస్తవం. ఆ యుద్ధం ముగిసేనాటికి అమెరికా 'విముక్తి' కల్పించిన 'ఆక్రమించిన' దేశాల్లో అమెరికా సేనలు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యూహ పత్రం, ఆ యా భూభాగాల నుంచి సేనల ఉపసంహరణ లేదా తగ్గింపునకు పిలుపు ఇవ్వలేదు. అవి ఆతిథ్యం ఇస్తున్న అమెరికా సేనల నిర్వహణకు ఆయా దేశాలు కొంత పైకాన్ని చెల్లించాలని మాత్రమే అది అడుగుతోంది. ఇది కళాత్మక మాఫియా శైలి అవుతుంది. ఇతర పెద్ద శక్తుల నుంచి ఎదురు కాగల బెడద నుంచి 'రక్షణ' కల్పిస్తున్నందుకు 'మామూలు' ఇవ్వాలని డిమాండ్ చేస్తోందన్నమాట!

ఇది చూడండి: యూరప్, ఆసియాలలో శక్తిమంతమైన సైనిక యంత్రాలుగా చైనా, రష్యా నడుచుకునేందుకు అమెరికా అనుమతిస్తుంది. చైనా, రష్యా పొరుగునున్న దేశాలు ప్రపంచ శక్తి అయిన అమెరికా పెత్తనం నుంచి తమను కాపాడుకునేందుకు ఈ ప్రాంతీయ శక్తుల పంచన చేరవచ్చు. ఇక సేనల తగ్గింపు ప్రసక్తి ఎక్కడ? ట్రంపిజంగా అభివర్ణించదగిన ఈ విధానంపై ఇతర దేశాల స్పందన ఎలా ఉండబోతోందన్నది 2020లలో కాలగతిని నిర్వచించనుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ప్రజారోగ్యాన్ని పణంగా పెడతారా?

దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాల కోసం, ముడి చమురు దిగుమతి ఖర్చును తగ్గించుకోవాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం ఒక కొత్త విపత్తుకు దారితీస్తోంది. పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే (బ్లెండింగ్) ప్రక్రియను జాతీయ ప్రాముఖ్యం కలిగిన అంశంగా పరిగణించి, ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతులు మంజూరు చేస్తోంది. అయితే, ఈ ప్రక్రియలో భాగంగా నెల్లూరు జిల్లా రాచర్లపాడు సెజ్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ప్లాంట్లు స్థానిక ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి గొడ్డలిపెట్టుగా మారాయి. దాచిపెట్టిన విషవాయువుల నిజాలు, ఈ ఇథనాల్ ప్లాంట్ల పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) నివేదికలు పచ్చి అబద్ధాలతో నిండి ఉన్నాయి. అమెరికా పర్యావరణ సంస్థలు వంటివి ఇథనాల్ ఉత్పత్తిలో అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ కారక రసాయనాలు (హెచ్‌ఏపీలు) విడు దలవుతాయని హెచ్చరిస్తున్నప్పటికీ, కంపెనీలు తమ నివేదికల్లో వీటి ఉద్గారాలను 'సున్నా' (నిల్)గా చూపించాయి. ముఖ్యంగా ఎసిటాల్డిహైడ్, ఫార్మాల్డిహైడ్, అక్రోలిన్ వంటి రసాయనాలు గాలిలో కలిస్తే శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఈఐఏ నివేదికలు కేవలం బాయిలర్ల కాలుష్యంపైనే దృష్టి పెట్టి, ఫెర్మెంటేషన్ ట్యాంకులు, డిస్టిలేషన్ కాలమ్స్ నుండి వెలువడే విషవాయువు లను పూర్తిగా విస్మరించాయి.

ఒకప్పుడు చక్కెర పరిశ్రమ వ్యర్థాలైన 'మొలాసిస్' నుండి

మాత్రమే ఇథనాల్ తయారు చేసేవారు. కానీ ప్రస్తుతం బియ్యం, గోధుమలు, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలను వినియోగిస్తున్నారు. రాచర్లపాడు వంటి ఒక్కో ఫ్యాక్టరీ ఏడాదికి సుమారు 64.48 కోట్ల కిలోల బియ్యాన్ని మింగేస్తోంది. దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కిలో బియ్యాన్ని కేవలం రూ. 20లకే ఈ కంపెనీలకు కట్టబెడుతోంది. ఇది చాలదన్నట్లు, బహిరంగ మార్కెట్ ధరల భారం తప్పించుకోవడానికి కంపెనీలు రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేస్తున్నాయి.

ఇక నీటి వినియోగం విషయంలో ఈ ప్లాంట్లు ఒక రకమైన 'జల రాక్షసులు' అని చెప్పవచ్చు. ఒక లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి ప్లాంట్ స్థాయిలో 4 లీటర్ల నీరు అవసరమైతే, దాని ముడి పదార్థాల సాగుతో కలిపి మొత్తం 2,860 లీటర్ల నీరు ఖర్చవుతుంది. అంటే, 72 కుటుంబాలు ఒక రోజులో వాడే నీటితో కేవలం ఒకే ఒక్క లీటర్ ఇథనాల్ తయారవుతుంది. పైగా, ఈ ప్లాంట్ల నుండి వెలువడే 13 లక్షల కిలోల ద్రవ వ్యర్థాలు భూగర్భ జలాలను విషతుల్యం చేసి, పంట పొలాలను నాశనం చేస్తాయి.

ప్రజాభిప్రాయానికి పాతర

తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, నిర్మల్ జిల్లాల్లో ప్రజల తీవ్ర నిరసనల కారణంగా అక్కడి నుండి వెళ్లగొట్టబడిన ఈ ప్లాంట్లను ఆంధ్రప్రదేశ్‌లోని రాచర్లపాడుకు తరలించారు. నిజానికి ఈ సెజ్ 'కిసాన్ సెజ్' కాబట్టి ఇక్కడ పర్యావరణానికి హాని కలిగించే ఫ్యాక్టరీలు పెట్టరాదు. అందుకే కేంద్రం ప్రజాభిప్రాయ సేకరణ చేయమని ఈ ఫ్యాక్టరీలు పెట్టాలనుకుంటున్నవారిని కోరింది. దీంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వెబ్‌సైట్‌లో డిసెంబర్ 30వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ఒక ప్రకటన ఉంచారు. కానీ ఆ ప్రాంత ప్రజలు ఎవరికీ దీని గురించి సమాచారం ఇవ్వలేదు.

కేవలం 4 శాతం ముడి చమురు ఆదా కోసం ప్రజారోగ్యాన్ని, ఆహార భద్రతను పణంగా పెట్టడం సమంజసం కాదు. మన పిల్లల భవిష్యత్తును, పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించి, రాచర్లపాడులోని ఇథనాల్ ఫ్యాక్టరీలను మూసివేయాలి. అభివృద్ధి పేరుతో సాగుతున్న ఈ వినాశనాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– వెన్నెలకంటి రామారావు । సీనియర్ జర్నలిస్ట్

నా ఇంటికి ఎన్నడూ రానివారు!

ఇన్ బాక్స్

వినోద్ కుమార్ శుక్లా (1937–2025) ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుప్రసిద్ధ హిందీ కవి, నవలాకారుడు, 2024 సంవత్సరపు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత. అయిదున్నర దశాబ్దాలపాటు విస్తారంగా వెలయించిన రచనలలో 'మ్యాజిక్ రియలిజమ్' ధోరణిని విజయవంతంగా పొదిగిన సృజనశీలి. ప్రస్తుత కవిత, 'దోజ్ దట్ విల్ నెవెర్ కమ్ టు మై హోమ్' శుక్లా గాఢమైన, ప్రతీకాత్మక శైలికి మేలితునక. తన 88వ ఏట డిసెంబర్ 23న కన్నుమూసిన ఈ సాహితీమూర్తికి నివాళి.

ఎన్నడూ నా యింటికి రాని వారిని
నేనే వెళ్ళి కలుస్తాను
వరదలతో పోటెత్తే నది నా
యింటికి ఎన్నడూ రాదు
నది వంటి మనుషుల్ని
కలిసేందుకు
నేనే ప్రవాహం దగ్గరికి
వెడతాను –
కొంచెం ఈది వాళ్ళతో
తలమునకలవుతాను
ఇసుకదిబ్బలు, శిలలు, పర్వ
తాలు, నీటి మడుగులు,
పొడవాటి వృక్షాలు,
పంటపొలాలు
నా యింటికి ఎన్నడూ రాలేవు
నేనే లోలోతుల్లో నిమ్నోన్న
తాల్లో అన్వేషించాలి
మనుషుల్ని ఇసుక మేటలలో,
పర్వతాలలో, శిలాసదృశ
రూపాలలో.

నిరంతరం శ్రమచేసే ప్రజను
నేనే కలుసుకుంటాను–
నా తీరిక వేళల ఉబుసుపోకకు
కాదు సుమా –

నివాళి

వినోద్ కుమార్ శుక్లా

వాళ్ళను కలవటమే
ముఖ్యమైన పనిగా పెట్టుకుని!
ఈ నా ప్రథమ కాంక్షనే చిట్టచివరి
కోరికలాగ ఎప్పటికీ నాలో
నిలుపుకుంటాను.

హిందీ మూలం: వినోద్ కుమార్ శుక్లా
ఆంగ్ల రూపం: వి. కె. శుక్లా–డేనియల్ వెయిస్బోర్ట్
తెలుగు: ఘంటశాల నిర్మల

చైనాదే పైచేయి

డేటా పాయింట్

చైనాతో మన వాణిజ్య లోటు ఏటా పెరుగుతోంది. మనదేశం నుంచి చైనాకు చేసే ఎగుమతులు తగ్గుతుంటే దిగుమతులు మాత్రం పెరుగుతున్నాయి.



సంవత్సరాల వారీగా
● ఎగుమతులు ● దిగుమతులు (బిలియన్ డాలర్లలో)

	ఎగుమతులు	దిగుమతులు
2020-21	21.19	65.21
2021-22	21.26	94.57
2022-23	15.33	98.51
2023-24	16.67	101.74
2024-25	14.25	113.45
2025-25 (ఏప్రిల్-అక్టోబర్)	10.02	73.99

ఆధారం: కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ

నిజమైన పూజ

జ్యోతిర్మయం

రోజూ రకరకాల పుష్పాలతో దేవునికి అలంకరించి, సమర్పించి, 'పుష్పం సమర్పయామి', 'పత్రం సమర్పయామి' అని ఆనందాన్ని అనుభవిస్తుంటాం. పండుగల్లో అన్ని ఆలయాల్లోనూ దేవతల విగ్రహాల మెడలు పూలహారాలతో నిండిపోతాయి. రంగు రంగుల పూలు, పండ్లు, పత్రాలు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తాయి. ప్రాథమిక దశలో అలాంటి పూజలు మంచివే అయినా క్రమంగా వాటిని దాటిపోవాలంటారు కొందరు మహనీయులు.

ప్రప్రథమంలో రామకృష్ణ పరమహంస కూడా పువ్వులు కోసేవారు. ఒక రోజు పంచవటి ఎదుటవున్న ఒక బిల్వవృక్షం ఆకులు కోస్తూంటే ఒక కొమ్మ కొద్దిగా ఊడివచ్చింది. అప్పుడు సర్వభూతాలలోనూ భగవంతుడు విరాజిల్లుతున్నాడన్న అనుభూతి ఆయనకు కలిగింది. మొక్కలోని భగవంతునకు ఎంతగా బాధ కలిగిందో అని రామకృష్ణుడు చింతించారు. పిమ్మట ఆకులు కోయలేకపోయారు. మరొక్క రోజు పువ్వులు కోయటానికి తిరుగుతున్నారు. అప్పుడు ఒకొక్క పువ్వు ఒక్కొక్క గుత్తిగా విరాట్ శివునికి అలంకరిస్తూ, అహర్నిశలూ ఆ విరాడ్రూపుని పూజ జరుగుతున్నట్టుగా ఆయన దర్శించారు. (శ్రీ రామకృష్ణ కథామృతం – మహేంద్ర నాథ్ గుప్తా). అప్పటి నుంచి ఆయన పూజ కోసం పూలనూ, ఆకులనూ కోయటం మానేసినట్టు తెలుస్తోంది.

పూలన్నిటినీ కోసి, ఆ మొక్కలను బోడి చేసి, హృదయంలో మాత్రం దుర్గుణాలు అన్నిటినీ భద్రంగా అలాగే ఉంచుకొని, దేవునికి మొక్కితే ప్రయోజనం శూన్యమట. దేవుడు కోరే పుష్పాలు – **అహింస ప్రథమం పుష్పం, పుష్పమింద్రియ నిగ్రహః, సర్వభూత దయా పుష్పం, క్షమా పుష్పం విశేషతః, శాంతి పుష్పం, తపః పుష్పం, ధ్యానం పుష్పం తథైవచ సత్యమష్ట విధం పుష్పం విష్ణు ప్రీతికరం భవేత్** – అంటే అహింస, ఇంద్రియ నిగ్రహం, సర్వభూత దయ, ఓర్పు, శాంతి, పరమాత్మకై తపించుట, ధ్యానం, సత్యనిరతి అనే ఎనిమిది విధాలైన పుష్పాలు విష్ణువుకు ప్రీతికరమట. మనం ఆ సద్గుణాలను అలవర్చుకొని జీవిస్తే ఆ జీవితమే అత్యుత్తమ పూజ అవుతుంది.

– రాచమడుగు శ్రీనివాసులు

పందెంకోళ్లపై దొంగల పంజా

మూడు నెలల్లో 45 పుంజులు చోరీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.లక్షల విలువ చేసే పుంజులు చోరీ

కొత్తగూడెంలోనే రూ.12 లక్షల విలువ చేసే 34 కోళ్లు అపహరణ

సంక్రాంతికి ముందే జిల్లాలో వరుస దొంగతనాలు

బెంబేలెత్తుతున్న పెంపకందారులు

పందెం కోళ్లకు కేరాఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా. సంక్రాంతి పందాల కోసం కోళ్లను ప్రత్యేక వాతావరణంలో కంటికిరెప్పలా సాకుతారు. ఇక్కడి పందెం కోళ్లకు ఉన్న డిమాండ్ తెలిసిన దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సంక్రాంతికి ముందే లక్షల విలువైన 79 పందెం కోళ్లను ఎత్తుకు పోయారు. దీంతో పెంపకందారులు గగ్గోలు పెడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఇష్టంతో కొందరు.. జీవనోపాధిగా మార్చుకుని మరికొందరు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పందెంకోళ్లను పెంచుతున్నారు. వాటికి బలం కోసం జీడిపప్పు.. బాదంపప్పు.. మటన్ కీమా వంటి పౌష్టికాహారం పెడతారు. ప్రత్యేక వాతావరణంలో నెలలు తరబడి పెంచుతారు. అనారోగ్యం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. రెక్కలు బలంగా ఆడటానికి ఈత నేర్పిస్తారు. ఒక్కో పందెం కోడి బ్రీడ్‌ను బట్టి రూ.70 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుంది. అలాంటి కోళ్లపై దొంగల కన్ను పడింది.

సంక్రాంతి సీజన్‌కు ముందే పందెం కోళ్ల చోరీ

సంక్రాంతి సీజన్‌కు ముందే పందెం కోళ్ల దొంగతనాలు జోరందుకున్నాయి. కొందరు మాత్రమే ఫిర్యాదు చేస్తున్నారు. మరికొన్ని చోరీలపై కేసు కూడా లేకుండా పక్కన పెట్టడం రివాజుగా మారింది. జిల్లాలో పందెంకోళ్లను రాయలసీమ వరకు అన్ని జిల్లాల పందెంరాయుళ్లు కొనుగోలు చేస్తుంటారు. ప్రధానంగా కోడిపందాలకు ఉపయోగించే డేగ, కాకి డేగ, పచ్చ డేగ, సేతువా, నెమలి, పింగళాలు, గట్టి కాకులు, కొక్కిరాయి, పర్ల, అబ్రాసు ఇలా 12 రకాలు ఉన్నాయి. ఆగస్టు నుంచే జిల్లాలో పందాలకు ప్రత్యేక బ్రీడ్‌లను సన్నద్ధం చేస్తుంటారు.

పందెంకోళ్లకు ఈ ప్రాంతాలు ప్రత్యేకం

ఉంగుటూరు, భీమవరం, ఉండి, నరసాపురం, దెందులూరు ప్రాంతాల్లో ప్రత్యేకంగా పందాలకు కోళ్లను పెంచుతారు. సగటున ఒక్కో పుంజు రూ. 30 వేల నుంచి రూ.3 లక్షల వరకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తుంటారు. ఉంగుటూరులో గత నెలలో కాకి, నెమలి రకాలు అత్యధికంగా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు విక్రయించారు. సంక్రాంతి మూడు రోజులపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల బరుల్లో వేల సంఖ్యలో కోడిపందాలు నిర్వహిస్తారు. ప్రతి బరిలో 50 నుంచి 100కుపైగా పందాలు రోజూ ఒక్కో కేటగిరిలో జరుగుతుంటాయి. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా కేవలం పందాల కోసమే 20 వేలకు పైగా పందెంకోళ్లను వినియోగిస్తుంటారు. ఇలాంటి తరుణంలో వరుస దొంగతనాలు నిర్వాహకులను బెంబేలెత్తిస్తున్నాయి.

34 పందెం పుంజులు మాయం

ఈనెల 9న ఉంగుటూరు మండలంలోని గొల్లగూడెం శివారు ప్రాంతమైన కొత్తగూడెంలో వీర వెంకటరమణమూర్తి (శ్రీను)కు చెందిన 34 పందెం పుంజులు చోరీకి గురయ్యాయి. సీసీ కెమెరాల ఏర్పాటు, కుక్కలతో కాపలా, అలాగే కోళ్లను సాకడానికి మనుషులను ఏర్పాటు చేశారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గోళీలతో కుక్కలను కొట్టి కాపలాదారులను కత్తులు, కర్రలతో బెదిరించి 34 కోళ్లను అపహరించారు. వీటి విలువ రూ.12 లక్షలపై మాటే. ఆరు నెలల నుంచి పెంచిన కోళ్లను దొంగలు ఎత్తుకుపోవడంతో శ్రీను లబోదిబోమంటున్నారు. పోలీసులు ఫిర్యాదు తీసుకుని ఇంకా విచారిస్తూనే ఉన్నారు.

ఇదే తరహాలో మూడు నెలల్లో జిల్లాలో పలుచోట్ల దొంగతనాలు జరిగాయి. ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడులో 8 పందెంకోళ్లు, తిరుమలంపాలెంలో 17, రాజుపాలెంలో 8 పందెంకోళ్లు దొంగతనానికి గురయ్యాయి. ఇక మొగల్తూరు మండలం వారతిప్పలో 12 పుంజులు అపహరణకు గురైన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే జగన్నాథపురంలో రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. దొంగతనానికి గురైన కోళ్లు ఒంగోలు, తూర్పుగోదావరిలో విక్రయిస్తున్నారని అనుమానిస్తున్నారు. అయితే చోరీకి గురైన వాటిలో ఇప్పటి వరకూ ఒక్క కోడిని కూడా పోలీసులు రికవరీ చేయలేదు.

ముక్కంటిని దర్శించుకున్న ప్రముఖులు

ఆలయంలో తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్

మాజీ న్యాయమూర్తి జస్టిస్ సీవై సోమయాజులు

శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్, కోల్‌కతాకు చెందిన డెట్స్ రీకవరీ అపిలియేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ అనిల్‌కుమార్ శ్రీవాత్సవ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సీవై సోమయాజులు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీరజ్ తివారీ తదితరులు ఉన్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్ ఏర్పేడు మండలం గుడిమల్లంలోని ఆనందవల్లీ సమేత శ్రీపరశురామేశ్వరాలయాన్ని దర్శించుకున్నారు.

– శ్రీకాళహస్తి

దుర్గమ్మ సన్నిధిలో త్రిపుర హైకోర్టు జడ్జి

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ టి.అమర్‌నాథ్ గౌడ్ సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ జస్టిస్ అమర్‌నాథ్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

గొంతెత్తిన ఆర్యవైశ్యులు

పొదిలి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని దుకాణాల బంద్

పొదిలిలో నిరసన తెలుపుతున్న ఆర్యవైశ్యులు

పొదిలి: వ్యాపారులైన తండ్రీ కొడుకులను విచక్షణా రహితంగా కొట్టిన ప్రకాశం జిల్లా పొదిలి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్యులు గొంతెత్తారు. కుమారుడిని ఎందుకు అరెస్టు చేశారని అడిగేందుకు వెళ్లిన కోటేశ్వరరావుపై ఎస్‌ఐ లాఠీ చార్జి చేయడాన్ని జీర్ణించుకోలేని ఆర్యవైశ్యులంతా ఒక్కటయ్యారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం దుకాణాలు మూసివేసి పొదిలి పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. ఎరువుల వ్యాపారి యాదాల కోటేశ్వర రావు, అతని కుమారుడు అవినాష్‌లపై ఎస్‌ఐ వ్యవహరించినతీరు క్షమించరానిదని మండిపడ్డారు.లారీ రోడ్డుపై పెట్టి అన్‌లోడ్ చేయిస్తున్నారన్న కారణంతో లారీ డ్రైవర్, అవినాష్‌ను తీవ్రంగా కొట్టి స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. కక్ష కట్టినట్టు కొట్టారని బాధితులు వాపోయారు. పెద్దబస్టాండ్‌లో మానవహారం చేపట్టి అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ సాజిదాకు వినతిపత్రం ఇచ్చారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఆర్యవైశ్యులు, వ్యాపారుల మద్దతు కూడగట్టి రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

బాబు పాలనలో ఆర్యవైశ్యులకు రక్షణ కరువు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: చంద్రబాబు పాలనలో ఆర్యవైశ్యులపై వేధింపులు అధికమయ్యాయని, మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఇది ఎంతో కాలం సాగదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పొదిలిలో ఆర్యవైశ్యుల వర్గానికి చెందిన అవినాశ్ అనే యువకుడిని ఎస్‌ఐ రక్తం వచ్చేలా కొట్టారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తండ్రి కోటేశ్వర రావును కూడా కొట్టారని చెప్పారు. వైశ్యులపై కక్ష సాధింపు, పోలీసుల వేధింపులు మితిమీరాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొదిలి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్య వైశ్యులంతా ఒక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. బాబు పాలనలో టీటీడీ విఫలమైందని, తిరుమలలో పరిపాలన గాడి తప్పిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఏపీలో పోలీస్ రాజ్యం, దమన కాండ నడుస్తోందన్నారు. పొదిలి ఘటనపై ఆర్యవైశ్యులకు వెంటనే క్షమాపణ చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తిరుమలలో

వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

పదిరోజులపాటు భక్తులకు దర్శనం | ఆకట్టుకుంటున్న శ్రీవారి ఆలయంలో పుష్పాలంకరణలు

తిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం వైభవంగా ప్రారంభమైంది. సోమవారం అర్ధరాత్రి శ్రీవారి ఆలయాన్ని తెరిచి ఏకాంతంగా స్వామివారి పూజాది కైంకర్యాలు, అభిషేకం నిర్వహించిన అనంతరం 1.30 గంటల నుంచి శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాన్ని ప్రారంభించారు. మంగళవారం నుంచి జనవరి 8వ తేదీ రాత్రి 12గంటల వరకు 10 రోజులపాటు టీటీడీ భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనుంది. మరోవైపు వీఐపీలు పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకున్నారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యత

ముక్కోటి ఏకాదశి పర్వదినానికి సామాన్య భక్తులకే పెద్దపీట వేసినట్లు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ ఏడాది వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తుల కోసం మూడు ప్రత్యేక ప్రవేశ మార్గాలను అధికారులు సిద్ధం చేశామన్నారు. కేవలం టోకెన్లు కలిగిన భక్తులను మాత్రమే ఈ మార్గాల ద్వారా అనుమతిస్తున్నామన్నారు. కృష్ణతేజ ప్రవేశ మార్గంలో తెల్లవారుజామున 1 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు, ఏటీజీహెచ్ అతిథి గృహం వద్ద నుంచి ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, శిలాతోరణం మార్గం నుంచి సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అనుమతిస్తారని చెప్పారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు తొలిసారిగా అత్యాధునిక ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతను వినియోగిస్తున్నామన్నారు. స్థానిక భక్తుల కోసం రోజుకు 5 వేల చొప్పున ఈ–డిప్ ద్వారా టోకెన్లు ఇప్పటికే జారీ చేశామని ఆయన గుర్తుచేశారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఈవో వెంకయ్య చౌదరి

ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో, విద్యుద్దీపాలంకరణతో తీర్చిదిద్దారు. టీటీడీ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అలంకరణలు భక్తులను కనువిందుచేస్తున్నాయి. మందిరంలోని ధ్వజస్తంభం, బలిపీఠాన్ని చూడచక్కగా ముస్తాబు చేశారు. వైకుంఠ ప్రదర్శన మార్గంలోని అలంకరణ అద్భుతంగా ఉంది. తిరుమల వ్యాప్తంగా పదిరోజులపాటు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలను, నాలుగు టన్నుల కట్ ఫ్లవర్స్ వినియోగించనున్నారు. శ్రీవారి ఆలయంఎదుట శ్రీ రంగనాథస్వామి ఆలయం, అష్టలక్ష్ములు, శ్రీ వేంకటేశ్వరస్వామి సెట్టింగ్ భక్తులను మరింత ఆధ్యాత్మిక వైభవాన్ని తీసుకొచ్చేలా ఉంది.

కక్షకట్టి .. కాలేజీ డైరెక్టర్‌ను కత్తితో పొడిచిన ఆగంతకుడు

నిందితుడిని అదుపులోకి తీసుకున్న నరసరావుపేట పోలీసులు

నరసరావుపేట టౌన్: సోదరి ఆత్మహత్య.. అది తట్టుకోలేక తండ్రి బలవన్మరణం. ఈ రెండు ఘటనలకు కారణమైన సోదరి చదివిన కళాశాల యాజమాన్యంపై ఆ యువకుడు కక్ష కట్టాడు. తండ్రి చనిపోయిన రోజే ప్రత్యర్థి అని భావిస్తున్న వ్యక్తిని చంపాలనుకున్నాడు. పథకం ప్రకారం తుపాకీతో బెదిరించి కత్తితో దాడికి పాల్పడ్డాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో భావన కళాశాల డైరెక్టర్ పై జరిగిన హత్యాయత్నం కలకలం రేగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన జెట్టి అనూష గతేడాది నవంబర్ 16న పట్టణంలోని భావన కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె మృతితో కుంగిపోయిన తండ్రి హనుమంతరావు అదే ఏడాది డిసెంబర్ 29న గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అనూష మృతిలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఉందన్న అనుమానంతో కక్ష పెంచుకున్న ఆమె సోదరుడు జెట్టి ఏడుకొండలు ప్రిన్సిపాల్‌ను హతమార్చేందుకు ప్రణాళిక రూపొందించాడు. ఇందులో భాగంగా డమ్మీ తుపాకీ కొన్నాడు. ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల మైదానానికి రోజూ డైరెక్టర్ మైనేడి శ్రీనివాసరావు వస్తాడని తెలుసుకున్నాడు. సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో తుపాకితో బెదిరించి వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఘటనలో శ్రీనివాసరావు ఛాతిపై రెండు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు ఏడుకొండల్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. శ్రీనివాసరావును ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఫిరోజ్ తెలిపారు. నిందితుడు ఏడుకొండలు వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

యూరియా వారికేనా? మేం రైతులం కాదా?

అధికారులను నిలదీసిన అక్కంపేట రైతులు

సిబ్బందితో మాట్లాడుతున్న రైతులు

మనుబోలు: 'మేం రైతులం కాదా.. వచ్చిన యూరియా అంతా అధికార పార్టీ వారికే ఇచ్చేస్తారా? ఇదేం న్యాయం' అంటూ వ్యవసాయశాఖాధికారులపై శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం అక్కంపేట రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కంపేట రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. పలువురు సన్న, చిన్న కారు రైతులకు యూరియా ఇవ్వకపోగా, టీడీపీకి చెందిన వారికి మాత్రమే ఇవ్వడంతో మిగిలిన రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే ఎకరాకు ఒక బస్తా మాత్రమే ఇస్తామని నిబంధనలు విధించిన అధికారులు ఆ మేరకు కూడా అందరికి సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌కేలకు వచ్చిన యూరియా అధిక మొత్తం అధికార పార్టీ నేతలు, వారి అనుయాయులకే తరలిపోతోందని, సామాన్య రైతులకు తూతూ మంత్రంగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదన్నారు. అక్కంపేట ఆర్‌ఎస్‌కే పరిధిలో వచ్చిన యూరియాను కొందరు అధికార పార్టీ నాయకులు దళితుల పేర్లపై వడ్లపూడి సర్వే నంబర్లలో రాయించుకుని తీసుకెళ్లారని, ఆర్‌ఎస్‌కేల్లో కూర్చుని ఎవరికి యూరియా ఇవ్వాలో వారే నిర్ణయించడం దుర్మార్గమని వాపోయారు.

ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్‌వే తరలించాల్సిందే

కలెక్టరేట్ ఎదుట నాలుగు గ్రామాల ప్రజల నిరసన

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలో ఎన్‌హెచ్–16పై నిర్మించబోతున్న ఈఎల్‌ఎఫ్–2 ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్‌వేను వేరే ప్రాంతానికి తరలించాలని నాలుగు గ్రామాల ప్రజలు నినదించారు. సింగరాయకొండ, కలికవాయి, కనుమళ్ల, మూలగుంటపాడు గ్రామాలకు చెందిన ప్రజలు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఈఎల్‌ఎఫ్–2 వ్యతిరేక పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సింగరాయకొండ మండల పరిధిలోని నాలుగు గ్రామాల మధ్య ఎన్‌హెచ్ –16 హైవేకి ఇరువైపులా నివాస ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఎన్‌హెచ్–16 అధికారులు ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ఇరుపక్కలా 150 మీటర్లు నాన్ రెసిడెన్షియల్ జోన్‌గా ప్రకటిస్తున్నట్టు తెలిసిందన్నారు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈఎల్‌ఎఫ్–2 ఎమర్జెన్సీ ల్యాండింగ్ నిర్మాణం చేయటం వలన నాలుగు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈఎల్‌ఎఫ్–2 నిర్మానుష్య ప్రాంతంలో చేసుకుంటే ఎటువంటి ఇబ్బంది ఉండదని, కానీ నివాస ప్రాంతాల వద్ద నిర్మించటం వలన ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

జైల్లోనే సెంగార్

‘ఉన్నావ్’ కేసులో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుపై సుప్రీంకోర్టు స్టే

- తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా దోషిని విడుదల చేయొద్దని స్పష్టీకరణ
- ఎమ్మెల్యే ‘ప్రజా సేవకుడు’ కాదని ఎలా అంటారు?
- హైకోర్టు వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం విస్మయం
- కానిస్టేబుల్ ప్రజా సేవకుడైనప్పుడు.. ఎమ్మెల్యేకు మినహాయింపు ఎందుకని ప్రశ్న
- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌కు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో 2017 నాటి ఉన్నావ్ అత్యాచారం కేసులో దోషి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. అతడికి బెయిల్ మంజూరు చేయడంతోపాటు కింది కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను రద్దు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ‘స్టే’ విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేదాకా సెంగార్‌ను జైలు నుంచి విడుదల చేయొద్దని అధికారులకు తేల్చిచెప్పింది. ఐపీసీ ప్రకారం ఎమ్మెల్యేను ‘ప్రజాసేవకుడి’గా పరిగణించలేమన్న ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలను అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ఇది చట్టసభ సభ్యులకు మినహాయింపు ఇచ్చినట్లు అవుతుందన్నది.

సెంగార్

ఎమ్మెల్యే ప్రజాసేవకుడు కాదా?

ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)తోపాటు బాధితురాలు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ‘చట్టపరమైన అంశాలను పరిశీలించాల్సిందే. హైకోర్టు న్యాయమూర్తులు ఎంతో అనుభవజ్ఞులు, కానీ ఎవరైనా పొరపాట్లు చేస్తారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(సి) నిర్వచనం చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. చట్టం ప్రకారం ఒక కానిస్టేబుల్ ‘పబ్లిక్ సర్వెంట్’ అవుతారు. అలాంటప్పుడు ఒక శాసనసభ్యుడు మాత్రం ప్రజా సేవకుడు కాదా? ఎమ్మెల్యేను మినహాయించడం సరైందేనా? చట్టసభ సభ్యులను దీని నుంచి మినహాయించడం సరైనది కాకపోవచ్చు’ అని ధర్మాసనం పేర్కొంది. సాధారణంగా ఒక దోషి లేదా అండర్ ట్రయల్ ఖైదీకి బెయిల్ ఇస్తూ కింది కోర్టు లేదా హైకోర్టు ఉత్తర్వు జారీ చేసినప్పుడు అతడి వాదన వినకుండా ఆ ఉత్తర్వుపై స్టే విధించలేమని తెలియజేసింది. మరో కేసులో సెంగార్ దోషిగా తేలి, ప్రస్తుతం కస్టడీలోనే ఉన్నాడని పేర్కొంది. ఈ నెల 23న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఉన్నావ్ కేసుకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితులను, వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని నిలిపివేస్తున్నామని స్పష్టంచేసింది.

బాధితురాలికి ప్రాణహాని ఉంది: తుషార్

సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ‘ఇది అత్యంత పాశవికమైన నేరం. ఘటన జరిగినప్పుడు బాధితురాలి వయసు 16 ఏళ్ల కంటే తక్కువ (15 ఏళ్ల 10 నెలలు). కేవలం ఏడేళ్ల జైలుశిక్ష పూర్తయిందన్న కారణంతో దోషికి బెయిల్ ఇవ్వడం సరికాదు. సవరించిన చట్టం ప్రకారం ఇలాంటి నేరాలకు కనీసం 20 ఏళ్ల జైలు శిక్ష విధించాలి’ అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ‘నేరం జరిగిన సమయానికి ఈ చట్ట సవరణ రాలేదు కదా! ఆ తర్వాత వచ్చిన సవరణలను పాత కేసులకు ఎలా వర్తింపజేస్తాం?’ అని ప్రశ్నించింది. దీనికి తుషార్ బదులిస్తూ.. ‘మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగినప్పుడు పబ్లిక్ సర్వెంట్ నిర్వచనంతో పనిలేదు. ఎమ్మెల్యే అనే వ్యక్తి ప్రజల దృష్టిలో బలమైన స్థానంలో ఉంటారు. ఎవరైనా సాయం కోసం ఎమ్మెల్యే దగ్గరకు వెళ్తారు. అలాంటి నమ్మకమైన స్థానంలో ఉండి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేసే నేరం కచ్చితంగా తీవ్రమైన లైంగిక దాడి కిందకే వస్తుంది. ఆర్మీ ఆఫీసర్ విధుల్లో ఉన్నప్పుడు తప్పు చేస్తే ఎలా శిక్షార్హుడో, ఎమ్మెల్యే కూడా అంతే’ అని వాదించారు. సెంగార్ బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని తుషార్ మెహతా ఆందోళన వ్యక్తం చేశారు. ‘సెంగార్ ఇప్పటికే బాధితురాలి తండ్రి కస్టోడియల్ డెత్ కేసులోనూ దోషిగా తేలారు. ఈ హత్య కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్నారు. పలుకుబడి ఉన్న వ్యక్తి సెంగార్ బయటకొస్తే బాధితురాలికి, ఆమె కుటుంబానికి తీరని అన్యాయం జరుగుతుంది. ఆ బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బెయిల్ రద్దు చేయాలి’ అని కోర్టును కోరారు. ఎల్.కె. అద్వానీ కేసులో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ఎంపీలు లేదా ఎమ్మెల్యేలుగా పదవిలో ఉన్న వాళ్లను ప్రజా ప్రతినిధులుగానే పరిగణిస్తూ అప్పట్లో న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు గుర్తు చేశారు.

సెంగార్ తరఫు న్యాయవాదుల వాదన

సెంగార్ తరఫున న్యాయవాదులు సిద్ధార్థ దవే, ఎన్. హరిహరన్ వాదనలు వినిపించారు. ‘ట్రయల్ కోర్టు సెంగార్‌ను పబ్లిక్ సర్వెంట్‌గా పరిగణించడం వల్లనే జీవిత ఖైదు విధించింది. ఐపీసీలోని పబ్లిక్ సర్వెంట్ నిర్వచనాన్ని తీసుకొచ్చి పోక్సో చట్టానికి ఆపాదించడం న్యాయం కాదు. ఒక చట్టంలోని నిర్వచనాన్ని మరో చట్టానికి వర్తింపజేయకూడదు’ అని సాంకేతిక అంశాన్ని లేవనెత్తారు. అలాగే సెంగార్‌కు బెయిల్ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులకు వ్యతిరేకంగా ఆరోపణలు వస్తున్నాయని, టీవీల్లో కొందరు చర్చలు సాగిస్తున్నారని సెంగార్ తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయండి

ఇరుపక్షాల వాదనలు తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం .. ఎమ్మెల్యేను పబ్లిక్ సర్వెంట్ కాదనడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూనే, ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను నిలిపివేసింది. దీనిపై లోతుగా విచారణ జరపాల్సి ఉందని వెల్లడించింది. 4 వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.

అసలేం జరిగింది?

ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్ ఓ మైనర్ బాలికను అపహరించి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో అతడు దోషిగా తేలడంతో 2019 డిసెంబర్‌లో ట్రయల్ కోర్టు జీవిత ఖైదు(మరణించేదాకా జైలులోనే) విధించింది. మరోవైపు బాధితురాలి తండ్రి పోలీసు కస్టడీలో మరణించాడు. ఈ కేసులోనూ సెంగాల్ దోషిగా తేలడంతో పదేళ్ల జైలు శిక్ష పడింది. ఉన్నావ్ అత్యాచారం కేసుతోపాటు సంబంధిత ఇతర కేసులను ఉత్తరప్రదేశ్ ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఉన్నావ్ రేప్ కేసులో ట్రయల్ కోర్టు విధించిన శిక్షను రద్దు చేయాలని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ సెంగార్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఇటీవల విచారించింది. సెంగార్ చేసిన నేరం పోక్సో చట్టంలోని సెక్షన్ 5(సి) కింద ‘తీవ్రమైన లైంగిక దాడి’ పరిధిలోనికి రాదని అభిప్రాయపడింది. ఐపీసీ సెక్షన్ 21 ప్రకారం ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధి ‘పబ్లిక్ సర్వెంట్’ నిర్వచనం పరిధిలోకి రారని పేర్కొంది. సెంగార్ ఇప్పటికే ఏడేళ్లపాటు జైలు శిక్ష అనుభవించినందున బెయిల్ మంజూరు చేస్తున్నట్లు, జీవిత ఖైదును కూడా రద్దు చేస్తున్నట్లు ఈ నెల 23వ తేదీన తీర్పునిచ్చింది.

ఆరావళి ‘ఎత్తు’ వివాదంలో కీలక మలుపు

గతంలో తామిచ్చిన తీర్పు అమలును నిలుపుదలచేసిన సుప్రీం

- నియంత్రణల్లో లోటుపాట్లను పూడ్చాల్సి ఉంది
- 500 మీటర్ల దూరాల్లో 100 మీటర్లకు మించి ఎత్తులో ఉండే కొండలనే పర్వతాలుగా నిర్వచించడం సబబుకాదని వ్యాఖ్య
- నవంబర్ 20నాటి తీర్పును పక్కనబెడుతున్నామని స్పష్టీకరణ
- స్థానిక నిపుణులతో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని ఆదేశం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు



న్యూఢిల్లీ/జైపూర్: ఆరావళి శ్రేణిలో వంద మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న కొండలనే పర్వతాలుగా పరిగణిస్తూ కొత్త నిర్వచనం ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తడంతో సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 20వ తేదీన తాము ఇచ్చిన తీర్పును పక్కనబెడుతున్నట్లు సోమవారం సుప్రీంకోర్టు ప్రకటించింది. వంద మీటర్ల కంటే ఎత్తున్న ఆరావళి పర్వతాలకే పర్యావరణ పరిరక్షణ లభిస్తుండటంతో ఎత్తు తక్కువ ఉన్నవి గనుల తవ్వకంతో కనుమరుగయ్యే ప్రమాదముందని పర్యావరణవేత్తలు మొదలు నేతలు, సామాన్య ప్రజానీకం నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం సూమోటోగా స్వీకరించింది. సోమవారం ఈ కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల వెకేషన్ బెంచ్ విచారించి పలు వ్యాఖ్యలుచేసింది. ‘‘ఫలానా ఎత్తు ఉన్న కొండలనే ఆరావళి పర్వతాలుగా పరిగణించాలనే నిర్వచనం ఇవ్వడంలో సహేతుకత లోపించినట్లు స్పష్టమవుతోంది. సంబంధిత కమిటీ నివేదికలో, తీర్పులో ఇలాంటి పలు సంక్లిష్టమైన, కీలక అంశాలపై దృష్టిపెట్టలేదు. అందుకే ఈ అంశంలో మరింత లోతైన అధ్యయనం, దర్యాప్తు, విచారణ అవసరం. అప్పటిదాకా మేం గతంలో ఇచ్చిన తీర్పును పక్కనబెడుతున్నాం. 2010 ఆగస్ట్ 25వ తేదీన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ) ఇచ్చిన నిర్వచనం మేరకు 2024 మే 9న మేం ఇచ్చిన తీర్పు ప్రకారం ఆరావళి పర్వతాల్లో ఇకపై ఎలాంటి మైనింగ్ అనుమతులు ఇవ్వకూడదు. నవంబర్ 20న మేం ఇచ్చిన తీర్పు, అందులో పర్వతం నిర్వచనాన్ని తప్పుగా ఆపాదించే పెను ప్రమాదముందని అర్థమవుతోంది. కొత్త నిర్వచనాన్ని మైనింగ్ సంస్థలు తప్పుగా అన్వయించి తమను అనువుగా అమలుచేసే ప్రమాదం పొంచి ఉంది. గతంలో కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, నియమ నిబంధనల్లో స్పష్టత కరువవడంతో ఇదంతా జరిగింది. ఆరావళి పర్వతాల పర్యావరణ పరిరక్షణ, సమగ్రత కాపాడేలా నిబంధనల్లో లోటుపాట్లను సమగ్ర స్థాయిలో పూడ్చాల్సి ఉంది. 100 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తున్న కొండలను మాత్రమే ఆరావళి పర్వత శ్రేణిగా పేర్కొనడంలో తర్కం లోపించింది. 500 మీటర్ల దూరం ఎడంగా ఉన్న కొండలనే ఆరావళి పర్వత శ్రేణిలో భాగంగా పరిగణించాలన్న నిబంధనలోనూ లోపాలున్నాయి. ఇలాంటి పలు నిబంధనలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలులేవని అర్థమవుతోంది. పలు కీలక అంశాల్లో సంక్లిష్టత నెలకొంది. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాల్లో 12,081కిగాను కేవలం 1,048 పర్వతాలు మాత్రమే 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్నాయి. దీంతో మిగతా కొండలకు మైనింగ్ ముప్పు పొంచి ఉంది. ఇలా చిన్న కొండలు పర్యావరణ పరిరక్షణ ఛత్రం ఆవల ఉండిపోవడం మేం ఏమాత్రం ఒప్పుకోం. మళ్లీ సమగ్ర స్థాయిలో శాస్త్రీయ, భౌగోళిక దర్యాప్తు జరగాల్సిందే. ఈ మేరకు స్థానిక నిపుణులతో అత్యున్నత కమిటీ ఏర్పాటును ప్రతిపాదిస్తున్నాం. ఈ విషయంలో మీ స్పందన తెలియజేయండి’’ అంటూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. ఆరావళి పర్వతాల పరిధిలోకి వచ్చే ఢిల్లీ, రాజస్థాన్, హరియాణా, గుజరాత్‌లకూ నోటీసులు పంపించింది. జనవరి 21వ తేదీలోగా స్పందన తెలపాలని సుప్రీంకోర్టు గడువు విధించింది.

ఆరావళి పర్వతాల ప్రత్యేకత ఏంటి?

ప్రపంచంలోనే అత్యంత పురాతన ముడత పర్వతాలుగా ఆరావళి పర్వతాలకు పేరుంది. ఢిల్లీ నుంచి మొదలై హరియాణా, రాజస్థాన్, గుజరాత్‌లదాకా ఆరావళి పర్వతాలు విస్తరించి ఉన్నాయి. ఆయా రాష్ట్రాల్లో మొత్తంగా 37 జిల్లాల్లో ఈ పర్వతాలున్నాయి. రాజస్థాన్‌లోని థార్ ఎడారి నుంచి ఇసుక మేఘాలు ఢిల్లీసహా ఉత్తరభారతాన్ని కమ్మేయకుండా ఈ ఆరావళి పర్వతాలే అడ్డుకుంటున్నాయి. ఆరావళి కారణంగానే థార్ ఎడారి ఉత్తరదిశగా విస్తరించకుండా ఆగిపోయింది. అలా ఉత్తరభారతంలో జీవవైవిధ్యానికి, భూగర్భ జలాలకు ఆరావళి పర్వతాలు రక్షాకవచాలుగా నిలుస్తున్నాయి. ఆరావళి కొండల్లోని వర్షపు నీరు నేలలోకి ఇంకి ఆయా ప్రాంతాల భూగర్భజలాలను ఎప్పటికప్పుడు రీచార్జ్ చేస్తున్నాయి. దీంతో భూసారం పరిరక్షించబడుతోంది. పరోక్షంగా జీవజాతుల మనుగడ సాధ్యమవుతోంది. ఆరావళిలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే పులుల అభయారణ్యాలుగా, జాతీయ వనాలుగా, పక్షుల సంరక్షణ కేంద్రాలుగా, పర్యావరణంపరంగా అత్యంత సున్నిత ప్రదేశాలుగా కొనసాగుతున్నాయి.

స్వాగతించిన పర్యావరణ నిపుణులు

గత తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు వెలువర్చిన తాజా నిర్ణయంపై పర్యావరణవేత్తలు ఆనందం వ్యక్తంచేశారు. అత్యున్నత కమిటీ అనేది కేవలం ప్రభుత్వ ఉన్నతాధికారుల కూటమిగా మిగిలిపోకుండా జీవావరణ, పర్యావరణవేత్తలకూ స్థానం కల్పించాలని పర్యావరణవేత్త భావరీన్ కంధారీ డిమాండ్‌చేశారు. ‘‘ఇది తాత్కాలిక గెలుపు. ఇప్పటిదాకా జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని వెల్లడిస్తూనే ఇకమీదట మైనింగ్‌ను పూర్తిగా ఆపేలా తుది తీర్పు రావాలి’’ అని ‘పీపుల్స్ ఫర్ ఆరావళి’ వ్యవస్థాపక సభ్యురాలు నీలం అహ్లూవాలియా ఆశాభావం వ్యక్తంచేశారు. పర్యావరణవేత్త విమలేందు ఝా, జీవావరణవేత్త విజయ్ ధాస్మాన తదితరులూ తాజా ఉత్తర్వును స్వాగతించారు. ‘‘ఉత్తర్వును మేం కూడా స్వాగతిస్తున్నాం. ఆరావళి పరిరక్షణకు, పునరుద్ధరణకు మోదీ సర్కార్ కట్టుబడి ఉంది’’ అని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ చెప్పారు. ‘‘కొత్త నిర్వచనం సరిగా లేదని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు కేంద్ర సాధికారత కమిటీ, కోర్టు అమికస్ క్యూరీ సైతం గతంలోనే చెప్పారు. అయినాసరే కొత్త నిర్వచనం సరైందేనంటూ మంత్రి యాదవ్ గతంలో చేసిన వాదనలన్నీ తప్పు అని నేడు తేలింది. ఆయన వెంటనే రాజీనామా చేయాలి’’ అని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.

ఉరితీసే దాకా విశ్రమించం: బాధితురాలు

ఉన్నావ్: ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో ఉన్నావ్ కేసు బాధితురాలు సోమవారం సంతృప్తి వ్యక్తంచేశారు. సెంగార్‌ను ఉరితీసే దాకా విశ్రమించే ప్రసక్తే లేదని బాధితురాలు తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు నుంచి న్యాయం జరిగినట్లు భావిస్తున్నానని చెప్పారు. తనపై అత్యాచారం జరిగినప్పటి నుంచి న్యాయం కోసం గొంతు వినిపిస్తున్నానని పేర్కొన్నారు. ఏ కోర్టుపైనా తాను ఆరోపణలు చేయడం లేదని, అన్ని కోర్టులపై సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు. న్యాయం జరిగేదాకా పోరాడుతూనే ఉంటానని స్పష్టంచేశారు. సెంగార్‌ను ఉరి తీస్తేనే పూర్తిగా న్యాయం జరిగినట్లు అవుతుందన్నారు. తమకు ఇప్పటికీ బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం బలపడిందని బాధితురాలి సోదరి చెప్పారు. సెంగార్ ఒక క్రూర జంతువు అని మండిపడ్డారు. తొలుత తన సోదరిని, తర్వాత తమ కుటుంబాన్ని నాశనం చేశాడని ధ్వజమెత్తారు. అతడికి ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు నిలిపివేయడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ కేసులో పోరాటం ఆపబోమని తేల్చిచెప్పారు. మరోవైపు బాధితురాలి తల్లి సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తన బిడ్డపై అత్యాచారం చేసి, తన భర్తను చంపిన నేరగాడికి మరణ శిక్ష పడాల్సిందేనని అన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలపై సామాజిక కార్యకర్త యోగితా స్పందించారు. ఇది కేవలం ఉన్నావ్ బాధితురాలి పోరాటం కాదని.. మహిళలందరి పోరాటమని ఉద్ఘాటించారు. ఇది చాలా భిన్నమైన కేసు కాబట్టి హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు.

దేశానికే అవమానం

- విద్వేష నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- త్రిపుర విద్యార్థి హత్యపై సర్వత్రా నిరసనలు
- నిందితులను కఠినంగా శిక్షిస్తామన్న ఉత్తరాఖండ్ సీఎం

హత్యకు గురైన ఏంజెల్ చక్మా

డెహ్రాడూన్: ఈశాన్య రాష్ట్రం త్రిపురకు చెందిన ఓ విద్యార్థిని విద్వేష పూరిత వ్యాఖ్యలతో వేధించి, దారుణంగా చంపిన ఘటనపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్రిపురకు చెందిన ఏంజెల్ చక్మా(24) ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో ఎంబీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ నెల 9వ తేదీన కొందరు యువకులు కత్తులు, పదునైన ఆయుధాలతో దాడి చేయగా తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 26వ తేదీన కన్నుమూశాడు. ఏంజెల్ చక్మా తండ్రి బీఎస్ఎఫ్ జవాను. ఈయన ప్రస్తుతం మణిపూర్‌లోని టంగ్‌జెంగ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. డెహ్రాడూన్‌లో ఉంటున్న తన కుమారులు ఏంజెల్ చక్మా, మైకేల్ చక్మాలను కొందరు యువకులు ‘చైనీస్ మోమో’ అంటూ కొంత కాలంగా తీవ్రంగా వేధిస్తున్నారని తరుణ్ ప్రసాద్ చక్మా ఆరోపించారు. మేం చైనీయులం కాము, భారతీయులమంటూ అడ్డు చెప్పినందుకు ఏంజెల్‌ను విద్వేషపూరితంగా వెక్కిరిస్తూ కత్తి, ఇతర పదునైన ఆయుధాలతో దారుణంగా కొట్టారన్నారు. ఈ విషయమై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి సోమవారం తరుణ్ ప్రసాద్ చక్మాతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ దారుణానికి పాల్పడిన ఆరుగురిలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారని, నేపాల్‌కు పారిపోయిన మరొకరిని తీసుకువస్తామని చెప్పారు. నిందితులను పట్టుకుని, కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఏంజెల్ చక్మా కుటుంబానికి పరిహారంగా మొదటి విడతలో రూ.4.12 లక్షల చెక్కును పంపిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఘటనను తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీ విభజనవాదాన్ని ఎగదోస్తోందని ఆరోపించారు. డెహ్రాడూన్‌లో త్రిపుర విద్యార్థి దారుణ హత్య దేశానికే అవమానమని కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఈ గడ్డపై పుట్టిన వారంతా భారతీయులే అనే మెలకువ సమాజంలో ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు. ఘటనను రాజకీయం చేయవద్దని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరారు. హోం మంత్రి అమిత్ షా విద్వేష నేరాలపై స్పందించాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. ప్రధాన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి రూ.10 లక్షల బహుమానం అందిస్తామని త్రిపురలోని తిప్రా మోథా సుప్రీం ప్రద్యోత్ కిశోర్ మాణిక్య దేబ్‌వర్మ ప్రకటించారు. ఏంజెల్ చక్మాకు న్యాయం జరగాలంటూ సోమవారం డెహ్రాడూన్, అగర్తలాలో కొవ్వొత్తులతో ర్యాలీలు చేపట్టారు.

79వేల కోట్ల సైనిక హార్డ్‌వేర్ కొనుగోలుకు ఆమోదం

న్యూఢిల్లీ: సైన్యం సామర్థ్యాన్ని పెంపొందించడానికి రూ.79,000 కోట్ల విలువైన క్షిపణులు, ఆయుధాలు, హార్డ్‌వేర్ కొనుగోళ్లకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి(డీఏసీ) ఈ నిర్ణయం తీసుకుంది. తక్కువ స్థాయి తేలికైన రాడార్లు, పినాకా రాకెట్ వ్యవస్థ కోసం లాంగ్–రేంజ్ గైడెడ్ రాకెట్ మందుగుండు సామగ్రి, ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్, ఇంటర్‌డిక్షన్ సిస్టమ్, ఆర్మీ ఫిరంగి రెజిమెంట్ల కోసం లోయిటర్ మునిషన్ వ్యవస్థల కొనుగోలుకు కూడా ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక లక్ష్యాలపై ఖచ్చితమైన దాడికి లోయిటర్ మునిషన్ ఉపయోగిస్తారు. చిన్న పరిమాణంలో, తక్కువ ఎగిరే మానవ రహిత వైమానిక వ్యవస్థలను తక్కువ స్థాయి తేలికైన రాడార్లు గుర్తించి, ట్రాక్ చేస్తాయి. సుదీర్ఘ లక్ష్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పినాకా రాకెట్, వ్యవస్థల పరిధి, ఖచ్చితత్వాన్ని పెంచడానికి లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్లను కొనుగోలు చేయనున్నారు. వ్యూహాత్మక యుద్ధ ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో భారత సైన్య కీలకమైన ఆస్తులను ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్, ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ రక్షిస్తుంది. ఇక హిందూ మహాసముద్ర ప్రాంతంపై నిరంతర నిఘా కోసం పెద్ద సంఖ్యలో రిమోట్ పైలట్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ (ఆర్‌పీఏఎస్)లను లీజుకు తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆటోమేటిక్ టేకాఫ్ ల్యాండింగ్ రికార్డింగ్ సిస్టమ్ ఏరోస్పేస్ వాతావరణ వివరాలను ఎప్పటికప్పుడు అందిస్తుందని, ఆస్ట్రా ఎమ్– ఐఐ క్షిపణులు ప్రత్యర్థి విమానాలను తటస్థీకరించే యుద్ధవిమానాల సామర్థ్యాన్ని పెంచుతాయని రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది.

శాంతి ఒప్పందానికి చేరువలో...

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి
- ఫ్లోరిడా రిసార్ట్‌లో ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో భేటీ
- యుద్ధాన్ని ముగించడంపై చర్చ

వాషింగ్టన్: ఉక్రెయిన్–రష్యా యుద్ధం త్వరలో ముగిసిపోతుందన్న సంకేతాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చారు. శాంతి ఒప్పందం విషయంలో ఆ రెండు దేశాలు ఎన్నడూ లేనంత సమీపంలోకి వచ్చాయని తెలిపారు. ఆదివారం ఫ్లోరిడాలోని ఓ రిసార్ట్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ సమావేశమయ్యారు. దాదాపు మూడు గంటల పాటు ఈ భేటీ జరగడం విశేషం. ప్రధానంగా ఉక్రెయిన్–రష్యా శాంతి ఒప్పందంతోపాటు యుద్ధం ముగించడంపైనే వారు చర్చించినట్లు తెలుస్తోంది. జెలెన్‌స్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని ట్రంప్ పేర్కొన్నారు. భేటీ అనంతరం జెలెన్‌స్కీతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యా అధినేత పుతిన్ శాంతిని కోరుకుంటున్నారని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. జెలెన్‌స్కీ నిజంగా ధైర్యవంతుడైన నాయకుడు అంటూ కొనియాడారు. మరోవైపు జెలెన్‌స్కీ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడికి దిగడం గమనార్హం. ఉక్రెయిన్‌లోని పలు నగరాలపై రష్యా సైన్యం దాడులకు పాల్పడింది.

ఏం చర్చించారు?

ఉక్రెయిన్–రష్యా శాంతి ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. కొన్ని అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఉక్రెయిన్‌కు సంబంధించిన కొన్ని భూభాగాలను రష్యా ఆక్రమించింది. వాటిని తిరిగి అప్పగించాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తుండగా రష్యా అంగీకరించడం లేదు. వాటిపై హక్కులు వదులుకోవడంతోపాటు రష్యాలో అంతర్భాగంగా అధికారికంగా గుర్తిస్తేనే యుద్ధాన్ని ఆపేస్తామని తేల్చి చెబుతోంది. ఇందుకు ఉక్రెయిన్ ససేమిరా అంటోంది. మరోవైపు భవిష్యత్తులో తమపై దాడులు జరగకుండా భద్రతాపరమైన గ్యారెంటీలు ఇవ్వాలని కోరుతోంది. ఈ రెండు ముఖ్యమైన అంశాలపైనే ట్రంప్, జెలెన్‌స్కీ చర్చించినట్లు తెలుస్తోంది. యూరోపియన్ నాయకులతో సమావేశం కావాలని వారిద్దరూ నిర్ణయించారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయన్‌తోపాటు ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, పోలాండ్ తదితర దేశాల అధినేతలతో సమావేశం ఏర్పాటుచేస్తానని ట్రంప్ చెప్పారు. వచ్చే నెలలో ఈ భేటీ జరిగే అవకాశం ఉంది. శాంతి కోసం ట్రంప్ ఎంతగానో కృషి చేస్తున్నారంటూ ఆయనకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేశారు. శాంతికి తాము సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా, రష్యా అధినేత పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి ఒప్పందంపై వారు అభిప్రాయాలు పంచుకున్నారు.

పుణె స్థానిక పోరుకు అజిత్-శరద్ జట్టు

పుణె: మహారాష్ట్రలో బాబాయి అబ్బాయి బంధం మరో అడుగు ముందుకేసింది. పింప్రీ–చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం అధికార మహాయుతి సంకీర్ణ భాగస్వామి అయిన ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ, విపక్ష మహా వికాస్ అఘాడీకి చెందిన ఆయన చిన్నాన్న శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ)తో జట్టు కట్టడం తెలిసిందే. ఆదివారం ఈ మేరకు వాటి మధ్య కుదిరిన అవగాహన ఒక్క రోజులో పుణె దాకా విస్తరించింది. అక్కడి పుణె మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా కలిసే పోటీ చేయాలని అవి సోమవారం నిర్ణయానికి వచ్చాయి. అయితే, ఈ నిర్ణయం స్థానికంగా తీసుకున్నదే తప్ప శరద్ పవార్‌కు దీనితో ఏ సంబంధమూ లేదని ఆయన పార్టీ నేతలు చెబుతుండటం విశేషం. నామినేషన్ల శాఖకు గడువు ముగిసేందుకు సరిగ్గా ఒక్క రోజు ముందు ఈ పరిణామం జరగడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 29 స్థానిక సంస్థలకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మర్నాడు ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెల్లడవుతాయి.

ఐఎన్ఎస్‌వీ కౌండిన్య చరిత్రాత్మక యాత్ర షురూ

- 1500 సంవత్సరాల నాటి ప్రాచీన పద్ధతిలో రూపుదిద్దుకున్న నౌక
- పోరుబందర్ నుంచి ఒమన్‌కు బయల్దేరిన నౌక

పోరుబందర్: ఐదో శతాబ్దం నాటి ప్రాచీన కుడ్యచిత్రంలోని అసంపూర్ణ అంశాలను గుదిగుచ్చి, ఎలాంటి యంత్రాలు, మేకులు, స్టీల్ వాడకుండా సహజ ఉత్పత్తులతో రూపుదిద్దుకున్న పూర్తి మానవ నిర్మిత అద్భుతం ‘ఐఎన్ఎస్‌వీ కౌండిన్య’ నౌక తొలి సముద్రయానాన్ని విజయవంతంగా ఆరంభించింది. సోమవారం గుజరాత్‌లోని పోరుబందర్ నుంచి ఒమన్ దేశంలోని మస్కట్ తీరనగరానికి పయనమైంది. వెస్టర్న్ నావల్ కమాండ్‌లో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ అయిన వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ జెండా ఊపి నౌకాయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారత్‌లో ఒమన్ సుల్తానేట్ రాయబారి ఇస్సా సలేహ్ అల్ షిబానీ హాజరయ్యారు. ప్రాచీన భారతీయ నావికానిర్మాణ కౌశలాన్ని కళ్లకు కట్టేలా ‘కుట్టుడు పద్ధతి’లో నౌక నిర్మించామని భారత రక్షణ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 15 రోజులపాటు 1,400 కిలోమీటర్ల సముద్రయానం చేశాక ఒమన్ తీరానికి నౌక చేరుకోనుంది.

పురాతన భారతీయనౌకాయానానికి ప్రతీక అంటూ ప్రధాని ప్రశంస

నౌక ప్రయాణంపై ప్రధాని మోదీ అమితానందం వ్యక్తంచేశారు. ‘‘పోరుబందర్ నుంచి మస్కట్‌ను మన ప్రాచీనమూలాలున్న ఐఎన్ఎస్ కౌండిన్య బయల్దేరడం ఎంతో సంతోషదాయకం. నౌకలోని 18 మంది నావికుల ప్రయాణం క్షేమంగా జరగాలని కోరుకుంటున్నా. గల్ఫ్, ఆవలి ప్రాంతాలతోనూ భారత్ ప్రాచీనకాలంలో అద్భుతంగా సముద్రమార్గంలో వాణిజ్యం జరిపేదని ఈ నౌక ద్వారా చాటిచెప్పండి. మేకులకు బదులు తాళ్లతో విడిభాగాలను జతచేసే స్టిచ్చింగ్ పద్ధతిలో నిర్మాణం పూర్తి చేసుకుని ఈ నౌక భారత ఉజ్వలమైన సముద్రసంప్రదాయాలను స్మరణకు తెచ్చింది. నౌకను నిర్మించిన కళాకారులు, సిబ్బందికి నా అభినందనలు. ఈ నౌక పురాతన భారతీయ నౌకాయానానికి ప్రతీక’’ అని మోదీ అన్నారు.

సహజసిద్ధంగా.. సమున్నతంగా..

- నౌక తయారీలో మేకులు ఉపయోగించలేదు.
- స్టిచ్చింగ్ పద్ధతిలో విడిభాగాలను అత్యంత ధృడమైన తాళ్లతో ముడివేశారు.
- కొబ్బరినారతో తయారుచేసిన తాళ్లను ఉపయోగించారు. ఈ నౌకలో ఇంజిన్ ఉండదు. కేవలం తెరచాపలతో గాలివాటానికి అనుగుణంగా ముందుకు సాగుతుంది.
- సహజసిద్ధ జిగురులతో విడిభాగాలను అతికించారు. చేప నూనెను పూత పూశారు.
- ఐదో శతాబ్దంనాటి అజంతా గుహల్లో వెలుగు చూసిన ప్రాచీన నౌక చిత్రాల నుంచి డిజైన్‌ను సంగ్రహించారు.
- ఆధునిక తరం నౌకలతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నమైంది. నీటిలో మునిగే ప్రధాన భాగం, చదరపు తెరలు, తెడ్డులను ప్రాచీన తరహా డిజైన్‌లో రూపొందించారు.
- పురాతన నౌకా నిర్మాణాలు, నౌకా నిర్మాణశాస్త్రం, సాంప్రదాయ విధానాలను మేళవించి నౌకకు తుదిరూపునిచ్చారు.
- కర్ణాటకలోని వ్యూహాత్మకమైన కర్వార్ నౌకాస్థావరంలో దీనిని తయారుచేశారు. దీని పొడవు 65 అడుగులు.
- ఒకటో శతాబ్దంలో హిందూమహాసముద్రంలో సముద్రయానం చేసిన భారత నావికుడు కౌండిన్య పేరుతో ఈ నౌకకు ‘ఇండియన్ నావల్ సెయిలింగ్ వెసెల్(ఐఎన్ఎస్‌వీ) కౌండిన్య అని నామకరణం చేశారు.
- ఒక తెరచాపపై కదంబ పాలకుల రాజలాంఛనమైన గండభేరుండ పక్షి చిత్రం, మరో తెరచాపపై సూర్యుని ఆకృతిని చిత్రించారు.

మెక్సికోలో పట్టాలు తప్పిన రైలు.. 13 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలోని దక్షిణ ప్రాంతంలో ప్రయాణికుల రైలు పట్టాలు తప్పిన ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వందమంది క్షతగాత్రులయ్యారు. పసిఫిక్ సముద్ర తీరాన్ని గల్ఫ్ ఆఫ్ మెక్సికోను కలిపే మార్గంలో జరిగిన ప్రమాదం కారణంగా మొత్తం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక్సాకా–వెరాక్రుజ్ రాష్ట్రాలను కలిపే ఇంటర్ ఓషియానిక్ రైలు బోగీలు నిజాండా పట్టణ సమీపంలోని మలుపులో పట్టాలు తప్పాయి. ఈ విషాద ఘటనలో చాలా మంది గాయపడ్డారని తనకు అధికారులు తెలిపారని దేశ అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ తన ‘ఎక్స్’ ఖాతాలో పేర్కొన్నారు. ఘటన సమయంలో రైలులో 241 మంది ప్రయాణికులతోపాటు 9 మంది సిబ్బంది ఉన్నట్లు ఒక్సాకా రాష్ట్ర గవర్నర్ సాలొమొన్ జారా చెప్పారు. కాగా, ఇంటర్‌ఓషియానిక్ రైలు 2023లో అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రెడార్ హయాంలో మొదలైంది. దక్షిణ మెక్సికోలో రైల్వే మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు పసిఫిక్ సముద్రం, గల్ఫ్ ఆఫ్ మెక్సికో మధ్య ఉన్న టెహువాంటెపెక్‌ను అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం.

డైరీ ఆవిష్కరణ

నెహ్రూనగర్: కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యాన సోమవారం గుంటూరులో 2026 డైరీ ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బసవేశ్వరరావు పాల్గొన్నారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 41.2400 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1300, గరిష్ట ధర రూ.2300, మోడల్ ధర రూ.1700 వరకు పలికింది.

కర్షకులకు కష్ట కాలం..!

ఈ ఏడాదంతా రైతులకు తప్పని నష్టాలు

- వరుస తుపాన్లు, అధిక వర్షాలతో తగ్గిన దిగుబడులు
- చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యంతో కష్టాలు రెట్టింపు
- విత్తనం నుంచి ఎరువు, గిట్టుబాటు ధర వరకు అన్నీ అవస్థలే

మోంథా తుఫాన్ ప్రభావంతో కొల్లిపర మండలం బొమ్మివానిపాలెంలో కూరగాయల తోటలో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

కొరిటెపాడు (గుంటూరు): పట్టెడన్నం పెట్టే రైతన్నలకు ఈ ఏడాది కాలం కలిసి రాలేదు. పంట ఎక్కడైనా కాస్త పండితే గిట్టుబాటు ధర లేదు. ఖరీఫ్, రబీ సీజన్లలోనూ కష్టాలు తప్పలేదు. ప్రకృతి కన్నెర్రతో పంటలన్నీ వర్షార్పణం అయ్యాయి. వరుస తుపాన్లు, అధిక వర్షాలతో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. చంద్రబాబు సర్కార్ నిర్వాకంతో మన్ని ఇబ్బందులు తప్పలేదు.

ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు, తుపాన్లు రైతులను నిండా ముంచాయి. పండించిన ఏ ఒక్క పంటకూ గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మరింత నష్టపోవాల్సి వచ్చింది. రబీ సీజన్‌లో సకాలంలో వర్షాలు లేక సాగు మందకొడిగా సాగుతోంది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది రైతులకు సరిగా కలిసి రాలేదు.

సాగు ఆరంభం నుంచి కష్టాలు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రైతుల్ని కష్టాలు వెంటాడాయి. జిల్లాలో 2,15,701 ఎకరాల్లో రైతులు ఖరీఫ్‌లో సాధారణ పంటలు, మరో 40 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. ఆగస్టులో కురిసిన అధిక వర్షాలు, ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు, సాగునీటి ఎద్దడితో తీవ్ర నష్టం వాటిల్లింది. చాలా చోట్ల వెద పెట్టిన వరి కుళ్లిపోయింది. సుమారు 75 వేల ఎకరాల్లో పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తీరా అంచనా వేసిన తర్వాత చివరికి నష్టం ఏమీ జరగలేదని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

నాటి వ్యవస్థ నిర్వీర్యం..

విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు రైతులకు అన్ని విధాలా అండగా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. చంద్రబాబు సర్కార్ అధికారంలోకి రాగానే వాటి పేర్లను రైతు సేవ కేంద్రాలుగా మార్చింది. పేరుకు తగ్గ సేవ మాత్రం అందించలేక పోయింది. దీనికితోడు క్రమబద్ధీకరణ పేరుతో కొన్ని కేంద్రాలను మూసివేసింది. మిగిలిన వాటిని ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. దీంతో లక్ష్యం నీరుగారిపోయింది.

ఉచిత పంటల బీమాకు మంగళం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఎత్తివేయడంతో ప్రీమియం భారాన్ని రైతులే మోయాల్సి వచ్చింది. గడువు తెలియక చాలా మంది రైతులు సకాలంలో చెల్లించలేక పోయారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులపై ఒక్క పైసా భారం పడకుండా ప్రభుత్వమే ప్రీమియం మొత్తం చెల్లించింది. అన్నదాతలు ఎలాంటి దిగులు లేకుండా ఉన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. ధాన్యం, పత్తి కొనుగోళ్లు సక్రమంగా జరగలేదు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. వారి కష్టాన్ని దోచుకుంటున్నారు. మిర్చి ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా దిగజారిపోయాయి. దీనికి తోడు సాధారణ రైతులలో చాలా మందికి అన్నదాత సుఖీభవ నిధులు రాలేదు. కౌలు రైతులకు మొండిచేయి చూపించారు.

యూరియా కోసం పాట్లు..

ఖరీఫ్ సీజన్‌లో చాలా చోట్ల రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా షాపులు, రైతు సేవ కేంద్రాలు, సొసైటీల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. అది సరిపోక బ్లాక్‌లో కొందామంటే దొరకలేదు. ఆందోళనలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం సరిగా సరఫరా చేయలేక చేతులెత్తేసింది. చివరకు కొంతమంది రైతులు బ్లాక్‌లో కొనుగోలు చేసి అవసరాలను తీర్చుకున్నారు.

ఆర్‌ఎస్‌కేలు నిరుపయోగం

వైఎస్ జగన్ హయాంలో రైతుల కోసం ఊరూరా కట్టించిన రైతు భరోసా కేంద్రాలను చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వ్యవసాయ సేవలను తగ్గించడంతో ఆర్‌ఎస్‌కేలకు వెళ్లడం మానేశాం. గతంలో సీజన్ మొదలవగానే రాయితీ విత్తనాలు, అవసరమైన ఎరువులు, యంత్ర పరికరాలు, ఇతర అన్ని రకాల పథకాలు, కార్యక్రమాలు ఆర్‌బీకేవేదికగానే నిర్వహించే వారు. ఇప్పుడు నామమాత్రం చేయడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. వ్యవసాయ పథకాలు లేకపోవడం, పంట నష్ట పరిహారం ఇవ్వకపోవడం వల్ల పరిస్థితి దారుణంగా ఉంది. రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం కనికరం చూపడం లేదు.

– టి.వెంకటస్వామి, రైతు

రైతులకు తీవ్ర అన్యాయం

చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. అన్నదాత సుఖీభవ కొందరికి తప్ప ఏ పథకమూ ఇవ్వడం లేదు. అదీ తొలి ఏడాది ఎగనామం పెట్టారు. ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఇవ్వలేదు. అదే జగన్ హయాంలో ఎంతగానో భరోసా లభించింది. రైతు భరోసా కింద ఏటా రూ.13,500, ఉచిత పంటల బీమా కింద రూ.1.10 లక్షల పరిహారం జమయ్యాయి. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వ హయాంలో రైతులకు స్వర్ణయుగం.

–పేరం కృష్ణారెడ్డి, గుంటూరు రూరల్

తుపాన్లతో ఆశలు ఆవిరి

పంట చేతికి వచ్చే సమయంలో సంభవించిన మోంథా తుపాను రైతుల ఆశలను ఊడ్చిపడేసింది. పంటలు దెబ్బతిని రైతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. జిల్లాలో సుమారు 1.09 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా తక్కువగా చూపి చివరికి కేవలం 6,062.21 ఎకరాల్లో మాత్రమే వరి, పత్తి, మినుము, సోయాబీన్, కంది, అరటి, కూరగాయలు, తమలపాకు, పూలు పంటలు దెబ్బతిన్నట్లు తేల్చేసింది. దీంతో రైతులు కోలేకోలేని విధంగా నష్టపోయారు. అధిక వర్షాలు, తెగుళ్ల పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. మిర్చి దిగుబడి 10 క్వింటాళ్లకు పడిపోగా, పత్తి ఎకరాకు కేవలం 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వరి కూడా 25 క్వింటాళ్లకు మించి రాని పరిస్థితి నెలకొంది.

ఆగస్టులో కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న వెద పద్ధతిలో సాగు చేసిన వరి (ఫైల్)

న్యూస్‌రీల్

కల్కి అలంకరణలో వైకుంఠవాసుడు

తెనాలిటౌన్: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో స్వామివారికి ముక్కోటి ఏకాదశి దశావతార మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్వామివారిని శ్రీ కల్కి అవతారంలో అలంకరించి పురవీధుల్లో రథంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడే ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరారామంలో మంగళవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి ఉత్తర ద్వారదర్శనం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం వేకువ జామున స్వామివారి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారంలో ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అనంతరం స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తామని ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. స్థానిక కోదండరామాలయం, పాండురంగస్వామి ఆలయం, గీతా మందిరంతోపాటుగా మండల పరిధిలోని వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కూడా భక్తులకు ఉత్తరద్వార దర్శనం నిర్వహిస్తున్నట్లు ఆయా దేవాలయాల నిర్వాహకులు తెలిపారు.

'సారస్'ని విజయవంతం చేయాలి

గుంటూరు వెస్ట్: సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ప్రదర్శనను విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సారస్ కార్యక్రమాన్ని జనవరి 6వ తేదీ నుంచి 18 వరకు గుంటూరు–నరసరావుపేట రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదుట ఉన్న స్థలంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా జాతీయ స్థాయి సారస్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కోరారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఆయా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే చేనేత, హస్తకళలు, ఇతర సామగ్రిని ప్రదర్శించడం, విక్రయించడం జరుగుతుందన్నారు. ఇది మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనాన్ని తలపిస్తుందని చెప్పారు. 250కు పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

దుర్గమ్మ భక్తుల తలనీలాలకు రికార్డు ధర

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సమర్పించిన తలనీలాలకు రికార్డు ధర పలికాయి. ఏడాదికి రూ. 10.10 కోట్లకు తణుకుకు చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ టెండర్‌ను దక్కించుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం టెండర్ ప్రక్రియను నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణతో పాటు ఏపీకి చెందిన మొత్తం 19 మంది కాంట్రాక్టర్లు ఒక్కొక్కరూ రూ.50 లక్షల ప్రథమ దరావత్తుగా చెల్లించి వేలంలో పాల్గొన్నారు. రెండేళ్ల కాల పరిమితికి దేవస్థానం టెండర్లు ఆహ్వానించగా, కాంట్రాక్టర్ మొదటి ఏడాది మొత్తంపై 10 శాతం పెంపుతో రెండో ఏడాది టెండర్ కొనసాగింపు జరుగుతుందని టెండర్ నిబంధనల్లో పొందుపరిచారు.

వైకుంఠ రాయుడు... నారసింహుడు



దక్షిణావృత బంగారు శంఖం

- నేడు వైకుంఠ ఏకాదశి
- ముస్తాబైన ఆలయం
- భక్తులకు బంగారు శంఖంలో తీర్థం

ఆలయ ఉత్తర గాలిగోపురం

మంగళగిరి టౌన్: మంగళగిరిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్సవాలకు సుందరంగా ముస్తాబైంది. విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడుతోంది. శ్రీవారిని కొలిచేందుకు భక్తులు ముక్కోటి ఆశలతో సంసిద్ధులయ్యారు. మంగళవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి స్వామి ఉత్తర ద్వారం నుంచి గరుడ వాహనంపై దర్శన భాగ్యం కల్పించనున్నారు. తరలిరానున్న భక్తుల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

దక్షిణావృత శంఖంతో తీర్థం...

1820లో తంజావూరు మహారాజు వారణాసి యాత్రలో మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని బంగారు తొడుగు గల దక్షిణావృత శంఖాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ముక్కోటి ఏకాదశి రోజున ఈ శంఖంతో స్వామికి అభిషేకం చేస్తారు. ముక్కోటి ఏకాదశినాడు ఈ శంఖంతో భక్తులకు తీర్థం అందిస్తారు. విశేషంగా తరలివచ్చే భక్తుల రద్దీని పురస్కరించుకుని 30వ తేదీతోపాటు, 31వ తేదీన ద్వాదశి రోజున కూడా దక్షిణావృత శంఖ తీర్థాన్ని ఇవ్వనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

భారీ బందోబస్తు

నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ

నేడు జరగనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సోమవారం నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 320 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీరిలో ముగ్గురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 50 ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోమ్ గార్డులు ఉన్నట్లు చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటల నుంచి వీరు విధులకు హాజరయ్యారని పేర్కొన్నారు. షిఫ్టులవారీగా బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు.

రెవెన్యూ క్లినిక్‌తో సమస్యల పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లాలో రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. తెనాలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ సంబంధించి తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, 18 మంది మండలాల తహసీల్దార్లు , రెవెన్యూ ఉద్యోగులు రికార్డులతో హాజరయ్యారు. అడంగల్‌లో విస్తీర్ణం మార్పు చేర్పులు, భూ స్వభావ మార్పులు, 22ఏ నుంచి తొలగింపులు, హద్దురాళ్ల ఏర్పాటు, మ్యూటేషన్లకు సంబంధించి మొత్తం 40 అర్జీలను ప్రజలు అందించారు. వీటిని ఆన్‌లైన్లోనే సిబ్బంది వెంటనే నమోదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్‌లో అందించిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన 348 అర్జీలను కలెక్టర్‌తోపాటు డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా అధికారులు పరిశీలించారు.

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

అంజుమన్ భూమిపై ఎమ్మెల్యే తీరు దారుణం

- చిన్నకాకాని అంజుమన్ భూమిపై నోటిఫికేషన్ సరికాదు
- మాజీ ఎమ్మెల్యే, ముస్లిం సంఘాల ప్రతినిధులు

మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గుంటూరు చిన్నకాకానిలోని అంజుమన్ సంస్థకు సంబంధించిన 71.57 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు చేస్తుంటే అంజుమన్ అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యుడు, తూర్పు నియోజకవర్గ మైనారిటీ ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ఏం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరి ఫాతిమా అన్నారు. పాత గుంటూరులోని అంజుమన్ షాదిఖానాలో సోమవారం అంజుమన్ హమారా–హక్ హమారా పేరిట ముస్లిం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటైంది. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీం అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నూరి ఫాతిమా మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన రాష్ట్ర మంత్రి లోకేష్ ఓఎస్డీ, పర్సనల్ అసిస్టెంట్ సంబంధిత అధికారులకు చిన్నకాకానిలోని 71.57 ఎకరాల భూమిని ఐటీ పార్క్ కోసం ప్రైవేటీకరణ చేసేందుకు విన్నవించుకుంటే 11 నెలల తరువాత ఇప్పుడు వక్ఫ్ సీఈఓ, వక్ఫ్‌బోర్డు చైర్మన్, జిల్లా అంజుమన్ అధ్యక్షుడు, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యుడు, ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్‌కు తెలియకుండానే ఎజెండాలో కమిటీ సభ్యులు సంతకాలు చేశారా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఏకంగా పచ్చ పత్రికలో టెండర్లు పిలుస్తూ నోటిఫికేషన్ ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. తక్షణమే భూసేకరణకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముస్లిం సంఘాలు మాట్లాడేందుకు ప్రయత్నించే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో భూ సేకరణ చట్టం ప్రకటనను తక్షణమే విరమించుకోవాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్, జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు పఠాన్ షైదా, సీపీఎం నగర కార్యదర్శి నళినికాంత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, లియాఖత్ అలీ, షన్ను, అప్సర్ బాబు, కార్పొరేటర్లు మహమ్మద్, ఆబిద్, ఫర్జానా, మైనారిటీ నాయకులు సలీం, సమీ ఉల్లా బేగ్, జాఫర్ ఖాన్, జబీర సలీం, ఇషాక్, నజీర్, సమద్, సైదా, సుభాని, రహీముద్దీన్, రియాజ్, జబిఉల్లా, బషీర్, ముస్లిం సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు మహమ్మద్ ఖలీం, మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఖాజావలి, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జాదా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో, మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్‌తో కలిసి అంజుమన్ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు.

ఎమ్మెల్యే నసీర్‌ను కలవనివ్వకుండా వైఎస్సార్‌సీపీ నేతలను, ముస్లింలను అడ్డుకుంటున్న పోలీసులు

ఆస్తులను కాజేస్తే అల్లాహ్ క్షమించడు

చిన్నకాకానిలో ఉన్న అంజుమన్ సంస్థకు సంబంధించిన 71.57 ఎకరాల భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని తీసుకు వచ్చామని తెలిపారు. అంజుమన్ ఆస్తులను కాజేస్తే అల్లాహ్ క్షమించడని నూరి ఫాతిమా తెలిపారు. దీనిపై తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ మాట్లాడుతూ... అంజుమన్ సంస్థకు సంబంధించిన చిన్న కాకానిలోని 71.57 ఎకరాల భూమికి సంబంధించి అధికారులతో, న్యాయనిపుణులతో మాట్లాడుతానని అన్నారు.

ఉత్తమ సేవకు జాతీయ గుర్తింపు

మాచర్ల: మాచర్ల కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రికి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది. తొలుత 20 పడకలతో ప్రారంభమైన ఆసుపత్రి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం 10 మంది వైద్యులతోపాటు 16 మంది స్టాఫ్ నర్సులతోపాటు వివిధ విభాగాల టెక్నీషియన్లు, శానిటరీ సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. రోజూ 400 మందికి పైగా వైద్య సేవలు పొందుతున్నారు. ఎక్సరే, ఈసీజీ పరీక్షలతోపాటు ఆపరేషన్లు సమర్థంగా నిర్వహిస్తున్నారు. వైద్యులు మెరుగైన సేవలందించటంతో గతేడాది రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3,4వ తేదీల్లో ఢిల్లీ బృందం రెండు రోజుల పాటు వైద్య సేవలు పరిశీలించింది. వార్డులు, అత్యవసర సర్వీసు, ఎఆర్‌టీ సెంటర్, హెచ్ఐవీ, టీబీ తదితర విభాగాలు పరిశీలించింది. ఆపరేషన్లు నిర్వహించే తీరు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పరిశీలించి 91.7 శాతం సేవలందిస్తున్నట్లు జాతీయ స్థాయి క్వాలిటీ ఎష్యూరెన్సు సర్టిఫికెట్ ఇచ్చింది.

తెనాలి తహసీల్దార్‌కు సీఎం అభినందన

తెనాలి రూరల్/గుంటూరు వెస్ట్: తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అభినందించారు. తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ ధ్రువీకరణ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ఆయన ప్రత్యేకంగా తహసీల్దారును సీఎం క్యాంప్ కార్యాలయానికి పిలిపించి, అభినందించారు. రెవెన్యూ శాఖలో అరుదైన రికార్డును గోపాలకృష్ణ నెలకొల్పారని, ఇరు తెలుగు రాష్ట్రాలలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి లేని ఘనత తెనాలి తహసీల్దార్ కార్యాలయం సాధించటం అభినందనీయమని ప్రశంసించినట్లు గోపాలకృష్ణ రాత్రి వెల్లడించారు. ఇటీవల 5,800 మంది రైతు సమస్యలను సింగిల్ విండో విధానంలో తహసీల్దారు పరిష్కరించారు. కార్యాలయ సిబ్బంది పనితీరుతోపాటు ప్రజలతో వ్యవహరించే విధానంలో గోపాలకృష్ణ మంచి మార్పులు తీసుకొచ్చారు. శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని ఇటీవల దాతల సహకారంతో సర్వాంగ సుందరంగా ఆధునికీకరించి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా పునః ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి మనోహర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సమక్షంలో ఐఎస్ఓ ప్రతినిధి బృందం తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను ఈ నెల 15వ తేదీన అందించిన సంగతి విదితమే. తహసీల్దార్ వెంట రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ గోపాలకృష్ణను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	56,257
అమ్మకాలు	53,482
నిల్వ	11,060

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు–5	12,000–15,300
341	11,000–17,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16700
నంబరు–5	11,000–15,000
341	11,000–16,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 16,500
బాడిగ–355	11,000 – 17,000
దేవనూరు డీలక్స్	11,000 – 17,500
ఆర్మూర్	10,000 – 13,000
తాలుకాయలు	5,000 – 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,800
బాడిగ – 355	10,000–16,500
దేవనూరు డీలక్స్	12,000–17,300
తాలు	5,200 – 7,200

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 552

కొమ్ములు : 315 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,100	12,850	12,000

కాయలు : 392 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,000	13,050	12,850

మొత్తం అమ్మకాలు : 414 క్వింటాళ్లు

–దుగ్గిరాల

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు 2,304 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగుల నీటి మట్టం స్థిరంగా ఉంది. బ్యాంక్ కెనాల్‌కు 106 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 299, పశ్చిమ కాలువకు 87, నిజాంపట్నం కాలువకు 140, కొమ్మూరు కాలువకు 1,360 క్యూసెక్కుల విడుదల చేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి

పోలీస్ పీజీఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఆవరణలో సోమవారం పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆలకించారు. సంబంధిత ఫిర్యాదులపై సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల అధికారులతో మొబైల్‌ఫోన్లలో మాట్లాడారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చట్ట పరిధిలోనే బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ రమణమూర్తి (పరిపాలన), డీఎస్పీలు అరవింద్ (గుంటూరు పశ్చిమ), అబ్దుల్‌అజీజ్ (గుంటూరు తూర్పు) బానోదయ (దక్షిణ) ఫిర్యాదులు స్వీకరించారు.

అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ఫోర్జరీ సంతకంతో రూ.2.81 లక్షలు కాజేశారు

ఫిస్టులా వ్యాధికి సంబంధించి ఆరోగ్య బీమా ఉందా లేదా తెలుసుకునేందుకు ఈ ఏడాది జూలైలో గుంటూరువారితోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లా. ఈ క్రమంలో ఆరోగ్య బీమా, ఆధార్ ఇతరత్రా కార్డులను ఆసుపత్రి సిబ్బంది పరిశీలించారు. ఫిస్టులాకు సంబంధించి ఎటువంటి ఆరోగ్య బీమా లేదని తేల్చారు. నేను అక్కడి నుంచి వచ్చేశాను. అయితే ఇటీవల నా ఆరోగ్య బీమా పాలసీని పరిశీలించగా, రూ.2.81 లక్షలను అదే ఆసుపత్రి వైద్యులు నా పేరుతో కాజేసినట్లు గుర్తించా. సదరు ఆసుపత్రిలో నాకు చేయని చికిత్సకు ముంబయిలోని సదరు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీతో కుమ్మక్కై, ఆధార్, హెల్త్ పాలసీ, పాన్ కార్డులు ఉపయోగించి ఒరిజినల్ బిల్లుపై నా సంతకం ఫోర్జరీ చేసి రూ. 2.81 లక్షలు కాజేశారు. అక్రమంగా లబ్ధి పొందిన ఆసుపత్రి నిర్వాహకులపై స్థానిక పోలీసులకు ఈనెల 10న ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యల్లేవు. వారిపై కేసు నమోదు చేయాలి.

– షేక్ సైనా, కోబాల్డుపేట, గుంటూరు

ధాన్యం డబ్బులు చెల్లించడంలేదు

సుమారు ఐదేళ్ల క్రితం పొన్నూరు సిద్ధివినాయక కాలనీలోని ఓ వ్యాపారికి ధాన్యం, మొక్కజొన్న విక్రయించాం. డబ్బులు పది రోజుల్లో చెల్లిస్తానని నమ్మబలికాడు. కాలక్రమంలో మూడు నెలలకే అతను మృతిచెందాడు. దీంతో వ్యాపారి తనయుడు డబ్బులు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనేకమార్లు డబ్బులు అడిగినా చెల్లించడంలేదు. దాదాపు 14 మంది బాధిత రైతులు ఉన్నారు. సుమారు రూ.42 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఏళ్లు గడిచినా డబ్బులు చెల్లించకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. న్యాయం చేయండి.

– రైతులు లక్ష్మీఅపర్ణ (భట్టిప్రోలు), రామిశెట్టి శ్రీనివాసరావు, బడే సుబ్బాయమ్మ (పొన్నూరు).

గతేడాదితో పోల్చితే తగ్గిన నేరాల సంఖ్య

నగరంపాలెం: గతేడాది కంటే ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వార్షిక నేర నివేదిక (2025)ను జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ ఏడాదిలో నేరాలు పదమూడు శాతం తగ్గాయని అన్నారు. జిల్లాలో 8,937 నేరాలు నమోదవ్వగా, గతేడాదిలో 10,252 నమోదైనట్లు తెలిపారు. గతేడాదిలో ఆస్తి చోరీ నేరాలు 1,054 కేసులు నమోదవ్వగా, 2025లో 1,090 కేసులు నమోదైనట్లు చెప్పారు. అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలను అరెస్ట్ చేసి రూ.11.88 కోట్ల విలువైన ఆస్తి రికవరీ చేశామన్నారు. 176 కేసుల్లో బాధితులు అసలు తిరిగి అప్పగించామని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజ్, డిజిటల్ ఆధారాలతో బంగారం దోపిడీ, వరుస చోరీలు, హత్యలు, వృద్ధ మహిళల హత్యలు తదితర నేరాలను ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. లైంగిక దాడుల కేసులు ఈ ఏడాదిలో 76 కేసులు నమోదవ్వగా, గత ఏడాదితో పోల్చితే ఆరు శాతం తగ్గాయని చెప్పారు.

● ఈ ఏడాదిలో 322 రోడ్డు ప్రమాద మరణాలు జరగ్గా, గతేడాదిలో 429 కేసులతో పోల్చితే 25% తగ్గాయన్నారు. ఈ ఏడాదిలో 102 సైబర్ కేసులు నమోదవ్వగా, గతేడాదితో సరిచూస్తే పది శాతం తగ్గాయన్నారు. పోగొట్టుకున్న రూ.1.47 కోట్లను బాధితులకు అప్పగించామని తెలిపారు. ఈ ఏడాదిలో 9,214 కేసుల విచారణ పూర్తి చేయగా, 3,997 కేసుల్లో శిక్షలు పడ్డాయన్నారు. సంకల్పం, సేఫ్ క్యాంపస్ జోన్, డ్రగ్స్ వద్దు బ్రో, ఈవ్‌టీజింగ్ కౌన్సెలింగ్, పల్లె నిద్ర, నాకాబందీ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నేర నిరోధక అవగాహన పెంచామన్నారు. 11 మంది రౌడీలపై పీడీయాక్ట్, గంజాయి వృత్తిని కొనసాగించే 13 మందిపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

బాలిక కేసులో డ్రగ్స్ తీసుకున్నట్లు ఆధారాలు లేవు..

ఇటీవల గుంటూరు తూర్పు సబ్ డివిజన్ లాలాపేట పీఎస్ పరిధిలో కుమార్తె డ్రగ్స్‌కు అలవాటుపడిందన్న కారణంతో తల్లి ఆత్మహత్యాయత్నం చేసిన కేసులో మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలు, ప్రసారాలు ఒకలా ఉంటే... వాస్తవం మరోలా ఉందన్నారు. ఆమె కుమార్తె వివాహానికి ఒప్పుకోలేదని, ఇంట్లోనూ కుటుంబ వివాదాలు నెలకొన్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఆమె కుమార్తె డ్రగ్స్ అలవాటు చేశారని ఆరోపణల్లో భాగంగా ఆరేడు మంది యువకులకు రక్త పరీక్షలు చేయించగా, ఎక్కడా కూడా ఆ యువకులు డ్రగ్స్ తీసుకున్నట్లు లేదని జిల్లా ఎస్పీ తెలిపారు. రెండు రోజుల క్రితమే రక్త నమూనాల నివేదికలు వచ్చాయని తెలిపారు.

● నారాకోడూరులో జరిగిన హత్య ఒక పార్టీకి సంబంధించిన కేసు అని చెప్పారు. రెండు గ్రూపుల మధ్య వివాదాలు, ఫ్యాక్షన్ల చిందులతో జరిగాయని, ఈ హత్య కేసులో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణ మూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ గట్టుపాటి శ్రీనివాసులు, సీఐలు అలహరి శ్రీనివాస్ (ఎస్‌బీ), బి.నరసింహారావు (డీసీఆర్‌బీ), వెల్ఫేర్ ఆర్ఐ సురేష్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ప్రకాష్ గౌడ్

నరసరావుపేట రూరల్: నకిలీ కార్ల కేసులో ఏ-6 నిందితుడిగా ఉన్న ప్రకాష్‌గౌడ్‌ను హైదరాబాద్‌లో నరసరావుపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ కార్ల కేసులో తొమ్మిది మంది నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు. ఇందులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేయగా నకరికల్లుకు చెందిన రామకృష్ణ న్యాయస్థానంలో లొంగిపోయాడు. నకిలీ కార్లకు డాక్యుమెంట్లను హైదరాబాద్‌కు చెందిన ప్రకాష్‌గౌడ్, వైజాగ్‌కు చెందిన వర్మలు అందజేశారు. ఈ కేసులో వీరిని ఏ-6, ఏ-7 నిందితులుగా పేర్కొన్నారు. ప్రకాష్‌గౌడ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో నిందితుడు వర్మను అరెస్ట్ చేయాల్సి ఉంది.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ నూతన సంవత్సర కేలండర్, డైరీని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి సోమవారం ఆర్జేడీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అదే విధంగా జీవో ప్రతులతో కూడిన ఉపాధ్యాయ మార్గదర్శినిని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీమ్‌బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ప్రభుత్వ జీవోలు, సర్వీసు నియమ, నిబంధనలతో ఉపాధ్యాయులకు కరదీపికగా ఉంటుందని అన్నారు. గత 50 ఏళ్లుగా నిరాటంకంగా ఉపాధ్యాయ, విద్యారంగ విషయాలతో జీవో పుస్తకాన్ని ప్రచురించడం గొప్ప విషయమని, ఇది ప్రతి ఉపాధ్యాయుని చేతిలో ఉండాల్సిన పుస్తకమన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, గుడిపాటి దాస్, కార్యదర్శులు పి.లక్ష్మీనారాయణ, చక్కా వెంకటేశ్వరరావు, పచ్చల శివరామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ కె.రమేష్, నాయకులు జహంగీర్, కిషోర్ షా, కృష్ణారావు, మునినాయక్, షకూర్, అప్పారావు, మాల కొండయ్య పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

16 నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జనవరి 16వ తేదీ నుంచి ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో, 19వ తేదీ నుంచి కంప్యూటర్ ట్యాలీ, 29వ తేదీ నుంచి రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత 10వ తరగతి, వయస్సు 19 నుంచి 50 సంవత్సరాల లోపు ఉండాలి. శిక్షణ కాలంలో భోజనం, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, 10వ తరగతి చదువుకున్నట్లు జిరాక్స్ కాపీలతో ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లా కు చెందిన నిరుద్యోగ యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూని యన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్‌బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు. 0863–2336912, 97006 87696, 81253 97953, 99499 30155, 97034 05066 ఫోన్ నంబర్లును సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌తో పాటు జీవో ప్రతుల పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ జీవోల కాపీలను ఒకే పుస్తకంలో చేర్చడం అభినందనీయమన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనం కలిగించే విధంగా యూటీఎఫ్ ముద్రించిన స్టడీ మెటీరియల్, డ్రగ్స్‌ను పారతోలతాం అనే కరపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు ఎండీ షకీలాబేగం, జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.కోటిరెడ్డి, బి.ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకులతో కలసి డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

● గన్నవరం ఏడీఏ ఎం.సునీల్

● పలు ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

తెనాలిటౌన్: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గన్నవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.సునీల్ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, తెనాలి మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, గుంటూరు మండల వ్యవసాయాధికారి బి.కిషోర్ తనిఖీల్లో పాల్గొన్నారు. స్టాక్ రిజిష్టర్ పరిశీలించి రికార్డు తనిఖీ చేశారు. రిజిష్టర్‌లు ఎప్పటికపుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఎమ్మార్పీకంటే అధిక ధరకు విక్రయిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.కిషోర్, ఏఈఓ మురళి, తదితరులు ఉన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

రూ.15లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల..

చేబ్రోలు: రైతులకు ఎరువులు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ రాష్ట్ర తనిఖీ బృందం అధికారి గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, కమీషనరేట్ కార్యాలయ వ్యవసాయశాఖాధికారి బి సురేష్‌బాబులు తెలిపారు. చేబ్రోలు మండలంలోని శేకూరు, వడ్లమూడి, చేబ్రోలు గ్రామాల్లోని ప్రైవేటు ఎరువుల దుకాణాలను రాష్ట్ర తనిఖీ బృందం సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పొన్నూరు ఏడీఏ వి రామకోటేశ్వరి, స్థానిక ఏఓ ప్రియదర్శినిలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియా తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వలు, అమ్మకాలు, ఎరువుల లభ్యత గురించి పరిశీలన చేశారు. శేకూరు, వడ్లమూడి గ్రామాల్లోని రెండు షాపుల్లో సరైన పత్రాలు, బిల్లులు లేకపోవటంతో అమ్మకాలు నిలుపుదల చేశారు. 85.4 మెట్రిక్ టన్నుల ఎరువులను రూ.15,19,870ల నిలుపదల చేశారు. మండలంలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లుకు ఎరువులు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రికార్డు మెయింటైన్ సరిగ్గా లేని వారికి సంజాయిషీ తీసుకొని, లైసెన్స్ సస్పెన్షన్‌కి ఆదేశాలు జారీ చేశారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత



పెదకాకాని: అనుమతులు, బిల్లులు లేకుండా అమ్మకాలు చేస్తున్న దుకాణాల్లో ఉన్న ఎరువుల విక్రయాన్ని నిలిపివేసినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమణకుమార్ అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రైవేటు దుకాణాలకు యూరియా సరఫరా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ అధిక ధరలకు విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. బిల్లులు లేకుండా ఎరువుల అమ్మకాలపై సోమవారం అధికారి రమణకుమార్ వెనిగండ్ల, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు గ్రామాల్లోని షాపుల్లో ఆకస్మిక తనిఖీ చేశారు. వెనిగండ్ల దుకాణాల్లో అనుమతులు, సరఫరా వివరాలు లేని ఎరువులను గుర్తించారు. 4.35 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా అమ్మకాలు చేపట్టినా, అధిక ధరలకు అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమానంతో భార్యపై భర్త దాడి

చిలకలూరిపేటటౌన్: అనుమానం పెనుభూతమై ఓ నిండు సంసారంలో చిచ్చుపెట్టిన ఘటన చిలకలూరిపేట మండలంలోని వేలూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లడి సల్మాన్‌రాజు తన భార్య పుష్ప (34) ప్రవర్తనపై అనుమానంతో, సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో నిద్రిస్తున్న ఆమె తలపై రోకలిబండతో బలంగా మోది హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాడిలో తీవ్ర రక్తగాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాధితురాలిని కుటుంబ సభ్యులు వెంటనే చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ప్రస్తుతం ఆమె వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతుంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం దర్యాప్తు చేస్తున్నారు.

3,4 తేదీల్లో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు

సమావేశాల ప్రతులను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి, చాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చరిత్రపై పరిశోధనలు ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 48వ వార్షిక సమావేశాలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో జనవరి 3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమావేశాలకు సంబంధించిన ప్రచార ప్రతులను వీవీఐటీ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో–చాన్స్‌లర్ వాసిరెడ్డి మహదేవ్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా మొవ్వా శ్రీనివాసరెడి మాట్లాడుతూ వైజ్ఞానిక పద్ధతులలో చరిత్ర అధ్యయనాన్ని ప్రోత్సహించడం, ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర పరిశోధనల ప్రగతిని మూల్యాంకన చేయడం ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమన్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు దేశవ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవుతారనీ, ఆధునిక చరిత్ర, సాంకేతికత, సామాజిక అంశాలపై పరిశోధనా పత్రాల సమర్పణ, చర్చలు జరుగుతాయని వివరించారు. పాలక సభ్యురాలు వాసిరెడ్డి ప్రత్యూష, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఏఎన్‌యూ హిస్టరీ ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు, వీవీఐటీయూ పబ్లికేషన్ డివిజన్ సంధానకర్త మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

రేపు సామాజిక పింఛన్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు బుధవారం పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 జనవరి ఒకటో తేదీ నూతన ఏడాది కారణంగా ఆ రోజున పంపిణీ చేయాల్సిన పింఛన్లు బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ చేస్తారని తెలిపారు. సచివాలయ సిబ్బంది మంగళవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. బుధవారం రోజే వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అనివార్య కారణాల చేత 31న తీసుకోని వారికి జనవరి రెండో తేదీన పంపిణీ చేస్తామన్నారు. రాజధాని నిర్మాణ పనులకు సహకారం అందించండి రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన మట్టి, ఇసుక, గ్రావెల్ తవ్వకాల కోసం కాంట్రాక్టర్లకు అవసరమైన అనుమతులు అందించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, కాలుష్య నివారణ, మైనింగ్, సీఆర్‌డీఏ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రజా సంపద దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ముడిసరుకు సేకరణకు అనుమతులు ఇవ్వాలన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వేమూరు(భట్టిప్రోలు): అతి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఐలవరం జరిగింది. గ్రామానికి చెందిన వీరంకి సాంబశివరావు(69) ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో భోజనం చేసి ఇంటి ముందున్న హైవే పైకి వచ్చాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్ఐ ఎం. శివయ్య సోమవారం తెలిపారు. సాంబశివరావు కుమారుడు ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్
బ్రాడీపేట బ్రాంచి, 4/12, గుంటూరు-2. ఫోన్స్: 0863-2261362, 2241840

గోదాములలోని మిర్చి నిల్వల బహిరంగ వేలం ప్రకటన

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు మా బ్యాంకు ద్వారా మెస్సర్స్ లక్ష్మీ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ (కార్పొరేట్ హామీదారు), గుంటూరు మరియు మెస్సర్స్ వాసవి రత్న కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ (కార్పొరేట్ హామీదారు), గుంటూరు లలో ఉన్న మిర్చి నిల్వలు తాకట్టుపై తీసుకున్న ఋణములను గడువుకాలందాటి నోటీసులు పంపినసూ బాకీ చెల్లించియుండలేదు. ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింది ఖాతాదారుల ఖాతాకు కోల్డ్‌స్టోరేజ్‌లో ఉన్న మిర్చి నిల్వలను ది.19-01-2026 నుండి స్టాకు అమ్మకం అయ్యేంతవరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుండి గుంటూరు కోల్డ్ స్టోరేజ్ ఆవరణ నందు మిర్చి నిల్వలను బహిరంగ వేలం వేసి వారి పేరున ఉన్న ఐకాయిలకు జమకట్టుకోబడును.

నియమ నిబంధనలు

1) వేలములో సఫలీకృత కొనుగోలుదారుడు వెంటనే రూ.25,000/- లు చెల్లించవలెను. మిగిలిన మొత్తమును రెండు రోజులలోగా పూర్తిగా చెల్లించవలెను.
2) వేలంలో అమ్మకము కాని మిర్చిబస్తాలు మార్కెట్ యార్డుకు తరలించి అమ్మకము చేయబడును.
3) ఈ ప్రక్రియ సరుకు పూర్తిగా అమ్మకము జరుగు వరకు కొనసాగించబడును.
4) అమ్మకము చేయగా ఇంకనూ బాకీ మొత్తము పూర్తికాని యెడల చట్టపరమైన చర్యల ద్వారా రైతులు/హామీదారుల నుండి మిగిలిన సొమ్మును వసూలు చేయబడును.
5) ఎట్టి కారణము చూపకనే వేలం ఆపుటకుగాని, తిరస్కరించుటకు గాని వేలంను నిలిపి వేయుటకు కాని బ్యాంకువారికి పూర్తి అధికారం కలదు.
6) వేలం వేసిన పూర్తి బకాయి చెల్లింపుకానియెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును.
7) మిర్చినిల్వ వేలం ధరను వేలంవేయు తేదీన వుండే మార్కెట్ ధరనుబట్టి నిర్ణయించబడును.
8) సరుకు రవాణా ఛార్జీలను మరియు సేల్‌టాక్సు తదితర ఖర్చులను సఫలీకృత పాటదారుడు మాత్రమే భరించవలెను.
9) వేలం ఎక్కడ ఉన్నది అక్కడే – ఎలా వున్నది అలానే పద్ధతిలో జరుగును.
10) వేలంలో అత్యధిక ధరతో పాటపాడినవారికి మాత్రమే మిర్చి నిల్వలు అందజేయబడును.
11) ఈ వేలము ప్రకటన తదితర ఖర్చులు ఈ క్రింది ఖాతాదారులే భరించవలెను.

మెస్సర్స్ లక్ష్మీ వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ (కార్పొరేట్ హామీదారు), గుంటూరు:

క్ర. సం.	ఖాతా నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	గోదాములో నిల్వ ఉన్న బస్తాల సంఖ్య
1	012332016003819	పాటిబండ్ల పుష్పావతి, భర్త: రోశయ్య, పెదపాలెం గ్రామం, అచ్చంపేట మండలం, గుంటూరు-522410.	427
2	012332016003820	పాలెపు సాయి కృష్ణ, తండ్రి: పి.నారాయణరావు, గోరంట్ల, గుంటూరు-522410.	576
3	012332016003995		417
4	012332016003916	రావి వెంకట సుబ్బారావు, తండ్రి: ఆర్. సత్యనారాయణ, వట్టిచెరుకూరు, గుంటూరు జిల్లా-522212.	60
5	012332016003923	కె. నాగరాజు, తండ్రి: కె.తెంచప్ప, నేలప్పన క్యాంప్, బసవేశ్వరనగర, మదిరె, బళ్లారి-583102.	78
6	012332016003939	గంధూరి శ్రీనివాసరావు, తండ్రి: అంజయ్య, బంక్ బజార్, జూలకల్లు, గుంటూరు-522413.	40
7	012332016003991	చిల్లా బ్రహ్మయ్య, తండ్రి: వెంకటేశ్వర్లు, తాళ్ళపల్లి, గుంటూరు జిల్లా-520426.	95
8	012332016004049	సిరుమాల మాధవ రెడ్డి, తండ్రి: ఈశ్వరరెడ్డి, నందిపాడు, కర్నూల్ జిల్లా-518123	53

మెస్సర్స్ వాసవి రత్న కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ (కార్పొరేట్ హామీదారు), గుంటూరు:

క్ర. సం.	ఖాతా నెం.	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	గోదాములో నిల్వ ఉన్న బస్తాల సంఖ్య
1	012332016003791	గడియాముల పిచ్చయ్య, తండ్రి: పెద వీరాస్వామి, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా-522019.	20
2	012332016003823	వజ్రాల గంగి రెడ్డి, తండ్రి: తిరుపతిరెడ్డి, పాత మల్లాయపాలెం, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా-522235.	83
3	012332016003897		124
4	012332016004046		50
5	012332016003883	పాటిబండ్ల నాగరాజు, తండ్రి: వెంకటప్పయ్య, నాగులుప్పాడు గ్రామం, పెదనందిపాడు మండలం, గుంటూరు జిల్లా-522235.	42
6	012332016003936		124
7	012332016004022		172
8	012332016004087		329
9	012332016003915	ధారం వెంకటరావు, తండ్రి: వెంకటేశ్వర్లు, ప్రత్తిపాడు, గుంటూరు జిల్లా-522235.	106
10	012332016004054		30
11	012332016003953	బొల్లినేని సింహాచలం, తండ్రి: శివ రామకృష్ణయ్య, రాట్నపాడు గ్రామం, పెదనందిపాడు, గుంటూరు జిల్లా-522235.	251
12	012332016004083	ముప్పా సుబ్బారావు, తండ్రి: భూషయ్య, బొడవాడ గ్రామం, మందగుంట మండలం, ప్రకాశం జిల్లా-523169.	35
13	012332016004084	చెన్నుపాటి రాఘవరావు, తండ్రి: వెంకటేశ్వర్లు, గోగులమూడి గ్రామం, అబ్బినేనిగుంటపాలెం, గుంటూరు జిల్లా-522015.	178

ప్రదేశం : గుంటూరు
తేది : 29-12-2025
సం/- అధీకృత అధికారి
ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, బ్రాడీపేట బ్రాంచి, గుంటూరు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ GD కానిస్టేబుల్ కోచింగ్ అర్హత: 10వ తరగతి 100% గ్యారంటీ శిక్షణ ఇవ్వబడును. చివరి తేది : 31-12-2025. సంప్ర॥ 93906 11350, 80744 82386

REAL ESTATE

■ నూతనసంవత్సర శుభాకాంక్షలు, గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురంకాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDAఅప్రూవ్డ్‌ప్లాట్స్ & పొలములు. అ/కొ, స్పాట్ రిజిస్ట్రేషన్. మీ లతీష్ గౌడ్. సం॥ 9848986831

PLOT FOR SALE

■ గుంటూరు నుండి 6కి.మీ బుడంపాడు మెయిన్‌రోడ్డు దగ్గర్లో వెంచర్స్, 40అ॥33అ. రోడ్లు, కరెంట్ సౌకర్యం.. స్పాట్ రిజిస్ట్రేషన్. గజంరివేలు,15వేలు మాత్రమే. 8317528192

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం బ్యాంకులలో ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్, సంప్ర॥ 7989731043

■ బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41168

WANTED

■ గుంటూరు లక్ష్మీపురం నందు ప్రముఖ దంత వైద్యశాలలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. గుంటూరు టూటౌన్ వారికి ప్రాధాన్యత. ✆ 8500808778

■ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్/ బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ లలోపు వారు రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.

■ జనరేటర్స్ కావలెను. 82.5 Kv కెపాసిటీ గల Kirloskar, Cummins, Ashok Leyland కంపెనీ మాత్రమే కావలెను. వెంటనే సంప్రదించగలరు. మొబైల్ నెంబర్: 9248711160, 9248733306

■ ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు part-time or full time ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్రదించండి. సెల్.85003 53577.

■ ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు గుంటూరు, చిలకలూరిపేట, నరసరావుపేట ప్రాంతాల నుండి M/F Executives కావలెను. మంచి కమీషన్ + ఇన్సెంటివ్స్, LIC ఏజెంట్స్, రిటైర్డ్ టీచర్స్, గృహిణులు & Freshers కూడా సంప్ర: 82478 24262

■ డ్యూటీ డాక్టర్స్, రిసెప్షనిస్ట్, నర్సెస్ (MPHW) వాచ్‌మెన్స్ కావలెను. కొత్తవారికి కూడా ప్రాధాన్యత.అహల్యా నర్సింగ్‌హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 92464 27459

■ ఫ్రీ కంప్యూటర్, M.S Office, స్పోకెన్ ఇంగ్లీష్, కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి జాబ్ చూపించబడును. అర్హత: 10th-Degree, 18-28సం॥. 9133444985/89

■ గుంటూరు లక్ష్మీపురం ఏరియాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గంటలు డ్యూటీ. సంప్రదించండి ✆ 96761 07661

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారు చేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్. 9640729906

గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే ఉపేక్షించం

ఫిరంగిపురం: మండల కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.మోహన్‌రావు తనిఖీ చేశారు. యూరియా నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని దుకాణాదారులకు తెలియజేశారు. అదే విధంగా దుకాణంలో యూరియా నిల్వలు, ధర తెలిపే బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో వాసంతి, షేక్ సుభాని ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

తాడికొండ: మోతడక చలపతి ఇంజినీరింగ్ సీఈసీ విభాగం సైబర్ సెక్యూరిటీ వింగ్, సైబర్ బ్లూమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలోని పీజీఎం చిన్నారుల హోమ్‌లో వారికి అవసరమైన నిత్యావసర సరుకులను విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చదువుతో పాటు సామాజిక బాధ్యతను తెలియజేసే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని అన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ డి.కల్యాణ్ కుమార్, అధ్యాపకులు పి.ప్రేమ్‌చంద్, పి.మురళీకృష్ణ, టి.ఏడుకొండలు, యు.ఇందుశేఖర్, కె.నళిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛను ఇప్పించాలని వినతి

తెనాలిఅర్బన్: అర్హత ఉన్నా నూతన పింఛన్ మంజూరుకాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే దానిని మంజూరు చేయాలనా ఐతానగర్ వాసి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తమకు కేటాయించిన దారిని కూడా అక్రమించారని మరొకరు ఫిర్యాదు చేశారు. అన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ వాణి, ఆరోగ్య అధికారి డాక్టర్ యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పేరేచర్ల సెంటర్‌లో రోడ్డు ప్రమాదం

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం గుంటూరుకు చెందిన మంద ఏసుదాసు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏసుదాసు సత్తెనపల్లిలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వస్తున్నారు. ఆయన పేరేచర్ల సెంటర్‌ను దాటుతుండగా పలకలూరు మార్గం నుంచి పేరేచర్ల వైపు వస్తున్న లారీ ఏసుదాసు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం దెబ్బతినగా ఏసుదాసు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. రద్దీగా ఉండే పేరేచర్ల కూడలిలో ఈ ప్రమాదం జరగడంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, పోలీసులు స్పందించి బాధితుడికి సహాయక చర్యలు అందించారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం

తెనాలి: బాపట్ల జిల్లా చీరాలకు చెందిన కరాటే మాస్టర్ 'కింగ్' నరేంద్రరెడ్డి కావూరి పట్టణానికి చెందిన హరిహంసిక డాన్స్ – తైక్వాండో అకాడమీలో విద్యార్థులకు శిక్షణనిచ్చారు. అకాడమీ కోచ్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కోచింగ్ క్యాంపుకు ఆయన ప్రత్యేకంగా విచ్చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు ఉదయం ఏడు గంటల్నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణనిచ్చారు. కర్రసాము, నాన్‌చాక్, కరాటే కటాస్‌తోపాటు సెల్ఫ్ డిఫెన్స్‌ను నేర్పించారు. కరాటే బ్లాక్ బెల్ట్‌ను సాధించిన ఎం.సత్యనారాయణ తెనాలి విద్యార్థులకు ఉత్తమ శిక్షణనిస్తూ తెనాలికి మంచి పేరును తీసుకొస్తున్నట్టు అభినందించారు. హరిహంసిక డాన్స్–తైక్వాండో అకాడమీని 2026లో హరిహంసిక మార్షల్ ఆర్ట్స్ అకాడమీగా చేస్తున్నామని, త్వరలో తెనాలిలో జాతీయ స్థాయి కరాటే పోటీలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు.

రామారావు కుటుంబానికి న్యాయం చేయాలి

తాడికొండ: అమరావతి కోసం రైతు రామారావు ఆవేదనతో ప్రాణత్యాగం చేసినా కూటమి సర్కారు కళ్లు తెరవడం లేదని.. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇంతవరకు ఎలాంటి కనికరం చూపకపోవడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు అన్నారు. సోమవారం అమరావతి రాయపూడిలోని సీఆర్డీయే ప్రధాన కార్యాలయం వద్ద రామారావు కుటుంబానికి న్యాయం చేయాలని, అమరావతి రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అమరావతి రైతులతో పాటు రామారావు కుటుంబ సభ్యులు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు. ఇంటిని తొలగిస్తున్నారనే ఆవేదనతో మరణించిన దొండపాటి రామారావు చిత్రపటాలు, బ్యానర్లు చేతబట్టి న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ సీఆర్డీయే కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అనంతరం సీఆర్డీయే అదనపు కమిషనర్ భార్గవ్ తేజ, మున్సిపల్ మంత్రి కార్యాలయం అధికారులకు పలువురు నాయకులతో కలిసి ఆయన వినతి పత్రాలు సమర్పించారు. రైతు రామారావు కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, రామారావు, రైతులు కోరిన విధంగా ప్లాట్ల కేటాయింపులోని అవకతవకలను సరిదిద్ది తక్షణమే ప్రత్యామ్నాయంగా సరైన ప్లాట్లు కేటాయించాలని నాయకులు కోరారు.

సీఆర్డీయే ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తున్న నాయకులు

వక్ఫ్ భూముల సేకరణ ఉపసంహరించుకోవాలి..

మంగళగిరి టౌన్: పారిశ్రామిక కారిడార్ పేరుతో వక్ఫ్ భూములను సేకరించే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. ఈ మేరకు మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అంకారావు, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతలకు వినతిపత్రాలు అందజేశారు. రామారావు మాట్లాడుతూ.. ముస్లింల అభ్యున్నతి, సంక్షేమం కోసం వినియోగించాల్సిన వక్ఫ్ భూములను పారిశ్రామిక కారిడార్ పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. సుమారు 70 ఏళ్ల నుంచి ఈ భూములు వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్నాయని.. 100 మందికి పైగా రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. ఎన్నికలకు ముందు ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించినా, నేడు ప్రభుత్వం ఆచరణలో విరుద్ధంగా ఉందని విమర్శించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ అవసరాలు, పారిశ్రామిక అవసరాలకు సేకరించేటప్పుడు ప్రాధాన్యతా క్రమంలో బీడు భూములుగా ఉన్న వాటిని సేకరించాలనే నిబంధనకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డుకు కేటాయించిన భూములు విక్రయించడానికి గానీ, సేకరించడానికి కానీ చట్టం అంగీకరించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రవి, జొన్న శివశంకరరావు, ఈమని అప్పారావు, దుర్గారావు, జేవీ రాఘవులు, బి.వెంకటేశ్వర్లు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సమస్యలపై అధికారులు స్పందించాలి

మంగళగిరి టౌన్: నిరసన దీక్షలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని.. అధికారులు దీనిపై స్పందించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అసహనం వ్యక్తం చేశారు. తాడేపల్లి ఎంబుక్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన దీక్షలు సోమవారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. పగలు డ్యూటీ చేయాలని అధికారులు చెబుతున్నారని, పగలు డ్యూటీ చేస్తే రూ.21 వేల వేతనం ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశం మేరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని గుర్తు చేశారు. ఎంబుక్ కార్మికులు చేస్తున్న నిరసన దీక్షకు అధికారులు లేదా స్థానిక మంత్రి నారా లోకేష్ పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఈమని అప్పారావు, ఎం.రవి, భాగ్యరాజు, కమలాకర్, కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేస్తున్న కార్మికులు

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై బాలికలకు అవగాహన

తాడేపల్లి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, పెనుమాకలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినులకు సోమవారం హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ కూచిపూడి మనోజ్ఞ, ఆంధ్రా యూరోలజీ, గైనకాలజి హాస్పిటల్ డాక్టర్ వర్షిణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కోసం ఈ వ్యాక్సిన్ అవసరమని అన్నారు. శరీరంలోని వివిధ భాగాలను ప్రభావితం చేసే 100 కంటే ఎక్కువ రకాల హెచ్‌పీవీలు ఉన్నాయని.. వీటిలో 40 కంటే ఎక్కువ రకాలు జననేంద్రియ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తాయని వివరించారు. రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ.. సుమారు 1000 మందికి పైగా బాలికలకు హెచ్‌పీవీ టీకా వేయనున్నామని తెలిపారు. తల్లిదండ్రుల అంగీకారంతో ఈనెల 31వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. వివరాలకు 99480 74365, 97039 34444, 90323 31199, 84668 12222 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రొటేరియన్స్ ప్రెసిడెంట్ రామకృష్ణ, శ్రీలత, నవ్య, స్వాతి చందన, కాట్రగడ్డ శివనారాయణ, మున్నంగి వివేకానందరెడ్డి, రమేష్, పలగాని శ్రీకాంత్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న గైనకాలజిస్ట్

ఇచ్చిన హామీని లోకేష్ అమలు చేయాలి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, దుర్గారావులు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు వారు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు గత 391 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ కూటమి అధికారంలోకి వస్తే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. వెంకటరమణ, దేవరాజు, ఇశ్రాయేల్, గురవయ్య దీక్షల్లో కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు బూరగ అంకయ్య, సూర్యప్రకాష్, సుభాని, టి.నాగేశ్వరరావు, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరరావు సువర్ణకుమారి, శారద, రిబ్కా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

పట్టపగలు ఇంట్లో చోరీ.. నగలు అపహరణ

కొల్లిపర: మండల పరిధిలోని అత్తోట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు ఇంట్లో చొరబడి నగలు అపహరించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. దీనిపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలోనే యర్రు సువర్ణ భర్త వెంకటేశ్వరరావు చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 10 గ్రాముల బంగారం, 140 గ్రాముల వెండి దొంగిలిచ్చినట్లు దీంతో కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. కొలిపర పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ ఫెయిర్‌తో సృజనాత్మకత పెంపొందుతుంది

తాడేపల్లి రూరల్: సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మతక పెంపొందుతుందని స్కూల్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయ భాస్కరరావు అన్నారు. సోమవారం తాడేపల్లి రూరల్ కుంచనపల్లి గీతాంజలి స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏడాది మొత్తం చేసిన పనిని ప్రదర్శించడానిక అవకాశం కల్పించే వేదిక సైన్స్ ఫెయిర్ అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతిని తెలుసుకునే పరిపుష్టిగా ఉంటుందని పేర్కొన్నారు. వివిధ తరగతుల విద్యార్థులు తమ శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మున్నంగి రమాదేవి, హారిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న విజయ భాస్కరరావు

ప్రతిభావంతులకు అభినందన

మేడికొండూరు: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 28వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో యూనివర్సల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మకమైన 'ఓవరాల్ ఛాంపియన్‌షిప్ స్పోర్ట్స్ ట్రోఫీ'ని సొంతం చేసుకున్నారు. విద్యార్థులు రన్నింగ్ రిలే పరుగు 100 మీటర్లలో మొదటి స్థానం.. 200 మీటర్ల పరుగులో రెండో స్థానం.. త్రో ఈవెంట్స్ జావలిన్ త్రో లో 1, 2వ స్థానాలు, డిస్కస్ త్రో లో 1వ స్థానం, షాట్ పుట్ లో 1, 2వ స్థానాలు.. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబుల్స్‌లో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ కళాశాలకు పేరు తెస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రీజనల్ లెవెల్ విజేతలు జనవరి 28, 29, 30 తేదీల్లో తిరుపతిలో జరిగే స్టేట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.కోటిరెడ్డి, డిప్లమో ప్రిన్సిపల్ ఎం.జయరామి రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సతీష్, అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

సీఆర్డీయే ఆధ్వర్యంలో స్టేక్‌హోల్డర్స్‌తో సమావేశం

తాడికొండ: అమరావతి రాజధాని నగర పర్యావరణ నిర్వహణ ప్రణాళిక(ఈఎంపీ)లో చేపట్టాల్సిన స్టేక్‌హోల్డర్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిర్ణయించిన షెడ్యూల్, అజెండా ప్రకారం వెంకటపాలెం, రాయపూడి, నేలపాడు, మల్కాపురంలో స్టేక్‌హోల్డర్ సంప్రదింపుల సమావేశాలు సోమవారం నిర్వహించారు. రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రజారోగ్యం, భద్రతా అంశాలపై సమాచారం అందించడం, అలానే నిర్మాణ పనుల వల్ల కలిగే పర్యావరణ, సామాజిక అంశాలపై గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడమే ఉద్దేశ్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఆర్డీయే అధికారులు తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశాలలో ఆయా గ్రామాల ప్రజలు భారీ వాహనాల రాకపోకలు, నియంత్రణ, రోడ్డు భద్రత అంశాలు, నిర్మాణ పనుల వల్ల కలిగే కాలుష్య నియంత్రణ, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, వైద్యం, ఆరోగ్య సదుపాయాల లభ్యత వంటి పలు ముఖ్యమైన అంశాలను ప్రస్తావించారు. సమావేశాల్లో వచ్చిన అభిప్రాయాలపై చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్ల ప్రతినిధులు, పీఎంసీల ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో సీఆర్డీయే సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, పీజీఎంసీ నుంచి మగేష్, శశి కిరణ్, గాజుల అరుణ్ కుమార్, ఎంఈఐఎల్, ఆర్‌వీఆర్, బీఎస్‌ఆర్, ఎల్‌వీటీ, ఎన్‌సీసీ, ఎంవీఆర్, బీఎస్‌సీపీఎల్ సంస్థల కాంట్రాక్టర్ల ప్రతినిధులు, ఆర్వీ, టిప్సా, మార్స్, ట్రాక్టబుల్, లాసా సంస్థలకు చెందిన మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌లు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీయే అధికారులు

డోకిపర్రు రైల్వే బ్రిడ్జి రహదారికి మరమ్మతులు

మేడికొండూరు: మేడికొండూరు మండల పరిధి డోకిపర్రు గ్రామంలో ప్రయాణికులకు పెను సవాలుగా మారిన రహదారి సమస్యకు పరిష్కారం లభించింది. శాంతినగర్ వెళ్లే ప్రధాన దారిలోని రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు భారీగా కోతకు గురవడంతో వాహనదారులు, పాదచారులు ఆ దారిన వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. రోజూ నానా ఇబ్బందులు పడుతున్న శాంతినగర్ వాసులు ఈ విషయాన్ని మండల జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య దష్టికి తీసుకువెళ్లారు. ప్రజా సమస్యపై సానుకూలంగా స్పందించిన ఆయన, హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా సమీక్షించారు. అనంతరం క్రేన్‌ను రప్పించి కోతకు గురైన గుంతలను పూడ్చివేయించారు. దీంతో రాకపోకలకు పునరుద్ధరణ కొనసాగింది. తమ సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించిన సిద్ధయ్యకు గ్రామస్తులు, శాంతినగర్ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య

క్వారీ బ్లాస్టింగ్‌లపై అధికారులకు వినతి

ఫిరంగిపురం: క్వారీల బ్లాస్టింగ్‌లతో రాళ్లు తమ ఇళ్లపై పడుతున్నాయని.. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. తమకు న్యాయం చేయాలని కోరుతు గొల్లపాలెం గ్రామానికి చెందిన మహిళలు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మహిళలు మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం రెండు క్వారీలకు సంబంధించిన వారు బ్లాస్టింగ్‌లు చేస్తుండటంతో రాళ్లు తమ నివాసాలపై పడుతున్నాయని అన్నారు. పెద్ద పెద్ద వాహనాల రాకపోకలతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. వాహనాల ద్వారా ఏర్పడే దుమ్ము, ధూళితో అనారోగ్యాల బారిన పడుతున్నామని చెప్పారు. ఇళ్ల మీద రాళ్లు పడుతుండటంతో ప్రాణభయంతో బయటకు వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంపీడీవో పి.శివ సుబ్రహ్మణ్యం, ఏఎస్‌వో శివకు వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న గొల్లపాలెం మహిళలు

ప్రత్యామ్నాయ పంటగా నువ్వుల సాగు లాభదాయకం

ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.మనోజ్

తెనాలిటౌన్: రైతులందరూ ఒకే పంట పండించడం వలన మద్దతు ధర లభించదని,సాగు ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటగా నువ్వుల సాగు లాభదాయకమని ఏరువాక కేంద్రం గుంటూరు సమన్వయకర్త డాక్టర్ ఎ.మనోజ్ రైతులకు సూచించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఏరువాక కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో సోమవారం రైతులకు నువ్వుల పంటలో సమగ్ర యాజమాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమన్వయ కర్త డాక్టర్ ఎ.మనోజ్ పాల్గొని మాట్లాడారు. షెడ్యూలు కులాల ఉపప్రణాళికలో భాగంగా కొలకలూరులో నువ్వుల పంటపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వెల్లడించారు. నువ్వుల్లో కొత్త రకాలు ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ముఖ్యంగా వైఎల్ఎం 66, వైఎల్ఎం 146 రకాలు ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ళ వరకు దిగుబడి ఇస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పంటల మాదిరిగా కాకుండా తేలికపాటి ఒకటి రెండు నీటి తడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. నువ్వుల సాగులో వచ్చే చీడ పీడలను, సమగ్ర యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ నాగరాజు, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

రైతులకు వివరిస్తున్న డాక్టర్ మనోజ్

నేడు ఉపాధి హామీపై బహిరంగ ప్రజావేదిక

తెనాలి: ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో అత్తోట దీప్తి సోమవారం తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో నవంబరు 24 నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు.

ఒకేషనల్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల సత్తా

దుగ్గిరాల: ఒకేషనల్ ఎగ్జిబిషన్ ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగంలో పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించారని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బీవీ కృష్ణారావు తెలిపారు. సోమవారం మండలంలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులు చంద్రకిరణ్, దుర్గ, భవిత, అజ్మా, బాల హన్సిక, మనోజులను అభినందించారు. వారికి సహకరించిన ఒకేషనల్ ఉపాధ్యాయులు కల్యాణి, జనార్ధనరావు, విద్యా కమిటీ సభ్యులు, తదితర ఉపాధ్యాయులను సైతం అభినందించారు. విద్యార్థులకు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ప్రశంసాపత్రం, క్యాష్ ప్రైజ్, జ్ఞాపిక అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతి అందుకుంటున్న విద్యార్థులు, ఒకేషనల్ ట్రైనీ టీచర్లు

వినతులు రాని పరిష్కార వేదిక

దుగ్గిరాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేశారు. మండల స్థాయి అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు విధిగా కార్యాలయానికి హాజరయ్యారు. కానీ ప్రజల నుంచి ఒక్క అర్జీ కూడా రాలేదని తహసీల్దారు ఐ.సునీత తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కనకదుర్గ, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఆధార్ కార్డులు ఇవ్వాలి

తెనాలిరూరల్: పట్టణ యడ్ల లింగయ్య కాలనీలో నివసించే నిరుపేదలకు ఆధార్ కార్డులివ్వాలని కోరుతూ సీపీఎం పార్టీ నాయకులు తెనాలి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. కాలనీలో సుమారు 30 కుటుంబాలకు ఆధార్ కార్డులు లేవని, దీని వల్ల ఆ కటుఉంబాల్లోని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ప్రవేశం దొరకడం లేదని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. రేషన్ కారుడలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, చిత్తుకాగితాలు, అట్టలు ఏరుకుని బ్రతికే వారికి ఆర్థిక భారమవుతోందని కొల్లిపర బాబు ప్రసాద్ తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. షేక్ హుస్సేన్‌వలి, తమ్మిశెట్టి అంకయ్య, కోటగిరి నర్సమ్మ, హిమబిందు, శేషమ్మ, ప్రేమకుమారి, వెంకటేష్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, లాంఫాం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పలు పంటలు వేసే విధానం, తెగుళ్ల నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శెనగ పంటలో వచ్చే ఎండు తెగుళ్ల, మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు, మిరపలో వచ్చే నల్లతామర పురుగు వంటి వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ టి.కేశవరావు, వైస్ చైర్మన్ షేక్.జానీబేగం, శాస్త్రవేత్తలు శ్రీలతవాణి, దయానా, నాగజ్యోతి, డాక్టర్ రమణ, ఏవో వాసంతి, వ్యవసాయ విస్తరణాధికారి సుభాని, రైతులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

బాబు సర్కారు దోపిడీ 'పర్వం'

ఉత్సవాలు, ఈవెంట్ల కోసం రూ.150 కోట్లు

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వేడుకల పేరిట భారీ బడ్జెట్

ఏపీటీడీసీ హోటళ్లు, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి గాలికి

అస్మదీయులకు దోచిపెట్టేందుకు ఉత్సవాల పేరుతో భారీ డ్రామా

తాజాగా ఆవకాయ పేరుతో అమరావతిలో రూ.5 కోట్లతో ఉత్సవ్

గతంలో ఇలానే శక్తి విజయోత్సవ్ పేరుతో సీఎం సతీమణి ప్రసంగానికి రూ.7 కోట్లు ఖర్చు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసి ఉత్సవాలు, ఈవెంట్ల పేరుతో దోపిడీ పర్వానికి తెరలేపింది. అధికారం చేపట్టినప్పటి నుంచి భారీగా ప్రజాధనాన్ని ఖర్చుచేస్తూ తన అనుయాయ సంస్థలకు భారీగా దోచిపెడుతోంది. ఇప్పటికే శక్తి విజయోత్సవ్, వరల్డ్ టూరిజం డే పేరిట భారీ అవినీతికి పాల్పడిన సర్కారు తాజాగా అమరావతి-ఆవకాయ అంటూ మరో లూటీ ఈవెంట్‌కు సిద్ధమవుతోంది.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యాటక రంగం పూర్తిగా కుంటుపడింది. ఆధ్యాత్మిక కేంద్రాలు, ఎకో, తీర ప్రాంతాలు వంటి పర్యాటక ప్రదేశాల్లో మౌలిక వసతుల లేమి వెంటాడుతోంది. వీటిని అభివృద్ధి చేయకుండా ఏడాదిన్నర కాలంగా చంద్రబాబు సర్కారు యథేచ్ఛగా భూ పందేరాలు, ఉత్సవాల పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడంతోనే పబ్బం గడిపేసింది. తమ బినామీ సంస్థలు, అనుయాయులకు ప్రాజెక్టులు, ప్రోగ్రామ్స్‌ను వంతులు వేసి మరీ కేటాయించి అప్పనంగా దోచిపెడుతోంది. తాజాగా 'అమరావతి-ఆవకాయ' అంటూ హడావుడి చేస్తోంది. ఈ వేడుకల నిర్వహణ కోసం నిధులు ఖర్చు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ.. పర్యాటక ఆస్తులను అభివృద్ధి చేయడంలో చూపించట్లేదు. ఇప్పటివరకు దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడం కోసమంటూ భారీ స్థాయిలో పర్యాటక రోడ్‌షోలు, పండుగలు, ఫెయిర్స్ నిర్వహణకు ఏకంగా రూ.150 కోట్లు ఖర్చు చేస్తుండడం విస్తుగొలుపుతోంది. వాస్తవానికి ప్రభుత్వం కేవలం ప్రచారాల కోసం పెట్టిన ఈ బడ్జెట్.. ఒక వార్షిక ఏడాదిలో ఏపీటీడీసీ నికర రాబడులతో సమానంగా ఉండటం గమనార్హం.

అప్పుడు శక్తి విజయోత్సవ్.. ఇప్పుడు ఆవకాయ్!

చంద్రబాబు సర్కారు జనవరిలో విజయవాడలో 'అమరావతి-ఆవకాయ్' పేరుతో ఉత్సవం నిర్వహించనున్నట్టు ప్రకటించింది. మూడు రోజుల ప్రోగ్రామ్‌కి ఏకంగా రూ.5 కోట్లు బడ్జెట్ కేటాయించింది. తెలుగు సాహిత్యం, సినిమా వైభవాన్ని చాటేందుకు ఉత్తరాదికి చెందిన 'టీమ్ వర్క్ ఆర్ట్స్'కు బాధ్యతలిచ్చింది. అయితే, టెండర్లు లేకుండా ఎంప్యానల్ చేసిన సంస్థల్లో ఒక సంస్థకు కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది. గతంలోనూ ఇదే రీతిలో 2024 దసరా పండుగ సమయంలో శక్తి విజయోత్సవ్ పేరుతో తూతూ మంత్రంగా చేపట్టి ఏకంగా రూ.7 కోట్లు తమ అనుయాయులకు దోచిపెట్టింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగం చేయడంతో ఈ ప్రోగ్రామ్‌కు బడ్జెట్ అంచనాలకు మించి బిల్లులు చెల్లించింది. తొలుత శక్తి విజయోత్సవానికి రూ.2 కోట్లకు పరిపాలన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయగా.. ఆ తర్వాత మరో రూ.5 కోట్లు అదనంగా కేటాయిస్తూ మొత్తం రూ.7 కోట్లకు ఉత్తర్వులు ఇచ్చింది.

అంతా ప్లాన్ ప్రకారమే..

గతంలో శక్తి విజయోత్సవ్‌ను హైదరాబాద్‌కు చెందిన ఓ ఈవెంట్ కంపెనీకి డమ్మీ టెండర్ల ద్వారా కాంట్రాక్టు అప్పగించింది. సదరు కంపెనీ 2014-19 మధ్య కాలంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వానికి ఇలాంటి ఈవెంట్లు ఎన్నో చేసింది. సదరు కంపెనీ ఇటీవల ఎన్నికల్లో అధికార పార్టీకి ఫండింగ్ చేయడంతో.. అందుకు లబ్ధి చేకూర్చేందుకు పర్యాటక శాఖలో శక్తి విజయోత్సవ్ షోల నిర్వహణ అప్పగించింది. వాస్తవానికి మొదటి రోజు సాయంత్రం ఆరు గంటలకు కార్యక్రమం ప్రారంభం అయితే సీఎం సతీమణి భువనేశ్వరి నారీ శక్తిపై ప్రసంగించారు. ప్రభుత్వంలోని కొంత మంది మంత్రులు హాజరయ్యారు. రాత్రి 10 గంటల్లోపే కార్యక్రమం ముగిసింది. ఆ తర్వాత రెండు రోజులు సాయంత్రం పూటే తూతూ మంత్రంగా చిన్నారుల కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎంత విచ్చలవిడిగా ఖర్చు చేసినా రూ.కోటి, రూ.కోటిన్నర కూడా బడ్జెట్ దాటని కార్యక్రమానికి కళ్లు చెదిరేలా రూ.7 కోట్లు విడుదల చేయడం నిధుల దుర్వినియోగానికి అద్దం పట్టింది. పైగా ప్రైవేటు స్థలం వినియోగించుకున్నందుకు యజమానికి ఒక్క పైసా కూడా చెల్లించకుండా వేధించింది. అసలు ఈ కార్యక్రమానికి సంబంధించి పాస్‌లు పూర్తిగా దుర్వినియోగం అవ్వగా, కనీసం డ్యూటీలో ఉన్న పర్యాటక శాఖ ఉద్యోగులకూ పాస్‌లు అందని పరిస్థితి. ఇందులో ఏపీ టూరిజం అథారిటీలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తూ ఎనిమిదేళ్లుగా ఒకే చోట పాతుకు పోయిన ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం. ఆయనకు సంబంధం లేని ఈవెంట్ విభాగాన్ని రాజకీయ నాయకుల ఒత్తిడితో చేజిక్కించుకుని కథను నడిపించారని సమాచారం. ఫైల్ నిర్వహించడం దగ్గర నుంచి బిల్లుల అప్‌లోడ్ వరకు అన్నీ తానై వ్యవహరించారని, ఇందుకు ప్రతిగా బిల్లుల్లో ఒకశాతం కమీషన్ తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదేమాదిరిగా సెప్టెంబర్‌లో నిర్వహించిన వరల్డ్ టూరిజం డే కార్యక్రమంలోనూ భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. ఇప్పుడు అమరావతి-ఆవకాయ్‌లో కూడా ఇదే తంతు నడుస్తోందని వినికిడి.

మౌలిక వసతులు మృగ్యం..

గత ప్రభుత్వ హయాంలో పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు హరిత హోటళ్ల అప్‌గ్రేడేషన్‌ను చేపట్టింది. 12 హోటళ్లలో సుమారు రూ.78 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని చోట్ల చిన్న మొత్తంలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని గాలికొదిలేసింది. ఫలితంగా హోటళ్ల ఆదాయం గణనీయంగా పడిపోయింది. రూ.కోట్లు ఖర్చు చేసి రూపురేఖలు మార్చిన ఆ హోటళ్లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఏకంగా ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను సైతం కూటమి సర్కారు ఆహ్వానించింది. ఈ క్రమంలో సగానికిపైగా హోటళ్ల ఆదాయం క్షీణించింది. పైగా అక్కడ పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు ప్రైవేటు హోటళ్లకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్న పరిస్థితి. ఇలాంటి దుస్థితిలో పర్యాటకుల ఆకర్షణ కోసం పండుగలు నిర్వహిస్తామంటూ సర్కారు రూ.కోట్లు వృథా చేయడం గమనార్హం.

జిల్లాల్లో రూ.10కోట్లతో పర్యాటక ఉత్సవాలు ఇలా..

ఉత్సవం	బడ్జెట్(రూ.ల్లో)
మచిలీపట్నం బీచ్‌ఫెస్టివల్	50 లక్షలు
కాణిపాకం ఉత్సవాలు	కోటి
గోదావరి బోట్ ఫెస్టివల్	కోటి
విజయనగరం ఉత్సవాలు	50 లక్షలు
కాకినాడ బీచ్‌ఫెస్టివల్	కోటి
బారువా బీచ్‌ఫెస్టివల్	50 లక్షలు
గుత్తిఫోర్టు ఫెస్టివల్	50 లక్షలు
కొల్లేరు బర్డ్ ఫెస్టివల్	50 లక్షలు
ఓర్వకల్లు రాక్‌గార్డెన్ ఫెస్టివల్	50 లక్షలు
మైపాడు బీచ్ ఫెస్టివల్	50 లక్షలు
హార్సిలీహిల్స్ అడ్వెంచర్ ఫెస్టివల్	50 లక్షలు
సూర్యలంక బీచ్ ఫెస్టివల్	కోటి
లేపాక్షి ఉత్సవాలు	కోటి
పేరుపాలెం బీచ్ ఫెస్టివల్	50 లక్షలు
బెలూం కేవ్స్ ఫెస్టివల్	50 లక్షలు
మొత్తం	రూ.10 కోట్లు

2025-26లో పర్యాటక ప్రచారం ఖర్చు ఇలా.. (ఇది బడ్జెట్‌లో సగభాగమే)

అంశం	రూ.కోట్లు
మెగా ఈవెంట్స్	27
జిల్లా ఈవెంట్స్	10
ప్రపంచ పర్యాటక దినోత్సవం	3
అంతర్జాతీయ రోడ్‌షోలు, ఫెయిర్స్	7
జాతీయ రోడ్‌షోలు, ఫెయిర్స్	5
సోషల్ మీడియా, బ్రాండింగ్ పార్టనర్స్	7
హోర్డింగ్స్/డిజిటల్ ప్రకటనలు	10
బ్రోచర్ల ప్రింటింగ్	4
ప్రమోషనల్ వీడియోలు, డిజిటల్ కంటెంట్	4
పాత బిల్లులు చెల్లింపులు	1
మొత్తం	78

2025-26లో మెగా ఈవెంట్స్‌కు రూ.27 కోట్లు బడ్జెట్ ఇలా..

అంశం	రూ.కోట్లు
ఏపీ ట్రావెల్‌మార్ట్(విశాఖ)	3
గండికోట ఉత్సవం(కడప)	3
అరకు బెలూన్ ఉత్సవం	5
విశాఖ ఉత్సవ్	5
గ్లోబల్ శాంతి బుద్ధిస్టు ఫెస్టివల్	3
ఫ్లెమింగో ఫెస్టివల్	3
అమరావతి-ఆవకాయ్ లిట్రసీ, మ్యూజిక్ ఫెస్ట్ (ఎన్టీఆర్ జిల్లా)	5

క్లుప్తంగా...

అన్ని ఆలయాల్లో శ్రీవారి సేవకుల విధానం

రెవెన్యూ సేవలు సులభంగా అందాలి.. సర్వేలో తప్పులు దొర్లకూడదు: సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: తిరుమలలో అమలు చేస్తున్న శ్రీవారి సేవకుల విధానాన్ని రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం ఆర్టీజీఎస్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, పౌర సరఫరాలు, వైద్యారోగ్యం, రవాణా, అగ్నిమాపక, దేవదాయ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానికంగా వలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. శ్రీవారి సేవకులందిస్తున్న తరహా సేవలను అన్ని దేవాలయాల్లో వినియోగించుకోవాలన్నారు. పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చి నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్లు ప్రజలు నిత్యం సందర్శించే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాస్పత్రుల్లో క్షేత్రస్థాయి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. సర్వేల్లో తప్పులు దొర్లకుండా రెవెన్యూ యంత్రాంగం పనిచేసి ప్రజల మెప్పు పొందాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ఫిర్యాదులు రాకుండా చూసుకోలని సీఎం సూచించారు.

లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లిటిగేషన్ పాలసీ-2025 పరిశీలన నిమిత్తం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం తొలిసారిగా సోమవారం భేటీ అయింది. సచివాలయంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి, ఇతర అధికారులు సమావేశమై లిటిగేషన్ పాలసీపై చర్చించారు.

బంద్‌పై నిర్బంధం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రైతు నాయకుడు ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో తలపెట్టిన బంద్‌ను విచ్ఛిన్నం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. అప్పలరాజును అక్రమ అరెస్టుకు నిరసనగా బంద్ పాటిస్తోన్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. బంద్‌లో పాల్గొని అరెస్టయిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జగన్ పుట్టినరోజు వేడుకలు చూసి తట్టుకోలేకపోతున్నారు

- అందుకే పార్టీ కేడర్‌పై అక్రమ కేసులు
- సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం
- రెడ్‌బుక్ రాజ్యాంగంపై పోరాడుతున్న పార్టీ లీగల్ సెల్‌కు అభినందనలు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ వందల కొద్దీ తప్పుడు కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధిస్తున్నారని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజును ప్రజలంతా పండుగలా జరుపుకుంటుంటే... తట్టుకోలేని బాబు సర్కార్ బరితెగించి, పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసుల నమోదుకు పోలీసు వ్యవస్థను వినియోగించుకుంటోందని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగంపై ముందుండి పోరాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌కు ఆయన అభినందనలు తెలిపారు. వైఎస్ జగన్ కూడా ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు. పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌లు, జిల్లా అధ్యక్షులతో సోమవారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో సజ్జల మాట్లాడుతూ, 'అధికార పార్టీ నాయకుల అరాచకాలను పట్టించుకోని పోలీసు యంత్రాంగం జగన్ జన్మదిన వేడుకలను సంప్రదాయ జాతర తరహాలో నిర్వహించిన అభిమానులపై అక్రమ కేసులు నమోదు చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి పార్టీ కార్యకర్తలను నడిరోడ్డుపై నడిపిస్తూ అవమానించింది. నరికిన పొట్టేళ్ల తలలను దండగా చేసి టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ ఫ్లెక్సీకి వేసి వేడుకలు చేసిన టీడీపీ అభిమానులను పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదు. పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రజలకిచ్చిన హామీలు గాలికొదిలేసి ప్రభుత్వం ఇలా బరితెగింపునకు పాల్పడుతోంది. మెడికల్ కాలేజీలపై మన ఆందోళన ప్రజా ఉద్యమంగా మారింది. ప్రజలంతా ఏడాదిన్నరలోనే విసిగిపోయారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూటమి ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కేయడానికి సిద్ధమయ్యారు' అని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి వ్యవహరిస్తున్న పోలీసులపై ప్రైవేట్ కేసులు వేసి, వైఎస్సార్‌సీపీ కేడర్‌కు అండగా నిలుద్దామని సజ్జల ఈ సందర్భంగా లీగల్ సెల్‌కు పిలుపునిచ్చారు.

ఎమర్జెన్సీకి మించి దారుణ పాలన: పొన్నవోలు

సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీకి మించి దారుణమైన పాలన సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ లీగల్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు లీగల్ సెల్ అండగా నిలుస్తుందన్నారు. లీగల్ సెల్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ లీగల్ సెల్ కమిటీలు వెంటనే నియమించుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిన్న గడువిచ్చి.. ఈరోజు తొలగించారు

ఎగ్జిబిషన్ లోపల ఏర్పాటు చేసిన స్టాల్స్ తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

భవానీపురం (విజయవాడ పశ్చిమ): విజయవాడ భవానీపురంలోని పున్నమిఘాట్ ప్రాంతంలోగల బబ్బూరి గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌లోని నమూనా కట్టడాలను సోమవారం నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది దౌర్జన్యంగా తొలగించారు. ఈ కట్టడాలను వారం రోజుల్లో తొలగించాలనిఆదివారం నోటీసు ఇచ్చిన అధికారులు.. సోమవారం తెల్లారేసరికి వచ్చి ఎందుకు తొలగించారని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. 'సార్! గడువు ఇచ్చారు కదా.. మా వాళ్లు చెన్నై నుంచి సాయంత్రానికి వస్తున్నారు. వాళ్లు జాగ్రత్తగా తీసి పక్కన పెడతారు. మీరు ఎడాపెడా తీసేస్తే స్క్రాప్ కింద పోతుంది. తీవ్రంగా నష్టపోతాం..' అంటూ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రాధేయపడినా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కనికరించలేదు. అనుమతి ఇచ్చిన ఉత్తర్వుల్లోనే ప్రభుత్వ అవసరాలకు తొలగిస్తామని ఉంటుందని, అందుకే తొలగిస్తున్నామని వారు చెప్పారు. జనవరి 8 నుంచి 10వ తేదీ వరకు ప్రభుత్వం పున్నమిఘాట్‌లో నిర్వహించనున్న ఆవకాయ అమరావతి ఉత్సవాలకు సీఎం హాజరవుతారన్న సమాచారం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ప్రైవేట్ భూముల యజమానుల్ని భయభ్రాంతులకు గురి చేస్తోంది. భూముల యజమానులు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ భూములను ఏ కార్యక్రమాలకు ఉపయోగించకూడదని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆవకాయ అమరావతి ఉత్సవాలను ప్రభుత్వస్థలంలోనే నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ 24 గంటలు గడవకముందే ప్రైవేట్‌స్థలంలో ఎగ్జిబిషన్ నిర్మాణాలను తొలగించారు.

చావే శరణ్యం

అన్ని అనుమతులు తీసుకుని రెండునెలలుగా ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌ను తీసేయమంటే తమకు చావే శరణ్యమని నిర్వాహకులు మణి, సమీఖాన్ కన్నీటి పర్యంతమయ్యారు. అప్పులు తెచ్చి సుమారు రూ.5 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఈ ఎగ్జిబిషన్‌ను వచ్చే నెల 5న ప్రారంభించాలనుకున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమం ముగిసేవరకు ఆపేసి తర్వాత ప్రారంభించుకుంటామన్నారు. ఆ విధంగా అవకాశం కల్పించాలని నిర్వాహకులు కోరారు.

మాజీమంత్రి కారుమూరిపై అక్రమ కేసు

తణుకు అర్బన్: వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ సానుభూతిపరులు చంద్రబాబు ఫ్లెక్సీ కట్టడంపై నిరసన తెలిపినందుకు పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై తణుకు రూరల్ పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. ఈనెల 25న తణుకు వై.జంక్షన్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ సానుభూతిపరులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, తణుకు ఎమ్మెల్యే తదితరులు ఉన్న ఫ్లెక్సీని కట్టడంతో మాజీమంత్రి కారుమూరితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాత్రి సమయంలో నిరసనకు దిగి రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల ఎదుటే చంద్రబాబు ఫ్లెక్సీ ముందు వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ కట్టారు. దీంతో రెండు ఫ్లెక్సీలను పోలీసులు తొలగించారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో కారుమూరితో సహా 13 మందిపై పోలీసులు 189 (2), 329 (2), 223 (ఎ) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు ప్రజలు వ్యతిరేకం

మాజీ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: వైద్యకళాశాలల ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని మాజీ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు జరిగాయని, అయినా సీఎం చంద్రబాబు తన విధానాన్ని మార్చుకోవడానికి నిరాకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరించారని నాగార్జున విమర్శించారు. కోటి సంతకాల రూపంలో వెల్లువెత్తిన ప్రజాగ్రహాన్ని గమనించే మెడికల్ కాలేజీలపై కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని స్పష్టం చేశారు. ఆదోని మెడికల్ కాలేజీకి కిమ్స్ ఆస్పత్రి వైద్యుడి ద్వారా టెండర్ దాఖలు చేసినట్టు ప్రభుత్వం నిర్ధారించడం, సింగిల్ బిడ్ టెండర్‌ను ఆమోదించడం విస్తుగొలుపుతోందని విమర్శించారు. ఇది పారదర్శకతకు పాతరేయటమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దారుణమన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి మంకుపట్టు వీడాలని డిమాండ్ చేశారు.

ప్రయోగాలు తగ్గించిన ఇస్రో

పీఎస్ఎల్వీ ప్రయోగాలు తగ్గించి.. జీఎస్ఎల్వీ, ఎల్వీఎం-3 రాకెట్ ప్రయోగాల పెంపు

- ఒకేఒక్క పీఎస్ఎల్వీ ప్రయోగించినా విఫలం
- మరోవైపు 6,400 కిలోల వాణిజ్య ఉపగ్రహ ప్రయోగం విజయవంతం
- 2026 మార్చికి అందుబాటులోకి రానున్న కులశేఖరపట్నంలోని రాకెట్ ప్రయోగకేంద్రం
- భారీ ప్రయోగాల కోసం బలీయంగా శ్రీహరికోటలోని షార్ సెంటర్

ఈ ఏడాది ప్రారంభం జనవరి 29న ప్రయోగించిన జీఎస్ఎల్వీ ఎఫ్15 రాకెట్(పాతచిత్రం)

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. ఈ ఏడాది కేవలం ఐదు ప్రయోగాలకే పరిమితమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి రెండు జీఎస్ఎల్వీ రాకెట్లు, రెండు ఎల్వీఎం-3 రాకెట్లు, ఒక్క పీఎస్ఎల్వీ రాకెట్‌ను మాత్రమే ప్రయోగించారు. గతంలో ఏడాదికి నాలుగుకుపైనే పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలు ఉండేవి. జీఎస్ఎల్వీ, ఎల్వీఎం-3 రాకెట్ ప్రయోగాలు ఏడాదికి ఒకటో రెండో ఉండేవి. ఈ ఏడాది ఒకే ఒక్క పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగించినప్పటికీ విఫలమైంది. పీఎస్ఎల్వీ ప్రయోగాలను తగ్గించి జీఎస్ఎల్వీ, ఎల్వీఎం-3 రాకెట్ల ప్రయోగాలు పెంచుతున్నారు. ఈ ప్రయోగాలకు సంబంధించిన క్రయోజనిక్ దశను వివిధ రూపాల్లో తయారు చేసి విజయాలు నమోదు చేస్తున్నారు.

జనవరి నుంచే ప్రయోగాలు

ఈ ఏడాది ప్రారంభంలోనే అంటే జనవరి 29న జీఎస్ఎల్వీ ఎఫ్ 15 రాకెట్ ద్వారా నావిగేషన్ శాటిలైట్ (ఎన్వీఎస్-02)ను ప్రయోగించారు. మే 18న పీఎస్ఎల్వీ సీ 61 ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్-09)ను ప్రయోగించగా విఫలమైంది. జూలై 30న జీఎస్ఎల్వీ ఎఫ్ 16 ద్వారా ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని, నవంబర్ 2న ఎల్వీఎం3 - ఎం5 రాకెట్ ద్వారా కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంఎస్-03) ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించారు. డిసెంబర్ 24న ఎల్వీఎం - 3 - ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన 6,400 కిలోల అత్యంత బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి ప్రపంచంలో భారత కీర్తిపతాకాన్ని ఎగురవేశారు. ఇస్రో చరిత్రలో ఈ ఏడాది సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రయోగాలు చేసింది. ఇస్రో బాహుబలిగా పేరుగాంచిన ఎల్వీఎం-3 రాకెట్‌ను ఎప్పుడో రెండు మూడేళ్లకు ఒకటి, రెండుసార్లు ప్రయోగించేవారు. అలాంటిది ఈ ఏడాది 52 రోజుల వ్యవధిలో రెండు ప్రయోగాలు చేసి విజయాలను సొంతం చేసుకోవడం ఒక మైలురాయిగా నిలిచింది. ఇస్రో చరిత్రలో ఇప్పటిదాకా రెండువేల కిలోల నుంచి మూడువేల కిలోల బరువైన ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించారు. ఈ ఏడాది ప్రపంచంలో అగ్రరాజ్యంగా వెలుగొందుతున్న అమెరికాకు చెందిన 6,400 కిలోల అత్యంత బరువైన ఉపగ్రహాన్ని వాణిజ్యపరంగా ప్రయోగించి చరిత్ర సృష్టించారు.

లాంచింగ్ సౌకర్యాలు పెరిగినా.. ఆ స్థాయి ప్రయోగాలు లేవు

శ్రీహరికోటలో లాంచింగ్ సౌకర్యాలు విపరీతంగా పెరిగినప్పటికీ ఆ స్థాయిలో రాకెట్ ప్రయోగాలు నిర్వహించడంలో ఇస్రో వెనుకంజలోనే ఉంది. 2022, 2023 సంవత్సరాల్లో ఎనిమిదేసి ప్రయోగాలు చేసిన ఇస్రో 2024, 2025ల్లో అయిదేసి ప్రయోగాలకే పరిమితమైంది. 2020, 2021ల్లో కరోనా మహమ్మారి కారణంగా రెండేసి ప్రయోగాలతో సరిపెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మొదటి ప్రయోగవేదిక మీద ఒకేసారి రెండు రాకెట్లను అనుసంధానం చేసే సౌకర్యాలున్నాయి. రెండో ప్రయోగవేదికకు సంబంధించి రెండు వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లతోపాటు ఎస్ఎస్ఏబీ భవనం కూడా ఉంది. అంటే ఇక్కడ కూడా ఒకేసారి అయిదు రాకెట్లు అనుసంధానం చేసే వీలుంది. ఇక్కడ ఘన ఇంధన మోటార్ల తయారీ సామర్థ్యాన్ని కూడా పెంచారు. ఇన్ని వసతులు మెరుగుపడినా ఆ స్థాయిలో రాకెట్లను ప్రయోగించడంలేదు. ఈ నెల 24న చేసిన ఎల్వీఎం3 - ఎం6 ప్రయోగంతో షార్ నుంచి 104 ప్రయోగాలు పూర్తయ్యాయి. ఇందులో నాలుగు.. ఉపగ్రహాలు లేకుండా ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఈ నెల 24న చేసింది.. ఉపగ్రహాలతో కూడిన వందో ప్రయోగం. వచ్చే మార్చి నాటికి తమిళనాడు తూత్తుకుడి సమీపంలోని కులశేఖరపట్నంలో నిర్మిస్తున్న రాకెట్ ప్రయోగకేంద్రం అందుబాటులోకి రానుంది. పీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలను అక్కడి నుంచే నిర్వహించే అవకాశాలున్నాయి. భారీ ప్రయోగాల కోసం శ్రీహరికోట షార్ కేంద్రాన్ని బలీయమైన శక్తిగా తయారు చేస్తున్నారు. ఇక భవిష్యత్‌లో ప్రతిష్టాత్మకమైన గగన్‌యాన్ అన్‌మ్యాన్ మిషన్, గగన్‌యాన్ మ్యాన్ మిషన్, చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించే ప్రయోగాలతోపాటు సుమారు 10 వేలకిలోల బరువున్న ఉపగ్రహాలను ప్రయోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని సముపార్జించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

2026 ప్రారంభంలోనే పీఎస్ఎల్వీ సీ62 ప్రయోగం!

అన్వేష్ ఉపగ్రహం నమూనా

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ62 ప్రయోగాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ ప్రయోగాన్ని 2026 జనవరి 5న గాని లేదా 10న నిర్వహించేందుకు సిద్ధం చేస్తోంది. ఈ నెల 26న ఈవోఎస్-ఎన్1 (అన్వేష్) ఉపగ్రహం షార్ కేంద్రానికి చేరుకుంది. క్లీన్ రూమ్‌లో శాస్త్రవేత్తలు పరీక్షలు నిర్వహించి రాకెట్‌కు అనుసంధానం చేయనున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు సంబంధించి పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ బిల్డింగ్ (ఫిఫ్)లో నాలుగు దశల పీఎస్ఎల్వీ సీ62 రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేసి తుది విడత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాకెట్ అనుసంధానం తరువాత ఫిఫ్ నుంచి ఎంఎస్టీకి తరలించి అక్కడ ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ప్రయోగంలో ఈవోఎస్-ఎన్1 (అన్వేష్) అనే ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపబోతున్నారు. రాకెట్ ఆఖరి దశ అయిన పీఎస్-4 దశతో స్పెయిన్‌కి చెందిన స్పానిష్ స్టార్టప్ ఆర్బిటల్ పారాడైమ్‌తో ప్రయోగాత్మకంగా ఓ పరీక్షను నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారు. 25 కిలోల బరువైన కెస్ట్రెల్ ఇనీషియల్ డిమాన్‌స్ట్రేటర్ (కేఐడీ) అనే క్యాప్సూల్స్‌ను పీఎస్-4 ద్వారా తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశించడం కోసం దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలో ఒక స్ప్లాష్ డౌన్ జోన్‌ను గుర్తించారు. దీంతో పాటు ఇందులో 18 పేలోడ్స్‌ను కూడా పంపిస్తున్నట్లు ఇస్రో తెలిపింది.

'వాడికేం మగాడు' అనేవారు గతంలో. 'అయ్యో... మగాడు' అనేలా ఉన్నాయి రోజులు అనుకుంటున్నారు పురుషులు. 2025 సంవత్సరం పురుషుడిని మరింత ఒంటరిని చేసిందని పరిణామాలు చెబుతున్నాయి. 'అవతార పురుషుడు', 'ఆపద్బాంధవుడి'గా గతంలో చెప్పబడిన పురుషుడు నేడు సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాడని నిపుణులు అంటున్నారు. 2025లో పురుషుడి స్థితిగతులపై ఓ నజర్.

మెన్ ఇన్ 2025

వచ్చే ఏడాదైనా... మేల్ ఎంచుదాం!

జాతీయ పురుషుల కమిషన్

పురుషుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించే చట్టబద్ధమైన సంస్థను రూపొందించడానికి ఈ ఏడాది తొలి ప్రయత్నం జరిగింది. డిసెంబర్ 6న రాజ్యసభలో పార్లమెంటు సభ్యుడు డాక్టర్ అశోక్ కుమార్ మిట్టల్ 'జాతీయ పురుషుల కమిషన్ బిల్లు'ను ప్రైవేట్ బిల్లుగా ప్రవేశపెట్టారు. పురుషులపై చట్టపరమైన వివక్ష, మానసిక ఆరోగ్య సమస్యలు, కుటుంబ చట్టాలలో పక్షపాతాలు, కొన్ని నేర నిబంధనల దుర్వినియోగాన్ని పరిశీలించడానికి సంస్థాగత యంత్రాంగం కావాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఇలాంటి కమిషన్ ఉండాలని 'భార్యా బాధితులు' ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. 2025లో కొన్ని భరణం కేసులు న్యాయమూర్తులే ఆశ్చర్యపోయే విధంగా కోర్టు ముందుకు వచ్చాయి.

మగాడి కోసం రెండు ప్రయివేటు బిల్లులు

రైట్ టు డిస్ కనెక్ట్ బిల్

మగవారు ఆఫీసులో ఉన్నంత సేపే డ్యూటీ చేసినట్టు కాదు.. ఇంటికొచ్చాక కూడా కాల్స్ అటెండ్ చేస్తూ ఆఫీస్ పని చేస్తూ అదనపు డ్యూటీ చేస్తూనే ఉంటారు. దీనివల్ల కుటుంబంలో కలతలు సర్వసాధారణం. మగవారికే కాదు పురుష/మహిళా ఉద్యోగులందరికీ పని గంటల తర్వాత ఆఫీసుతో డిస్‌కనెక్ట్ అయ్యే హక్కును ప్రతిపాదిస్తూ 'రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్'ను ప్రయివేటు బిల్లుగా 2025లో పార్లమెంట్ మెంబర్ సుప్రియా సూలే ప్రవేశపెట్టారు. అత్యవసర సేవల్లో ఉంటే తప్ప ప్రతి ఉద్యోగంలో ఇలా డిస్‌కనెక్ట్ అయ్యే సౌలభ్యం మగవారికి ఉంటే వారు మరింత క్వాలిటీ లైఫ్‌ను అనుభవించగలరు.

ఆయుష్షు తక్కువ

'నూరేళ్లు వర్ధిల్లు' అనుకోవడమే గాని పురుషుడి ఆయుష్షును తగ్గించే విషయాల గురించి చింత ఉండటం లేదు. తాజా గణాంకాల ప్రకారం దేశంలో మహిళలతో పోలిస్తే పురుషుల ఆయుష్షు నాలుగు సంవత్సరాలు తక్కువ. ఈ గణాంకాల ప్రకారం దేశంలో నగటు ఆయుర్దాయం ఇప్పుడు 70.3 సంవత్సరాలు. యాభై ఏళ్ల క్రితంతో పోలిస్తే 20 ఏళ్ల కంటే ఎక్కువ పెరుగుదల నమోదైంది. కేరళలో 75.1 సంవత్సరాలతో అత్యధికంగా ఉంది. రాష్ట్రాల వారీగా చూస్తే, పురుషుల ఆయుర్దాయం జమ్మూ కాశ్మీర్‌లో 73.4 సంవత్సరాలు కాగా, మహిళలకు కేరళలో 78.4గా ఉంది. అత్యంత తక్కువ ఆయుర్దాయం ఛత్తీస్‌గఢ్‌లో ఉంది. అక్కడ పురుషులకు 62.4 సంవత్సరాలు కాగా, మహిళలకు 67.1 సంవత్సరాలు. పురుషుల మరణాలకు ప్రధాన కారణంగా హృదయ సంబంధ వ్యాధులే కావడం గమనార్హం.

2025 ముగిసి, 2026లోకి అడుగుపెట్టబోతున్నాం. ఈ 365 రోజుల జీవితాన్ని మొత్తం తరచి చూసుకుంటే మీకు ఏమనిపిస్తుంది అని పురుషులని అడిగితే 'అసలు తరచి చూసే అవకాశం, తీరిక మాకెక్కడిదీ' అనేది పురుషుల మాట. హడావిడి, పని ఒత్తిడి, అనారోగ్యం, కుటుంబ బాధ్యతలు, సామాజిక వ్యవహారాలు, ఆర్థిక కష్టనష్టాలు... అన్నీ కలిపి నిమిషం తీరిక లేకుండా చేస్తే ఇక జీవితం ఎలా సాగుతోందో చూసి, అంచనా వేసే అవకాశం ఎలా ఉంటుంది? 2025లో పురుషుల సమస్యల మీద అనేకమంది వైద్య నిపుణులు, సామాజికవేత్తలు గొంతెత్తారు. ఆధునిక జీవనంలో అబ్బాయిల పరిస్థితి అధ్వానంగా మారిందని, సమస్యలు బయటకు చెప్పుకోలేక, లోపల దాచుకోలేక వారు అవస్థ పడుతున్నారని పేర్కొన్నారు. అధ్యయనాలు సైతం ఇదే విషయాన్ని వెల్లడించాయి. రీల్స్‌లో ఒక జోక్... నలుగురు మగవారు 'గోవాకు వెళదాం' అని ప్లాన్ చేస్తూ ఉంటారు. కలిసినప్పుడల్లా గోవా ప్లానే. కాని సంవత్సరాలు గడిచిపోతాయిగానీ గోవాకు మాత్రం వాళ్లు వెళ్లరు. నిజానికి గోవాకు వెళ్లడం పెద్ద విషయం కాదు. తగినన్ని డబ్బులు అందరి దగ్గరా ఉంటున్నాయి. కాని కదల్లేని మెదల్లేని పరిస్థితులు నేడు పురుషుడి కనీస సరదాలను కూడా తీర్చడం లేదు. 'మగాళ్లు పైలాపచ్చీసు'గా తిరుగుతుంటారు అనేది పాతమాట. కనీసం రెండురోజుల లీవ్ దొరకని ఉద్యోగాల్లో వాళ్లు ఒళ్లు హూనం చేసుకుంటున్నారని ఎవరికి తెలుసు?

పాపం ఒక్కడు

అవును! ఇంటికి అతను ఒకే ఒక్కడు. ఉమ్మడి కుటుంబాలు పోయి దేశంలో చిన్న కుటుంబాల వ్యవస్థ మొదలైన తర్వాత భార్య, భర్త, ఇద్దరు పిల్లలు అనే సంస్కృతి పెరిగింది. ఈ నేపథ్యంలో మగవాడు భర్త బాధ్యతనంతా భుజాన వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భార్య అతనికి సహకరిస్తున్నా పని ఒత్తిడి, బాధ్యతలు నిమిషం ఖాళీగా ఉంచడం లేదని నిపుణులు అంటున్నారు. పనులు పంచుకునే వారు లేక, కాసింత విశ్రాంతి దొరకక చాలామంది మానసిక సమస్యల బారిన పడుతున్నారని అంటున్నారు. 2025లో పురుషుల మానసిక సమస్యల గురించి శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి హెల్త్ ఎక్స్‌పర్ట్‌లు హెచ్చరికలు జారీ చేశారు.

★★★

కాలుష్యం అతడికే... జరిమానాలు అతడికే...

పురుషుడు పని చేయాలంటే కాలు బయట పెట్టాలి. బయట అడుగు పెడితే కాలుష్యం, దుమ్ము, ధూళీ, ట్రాఫిక్.... ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండే మన దేశంలో అత్యధిక పురుషులు టూ వీలర్ల మీద తిరుగుతూ కాలుష్యం బారిన పడుతున్నారు. ఫలితంగా జుట్టు రాలిపోవడం వీరి సమస్య. చూపు మందగించడం, చర్మం ముడతలు పడిపోవడం వంటి సమస్యలకు లెక్కలేదు. వేళ కాని వేళల్లో ఆహారం తీసుకోవడం వంటి కారణాలతో చాలామంది పురుషులు చిన్నవయసులోనే బీపీ, డయాబెటిస్ బారిన పడుతున్నారు. గ్యాస్ట్రిక్ సమస్యలు పురుషుల్లో సర్వ సాధారణం. ఇక వీరు ట్రాఫిక్ జరిమానాల బారిన పడుతూ అవి కట్టలేక చేసే ఆర్తనాదాలకు అంతు లేదు.

బెట్టింగ్ బర్‌బాదీ

బెట్టింగ్ యాప్స్ ఎరకు చిక్కుకున్న పురుషుల పెను విషాదాలు 2025లో అత్యధికం చోటు చేసుకున్నాయి. మద్యం, డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకున్నవారు కూడా సులభ దారుల్లో డబ్బు వస్తుందని బెట్టింగ్ యాప్స్‌కు చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో యువకులు ఎక్కువ ఉంటే సైబర్ మోసగాళ్ల చేత చిక్కి వారు పెట్టమన్న చోట పెట్టుబడులు పెట్టి కోట్లు నష్టపోయిన వారిలో అనుభజ్ఞులైన ప్రొఫెషనల్స్ ఉన్నారు. జీవన తాత్త్వికత, జీవన సౌలభ్యాలు తెలుసుకోకుండా అసలు ఎటువంటి వివేచనాపూరిత ఆలోచనలు లేకుండా ఎక్కువ సంఖ్యలో పురుషులు ఉంటూ మూక స్వభావంతో జీవితాలను కష్టాల్లోకి నెట్టుకుంటున్నారు.

గడ్డం పురుష లక్షణం

ఎన్ని చెప్పుకున్నా ఇప్పటికీ ఇది పురుష ప్రపంచమే. పురుషులే ఆకర్షక శక్తులుగా నిలిచే ఆనవాయితీ పోలేదు. ఒకప్పుడు పురుషులు శుభ్రంగా గడ్డం గీసుకుని కనిపించేవారు. ఇప్పుడు గడ్డం కలిగి ఉండటం పురుష లక్షణంగా మారింది. 2025లో బారు గడ్డాల సౌందర్యంతో రణబీర్ కపూర్, రణధీర్ కపూర్‌తో మొదలు రామ్‌చరణ్, జూ.ఎన్టీఆర్, విజయ్ దేవరకొండతో సహా విరాట్ కోహ్లీతోపాటుగా హల్‌చల్ సృష్టించారు. ప్రస్తుతం 'వారణాసి' కోసం మహేష్ బాబు కూడా గడ్డం పెంచారు. ప్రపంచవ్యాప్తంగా నెట్‌లో అత్యధికులు సెర్చ్ చేసిన వ్యక్తి స్త్రీ కాదు. అమెరికన్ గాయకుడు–గేయరచయిత డేవిడ్ ఆంటోనీ బర్క్ (D4vd). మనదేశంలో అత్యధికంగా సెర్చ్ చేసిన వ్యక్తుల్లో మొదటి ఐదుగురిలో నలుగురు మగవారే కావడం విశేషం. వారిలో తొలిస్థానం యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ కాగా, ఆ తర్వాతి స్థానాల్లో క్రికెటర్లు ప్రియాంశ్ ఆర్య, అభిషేక్ శర్మ, షేక్ రషీద్ ఉన్నారు.

ఎవరికీ చెప్పుకోలేక

'మగవాడివి.. నువ్వు ఏడవకూడదు' అని చిన్ననాటి నుంచి వినే మాటలు, ఇంటా బయటా నూరిపోసే పురుష అహం ఆ సమయానికి బాగున్నా వయసు పెరిగే కొద్దీ పురుషులను సతమతం చేస్తున్నాయి. దీంతో ఎంత కష్టం వచ్చినా బయటకి చెప్పుకోలేక, ఇతరులతో పంచుకోలేక నలిగిపోతున్నారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది జరిగిన అధ్యయనాల్లో అనేకమంది పురుషులు తమ తమ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, చిన్న చిన్నవి బయటకు చెప్పుకుంటే పరువు పోతుందనో, ఎగతాళి చేస్తారనో లోలోపలే దాచుకొని కుమిలిపోతున్నారని తేలింది. ఉదాహరణకు ఇంట్లో అవమానకరమైన, సూటిపోటి మాటలు ఎదురవుతుంటే ఆ పురుషుల బాధ వర్ణనాతీతంగా ఉంది.

అనూహ్యమైన ఆమె

భార్యాభర్తల అనుబంధం భారతీయ సంస్కృతిలో ఎంతో ముఖ్యమైనది. దాని కోసం స్త్రీ, పురుషులిద్దరూ ఎన్నో త్యాగాలకు, సర్దుబాట్లకు సిద్ధమవుతూనే ఉంటారు. అయితే గతంలో గృహహింసలో మగవారి పాత్ర వార్తల్లోకి ఎక్కేది. ఇప్పుడు స్త్రీ హింస వార్తలుగా కనిపించడం మగవారికి బెంబేలు పుట్టిస్తోంది. భర్తల ప్రాణాలకు భార్య వల్ల ముప్పు ఏర్పడే పరిస్థితి రావడం 2025లో ఎక్కువ సంఘటనల వల్ల కనిపించిన సామాజిక విషాదం. ఇంత ప్రమాదం అరుదే అయినా భార్య నుంచి వేధింపులు, ఆమె కుటుంబసభ్యుల నుంచి బెదిరింపులు ఇటీవల పెరిగాయని పురుషులు చేస్తున్న ఆరోపణ. నకిలీ వేధింపులు కేసులు, వరకట్న కేసులు వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విడాకుల కోసమో, మరే కారణం చేతనో సూటిపోటి మాటలు అనడం వల్ల ఆత్మహత్యలకు పాల్పడే పురుషుల సంఖ్య పెరిగింది.

ఒక ఉద్యోగం చాలదు

ఒక ఉద్యోగానికే సమయం సరిపోకపోతే ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు, ఇంటి స్థలాలు– ఇళ్ల ధరలు, ఇళ్ల అద్దెలు మగవాణ్ణి మరో ఉపాధిని కూడా వెతుక్కునే అగత్యానికి నెడుతున్నాయి. ఏ.ఐ ప్రవేశం తర్వాత ఉద్యోగాలు పోతాయన్న హెచ్చరికలు వారిని అభద్రతలో నెడుతున్నాయి. అప్పులు చేసి, వడ్డీలు కట్టక తప్పని పరిస్థితో ఈఎంఐలకు చిక్కుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాల్లోని పురుషులు ఈ ఇబ్బందిని తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. కొందరు ఉద్యోగంతోపాటు పార్ట్‌టైం ఉద్యోగాలూ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఊబర్, ఓలా సర్వీసుల్లో ఇలాంటి మగవారు ఎందరో కనిపిస్తున్నారు. రాత్రిళ్లు నిద్ర కాచి పని చేస్తున్నారు.

● రివైండ్: 2025

నైపుణ్యం కొద్దీ పురుషుడు

'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అన్నాడు కవి. 'పుణ్యం' మాత్రమే కాదు 'నైపుణ్యం'తోనూ ఈ సంవత్సరం వార్తల్లో నిలిచిన పురుషోత్తములు వీరు. బంజరు భూమిని పచ్చని అడవిగా మార్చిన ప్రొఫెసర్ శంకర్‌లాల్, తమ ప్రతిభాపాటవాలతో దిగ్గజసంస్థలు యాపిల్‌లో సీవోవోగా, టెస్లాలో సీఎఫ్‌ఓగా సత్తా చాటుతున్న సబీఖాన్, వైభవ్ తనేజా వరకు... అంకితభావానికి, నైపుణ్యం జోడించిన స్ఫూర్తిదాయక పురుషోత్తముల గురించి...

అతడు అడవిని సృష్టించాడు!

'అయ్యో!' అని బాధకే పరిమితమై ఉంటే అతడు అడవిని సృష్టించి ఉండేవాడు కాదు. ఇండోర్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌లాల్ గార్గ్ స్థలంలో 2019లో జరిగిన అగ్నిప్రమాదంలో వెయ్యి వరకు చెట్లు బూడిదయ్యాయి. ఆ కన్నీళ్ల నుంచే శంకర్‌లాల్ 'నేను అడవిని సృష్టించాలి' అనే కల కన్నారు. ఆ కలను సాకారం చేసుకోవడానికి లేటు వయసులోనూ రాత్రనక పగలనక కష్టపడ్డారు. సంవత్సరాల అతడి శ్రమ ఫలించింది. ఆ బంజరు భూమిలో ఇప్పుడు 40,000 చెట్లు కనిపిస్తున్నాయి. ''ఆ ప్రాంతంలోని తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటికొరత వల్ల మొదటి దఫా దాదాపు వందమొక్కలు మాత్రమే నాటాను. రోజూ నేనే వాటికి నీరు పోసేవాడిని. కొన్నిరోజుల్లో ఆ మొక్కలు పెరగడం నాకు సంతోషాన్నిచ్చింది. క్రమంగా, మొక్కలు రాళ్లలో తమదైన స్థలాన్ని ఏర్పర్చుకున్నాయి. ఇది ప్రాథమిక ప్రకృతి ధర్మం' అంటున్నారు 75 ఏళ్ల గార్గ్.

'హోప్' మొదలైంది...

'శాస్త్రసాంకేతిక విషయాలు శాస్త్రవేత్తలకు మాత్రమే పరిమితం కాదు. సామాన్యులు కూడా వాటి గురించి లోతుగా తెలుసుకోవాలి, అంతరిక్ష పరిశోధనలు తమ జీవితాలకు ఎలా ప్రయోజనం చేకూరుస్తాయో తెలుసుకోవాలి' అంటున్న నాసా మాజీ హార్డ్‌వేర్ ఇంజినీర్ సిద్ధార్థ్ పాండే 'ప్రోటో ప్లానెట్' స్టేషన్‌కు సంబంధించి కీలకంగా వ్యవహరిస్తున్నారు. తాజా విషయానికి వస్తే...పాండే బృందం లద్దాఖ్‌లోని పోకార్ లోయలో ప్రారంభ వెంచర్ హోప్ (హిమాలయన్ అవుట్‌పోస్ట్ ఫర్ ప్లానెటరీ ఎక్స్‌ప్లోరేషన్)కు శ్రీకారం చుట్టింది. దీనిని ఇస్రో హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (హెచ్‌ఎస్‌ఎఫ్‌సీ)తో సంయుక్తంగా అభివృద్ధి చేశారు. వాతావరణ మార్పులు మానవ శరీరంపై కలిగించే ప్రభావం గురించి అధ్యయనం చేయడం ఈ మిషన్ ప్రాథమిక లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వ్యోమగాములకు, విద్యార్థులకు కీలకమైన డేటాను అందించే పరిశోధన ఇది. 'లద్దాఖ్‌లో స్టేషన్ నిర్వహించడం ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. ప్రతి విషయంలో జాగ్రత్తగా ఉన్నాం. ఏది నిర్మించినా అది స్థిరంగా ఉండేలా చూడాలనుకున్నాం. ఐఐటీ–మద్రాస్, ఐఐటీ–ముంబై. ఐఎస్‌టీ–తిరువేంద్రం, యూనివర్శిటీ ఆఫ్ మల్టా, హోప్ నుంచి డేటా సేకరించడానికి ఆసక్తి చూపుతున్నాయి' అంటున్నారు పాండే.

కరెంట్ బిల్లు తగ్గించేలా...

విద్యుత్ వృథాను అరికడితే 'కరెంట్ బిల్లు' తేలిక అవుతుంది కదా! అని ఆలోచించారు బెంగళూరుకు చెందిన భరత్ రంక్వాత్. విద్యుత్ వృథాను అరికట్టే స్మార్ట్ ఎనర్జీ సిస్టమ్‌ను వృద్ధి చేశారు. 'ఎనలాగ్' అనే ఈ స్మార్ట్ అప్లికేషన్ విద్యుత్ వృథాను అరికట్టి బిల్లు భారాన్ని తగ్గించడం లో వినియోగదారులకు ఉపయోగపడుతోంది.

టెస్లా వైభవం... తనేజ



'ఎవరీ వైభవ్ తనేజా?' అనుకునేలా చేశారు వైభవ్ తనేజా. అపరకుబేరుడు ఎలాన్ మస్క్ 'టెస్లా' చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో)గా ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. చార్టర్డ్ ఎకౌంటెంట్ (సీఏ) అయిన వైభవ్ 2017లో టెస్లా 'సోలార్‌సిటీ'లో చేరి ఫైనాన్స్‌కు సంబంధించి వివిధ హోదాల్లో పనిచేశారు. దిల్లీ యూనివర్శిటీలో బీ.కామ్, ఆ తరువాత సీఏ చేసిన వైభవ్ 'సోలార్‌సిటీ'కి ముందు మల్టీనేషనల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ నెట్‌వర్క్ 'పీడబ్ల్యూసీ'లో పనిచేశారు. సీఎఫ్‌వోకి ముందు కార్పొరేట్ కంట్రోలర్, చీఫ్ ఎకౌంటింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఏడాదికి రూ.1200 కోట్ల జీతం తీసుకుంటున్న వ్యక్తిగా సంచలనం సృష్టించారు. ఈ సంవత్సరం ఎలాన్ మస్క్‌కు చెందిన 'అమెరికన్ పార్టీ'లో ట్రెజరర్‌గా నియామకం అయ్యారు. 'వైభవ్ నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతారు. ప్రతిభ ఉంటే త్వరగా పై స్థాయికి వెళ్లవచ్చు అని చెప్పడానికి వైభవ్ నిలువెత్తు నిదర్శనం' అంటారు ఆయనతో పనిచేసిన వారు.

సత్తా చాటే సైనికుడు...



దిగ్గజ సంస్థ 'యాపిల్' చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో)గా ఈ సంవత్సరం ప్రపంచ దృష్టిని ఆకర్షించారు సబీఖాన్. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో అయిదవ తరగతి వరకు చదువుకున్నాడు ఖాన్. ఆ తర్వాత వారి కుటుంబం సింగపుర్‌కు, అక్కడి నుంచి అమెరికాకు వెళ్లింది. మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసిన ఖాన్ 1995లో యాపిల్‌లో చేరారు. 2019లో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) అయ్యారు. 'మాన్యుఫాక్చరింగ్‌కు సంబంధించి యాపిల్ విస్తరణలో ఖాన్ కృషి ఉంది. ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను తీర్చిదిద్దారు' అంటారు యాపిల్ సీఈవో టిక్ కుక్. యాపిల్‌లో ఎంతో మంది సాంకేతిక నిపుణులు, ప్రతిభావంతులతో కలిసి పనిచేసిన ఖాన్‌కు 'నమ్మకమైన సైనికుడి'గా పేరు.

ఛేంజ్ మేకర్స్ 2025

Rewind

★ అంజ్లీ అగర్వాల్

డాక్టర్ అంజ్లీ అగర్వాల్‌కు జీవితంలో ఎదురైన లోతైన బాధలెన్నో తెలుసు. కండరాల బలహీనతతో చక్రాల కుర్చీలో జీవిస్తున్నారామె. బహిరంగ స్థలాల్లో ర్యాంప్ లేకపోవడం వల్ల అవస్థ పడుతున్న తనలాంటి వేలమంది దివ్యాంగుల కోసం ఆమె పోరాటం సాగిస్తున్నారు. ఆమె, ఆమె బృందం కలిసి వందలాది ప్రజా స్థలాలకు పునః రూపకల్పన చేశారు. ర్యాంప్ ఉండటం వల్ల దివ్యాంగులు సౌకర్యవంతంగా ప్రయాణించగలరని అధికారులకు అవగాహన కల్పించారు.

★ డయానా పుండోల్

32 ఏళ్ల ఈ ఇద్దరు పిల్లల తల్లి మోటార్ రేసింగ్‌లో మొదటి మహిళా జాతీయ ఛాంపియన్. ఆమె 2024లో ఎంఆర్‌ఎఫ్ ఇండియన్ నేషనల్ కార్ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. పురుషులు–ఆధిపత్యం వహించే ఈ క్రీడలో స్త్రీల నుంచి ఇదో పెద్ద ముందడుగు. ఇప్పుడు 2025 –2026 ఫెరారీ క్లబ్ ఛాలెంజ్ మిడిల్ ఈస్ట్ సిరీస్‌లో పోటీ పడుతున్న మొదటి భారతీయ మహిళగా నిలిచారు, ఫెరారీ 296 ఛాలెంజ్ కారును నడుపుతున్నారు. ఒకప్పుడు ఉపాధ్యాయురాలిగా పనిచేసి, ఇప్పుడు రేసింగ్‌లో ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

★ బీబీ జాన్

కర్నాటకకు చెందిన బీబీ జాన్ చిన్నపాటి లోన్ కోసం బ్యాంక్ వెళితే తన లాంటి వాళ్లకు లోన్ రావడం ఎంత కష్టమో తెలియడమే కాకుండా తన లాంటి వాళ్లు చాలామంది లోన్ల కోసం బాధలు పడుతున్నారని అర్థమైంది. దాంతో ఆమె స్థానిక స్వయం సహాయక సంఘానికి నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చి 14 మంది సభ్యుల బృందంతో మొదలుపెట్టి నేడు 1,000 మందికి పైగా మహిళల సమష్టి ఎదుగుదలకు కారణమయ్యారు. వారంతా స్వంత మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నడుపుతూ సేంద్రీయ, వాతావరణ–స్థిరమైన పద్ధతులను ఉపయోగించి 30 గ్రామాలలో వ్యవసాయం చేస్తున్నారు.

● ముగ్గు ముచ్చట

29 చుక్కలు, 7 వరుసలు చుక్క వదిలి చుక్క 7 వచ్చే వరకు

బాలం దేవి
ఉండ్రాజవరం
పశ్చిమ గోదావరి జిల్లా



23 చుక్కలు 1 వచ్చే వరకు

పి. ప్రణతి, ఆర్.ఎస్.నగర్
కోదాడ, సూర్యాపేట జిల్లా

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
డిసెంబర్ 29న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,42,910	1,43,220	1,40,400	1,43,220	1,42,300	1,42,030
బంగారం (22 క్యారెట్లు)	1,28,610	1,29,900	1,28,700	1,33,800	1,30,920	1,30,200
వెండి	2,25,000	2,58,000	2,81,000	2,58,100	2,46,000	2,81,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి... నేడు శ్రీలంకతో ఐదో టి20 మ్యాచ్

తిరువనంతపురం: ఈ ఏడాదిని క్లీన్‌స్వీప్‌తో ముగించేందుకు భారత మహిళల టి20 క్రికెట్ జట్టు విజయం దూరంలో ఉంది. శ్రీలంక జట్టుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చివరి టి20 మ్యాచ్ ఈరోజు జరగనుంది. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో పూర్తి ఆధిపత్యం చలాయిస్తున్న హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీదుంది. మరోవైపు క్లీన్‌స్వీప్ తప్పించుకోవాలని, ఒక్క విజయంతోనైనా పరువు దక్కించుకోవాలని శ్రీలంక భావిస్తోంది. అయితే అన్ని రంగాల్లో విఫలమవుతున్న చమరి ఆటపట్టు సారథ్యంలోని శ్రీలంక ఆఖరి మ్యాచ్‌లో ఎలాంటి ప్రదర్శన ఇస్తుందో వేచి చూడాలి. వచ్చే ఏడాది జూన్–జూలైలో ఇంగ్లండ్ వేదికగా జరిగే టి20 ప్రపంచకప్ టోర్నీకి ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలుపెట్టిన టీమిండియా త్వరలో మరో రెండు టి20 సిరీస్‌లు (ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లతో) ఆడనుంది.

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కొంచెం మోదం... కొంచెం ఖేదం

2025లో అంతర్జాతీయ వేదికపై భారత్ క్రీడలకు మిశ్రమ ఫలితాలు

పురుషుల హాకీ, బ్యాడ్మింటన్, షూటింగ్ ప్రతీ సంవత్సరం తరహాలోనే 'సమ్'తృప్తిని పంచాయి. చెస్‌లో మహిళల వరల్డ్ కప్ టైటిల్‌తో కాస్త అదనపు ఆనందం దక్కితే, ఆర్చరీ, బాక్సింగ్‌లలో ఫర్వాలేదనిపించే ఫలితాలు వచ్చాయి. ఫుట్‌బాల్, టెన్నిస్ ఎప్పటిలాగే నిరాశను పంచితే... వెయిట్ లిఫ్టింగ్‌లో కొత్త తరం విజయాలు అందించలేకపోయింది. నీరజ్ చోప్రా తన స్థాయికి తగినట్లు పతకం తేలేక ప్రపంచ వేదికపై నిరాశ పర్చడం అనూహ్య ప్రదర్శనగా మిగిలిపోయింది. 2025లో క్రికెటేతర క్రీడల్లో భారత ఆటగాళ్లు అటు టీమ్ ఈవెంట్లలో, ఇటు వ్యక్తిగత క్రీడాంశాల్లోనూ మిశ్రమ ప్రదర్శన కనబర్చారు. ప్రపంచ వేదికపై ఓ ఆటగాడిని శిఖరాన నిలిపే అసాధారణ ప్రదర్శన లేదా అద్భుత క్షణాలు మాత్రం చెప్పుకోదగ్గవి ఏవీ రాలేదు. ఈ ఏడాది భిన్న క్రీడాంశాల్లో భారత ఆటగాళ్ల ప్రదర్శనను సమీక్షిస్తే... –సాక్షి క్రీడా విభాగం

హాకీ: భారత పురుషుల జట్టు ఆసియా కప్‌లో విజేతగా నిలిచి వచ్చే ఏడాది జరిగే ప్రపంచ కప్‌కు అర్హత సాధించడం చెప్పుకోదగ్గ విశేషం. అయితే ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ టోర్నీలో పేలవ ప్రదర్శనతో జట్టు ఎనిమిదో స్థానంతో ముగించింది. మహిళల హాకీ జట్టు ప్రదర్శన అయితే మరీ పేలవంగా ఉంది. చెప్పుకోదగ్గ విజయం ఒక్కటీ దక్కకపోగా...ప్రో హాకీ లీగ్‌లో దిగువ స్థానానికి పడిపోయింది.

ఫుట్‌బాల్: భారత ఫుట్‌బాల్ చరిత్రలో మరో చెత్త సంవత్సరంగా ఇది మిగిలిపోనుంది. అతి చిన్న జట్ల చేతుల్లో ఓడిపోవడంతోపాటు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరింత దిగువకు పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 127వ ర్యాంక్‌లో ఉన్న టీమ్ చివరకు వచ్చేసరికి 142వ ర్యాంక్‌తో ముగించింది. మహిళల జట్టు కొంత మెరుగ్గా ఆడటం విశేషం. క్వాలిఫికేషన్ టోర్నమెంట్ గెలవడం ద్వారా 2026 ఆసియా కప్‌కు భారత మహిళలు అర్హత సాధించారు.

బోపన్న

టెన్నిస్: పురుషుల టెన్నిస్‌లో భారత్‌కు సంబంధించి చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. ఏ ఒక్కరు కూడా టాప్-200 ర్యాంకింగ్స్‌లోకి వెళ్లలేకపోగా, చాలెంజర్ టూర్‌లో సింగిల్స్ విభాగంలో ఒక్కరూ కనీసం ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయారు. ఏటీపీ టూర్ డబుల్స్‌లో యూకీ బాంబ్రీ దుబాయ్ ఓపెన్ గెలవగా, రిత్విక్ బొల్లిపల్లి చిలీ ఓపెన్ సాధించాడు. డేవిస్ కప్‌లో స్విట్జర్లాండ్‌ను ఓడించి భారత్ 2026 డేవిస్ కప్ క్వాలిఫయర్ దశకు అర్హత సాధించగా... బిల్లీ జీన్‌కింగ్ కప్‌లో భారత్ ప్లే ఆఫ్స్ దశ వరకు వెళ్లగలిగింది. వర్ధమాన క్రీడాకారిణుల్లో శ్రీవల్లి రష్మిక, మాయ చక్కటి ఆటతో అందరి దృష్టిలో పడినా... ఫలితాలపరంగా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. సీనియర్ డబుల్స్ స్టార్, రెండు గ్రాండ్‌స్లామ్‌ల విజేత రోహన్ బోపన్న ఈ ఏడాది ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు.

దివ్య

చెస్: మహిళల చెస్ వరల్డ్ కప్‌లో భారత్‌కు చెందిన దివ్య దేశ్‌ముఖ్ చాంపియన్‌గా, కోనేరు హంపి రన్నరప్‌గా నిలవడం ఈ ఏడాది చదరంగంలో చెప్పుకోదగ్గ విశేషం. వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాతి ఏడాది గుకేశ్ కెరీర్ పడుతూ, లేస్తూ సాగింది. 'ఫిడే' వరల్డ్ కప్‌లో, ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్‌లో అతను విఫలమయ్యాడు. అయితే నార్వే ఓపెన్‌లో దిగ్గజం కార్ల్‌సన్‌పై సాధించిన గెలుపు చిరస్మరణీయంగా నిలిచింది. స్వదేశంలో జరిగిన వరల్డ్ కప్‌లో ప్రజ్ఞానంద, అర్జున్, నిహాల్, విదిత్, హరికృష్ణ విఫలం కాగా...'ఫిడే' సర్క్యూట్‌లో గెలిచి ఎట్టకేలకు ప్రజ్ఞానంద క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించగలిగాడు. ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కోనేరు హంపి, ఇరిగేశి అర్జున్ కాంస్య పతకాలతో మెరిశారు. ఈ ఒక్క ఏడాదే భారత్ నుంచి ఆరుగురు కొత్త 'గ్రాండ్‌మాస్టర్లు' రావడం విశేషం.

శీతల్ దేవి

ఆర్చరీ: భారత్‌కు సంబంధించి ఆర్చరీలో ఈ ఏడాది గుర్తుంచుకోదగ్గ విధంగా సాగింది. నాలుగు ప్రపంచకప్‌లలో కలిపి భారత ఆర్చర్లు మొత్తం 15 పతకాలు గెలుచుకున్నారు. 2025 ప్రపంచ కప్ పతకాల పట్టికను భారత్ నాలుగో స్థానంతో ముగించింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం గెలుచుకుంది. ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో 10 పతకాలతో అగ్రస్థానం సాధించడం విశేషం. వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో శీతల్ దేవి స్వర్ణంతో మెరిసింది.

బ్యాడ్మింటన్: భారత షట్లర్లు అంతర్జాతీయ వేదికపై మెరుగైన ప్రదర్శన కనబర్చారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడి కాంస్యం గెలుచుకోవడం ఈ ఏడాది హైలైట్ కాగా బీడబ్ల్యూఎఫ్ టూర్‌లో మరో మూడు టైటిల్స్ మన ఆటగాళ్ల ఖాతాలో చేరాయి. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను లక్ష్య సేన్, యూఎస్ ఓపెన్‌ను ఆయుశ్ శెట్టి గెలుచుకోగా... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడి సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

నీరజ్

అథ్లెటిక్స్: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరో ఏడాదిని తన పేరిట లిఖించుకున్నాడు. పారిస్ డైమండ్ లీగ్, పోష్‌స్ట్రూమ్ ఇన్విటేషనల్, కుసోసిన్స్కీ మెమోరియల్, గోల్డెన్ స్పయిక్ ఒస్ట్రావా, నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్లలో (మొత్తం ఐదు) నీరజ్ విజేతగా నిలిచాడు. ఫైగా కెరీర్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్‌ను కూడా (దోహా డైమండ్ లీగ్‌లో) అతను దాటడం మరో విశేషం. అయితే దురదృష్టవశాత్తూ 2025 వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చోప్రా పతకం గెలవకుండా వెనుదిరగడం మాత్రం నిరాశ కలిగించిన అంశం. మరోవైపు ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు 8 స్వర్ణాలు సహా మొత్తం 24 పతకాలు గెలుచుకున్నారు.

అంతిమ్

రెజ్లింగ్: 2025 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఏకైక పతకాన్ని గెలుచుకుంది. మహిళల 53 కేజీల విభాగంలో అంతిమ్ ఆ ఘనతను సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో మన దేశం 10 పతకాలు గెలుచుకుంది. తాను రిటైర్మెంట్‌ను వీడి మళ్లీ రెజ్లింగ్ బరిలోకి దిగుతున్నట్లు స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఏడాది చివర్లో ప్రకటించింది. సీనియర్లతో పోలిస్తే ప్రపంచ అండర్-20, అండర్-23 ఈవెంట్లలో మన రెజ్లర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చి భవిష్యత్తుపై ఆశలు రేపారు.

మనుష్, దియా

టేబుల్ టెన్నిస్: వరల్డ్ టీటీ టూర్‌లో భారత ఆటగాళ్లు రెండు టైటిల్స్ సాధించగలిగారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో దియా-మనుష్ జోడీ ట్యూనిస్ కంటెండర్ టోర్నీని, పురుషుల డబుల్స్‌లో సత్యన్-ఆకాశ్ ద్వయం లాగోస్ కంటెండర్ టోర్నీని సొంతం చేసుకున్నారు. ఆసియా టీటీ చాంపియన్‌షిప్‌లో కనీసం ఒక్క పతకమైనా గెలుచుకోవడంలో భారత ప్యాడ్లర్లు సఫలం కాలేకపోయారు. పురుషుల టీమ్ 11వ, మహిళల టీమ్ 12వ ర్యాంక్‌తో ఈ ఏడాదిని ముగించింది.

సురుచి

షూటింగ్: ఈ ఏడాది షూటింగ్‌లో భారత్ ప్రదర్శన సంతృప్తికరంగా సాగింది. అన్ని ప్రపంచకప్‌లలో కలిపి 11 స్వర్ణాలు సహా మొత్తం 28 పతకాలు గెలుచుకున్న భారత్... ఓవరాల్‌గా రెండో స్థానంతో ముగించింది. వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో కూడా మన షూటర్లు మొత్తం 13 పతకాలు అందించారు. ఈ ఏడాది కొత్తగా వెలుగులోకి వచ్చి వేర్వేరు టోర్నీల్లో సత్తా చాటిన షూటర్‌గా సురుచి సింగ్ (మహిళల పిస్టల్)కు గుర్తింపు లభించింది.

వెయిట్‌లిఫ్టింగ్: వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ మహిళల 48 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకాన్ని గెలుచుకుంది. స్వదేశంలో జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఇవి మినహా ఈ క్రీడాంశంలో భారత్ నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ లేదు.

నిఖత్

బాక్సింగ్: వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ 4 పతకాలు గెలుచుకుంది. వరల్డ్ బాక్సింగ్ కప్ సిరీస్‌లో భారత్ 3 ప్రపంచ కప్‌లలో కలిపి 13 స్వర్ణాలు సహా మొత్తం 40 పతకాలు సాధించడం విశేషం. తెలంగాణ బాక్సర్ నిఖత్ కూడా పసిడి పతకం నెగ్గింది.

కార్ల్‌సన్‌పై అర్జున్ విజయం | 7 పరుగులకు 8 వికెట్లతో భూటాన్ బౌలర్ రికార్డు
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

నాగార్జున

చలో కేరళ

కేరళ కాలింగ్ అంటున్నారట హీరో నాగార్జున. ఆయన కెరీర్‌లోని వందో సినిమా 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఆర్.ఏ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. కాగా ఈ సినిమా కోసం ఓ షెడ్యూల్‌ని కేరళలో ప్లాన్ చేశారట మేకర్స్. ఇందుకోసం నాగార్జున త్వరలోనే కేరళ వెళ్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. జనవరి మొదటివారంలో కేరళ షెడ్యూల్ స్టార్ట్ అవుతుందట. నాగార్జునపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని టాక్. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్న ఈ సినిమా 2026లో విడుదల అవుతుందని తెలిసింది.

మన టైమ్ స్టార్ట్ అయ్యింది

ప్రభాస్

'నానమ్మ.. ఈ ప్రపంచంలో నీకు అన్నీ మర్చిపోయే రోగం ఉన్నా.. ఆయన్ను మాత్రం అస్సలు మర్చిపోవు..' అనే డైలాగ్‌తో ప్రారంభం అవుతుంది 'ది రాజాసాబ్' సినిమా ట్రైలర్. ప్రభాస్ హీరోగా నటించిన సినిమా 'ది రాజాసాబ్'. నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటించారు. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న రిలీజ్ కానుంది. సోమవారం 'ది రాజాసాబ్ 2. ఓ' అంటూ కొత్త ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'గంగమ్మ..', 'మన టైమ్ స్టార్ట్ అయ్యింది.. లవ్ యూ..', 'అలాగే రాజాసాబ్', 'రేయ్ కనకరాజు.. నాకు నీ గురించి తెలుసుకోవాలని ఉంది', 'నిన్ను చాలా మిస్ అవుతున్నా', 'మిస్ యూ టు రాజాసాబ్', 'వేరే వరల్డ్‌ని సృష్టించుకుని, ఆ వరల్డ్‌లో మనం ఉండి, ఇక్కడ వాడితో యుద్ధం చేయాలి'... వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. సంజయ్ దత్, బొమన్ ఇరానీ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: తమన్.ఎస్.

పెళ్లి తేదీ ఫిక్స్

అల్లు శిరీష్, నయనిక

నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు అర్జున్ సోదరుడు, హీరో అల్లు శిరీష్ పెళ్లి తేదీ ఫిక్స్ అయింది. నయనికతో మార్చి 6న ఆయన ఏడడుగులు వేయనున్నారు. అల్లు శిరీష్-నయనికల నిశ్చితార్థం అక్టోబరులో జరిగింది. అయితే సోమవారం తన పెళ్లి తేదీని ప్రకటించారు శిరీష్. 2026 మార్చి 6న తన పెళ్లి జరుగుతుందని చెప్పారాయన. తన అన్న కుమారుడు అల్లు అయాన్, కుమార్తె అర్హాలతో కలిసి ఓ రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు శిరీష్. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని అయాన్, అర్హాలు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ బదులివ్వడం రీల్‌లో కనిపించింది. అయితే ఈ పెళ్లి ఎక్కడ జరుగుతుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇదిలా ఉంటే.. అల్లు అర్జున్- స్నేహారెడ్డి వివాహం కూడా 2011 మార్చి 6నే జరగడం విశేషం.

మాస్ అప్పలసూరి

జగపతిబాబు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పెద్ది'. జాన్వీకపూర్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ మూవీలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన నటిస్తున్న అప్పలసూరి పాత్రని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''హైలీ యాంటిసిపేటెడ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'పెద్ది'. జగపతి బాబు చేస్తున్న అప్పలసూరి పాత్ర సినిమాలోని గ్రామీణ నేపథ్యానికి పర్ఫెక్ట్ యాప్ట్. మునుపెన్నడూ చూడని అవతార్‌లో కనిపిస్తూ తన రఫ్ లుక్‌కు మరింత వన్నె తెచ్చారాయన. ఆయన లుక్ కఠినమైన వ్యక్తిత్వాన్ని, అప్పలసూరి పాత్ర డెప్త్‌ని ఇంటెన్స్‌గా ప్రజెంట్ చేశాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 27న రిలీజ్ కానుంది.

క్రేజీ ప్రాజెక్ట్

ఆది సాయికుమార్, రాజేష్ దండా

ఆది సాయికుమార్ హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. హాస్య మూవీస్ అధినేత, రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఆది హీరోగా నటించిన 'శంబాల' చిత్రం ఈ నెల 25న విడుదలైంది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో ఆదిని కలిసి, శుభాకాంక్షలు తెలిపారు రాజేష్ దండా. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ– ''మా హాస్య మూవీస్‌పై 'ఊరిపేరు భైరవకోన, సామజవరగమన, మజాకా, కె-ర్యాంప్' వంటి పలు హిట్ సినిమాలు నిర్మించాను. అలాగే మా బ్యానర్‌లో మరికొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ నిర్మాణంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నెక్ట్స్ మూవీ ఆదితో ఉంటుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడించనున్నాం'' అని తెలిపారు.

సంక్రాంతికి పతంగ్ ఆలోచన వచ్చింది

– ప్రణీత్

ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్, ప్రీతి పగడాల లీడ్ రోల్స్‌లో ప్రణీత్ పత్తిపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'పతంగ్'. డి. సురేష్‌బాబు సమర్పణలో విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలైంది. ఈ సందర్భంగా ప్రణీత్ పత్తిపాటి మాట్లాడుతూ–''మా స్వస్థలం హైదరాబాద్. ఓ సంక్రాంతి పండగ రోజున పతంగుల పోటీ నేపథ్యంతో ఓ సినిమా తీయాలనే ఆలోచనతో 'పతంగ్' ఆరంభించాం. గాల్లో పతంగ్ ఎగరడం, దానికున్న మాంజాని మేము గ్రాఫిక్స్‌లోనే చూపించాం. క్వాలిటీ విషయంలో నిర్మాతలు రాజీ పడలేదు. మా మూవీకి థియేటర్స్‌లో మంచి స్పందన లభిస్తోంది. ఈ సినిమాలో గౌతమ్ వాసుదేవ్ మీనన్‌గారు చేసిన పాత్రకు 'దిల్ 'రాజు, సందీప్ రెడ్డి వంగా, నాగ్ అశ్విన్, ఎస్‌జే సూర్య వంటి వారిని అనుకున్నాం. ఫైనల్‌గా గౌతమ్ మీనన్‌గారు చేశారు. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కాస్త కన్‌ఫ్యూజ్డ్‌గా కనిపిస్తుంది. చెప్పాలంటే అదీ నా క్యారెక్టరే. నేను కూడా చాలా కన్‌ఫ్యూజన్‌తో ఉంటుంటాను. కానీ, పనిలో మాత్రం క్లారిటీతో ఉంటాను. డి.సురేష్ బాబుగారితో అసోసియేట్ కావడం సంతోషంగా ఉంది. జనవరి 1న మా చిత్రం ఓవర్‌సీస్‌లో కూడా విడుదలవుతోంది'' అన్నారు.

చిన్న సినిమాలపై నమ్మకం ఉంది

– డి. సురేష్ బాబు

''చిన్న సినిమాలకి ప్రేక్షకులు థియేటర్స్‌కి రావడం తగ్గిపోతోందని తరుచూ మాట్లాడుతుంటాం. అయితే కొన్నిసార్లు చిన్న సినిమాలనే చాలా అద్భుతంగా ఆదరిస్తున్నారు. 'రాజు వెడ్స్ రాంబాయి, లిటిల్ హార్ట్స్' లాంటి సినిమాలు విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో చిన్న సినిమాలపై నమ్మకం ఉంది'' అని నిర్మాత డి. సురేష్ బాబు చెప్పారు. శ్రీ నందు, యామినీ భాస్కర్ జోడీగా నటించిన చిత్రం 'సైక్ సిద్ధార్థ'. వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రానా స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్‌పై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి నిర్మించారు. జనవరి 1న విడుదల కానున్న ఈ మూవీ ప్రెస్‌మీట్‌లో డి. సురేష్ బాబు మాట్లాడుతూ– ''సైక్ సిద్ధార్థ' సినిమా చూసిన వెంటనే తీసుకోమని రానాకి చెప్పాను. ఈ మూవీ అందరికీ చేరువ కావాలనే టికెట్ ధర కేవలం రూ.99గా నిర్ణయించాం'' అని పేర్కొన్నారు. శ్రీ నందు మాట్లాడుతూ– ''దండోరా' చిత్రంలో నా నటనకి చాలా మంచి అభినందనలు ఇచ్చారు. 2026 తెలుగు సినిమా 'సైక్ సిద్ధార్థ' తో ప్రారంభం కాబోతోంది. ఈ మూవీ అందరికీ నచ్చుతుంది'' అని తెలిపారు. ''ఇంత మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నందుకు చాలా హ్యాపీ'' అన్నారు వరుణ్ రెడ్డి. ''ఇది న్యూ ఏజ్ ఫిలిం. అందరూ కనెక్ట్ అవుతారు'' అని యామినీ భాస్కర్, మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ సాయి చెప్పారు.

నందు, సురేష్ బాబు, యామినీ భాస్కర్, వరుణ్ రెడ్డి

క్రైమ్ డ్రామా

మదన్ బాబు హీరోగా నటిస్తున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ అండ్ క్రైమ్ డ్రామా 'వాంటెడ్ బాయ్ ఫ్రెండ్'. 'వస్తే వదలం' అనేది ట్యాగ్‌లైన్. ప్రియాంక, సుష్మ, వి.జి.ఆర్. సాక్షి, మహీరా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇంద్రా కంపెనీ పతాకంపై కొర్రాల సుబ్బారెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నిర్మాత రామసత్యనారాయణ విడుదల చేసి, మూవీ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''ప్రేమ, నమ్మకం, ద్రోహం, క్రైమ్.. అంశాల మేళింపుతో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని తెలిపారు సుబ్బారెడ్డి. ఈ సినిమాకు సహ నిర్మాత: రవి రాథోడ్.

ప్రియాంక, మదన్ బాబు, సుష్మ, మహీరా

సాక్షి బిజినెస్

మంగళవారం
30-12-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
346	100
84,696	25,942

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,411	▽	182
డోజోన్స్	48,411	▽	307
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,858	▽	13
డాక్స్	24,453	△	113
షాంఘై	3,965	△	1
నికాయ్	50,527	▽	223

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.50	90.52
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	120.10	123.08
€	యూరో	ఎస్‌బీఐ	104.60	107.40
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.88	58.27
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.88	61.72
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.70	71.42
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.10	24.60
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.61	24.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.97	13.79

మెటల్స్‌.. క్రాష్‌

వెండి భారీ పతనం

- అదే బాటలో పసిడి, రాగి
- గరిష్ట స్థాయిలో అమ్మకాలు
- ఫ్యూచర్స్‌లో సిల్వర్‌ 8 శాతం, పసిడి 5 శాతం డౌన్‌

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతుండటం, ఎగుమతులపై చైనా ఆంక్షలు తదితర అంశాల కారణంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో పసిడి, వెండి, రాగి తదితర కమోడిటీల ధరలు సోమవారం కుదేలయ్యాయి. వరుసగా నాలుగు సెషన్ల పాటు కొనసాగిన వెండి ర్యాలీకి బ్రేక్‌ పడింది. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు, గరిష్ట స్థాయిలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌ (ఎంసీఎక్స్‌) ఫ్యూచర్స్‌ మార్కెట్లో మార్చి కాంట్రాక్టు ఒక దశలో సుమారు 6 శాతం క్షీణించి రూ. 2,26,275 (కిలోకి) వద్ద ట్రేడయ్యింది. సోమవారం తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైన సిల్వర్‌, ఇంట్రాడేలో జీవితకాల గరిష్టం రూ. 2,54,174ని తాకినప్పటికీ రూ. 2,25,500కి కూడా క్షీణించింది. ఇంట్రాడే గరిష్టం నుంచి దాదాపు రూ. 28,674 మేర పతనమైంది. గత వారంలో సిల్వర్‌ ఏకంగా రూ. 31,348 (15.04 శాతం) ఎగిసిన సంగతి తెలిసిందే.

పసిడి 3%, రాగి 13 శాతం డౌన్‌ ..

అటు పసిడిలో కూడా లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫిబ్రవరి కాంట్రాక్టు పది గ్రాముల బంగారం ధర ఒక దశలో రూ. 4,946 మేర (3.54 శాతం) క్షీణించి రూ. 1,34,927కి తగ్గింది. ఇంట్రాడేలో రూ. 1,40,444 గరిష్ట స్థాయిని చూసింది. అంతక్రితం సెషన్లోనే (శుక్రవారం) పుత్తడి ఆల్‌టైమ్‌ గరిష్ట స్థాయి రూ. 1,40,465ని తాకిన సంగతి తెలిసిందే. ఇక, రాగి విషయానికొస్తే, జనవరి కాంట్రాక్టు 13 శాతం క్షీణించి రూ. 1,211.05 (కిలోకి) పడిపోయింది. ఇంట్రాడేలో ఆల్‌టైమ్‌ గరిష్ట స్థాయి రూ. 1,392.95ని తాకింది. రికార్డ్‌ స్థాయి ర్యాలీ అనంతరం ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగడంతో వెండి, పసిడి రేట్లు తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ సీనియర్‌ అనలిస్ట్‌ సౌమిల్‌ గాంధీ చెప్పారు. భారీగా కొనుగోళ్ల వల్ల ఈ రెండూ ప్రస్తుతం ఓవర్‌బాట్‌ స్థితిలో ఉండటమనేది అప్రమత్తత వహించాల్సిన అవసరాన్ని సూచిస్తోందన్నారు. తదుపరి ర్యాలీకి ముందు కొంత కరెక్షన్‌ మంచిదని చెప్పారు.

అటు అంతర్జాతీయంగా కామెక్స్‌లో 2026 మార్చి నెల వెండి కాంట్రాక్టు ఔన్సుకి (31.1 గ్రాములు) 8 శాతం పైగా నష్టపోయి ఒక దశలో 70.56 డాలర్లకు తగ్గింది. ఇంట్రాడేలో 82.61 డాలర్ల గరిష్ట స్థాయిని తాకింది. అటు పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టు అయిదు శాతం పైగా క్షీణించి ఒక దశలో 4,323.20 డాలర్ల స్థాయికి పడిపోయింది. ఇంట్రాడేలో నమోదైన 4,580.70 డాలర్ల స్థాయితో పోలిస్తే 257.5 డాలర్ల మేర పతనమైంది. తర్వాత కొంత కోలుకుని 4,344.50 వద్ద ట్రేడయ్యింది. ఫ్యూచర్స్‌ రేట్ల ప్రభావం మంగళవారం దేశీయంగా స్పాట్‌ మార్కెట్లో కనిపిస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

కారణాలు ఇవి.. వడ్డీ రేట్ల కోతలు, అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా కమోడిటీల్లో ర్యాలీ మొదలైందని, ప్రస్తుతం పరిస్థితులు కాస్త చక్కబడుతున్న దాఖలాలు కనిపిస్తుండటంతో లాభాల స్వీకరణ జరుగుతోందని భావించవచ్చని జేఎం ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ ప్రణవ్‌ మేర్‌ తెలిపారు. అలాగే ఉక్రెయిన్‌–రష్యా మధ్య యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఉద్దేశించిన శాంతి చర్చలు తుది దశకు చేరాయన్న సంకేతాలు కూడా భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతాయనే ఆశాభావం కలిగిస్తున్నాయని యూబీఎస్‌ వర్గాలు తెలిపాయి. మరోవైపు, సీఎంఈ, కామెక్స్‌లాంటి ప్రధాన డెరివేటివ్స్‌ ఎక్స్ఛేంజీలను నిర్వహించే సీఎంఈ గ్రూప్‌.. వెండి డెరివేటివ్స్‌ కాంట్రాక్టులపై మార్జిన్లను 20,000 డాలర్ల నుంచి 25,000 డాలర్లకు పెంచేయడం వల్ల ట్రేడర్లు అమ్మకాలకు దిగి ఉంటారని మార్కెట్‌ వర్గాలు తెలిపాయి.

స్పాట్‌లో వెండి అప్‌..

ఫ్యూచర్స్‌ మార్కెట్లో పతనమైనప్పటికీ.. సోమవారం స్పాట్‌ మార్కెట్లో వెండి రేటు మరో కొత్త రికార్డును తాకింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్‌ ప్రకారం ట్రేడర్లు కొనుగోళ్లు కొనసాగించడంతో, న్యూఢిల్లీ బులియన్‌ మార్కెట్లో కిలోకి రూ.3,650 పెరిగి రూ. 2,40,000 స్థాయిని తాకింది. మరో వైపు 99.9 శాతం స్వచ్ఛత గల పసిడి రేటు పది గ్రాములకు రూ.500 క్షీణించి రూ. 1,41,800 వద్ద క్లోజయ్యింది.

పారిశ్రామికోత్పత్తి జూమ్‌

రెండేళ్ల గరిష్ట స్థాయికి చేరిక ● నవంబర్‌లో 6.7 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తి నవంబర్‌లో మెరుగుపడింది. రెండేళ్ల గరిష్ట స్థాయిలో 6.7 శాతం వృద్ధి చెందింది. మైనింగ్‌, తయారీలో పనితీరు బలంగా నమోదైంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అనంతరం ఆర్డర్లు పెరగడం ఉత్పాదకత పెంపునకు తోడ్పడింది. సెప్టెంబర్‌ 22 నుంచి నిత్యావసరాలు, వినియోగ వస్తువులపై జీఎస్‌టీ రేట్లను తగ్గించడం తెలిసిందే. దీంతో దేశంలో డిమాండ్‌ బలపడి, వినియోగం పెరిగినట్టు తెలుస్తోంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఆర్డర్లు పెరిగాయి. 2024 నవంబర్‌ నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (పారిశ్రామిక వృద్ధిని సూచించే సూచీ) 5 శాతంగా ఉండడం గమనార్హం. చివరిగా 2023 నవంబర్‌లో నమోదైన 11.9 శాతం గరిష్ట స్థాయిగా ఉంది. ఈ వివరాలను జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) విడుదల చేసింది.

➤ తయారీ రంగంలో ఉత్పత్తి 2025 నవంబర్‌లో 8 శాతం పెరిగింది. 2024 నవంబర్‌లో ఈ వృద్ధి 5.5 శాతంగానే ఉంది.
➤ మైనింగ్‌ ఉత్పత్తి 5.4 శాతం పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో పెరుగుదల 1.9 శాతమే. ➤ విద్యుదుత్పత్తి మాత్రం నవంబర్‌లో 1.5 శాతం క్షీణించింది. కానీ, 2024 నవంబర్‌లో 4.4 శాతం పెరిగింది. ➤ తయారీలో 23కు గాను 20 రంగాల్లో సానుకూల వృద్ధి నమోదైంది. ➤ క్యాపిటల్‌ గూడ్స్‌ ఉత్పత్తి 10.4 శాతం పెరిగింది. కన్జూమర్‌ డ్యూరబుల్స్‌ (ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర) తయారీ 10.3 శాతం పెరిగింది. క్రితం ఏడాది నవంబర్‌లో ఇది 14.1 శాతంగా ఉంది. ➤ కన్జూమర్‌ నాన్‌ డ్యూరబుల్స్‌ విభాగంలో ఉత్పత్తి 7.3 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తి 0.6 శాతం వృద్ధిగానే ఉంది.
➤ ఇన్‌ఫ్రా/నిర్మాణరంగ వస్తువుల ఉత్పత్తి 12.1 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఇది 8 శాతంగా ఉంది.

26,000 దిగువకు నిఫ్టీ

- సెన్సెక్స్‌ పతనం 346 పాయింట్లు
- ఆరంభ లాభాలు ఆవిరి
- నాలుగో రోజూ నష్టాలు



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన దేశీయ స్టాక్‌ మార్కెట్‌ నాలుగోరోజూ నష్టపోయింది. ఐటీ, చమురు, వినిమయ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్‌ 346 పాయింట్లు కోల్పోయి 84,696 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100 పాయింట్లు పతనమై 26వేల స్థాయి దిగువున 25,942 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు లాభాల్లో మొదలయ్యాయి. సంవత్సరాంతం కావడంతో ట్రేడింగ్‌ కార్యకలాపాలు పరిమితంగా ఉండడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీంతో సూచీల ఆరంభ లాభాలు ఆవిరై.., నష్టాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 404 పాయింట్లు నష్టపోయి 84,638 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు కోల్పోయి 25,920 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆసియా మార్కెట్లో దక్షిణ కొరియా 2%, చైనా 0.10% పెరిగాయి. హాంగ్‌కాంగ్‌ 1%, జపాన్‌ 0.50% నష్టపోయాయి. యూరప్‌ మార్కెట్లు 0.25% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

➜ రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ షేరు 1% నష్టపోయి రూ.1,545 వద్ద స్థిరపడింది. కేజీ–డీ6 గ్యాస్‌ క్షేత్రాల్లో సహజ వాయు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోవడంతో ప్రభుత్వం 30 బిలియన్‌ డాలర్లకుపైగా పెనాల్టీ విధించే యోచనలతో ఉన్నట్లు వార్తలు వెలుగులోకి వచ్చాయి. సెన్సెక్స్‌ కోల్పోయిన మొత్తం పాయింట్లలో ఒక్క రిలయన్స్‌ వాటాయే 78 పాయింట్లు.

➜ బీఎస్‌ఈ రంగాల వారీ ఇండెక్సుల్లో వినిమయ 0.91%, విద్యుత్‌ 0.86%, ఐటీ 0.79%, రియల్టీ 0.76%, క్యాపిటల్‌ గూడ్స్‌ 0.71 శాతం నష్టపోయాయి. మిడ్‌, స్మాల్‌ క్యాప్‌ సూచీలు 0.58%, 0.45 శాతం పతనమయ్యాయి.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..
4 కంపెనీల లిస్టింగ్‌కు సై
అరవింద్‌ యూత్‌లో వాటా కొనుగోలు

వైస్రాయ్‌ హోటల్స్‌ చేతికి మారియట్‌ ఎగ్జిక్యూటివ్‌ అపార్ట్‌మెంట్స్‌

డీల్‌ విలువ రూ. 206 కోట్లు

హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: మారియట్‌ ఎగ్జిక్యూటివ్‌ అపార్ట్‌మెంట్స్‌ మాతృ సంస్థ ఎస్‌ఎల్‌ఎన్‌ టెర్మినస్‌ హోటల్స్‌ అండ్‌ రిసార్ట్స్‌ను కొనుగోలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు వైస్రాయ్‌ హోటల్స్‌ వెల్లడించింది. ఇందుకోసం రూ. 206 కోట్లు వెచ్చించనుంది. ఈ ప్రతిపాదనకు వైస్రాయ్‌ హోటల్స్‌ షేర్‌హోల్డర్లు ఆమోదముద్ర వేసినట్లు స్టాక్స్‌ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. ఎస్‌ఎల్‌ఎన్‌కి చెందిన, గచ్చిబౌలిలోని 75 గదుల మారియట్‌ ఎగ్జిక్యూటివ్‌ అపార్ట్‌మెంట్స్‌ని మారియట్‌ నిర్వహిస్తోంది. 2030 నాటికి 1,000 గదులకు పెంచుకోవాలన్న తమ లక్ష్యానికి అనుగుణంగా ఈ ఒప్పందం ఉంటుందని వైస్రాయ్‌ హోటల్స్‌ సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ తెలిపారు. ప్రస్తుతం 470 గదులుండగా, కొత్త ప్రాజెక్ట్‌ ద్వారా మరో 200 గదులు జత కానున్నట్లు పేర్కొన్నారు. డీల్‌కి సంబంధించిన రూ. 206 కోట్లలో సుమారు రూ. 105.66 కోట్లు స్థలానికి, రూ. 60.67 కోట్లు ఇంటర్‌–కార్పొరేట్‌ రుణాలు, రూ. 59.67 కోట్లను షేర్ల కొనుగోలుకు వెచ్చించనుంది.

తగ్గుతున్న ఏటీఎంలు

2,000కు పైగా ఎత్తివేత ● బ్యాంక్‌ శాఖల్లో పెరుగుదల

ముంబై: డిజిటల్‌ చెల్లింపుల నేపథ్యంలో ఆటోమేటెడ్‌ టెల్లర్‌ మెషిన్లు (ఏటీఎంలు) తగ్గుముఖం పడుతున్నాయి. 2024 మార్చి నాటికి 2,53,417 ఏటీఎంలు దేశవ్యాప్తంగా ఉంటే, 2025 మార్చి చివరికి 2,51,057కు తగ్గినట్టు ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది. అంటే గత ఆర్థిక సంవత్సరంలో 2,360 ఏటీఎం మెషిన్లు తగ్గినట్టు తెలుస్తోంది. ఇదే కాలంలో బ్యాంక్‌ శాఖల సంఖ్య 2.8 శాతం పెరిగి 2025 మార్చి చివరికి 1.64 లక్షలకు చేరినట్టు తెలిపింది. ప్రైవేటు బ్యాంక్‌ల ఏటీఎంలు 79,884 నుంచి 77,117కు తగ్గాయి. ప్రభుత్వరంగ బ్యాంక్‌ల ఏటీఎంలు 1,34,694 నుంచి 1,33,544కు తగ్గాయి. డిజిటల్‌ చెల్లింపులు పెరగడంతో ఏటీఎంల్లో కస్టమర్ల లావాదేవీలు తగ్గినట్టు ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. ఇక వైట్‌ లేబుల్‌ ఏటీఎంలు (స్వతంత్ర సంస్థలు నిర్వహించే) మాత్రం 34,602 నుంచి 36,216కు పెరిగాయి. ప్రైవేటు, విదేశీ బ్యాంకుల ఏటీఎంలు ప్రధానంగా పట్టణాల్లో ఎక్కువగా ఉంటే, ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ఏటీఎంలు మాత్రం పట్టణాలతో పాటు గ్రామీణ పట్టణాల్లోనూ విస్తరించి ఉన్నాయి. ప్రభుత్వరంగ బ్యాంక్‌లు గత ఆర్థిక సంవత్సరంలో కొత్త శాఖల్లో మూడింట రెండొంతులు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేశాయి. కానీ, ప్రైవేటు బ్యాంకులు కొత్త శాఖల్లో మూడింట ఒక వంతు గ్రామీణ ప్రాంతాలకు కేటాయించాయి. బేసిక్‌ సేవింగ్స్‌ ఖాతాల సంఖ్య 2.6 శాతం పెరిగి 72.4 కోట్లకు చేరింది. ఖాతాల్లోని బ్యాలన్స్‌ 9.5 శాతం పెరిగి రూ.3.3 లక్ష లక్షల కోట్లకు చేరుకున్నట్టు ఆర్‌బీఐ నివేదిక వెల్లడించింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్‌, గ్రూప్స్‌, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్‌ పాలిటీ » టెట్‌/డీఎస్సీ ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ
» గ్రూప్స్‌, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్‌ ఎకానమీ » బ్యాంక్‌ ఎగ్జామ్స్‌ ప్రత్యేకం: రీజనింగ్‌

క్రియేటివ్‌ కెరీర్‌.. ఫ్యాషన్‌

ఫ్యాషన్‌ డిజైనింగ్‌ రంగంలో నిపుణులను తీర్చిదిద్దే సంస్థ.. నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ(నిఫ్ట్‌). కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిఫ్ట్‌ క్యాంపస్‌లలో.. ఫ్యాషన్‌ డిజైన్‌, టెక్నాలజీ విభాగాల్లో బ్యాచిలర్‌, పీజీ స్థాయి కోర్సులను అందిస్తున్నారు. వీటిల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నిఫ్ట్‌ అడ్మిషన్‌ టెస్ట్‌లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. తాజాగా 2026 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి.. నిఫ్ట్‌ అడ్మిషన్‌ టెస్ట్‌ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నిఫ్ట్‌ ప్రవేశ ప్రక్రియ, అందుబాటులో ఉన్న క్యాంపస్‌లు, కోర్సులు, ఎంపిక విధానం, కెరీర్‌ అవకాశాలు తదితర వివరాలు..

» నిఫ్ట్‌–2026 నోటిఫికేషన్‌ విడుదల
» బ్యాచిలర్‌, మాస్టర్‌ స్థాయిలో 11 విభిన్న కోర్సులు
» దేశ వ్యాప్తంగా 19 నిఫ్ట్‌ క్యాంపస్‌లలో 4,837 సీట్లు
» ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష

నిఫ్ట్‌ 2026

నైపుణ్యాలకు వేదిక నిఫ్ట్‌

ఫ్యాషన్‌ డిజైనింగ్‌, టెక్నాలజీకి ప్రాధాన్యం పెరుగుతోంది. వీటికి సంబంధించిన నైపుణ్యాలను అందించే విద్యాసంస్థలుగా నిఫ్ట్‌ క్యాంపస్‌లు ప్రత్యేక గుర్తింపును పొందాయి. ఫ్యాషన్‌ టెక్నాలజీకి సంబంధించి ఆధునిక నైపుణ్యాలు అందించే ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్‌ శాఖ నిఫ్ట్‌ క్యాంపస్‌లను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 19 నిఫ్ట్‌ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో బ్యాచిలర్‌, మాస్టర్‌, డాక్టోరల్‌ స్థాయిలో 11 కోర్సులు, 4,837 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నిఫ్ట్‌ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిఫ్టీ(నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ ఎంట్రన్స్‌ ఎగ్జామినేషన్‌) పేరుతో ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తున్నారు.

బ్యాచిలర్‌, మాస్టర్స్‌ కోర్సులు

బ్యాచిలర్‌ స్థాయిలో బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ పేరుతో యాక్సెసరీ డిజైన్‌,ఫ్యాషన్‌ కమ్యూనికేషన్‌,బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ డిజైన్‌, ఫ్యాషన్‌ ఇంటీరియర్‌, నిట్‌వేర్‌ డిజైన్‌, లెదర్‌ డిజైన్‌, టెక్స్‌టైల్‌ డిజైన్‌, బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ; అదేవిధంగా మాస్టర్స్‌ స్థాయిలో.. మాస్టర్‌ ఆఫ్‌ డిజైన్‌, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ మేనేజ్‌మెంట్‌, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీతోపాటు పీహెచ్‌డీ కోర్సులు అందిస్తున్నారు.

అర్హతలు

- **బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ కోర్సులు:** 10+2/ఇంటర్మీడియెట్‌ ఉత్తీర్ణత ఉండాలి.
- **బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ:** ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్‌ లేదా గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌ నుంచి మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **మాస్టర్‌ ఆఫ్‌ డిజైన్‌, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ కమ్యూనికేషన్‌:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత లేదా నిఫ్ట్‌ లేదా నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డిజైన్‌ నుంచి అండర్‌ గ్రాడ్యుయేట్‌ డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.
- **మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ:**నిఫ్ట్‌ నుంచి బి.ఎఫ్‌.టెక్‌ ఉత్తీర్ణులు లేదా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌ నుంచి బీటెక్‌ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

2026, ఆగస్ట్‌ 1 నాటికి 24 ఏళ్లలోపు ఉండాలి. పీజీ ప్రోగ్రామ్‌లకు ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

బీ.ఎఫ్‌.టెక్‌!

నిఫ్ట్‌ అందిస్తున్న ప్రోగ్రామ్‌లలో ప్రత్యేకమైనది బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ. ఫ్యాషన్‌ విభాగంలో టెక్నికల్‌ నైపుణ్యాలను అందించే ప్రత్యేక కోర్సు ఇది. ఇందులో అపెరల్‌ ప్రొడక్షన్‌ అందుబాటులో ఉంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

నిఫ్ట్‌–అడ్మిషన్‌ ప్రక్రియను మూడు దశల్లో నిర్వహిస్తారు. తొలి దశలో క్రియేటివ్‌ ఎబిలిటీ టెస్ట్‌ (సీఏటీ), జనరల్‌ ఎబిలిటీ టెస్ట్‌ (జీఏటీ) ఉంటాయి. ఆ తర్వాత దశలో సిట్యుయేషన్‌ టెస్ట్‌ ఉంటుంది. చివరగా పర్సనల్‌ ఇంటర్వ్యూ/గ్రూప్‌ డిస్కషన్‌ నిర్వహించి సీటు ఖరారు చేస్తారు.

తొలి దశలో జీఏటీ

- తొలి దశలో జీఏటీ(జనరల్‌ ఎబిలిటీ టెస్ట్‌)ని బ్యాచిలర్‌,పీజీ కోర్సుల అభ్యర్థులు ఇద్దరికీ నిర్వహిస్తారు. అయితే పరీక్షలో ప్రశ్నల క్లిష్టత స్థాయి మాస్టర్‌ కోర్సుల్లో కొంత ఎక్కువగా ఉంటుంది.
- బీడిజైన్‌ కోర్సుకు సంబంధించి జీఏటీ పేపర్‌లో 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఎండిజైన్‌ కోర్సుకు సంబంధించి జీఏటీ పేపర్‌లో 120 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. జీఏటీలోనూ పలు విభాగాల నుంచి నిర్దిష్ట సంఖ్యలో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ, కమ్యూనికేషన్‌ ఎబిలిటీ, ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌, అనలిటికల్‌ ఎబిలిటీ, జనరల్‌ నాలెడ్జ్‌ అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ కోర్సుకు సంబంధించిన పరీక్షలో కమ్యూనికేషన్‌ ఎబిలిటీ ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌పై 40 ప్రశ్నలు, క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు, అనలిటికల్‌ ఎబిలిటీ నుంచి 15 ప్రశ్నలు, జీకే అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. అదేవిధంగా ఎండిజైన్‌కు సంబంధించిన పరీక్షలో కమ్యూనికేషన్‌ ఎబిలిటీ ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌పై 50 ప్రశ్నలు, క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు, అనలిటికల్‌ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు, జీకే అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌ నుంచి 25 ప్రశ్నలు ఉంటాయి.

ఫ్యాషన్‌ టెక్నాలజీ.. ప్రత్యేక విధానం

- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ, మాస్టర్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ మేనేజ్‌మెంట్‌ కోర్సులకు తొలి దశ ప్రవేశ పరీక్ష జీఏటీ ప్రత్యేకంగా నిర్వహిస్తారు. మూడు గంటల వ్యవధిలో నిర్వహించే ఈ పరీక్షలో క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ, కమ్యూనికేషన్‌ ఎబిలిటీ అండ్‌ ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌, అనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటితోపాటు ఒక కేస్‌ స్టడీ కూడా ఉంటుంది. బి.ఎఫ్‌టెక్‌, ఎ.ఎఫ్‌టెక్‌లకు సంబంధించి 100 ప్రశ్నలు ఉంటాయి. బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీకి సంబంధించి జీఏటీని సెక్షన్‌–ఎ, సెక్షన్‌–బిలుగా నిర్వహిస్తారు. సెక్షన్‌–ఎలో కమ్యూనికేషన్‌ ఎబిలిటీ అండ్‌ ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌ (40 ప్రశ్నలు), క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ (20 ప్రశ్నలు), అనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ ఎబిలిటీ (15 ప్రశ్నలు), జీకే అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌ (25 ప్రశ్నలు) ఉంటాయి. సెక్షన్‌–బిలో క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ (15 ప్రశ్నలు), అనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ ఎబిలిటీ (15 ప్రశ్నలు), కేస్‌ స్టడీ (20 ప్రశ్నలు) ఉంటాయి.
- మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీకి సంబంధించి.. కమ్యూనికేషన్‌ ఎబిలిటీ అండ్‌ ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌ (45 ప్రశ్నలు), కేస్‌ స్టడీ (25ప్రశ్నలు), క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ (30 ప్రశ్నలు), అనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ ఎబిలిటీ (25 ప్రశ్నలు), జీకే అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌ (25 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ మేనేజ్‌మెంట్‌ కోర్సుకు మాత్రం కమ్యూనికేషన్‌ ఎబిలిటీ అండ్‌ ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌ విభాగంలో 50 ప్రశ్నలు, క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ విభాగంలో 20 ప్రశ్నలు, అనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ ఎబిలిటీలో 25 ప్రశ్నలు, జీకే అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌లో 25 ప్రశ్నలు, కేస్‌ స్టడీ విభాగంలో 30ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

రెండో దశలో సీఏటీ

మొదటి దశలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో క్రియేటివ్‌ ఎబిలిటీ టెస్ట్‌ (సీఏటీ) నిర్వహిస్తారు. అభ్యర్థుల్లోని పరిశీలనాత్మక నైపుణ్యం, సృజనాత్మకత, డిజైన్‌ సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఈ పరీక్ష ఉంటుంది.

మూడో దశ సిట్యుయేషన్‌ టెస్ట్‌

రెండు దశల్లోనూ చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుని చివరగా సిట్యుయేషన్‌ టెస్ట్‌ నిర్వహిస్తారు. బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ అభ్యర్థులు తమలోని సృజనాత్మక ప్రతిభను చూపే విధంగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో అభ్యర్థులకు నిర్ణీత మెటీరియల్‌ అందించి ఏదైనా ఆకృతిని రూపొందించమని లేదా ఏదైనా ఒక సందర్భాన్ని పేర్కొని దానికి తగినట్లుగా ఊహా చిత్రం గీయమని అడుగుతారు.

చివరగా.. జీడీ, ఇంటర్వ్యూ

జీఏటీ, సీఏటీలలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు చివరగా గ్రూప్‌ డిస్కషన్‌, పర్సనల్‌ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. భావ వ్యక్తీకరణ సామర్థ్యం, ఒక అంశంపై స్పష్టత, పరిజ్ఞానం, ఆలోచన సామర్థ్యాలను పరీక్షించే విధంగా గ్రూప్‌ డిస్కషన్స్‌ ఉంటాయి. పర్సనల్‌ ఇంటర్వ్యూ పూర్తిగా ఫ్యాషన్‌ కెరీర్‌ పట్ల అభ్యర్థికున్న ఆసక్తి, దానికి సరితూగే తత్వాలను గ్రహించే విధంగా ఉంటుంది.

వెయిటేజీ విధానం

- తుది ఫలితాలు విడుదల చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ కోర్సులకు సీఏటీకి 50 శాతం, జీఏటీకి 30 శాతం, సిట్యుయేషన్‌ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ కోర్సులకు జీఏటీ సెక్షన్‌–ఎకు 70 శాతం, జీఏటీ సెక్షన్‌–బికు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.
- మాస్టర్‌ ఆఫ్‌ డిజైన్‌ కోర్సుకు సీఏటీకి 40 శాతం, జీఏటీకి 30 శాతం, పర్సనల్‌ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ కల్పిస్తారు.
- మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ మేనేజ్‌మెంట్‌ కోర్సులకు జీఏటీకి 70 శాతం, పర్సనల్‌ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

బెస్ట్‌ స్కోర్‌కు మార్గమిదే

క్వాంటిటేటివ్‌ ఎబిలిటీ

మ్యాథమెటిక్స్‌, అర్థమెటిక్స్‌ అంశాలపై పట్టు సాధించాలి. వర్క్‌ అండ్‌ టాస్క్‌, శాతాలు, నిష్పత్తులు, టైమ్‌ అండ్‌ డిస్టెన్స్‌, టైమ్‌ అండ్‌ వర్క్‌కు సంబంధించిన అంశాలు ప్రాక్టీస్‌ చేయాలి.

కమ్యూనికేషన్‌ ఎబిలిటీ, ఇంగ్లిష్‌ కాంప్రహెన్షన్‌

ఇంగ్లిష్‌ భాషలో ప్రాథమిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు బేసిక్‌ గ్రామర్‌ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

అనలిటికల్‌ అండ్‌ లాజికల్‌ ఎబిలిటీ

విశ్లేషణ సామర్థ్యాన్ని, తార్కిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక టాపిక్‌లో ఇమిడున్న కీలకాంశాలు, వాటికి సంబంధించి అప్లికేషన్‌ అప్రోచ్‌తో ప్రాక్టీస్‌ చేయాలి.

జనరల్‌ నాలెడ్జ్‌ అండ్‌ కరెంట్‌ అఫైర్స్‌

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు హైస్కూల్‌ స్థాయి సోషల్‌ సబ్జెక్ట్‌ నుంచి ఉంటాయి. అదే విధంగా ముఖ్యమైన తేదీలు–సందర్భాలు వంటివి కూడా అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు తాజాగా జరిగిన ముఖ్యమైన సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి.

కేస్‌ స్టడీ

బ్యాచిలర్‌ ఆఫ్‌ టెక్నాలజీ, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ, మాస్టర్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ మేనేజ్‌మెంట్‌ కోర్సు అభ్యర్థులకు నిర్వహించే కేస్‌ స్టడీ.. ఒక వాస్తవ సమస్యను ఇచ్చి దానికి పరిష్కారం అడిగేలా ఉంటుంది. అభ్యర్థులకు అన్వయ దృక్పథం, సమస్యను గుర్తించే లక్షణం అవసరం.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్‌ దరఖాస్తులు ప్రారంభం:** 2025, డిసెంబర్‌ 8
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు చివరి తేదీ:** 2026, జనవరి 6
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు సవరణ:** 2026 జనవరి 12 నుంచి 14 వరకు
- **ఆన్‌లైన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ తేదీ:** 2026, ఫిబ్రవరి 8
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, హైదరాబాద్‌
- **వివరాలకు వెబ్‌సైట్‌:** https://exams.nta.ac.in/niftee

విద్య, ఉద్యోగ సమాచారం

కోల్‌ ఇండియా లిమిటెడ్‌లో 125 ఇండస్ట్రియల్‌ ట్రైనీ పోస్టులు

కోల్‌ ఇండియా లిమిటెడ్‌(సీఐఎల్‌) దేశవ్యాప్తంగా ఉన్న సీఐఎల్‌ కేంద్రాలలో ఇండస్ట్రియల్‌ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 125.
» **కంపెనీల వారీగా పోస్టులు:** కోల్‌ ఇండియా లిమిటెడ్‌(కోల్‌కతా)–07, భారత్‌ కోకింగ్‌ కోల్‌ లిమిటెడ్‌(ధన్‌బాద్‌)–12, సెంట్రల్‌ కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌(రాంచీ)–15, సీఎంపీడీఐఎల్‌(రాంచీ)–07, ఈస్టర్న్‌ కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌–12, మహానది కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌–20, నార్తర్న్‌ కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌–20, సౌత్‌ ఈస్టర్న్‌ కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌–20, వెస్టర్న్‌ కోల్‌ఫీల్డ్స్‌ లిమిటెడ్‌–12.
» **అర్హత:** ఐసీఏఐ నిర్వహించే సీఏ ఇంటర్మీడియట్‌ లేదా ఐసీఎంఏఐ నిర్వహించే సీఎంఏ ఇంటర్మీడియట్‌ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** యూఆర్‌/ఈడబ్ల్యూఎస్‌ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్‌:** నెలకు రూ.22,000.
» **శిక్షణా కాలం:** 15 నెలలు.
» **ఎంపిక విధానం:** సీఏ/సీఎంఏ మార్కుల మెరిట్‌, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేదీ:** 26.12.2025
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేదీ:**15.01.2026
» **వెబ్‌సైట్‌:** https://www.coalindia.in

బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాలో 400 అప్రెంటిస్‌లు

ముంబైలోని బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (బీవోఐ) వివిధ జోన్‌లలో ఖాళీగా ఉన్న అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 400.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.12.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్‌:** నెలకు రూ.13,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేదీ:** 25.12.2025
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేదీ:** 10.01.2026
» **వెబ్‌సైట్‌:** https://bankofindia.bank.in

క్లుప్తంగా...

విశాఖ పోర్టుకు తొలి మహిళా డిప్యూటీ చైర్‌పర్సన్

బాధ్యతలు చేపట్టిన రోష్ని అపరంజి

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ)కి తొలి మహిళా డిప్యూటీ చైర్‌పర్సన్‌గా రోష్ని అపరంజి కొరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవి చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారిగా ఆమె చరిత్ర సృష్టించారు. విశాఖకు చెందిన ఆమె అస్సాం–మేఘాలయ కేడర్ 2011 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. తన విద్యాభ్యాసం అంతా విశాఖపట్నంలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్ట్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు డిప్యూటీ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. 1984 ఏప్రిల్ 3న జన్మించిన రోష్ని ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీలో గోల్డ్ మెడలిస్ట్. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో విస్తృత పరిపాలనా అనుభవం కలిగి ఉన్నారు. అస్సాంలో జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అనంతరం అదే జిల్లాకు కలెక్టర్‌గా, తర్వాత ధేమాజీ కలెక్టర్‌గా సేవలందించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ నియామకానికి ముందు, కేంద్ర డిప్యుటేషన్‌లో విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ (వీసెజ్)లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన రోష్నికి పోర్టు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

బీడీఎస్ వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్లలో స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండ్ ప్రవేశాల కోసం వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆరోగ్య విశ్వవిద్యాలయం అవకాశం కల్పించింది. ఏయూ, ఎస్వీయూ రీజియన్‌లలో 63 సీట్లు ఖాళీగా ఉన్నట్టు సోమవారం ప్రకటించింది. ఈ సీట్లలో ప్రవేశాల కోసం విద్యార్థులు మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి జనవరి ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు. అదేవిధంగా ఎంబీబీఎస్ యాజమాన్య కోటా స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండ్–2 సీట్లను కేటాయించినట్లు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు బుధవారం సాయంత్రం నాలుగు గంటల్లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

నందకిశోర్‌కు ఐఎంఏ ఉత్తమ అధ్యక్షుడి అవార్డు

అవార్డు అందుకుంటున్న నందకిశోర్

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఏటా జాతీయ స్థాయిలో ఇచ్చే ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుని అవార్డు 2024–2025 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా పనిచేసిన డాక్టర్ గార్లపాటి నందకిశోర్‌కు లభించింది. ఈ అవార్డును గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన ఐఎంఏ జాతీయ సదస్సులో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ జై షా చేతుల మీదగా నందకిశోర్ అందుకున్నారు.

మున్సిపల్ స్కూళ్లలో అల్పాహారం అందించాలి

సాక్షి, అమరావతి: పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్న అన్ని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ విధానం అమలు చేశారని, ఈ ఏడాది అల్పాహారం నిలిపివేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణకు వినతిపత్రం అందించినట్టు తెలిపారు. హైస్కూళ్లలో తాగు నీటి వసతి, కరెంట్ సౌకర్యం, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమస్యలపై అన్ని పురపాలక సంఘాల్లోనూ కమిషనర్లకు వినతిపత్రాలు అందించినట్టు ఆయన పేర్కొన్నారు.

టెన్త్‌లో ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను చేర్చుతాం

సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో పుస్తక జ్ఞానమే కాకుండా పనిచేస్తూ నేర్చుకునే సంస్కృతిని పెంపొందించాలని, అందుకోసం రాష్ట్ర విద్యా శాఖ, సమగ్ర శిక్ష స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా కీలక మార్పులకు శ్రీకారం చుట్టిందని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విజయవాడలో 'రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటేషన్ 2025–26' కార్యక్రమంలో భాగంగా 26 జిల్లాల నుంచి 10 ట్రేడుల్లో 260 ప్రాజెక్టులను ప్రదర్శించారు. దీనికి హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏపీలో యాక్టివిటీ బేస్ట్ లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి మార్కుల జాబితాలో ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను చేర్చనున్నామని, ఇది విద్యార్థుల గ్రేడింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం ప్రాజెక్టుల విజేతలకు ట్రేడ్ల వారీగా నగదు బహుమతులు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అంతటా దాడులూ... దౌర్జన్యాలే..

రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతి భద్రతలు



కేసులు	2024	2025	పెరిగిన శాతం
హత్యాయత్నాలు	1,403	1,566	11.6
దాడులు, దౌర్జన్యాలు	137	146	6.6
ఆర్థిక నేరాలు	7,667	8,034	4.78
పగటిపూట చోరీలు	824	836	1.5

సాక్షి, అమరావతి: చంద్రబాబు రెడ్‌బుక్ పాలనలో రాష్ట్రం దాడులు, దౌర్జన్యాలతో అట్టుడుకుతోంది. ప్రధానంగా భౌతికదాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో 2025 సంవత్సరంలో శాంతిభద్రతల పరిస్థితిని వివరిస్తూ పోలీసు శాఖ వార్షిక నివేదికను సోమవారం డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, పరిస్థితి అంతా బాగుందని చెప్పేందుకు గణాంకాలతో కనికట్టు చేసేందుకు ఆ నివేదికలో యత్నించారు. కానీ ఎంతగా దాచాలన్నా పోలీసు శాఖ వైఫల్యం మాత్రం బట్టబయలైంది. 2024తో పోలిస్తే 2025లో రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలతోపాటు ఆర్థిక నేరాలు పెరిగాయని ఆ నివేదికే స్పష్టం చేసింది.

పూర్తిగా అదుపుతప్పిన శాంతిభద్రతలు

టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో భయోత్పాతం సృష్టిస్తోంది. అధికార టీడీపీ కూటమి నాయకుల అరాచకాలకు పోలీసులు వత్తాసు పలుకుతుండటంతో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. ప్రధానంగా రాజకీయ ప్రత్యర్థులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, సామాజిక ఉద్యమకారులే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు చాలావరకు కేసులు నమోదు చేయడం లేదు. అయినా సరే 2025లో దాడులు, దౌర్జన్యాల కేసుల సంఖ్య పెరగడం గమనార్హం. బాధితుల ఫిర్యాదులు అన్నింటిపైనా విచారణ చేసి కేసులు నమోదు చేసి ఉంటే రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితి మరింతగా వెల్లడయ్యేది. రాష్ట్రవ్యాప్తంగా 2024లో దాడులు, దౌర్జన్యాల కేసులు 137 నమోదు కాగా... 2025లో ఆ సంఖ్య 146కు పెరిగింది. భౌతిక దాడుల కేసులు 6.6శాతం పెరిగినట్టు పోలీసు శాఖ నివేదిక వెల్లడించింది. ఇక రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్న వారిని అంతం చేయడమే లక్ష్యంగా అధికార పార్టీ నేతలు చెలరేగిపోతున్నారు. 2024లో 1,403 హత్యాయత్నం కేసులు నమోదు కాగా... 2025లో హత్యాయత్నం కేసులు 1,566కు పెరగడం గమనార్హం. హత్యాయత్నం కేసులు 11.6 శాతం పెరిగాయని నివేదిక పేర్కొంది.

భారీగా పెరిగిన ఆర్థిక నేరాలు

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఆర్థిక నేరాలు అమాంతంగా పెరిగాయి. అధికార పార్టీ కక్ష సాధింపు చర్యలకు కొమ్ముకాయడమే పనిగా పెట్టుకున్న పోలీసు పెద్దలు.. రాష్ట్రంలో ఆర్థిక నేరాల అదుపుపై ఏమాత్రం శ్రద్ధ చూపించడం లేదు. 2024లో 7,667 ఆర్థిక నేరాల కేసులు నమోదు కాగా... 2025లో ఆ కేసుల సంఖ్య 8,034కు పెరిగింది. రాష్ట్రంలో ఆర్థిక నేరాలు 4.78 శాతం పెరిగాయని పోలీసు శాఖ నివేదిక వెల్లడించింది. ఇక పగటిపూట దొంగతనాలు కూడా పెరిగాయి. 2024లో 824 కేసులు నమోదు కాగా, 2025లో ఆ కేసుల సంఖ్య 836కు చేరింది.

లక్షల్లో భక్తులు వస్తే భద్రత కల్పించడం కష్టం

- మహిళల భద్రతపై జనరలైజ్ చేసి మాట్లాడటం సరికాదు
- పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలకు డీజీపీ కౌంటర్

'తిరుపతికి లక్షల్లో భక్తులు వస్తే భద్రత కల్పించడం సాధ్యమయ్యేపనా... వైఫల్యానికి చాలా కారణాలు ఉంటాయి' అని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల–తిరుపతిలలో వైకుంఠ ఏకాదశి టికెట్ల జారీలో తొక్కిసలాటపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... లక్షల్లో భక్తులు వస్తుంటే భద్రత కల్పించడం, తగిన ఏర్పాట్లు చేయడం పూర్తిగా సాధ్యం కాదని డీజీపీ బదులిచ్చారు. అందుకు చాలా కారణాలు ఉంటాయని, పోలీసుల వైఫల్యంగానే చూడకూడదన్నారు. ఇక భద్రత కోసం మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను డీజీపీ గుప్తా వ్యంగ్యంగా తిప్పికొట్టారు. 'మహిళా భద్రతలో పోలీసు వైఫల్యం గురించి జనరలైజ్ చేసి చెప్పడం సరి కాదు. నిర్దిష్టంగా చెప్పాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. నేరాలను కట్టడి చేస్తున్నామని చెప్పారు. 2024లో రాష్ట్రంలో 1,10,193 కేసులు నమోదు కాగా, 2025లో 1,03,397 కేసులకు తగ్గాయని తెలిపారు. నేరాలు 6 శాతం తగ్గాయన్నారు. నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2025లో 153 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. త్వరలో ఐపీఎస్ అధికారుల జాతీయ సదస్సు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఐజీలు శ్రీకాంత్, రవికృష్ణ, పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేరం రుజువు కాకముందే ఖాకీల శిక్ష

నిందితులతో రోడ్డుపై పరేడ్ • వ్యక్తుల సామాజిక గౌరవానికి తూట్లు

ఏపీ పోలీసుల బరితెగింపు • సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు

సాక్షి, అమరావతి: ఇప్పటికే బరితెగించి వ్యవహరిస్తున్న ఏపీ పోలీసులు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం నిర్భీతిగా బేఖాతరు చేసే స్థాయికి చేరారు. రెడ్‌బుక్ రాజ్యాంగ అరాచకాలకు వత్తాసు పలకడమే ఏకైక కర్తవ్యంగా రాజ్యాంగ ధర్మాన్ని నిస్సిగ్గుగా పోలీసు శాఖ విస్మరిస్తోంది. నిందితుల అరెస్టు, న్యాయస్థానంలో హాజరుపరిచే ప్రక్రియపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై స్వయంగా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం విస్మయపరుస్తోంది. ఆయా అంశాలకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలు ఏమిటీ?.. ఏపీ పోలీసుల బరితెగింపు ఏ స్థాయికి చేరిందన్న అంశాలు పరిశీలిస్తే...

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో నడిరోడ్డుపై నడిపిస్తూ తీసుకెళ్తున్న పోలీసులు (ఫైల్)

నిందితులను పరేడ్ చేయించకూడదు

డీజీపీలకు సుప్రీంకోర్టు ఆదేశం

ఏదైనా కేసుల్లో నిందితులను అరెస్టు విషయంలో పోలీసులు కచ్చితంగా నిబంధనలకు లోబడి వ్యవహరించాలని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. నిందితులను అరెస్టు చేయడం, న్యాయస్థానంలో హాజరుపరిచే ప్రక్రియలో అనుసరించాల్సిన విధి విధానాలను నిర్దేశించింది. ఈమేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ ప్రకారం..

- ఒక కేసులో నిందితులుగా ఉన్నంత మాత్రాన వారు నేరస్తులుగా భావించలేం. నేరం నిరూపితం కానంతవరకు నేరస్తులు కారు.
- ఇక నిందితుల సామాజిక గౌరవానికి పోలీసులు భంగం కలిగించ కూడదు. వారి గౌరవాన్ని పోలీసులు కచ్చితంగా పరిరక్షించాలి. అరెస్టు చేసిన నిందితులను బహిరంగంగా నడిపిస్తూ పరేడ్ చేయించకూడదు. వారిని ప్రజలకు కనిపించేలా ప్రదర్శించకూడదు.
- నిందితులను సోదా చేసే ప్రక్రియ గౌరవప్రదంగా ఉండాలి. వారి వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం కలిగించకూడదు.
- అరెస్టు సమయంలో పోలీసులు బల ప్రయోగం చేయడం సరికాదు.
- నిందితులు తప్పించుకునేందుకు యత్నిస్తే, గాయాలు కాకుండా వారిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించాలి. అంతేగానీ అరెస్టు కోసమని చెప్పి గాయపరచ కూడదు.

సుప్రీం కోర్టు చెప్పినా లెక్క చేయం

ఏపీ పోలీసుల నిర్భీతి

నిందితుల గౌరవానికి భంగం కలిగించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను తాము లెక్కచేయబోమంటూ బాబు సర్కార్ హయాంలో ఏపీ పోలీసులు బరితెగిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో కక్ష పూరితంగా అరెస్టు చేసిన పలువురు నిందితులను రోడ్డుపై నడిపించి పరేడ్ చేయించడం పోలీసుల దాష్టీకానికి నిదర్శనం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను సంప్రదాయ జాతర తరహాలో నిర్వహించిన అభిమానులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారు. నరికిన పొట్టేళ్ల తలలను దండగా చేసి టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఫ్లెక్సీకి వేసి వేడుకలు చేసిన టీడీపీ అభిమానులను పోలీసులు ఏమాత్రం పట్టించుకోలేదు. కానీ సాధారణ జాతర శైలిలో మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ అభిమానులపై మాత్రం కక్ష గట్టారు. శ్రీసత్యసాయి, అనంతపురం, ఉభయ గోదావరి తదితర జిల్లాల్లో ఏకంగా 13 కేసులు నమోదు చేశారు. ఆ కేసుల్లో నిందితులుగా ఉన్న యువకులను అరెస్టు చేశారు. అంతేకాదు...వారిని తీవ్రంగా కొట్టారు. అనంతరం వారిని నడిరోడ్డుపై నడిపిస్తూ పరేడ్ నిర్వహించారు. తద్వారా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు నిర్భీతిగా ఉల్లంఘించారు. నిందితుల సామాజిక గౌరవానికి భంగం కలిగించారు. వారి వ్యక్తిగత గోప్యత హక్కును కాలరాశారు. మొత్తం మీద సుప్రీంకోర్టు ఆదేశాలంటే తమకు ఏమాత్రం లెక్క లేదని తేల్చి చెప్పారు.

వాహనాలు లేవు.. అందుకే నడిపించాం

డీజీపీ గుప్తా బాధ్యతా రహిత స్పందన

నిందితుల గౌరవానికి భంగం కలిగించ కూడదని.. వారిని రోడ్డుపై నడిపిస్తూ పరేడ్ నిర్వహించకూడదని సుప్రీంకోర్టు డీజీపీలకు ఆదేశాలు జారీ చేసింది. కానీ 'సుప్రీంకోర్టు చెబితే మాత్రం మేమేందుకు చేస్తాం' అన్నట్టుగా సాక్షాత్తూ ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పందించడం విభ్రాంతి కలిగిస్తోంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా నిందితులను రోడ్డుపై పరేడ్ చేయించడంపై మీడియా ప్రతినిధులు ఆయనను సోమవారం ప్రశ్నించారు. దీనిపై డీజీపీ పూర్తి బాధ్యతారహితంగా స్పందించారు. 'నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచేందుకు పోలీసుల వద్ద వాహనాలు లేవు. అందుకే నడిపించి తీసుకువెళ్లాం' అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తద్వారా సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర పోలీసు శాఖకు ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర పోలీసు శాఖ చీఫ్ స్వయంగా సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే.. ఇక ఇతర పోలీసు అధికారుల ఎలా వ్యవహరిస్తారన్న అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో సామాన్యుల గురించి ఎందుకు పట్టించుకుంటారని, పౌర హక్కుల మాటేమిటని మేధావులు, ప్రజాస్వామ్య హితైషులు ప్రశ్నిస్తున్నారు. డీజీపీ గుప్తా ఒక దుస్సంప్రదాయానికి తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పౌర హక్కులను హరిస్తున్న బాబు సర్కార్

- రెడ్‌బుక్ రాజ్యాంగం సాక్షిగా పోలీసుల విధుల నిర్వహణ
- వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి విమర్శ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం బదులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. బాబు ప్రభుత్వం పౌరహక్కులను హరిస్తోందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ టెండర్లలో ఒక్క బిడ్ కూడా రాకపోవడంతో దిక్కుతోచని ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోంది. మాజీ సీఎం జగన్ ఫ్లెక్సీల వద్ద జంతుబలులు, రక్త తర్పణాలు చేశారంటూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతోంది. వారిని థర్డ్ డిగ్రీతో హింసిస్తోంది. పోలీసులు వారిని సంకెళ్లతో నడి రోడ్డుపై పరేడ్ చేయిస్తున్నారు. జంతుబలులు, రక్త తర్పణ సంస్కృతి టీడీపీదే. బాలకృష్ణ సినిమా రిలీజ్.. చంద్రబాబు పుట్టిన రోజు.. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు.. ఇలా ఎన్నో సందర్భాల్లో టీడీపీ కార్యకర్తలు చంద్రబాబు ఫ్లెక్సీల వద్ద పొట్టేళ్లను నరికి రక్తతర్పణం చేశారు. పొట్టేళ్ల తలలతో బాలకృష్ణ నిలువెత్తు ఫ్లెక్సీకి హారం వేశారు. ఇంకా సత్యకుమార్‌యాదవ్, పరిటాల శ్రీరామ్ ఎన్నికల ఊరేగింపులో కూడా పొట్టేళ్ల తలలు నరికి రక్తతర్పణం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఓ సినిమా ఫంక్షన్‌లో ఏకంగా భారీ తల్వార్‌తో వేదికపైనే విన్యాసాలు చేశారు' అని మనోహర్ రెడ్డి విమర్శించారు. పోలీసుల తీరుపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

అల్లోపతి.. ఆయుర్వేదం.. చేయవద్దు మిక్సోపతి

- ఆయుర్వేద వైద్యులు 58 రకాల సర్జరీలు చేయడానికి ఆమోదం తెలిపిన ఏపీ ప్రభుత్వం
- ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్
- ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ వెల్లడి
- ఆయుర్వేదం వైద్యాన్ని అసలైన రూపంలో ప్రోత్సహించాలని డిమాండ్
- ఆధునిక వైద్యంతో కలిపి మిక్సోపతి చేయవద్దని అల్లోపతి వైద్యుల ఆందోళన

సాక్షి, అమరావతి: ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు (సర్జరీలు) చేయడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని అల్లోపతి వైద్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయం ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని వైద్య నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఇప్పటికే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సైతం ప్రకటించింది. ఆయుర్వేద పీజీ వైద్యులు 58 రకాల శస్త్ర చికిత్సలు స్వతంత్రంగా చేసే వెసులుబాటు కల్పిస్తున్నట్టు ఈ నెల 23న రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. వాటిలో 39 శల్యతంత్ర(సాధారణ శస్త్ర చికిత్సలు), 19 శలాక్య తంత్ర(ఈఎన్‌టీ, నేత్ర, దంత వంటి ఇతర) శస్త్రచికిత్సలు ఉన్నాయి. పురాతన వైద్య విధాన ప్రక్రియలను ఆధునిక చికిత్సలతో అనుసంధానం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంపై రాష్ట్రంలోనే కాకుండా, జాతీయ స్థాయిలో అల్లోపతి వైద్యులు మండిపడుతున్నారు.

స్వచ్ఛమైన రూపంలోనే ప్రోత్సహించాలి

ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ పి.భన్సాలీ ఇప్పటికే ప్రకటించారు. తమకు ఆయుర్వేద, హోమియోపతి వైద్య ప్రక్రియలపై గౌరవం ఉందన్నారు. ఆయుర్వేదం దాని అసలైన, స్వచ్ఛమైన రూపంలోనే ప్రోత్సహించాలని, ఆధునిక వైద్యంతో ఎందుకు కలుపుతున్నారని ప్రశ్నించారు. సరైన శిక్షణ లేని వారు సర్జరీలు చేస్తే రోగుల ప్రాణాల మీదకు వస్తుందని ఐఎంఏ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అల్లోపతి, ఆయుర్వేద, వివిధ వైద్య విధానాలను కలిపి మిక్సోపతి చేస్తే వైద్య ప్రమాణాలు దెబ్బతింటాయని తెలిపింది. ఆయుర్వేద వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేందుకు సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ 2020లోనే మార్గదర్శకాలు ఇచ్చింది. అప్పట్లోనే దీన్ని అల్లోపతి వైద్యులు దేశవ్యాప్తంగా తీవ్రంగా వ్యతిరేకించారు. దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు సైతం చేశారు. సుప్రీం కోర్టును సైతం ఆశ్రయించారు. వచ్చే నెల ఎనిమిదో తేదీన విచారణకు రానుందని ఐఎంఏ చెబుతోంది.

అనుసంధానం చేయవద్దు

అల్లోపతి, ఆయుర్వేదం హోమియోపతి వైద్య విధానాలను ప్రభుత్వం అభివృద్ధి చేయడంలో తప్పులేదు. అలా కాకుండా ఒకదానితో మరొకటి అనుసంధానం చేసి మిక్సోపతి చేయవద్దు. ఇలా చేస్తే వైద్యం నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మోడ్రన్ మెడిసిన్ వైద్యులకు అనాటమీ, పథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీలో నైపుణ్యం ఉంటుంది. వీటిపై ప్రాచీన వైద్య విద్య అభ్యసించిన వారికి అవగాహన తక్కువ ఉంటుంది. ఆధునిక వైద్యంతో ఆయుర్వేదాన్ని అనుసంధానం చేయడం సరికాదు.

– డాక్టర్ ఎస్.బాలరాజు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

మరో ఇద్దరి పేర్లతోనూ గుర్తింపు కార్డులు

కస్టడీలో వెల్లడించిన 'ఐబొమ్మ రవి'

బ్యాంకు ఖాతాల్లో రూ.13 కోట్లు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి విచారణలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక విషయాలు గుర్తిస్తున్నారు. ప్రహ్లాద్‌తో పాటు మరో ఇద్దరి పేర్లు, వివరాలతో రవి నకిలీ గుర్తింపు కార్డులు పొందిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ముగ్గురూ గతంలో ఇతడికి స్నేహితులే కావడం గమనార్హం. వెల్లెల ప్రహ్లాద్ కుమార్‌తో పాటు అంజయ్య, కాళీప్రసాద్ పేర్లు, వివరాలు వాడి తన ఫొటోతో వీటిని పొందాడు. వీటిని ఉపయోగించి తన ఫొటోతో కొన్ని గుర్తింపు కార్డుతో దరఖాస్తు చేసి తీసుకోగా.. మరికొన్ని తయారు చేశారు. గతంలో రవి అమీర్‌పేట్‌లోని హాస్టల్లో ఉన్నప్పుడు ప్రహ్లాద్‌తో పరిచయమైంది. కడప జిల్లాకు చెందిన ప్రహ్లాద్ 2017లో అమీర్‌పేటలోని హాస్టల్ రూమ్‌లో రవితో కలిసి ఉన్నాడు. ఆ సమయంలో ప్రహ్లాద్‌కు సంబంధించిన పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు కలర్ జిరాక్సులు తీసుకున్నాడు. ఆపై వాటిని వాడి ప్రహ్లాద్ పేరుతోనే డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు తీసుకుని వీటి ఆధారంగా బ్యాంక్ అకౌంట్ తెరిచాడు. కరీంనగర్‌కు చెందిన అంజయ్య పేరుతోనూ రవి నకిలీ గుర్తింపుకార్డులు తయారు చేశాడు. ఇతడితో పాటు తన పదో తరగతి క్లాస్‌మేట్ అయిన కాళీప్రసాద్ పేరుతో రూపొందించాడు. ఈ ముగ్గురి పేర్లు, వివరాలు వాడే వెబ్‌సైట్ల నిర్వహణకు అవసరమైన డొమైన్లు ఖరీదు చేశాడు. హాస్పిటల్.ఇన్, సప్లయర్స్.ఇన్ తదితర వెబ్‌సైట్లను ఇలానే ఏర్పాటు చేశారు. ఈ రెండూ విజయం సాధించకపోవడంతోనే రవి 'ఐబొమ్మ'ను ఏర్పాటు చేశాడు. ఇతడి బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీల్లో ఇప్పటికి రూ.13 కోట్లు గుర్తించారు. వీటిలో రూ.3 కోట్లు పోలీసులు ఫ్రీజ్ చేయగా.. మిగతా రూ.10 కోట్లు విదేశాల్లో జల్సాలు, ఆస్తుల ఖరీదుకు రవి ఖర్చు చేశాడు. పోలీసు కస్టడీ ముగియడంతో రవిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించనున్నారు.

అమెరికాలో తెలుగు యువతుల దుర్మరణం

విహారయాత్రకు వెళ్లి వస్తుండగా లోయలో పడిన కారు

గార్ల (తెలంగాణ): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఇద్దరు మహబూబాబాద్ జిల్లా యువతులు కాలిఫోర్నియా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. అలబామ హిల్స్ విహారయాత్రకు వెళ్లొస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు లోయలో పడింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు జరిగింది. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన కడియాల కోటేశ్వరరావు, రేణుక దంపతుల ద్వితీయ కుమార్తె భావన(24), గార్లకు చెందిన పుల్లఖండం నాగేశ్వరరావు, శిరీష దంపతుల ఏకైక కూతురు మేఘనారాణి (24)లు చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్నారు. ఇద్దరూ కలిసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. ఓహాయో రాష్ట్రం డేటాన్‌లో ఉండి ఎంఎస్ చదువు పూర్తి చేసుకొని ఇటీవల పట్టా పొందారు. ఉద్యోగాల వేటలో పడ్డారు. అమెరికాలో క్రిస్మస్ సెలవులు కావడంతో రెండు కార్లలో 8 మంది స్నేహితులతో కలిసి కాలిఫోర్నియా సమీపంలోని అలబామ హిల్స్ చూసేందుకు వెళ్లారు. విహారయాత్ర ముగించుకుని వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు లోయలో పడిపోయింది. కారులో నలుగురు ఉండగా భావన, మేఘనారాణి అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా ఇద్దరు యువకులు తీవ్రగాయాలతో బయటపడ్డారు. గాయాలపాలైన యువకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భావన, మేఘన మృతితో గార్ల, ముల్కనూరు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృత దేహాలు ఇండియాకు రావడానికి వారం నుంచి పది రోజులు పట్టే అవకాశం ఉందని మృతుల బంధువులు తెలిపారు.

మే 17న జేఈఈ అడ్వాన్స్‌డ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష (జేఈఈ–అడ్వాన్స్‌డ్) తేదీలను ఐఐటీ రూర్కీ ప్రకటించింది. వచ్చే మే 17న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందని తెలిపింది. ఏప్రిల్ 6 నుంచి మే 2 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొంది. మే 25న ప్రొవిజినల్ ఆన్సర్ 'కీ', జూన్ 1వ తేదీన ఫైనల్ ఆన్సర్ 'కీ' వెల్లడిస్తామంది. ఇదే రోజు అడ్వాన్స్‌డ్ ఫలితాలు కూడా వెల్లడిస్తారని ఐఐటీ రూర్కీ తెలిపింది.

పది ఇండిగో విమానాల రద్దు

శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ఇండిగో విమానాలు రద్దయ్యాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కొచ్చి, వైజాగ్, ఢిల్లీ, చండీఘఢ్ మధ్య రాకపోకలు సాగించే మొత్తం పది విమానాలను నిర్వహణపరమైన కారణాలు, ప్రతికూల వాతావరణం కారణంగా రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ వెల్లడించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సినీనటి మాధవీలతపై కేసు నమోదు

హైదరాబాద్: సాయిబాబా అసలు దేవుడే కాదని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న యూట్యూబర్లపై శిర్డీసాయి భక్త ఐక్యవేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గోవిందసేవ, హైందవుడు, అహం బ్రహ్మాస్మి, భారత్‌వర్ష, సూర్యఅఖండి, రాధామనోహర్ దాస్, ఆకాశ్ భారత్‌వాసి, మాధవీలత (సినీనటి), పార్వతి హిందూధర్మ తదితరులు దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశామని విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

న్యూఇయర్ థ్రిల్.. కిక్ ఫుల్..

కొత్త ఏడాదికి స్వాగతం అంటూ నయా ట్రెండ్

విజయవాడలో జరిగే కొత్త సంవత్సరం ప్రత్యేక వేడుకలకు అర్ధనగ్న చిత్రాలతో ఆన్‌లైన్ ప్రచారం

కాకినాడలో జరిగే కొత్త సంవత్సరం ప్రత్యేక వేడుకలకు రూ.3500 చెల్లించాలంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం

తాగినంత మద్యం.. తిన్నంత ఫుడ్ అంటూ ఆఫర్లే ఆఫర్లు..

సినీ యాక్టర్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రైవేట్, స్టార్ హోటళ్ల ప్రచారం

ఒక్కొక్కరికీ 31వ తేదీ రాత్రికి రూ.10 వేల వరకూ ఎంట్రీ టికెట్

నిస్సిగ్గుగా సోషల్ మీడియాలోనూ ప్రకటనలు

మరోవైపు అర్ధరాత్రి వరకూ మద్యం తాగేందుకు అనుమతించిన ప్రభుత్వం

న్యూఇయర్ వేడుకల పేరిట వ్యాపారుల దోపిడీ

సాక్షి, అమరావతి: న్యూఇయర్‌కు స్వాగతం పలకడానికి కార్పొరేట్ సంస్థలు నయా ట్రెండ్‌తో సిద్ధమయ్యాయి. కొత్త సంవత్సరంలో అవసరానికి మించి జనం చేత ఖర్చు పెట్టించడానికి సినీ గ్లామర్‌తో ఆకర్షిస్తున్నారు. డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రత్యేక వేడుకల పేరుతో భారీ దోపిడీకి పాల్పడేందుకు సిద్ధమయ్యారు. పాశ్చాత్య సంస్కృతికి తెరతీస్తూ మత్తులో ముంచి తేల్చడానికి ఆకర్షణీయ ప్రకటనలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలతో పాటు పట్టణాల్లోనూ ఈ సంప్రదాయాన్ని విస్తరించడం గమనార్హం.

ఆనందం మాటున దోపిడీ..

కొత్త ఏడాది వస్తుందంటే చాలు ప్రత్యేక ఆఫర్లతో వాణిజ్య సంస్థలు కస్టమర్లను ఆకర్షిస్తుంటాయి. దుస్తులు, గృహోపకరణాల కొనుగోలుకు జనం ఆసక్తి చూపుతారు. అటు ఈ-కామర్స్ వెబ్‌సైట్లు కూడా డిస్కౌంట్ల ప్రకటనలతో హోరెత్తిస్తుంటాయి. ఇవన్నీ జనం ఎప్పటి నుంచో చూస్తున్నవే. పైగా వీటి వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలకూ విఘాతం వాటిల్లదు. కానీ ఈసారి నయా ట్రెండ్ ప్రాచుర్యంలోకి వచ్చింది. డిసెంబర్ 31 రాత్రి వేడుకలను ప్రైవేటు సంస్థల వారు, స్టార్ హోటళ్లు, రిసార్టుల నిర్వాహకులు ప్రత్యేక ప్రదేశాల్లో సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ వేడుకలకు సినీ గ్లామర్‌ను టచ్ చేస్తూ ఇతర రాష్ట్రాల హీరోయిన్లు, మోడళ్లు, కమెడియన్లు, డాన్సర్లు, సింగర్లు, పేరుపొందిన డీజేలు, యాంకర్లను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నారు. వారి అర్ధనగ్న ఫొటోలతో బహిరంగంగా ఫ్లెక్సీలు వేస్తున్నారు. వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. తాగినంత మద్యం, తిన్నంత ఫుడ్ అంటూ ఊరిస్తున్నారు. ముందుగా సీటు రిజర్వ్ చేసుకుంటే ధర తక్కువ అంటూ సామాన్యులను ఆకర్షిస్తున్నారు. అటు ప్రభుత్వం కూడా అర్ధరాత్రి 1 గంట వరకూ మద్యం విక్రయాలకు అనుమతినివ్వడం వీరికి కలిసి వచ్చే అంశం. దీంతో ఒక్కొక్కరికీ ఎంట్రీకి రూ.3500 నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేస్తున్నారు. కానీ వారి ఆకర్షణీయ ప్రకటనలను చూసి వెళ్లేందుకు సిద్ధమవుతున్న పిల్లలను చూసి చాలామంది తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా అర్ధరాత్రి దాటే వరకూ ఇలా విచ్చలవిడిగా మద్యం తాగి వాహనాలతో రోడ్ల పైకి వస్తే జరిగే ప్రమాదాలను తలుచుకుని భయపడుతున్నారు.

విజయవాడ నగరంలోని ఓ బార్ వద్ద కొత్త సంవత్సరం ప్రత్యేక వేడుకల ప్రచారం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కొత్త సంవత్సరం ప్రత్యేక వేడుకలకు సెలబ్రిటీలు వస్తున్నారంటూ ఆన్‌లైన్‌లో చేస్తున్న ప్రచారం

అంటువ్యాధుల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంటువ్యాధుల నివారణ, నియంత్రణకు రాష్ట్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం తెలిపారు. కమిటీ ఛైర్మన్‌గా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ వీరపాండియన్, సభ్యులుగా జాతీయ స్థాయి వైద్య సంస్థ నిపుణులు, రాష్ట్ర పశుసంవర్ధక, పంచాయతీరాజ్, మునిసిపల్ పరిపాలన, వ్యవసాయ శాఖల నుంచి 24 మంది అధికారులు ఉంటారని పేర్కొన్నారు. ఈ కమిటీ అంటువ్యాధుల వ్యాప్తిపై అధ్యయనం చేసి, వాటి కట్టడికి ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. అలాగే, ప్రతి మూడు నెలలకోసారి రాష్ట్రంలో అంటువ్యాధుల కేసుల స్థితిగతులు, అమలవుతోన్న నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

నోడల్ ఏజెన్సీ సమావేశానికి ఎందుకు రారు?

హెచ్‌వోడీలపై మంత్రి డీబీవీ స్వామి ఆగ్రహం

సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమ శాఖ అంటే అధికారులకు అంత చిన్న చూపా? ఎస్సీ సబ్‌ప్లాన్ నోడల్ ఏజెన్సీ సమావేశానికి హెచ్‌వోడీలు ఎందుకు రారు? అంటూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ సబ్‌ప్లాన్ వినియోగంపై సోమవారం నిర్వహించిన నోడల్ ఏజెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి హెచ్‌వోడీల గైర్హాజరు కావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌వోడీలు సమావేశానికి రాకపోవడం పేద, బలహీన వర్గాల ప్రజల పట్ల వారికున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. అనంతరం ఈ ఏడాది ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై డిపార్ట్‌మెంట్‌ల వారీగా వివరాలను మంత్రి తెలుసుకున్నారు. ఈ ఏడాది ముగుస్తున్నప్పటికీ కొన్ని శాఖలు సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఎందుకు వెనుకబడి ఉన్నాయని ప్రశ్నించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నూరుశాతం ఖర్చు చేయాలని ఆదేశించారు.

ఎక్కువ రాబడి వచ్చే సంస్థల్లో డిపాజిట్లు చేయండి

ప్రభుత్వ రంగ సంస్థలకు ఆర్థిక శాఖ సూచన

సాక్షి,అమరావతి: తమ దగ్గర ఉన్న నిధులను ఎక్కువ వడ్డీలు ఇచ్చే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో (ఎన్‌బీఎఫ్‌సీ) డిపాజిట్లు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలకు రాష్ట్ర ఆర్థిక శాఖ సూచించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. సాధారణంగా పలు ఆర్థిక సంస్థలు అందించే వడ్డీ రేటు లేదా రాబడి పెట్టుబడి వ్యవధి 5-7% మధ్య ఉంటోందని గమనించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెట్టుబడులు పరిపాలనా, కార్యాచరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్తమ రాబడిని ఇచ్చే సాధనాల వైపు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

షెల్టర్ హోమ్స్ ఏర్పాటుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

రెండు వారాల్లో వివరాలు ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నిరాశ్రయుల కోసం విజయవాడసహా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో షెల్టర్‌హోమ్‌ల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై పూర్తి వివరాలతో రెండు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారిని షెల్టర్ హోమ్‌లకు తరలించేలా తక్షణమే డ్రైవ్ నిర్వహించి, ఒక నివేదికను తమ ముందుంచాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు న్యాయవాది ఎన్.ఆది రామకృష్ణుడు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. నిరాశ్రయుల రక్షణ కోసం 'నివాసం పథకం' ఉన్నా.. అమలు విషయాన్ని అధికారులు పట్టించుకోవడంలేదని పిటిషనర్ తన పిల్‌లో పేర్కొన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ కొన్ని షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేసినప్పటికీ, ప్రయోజనం ఉండడంలేదని తెలిపారు. కాగా మహిళలకు ఎలాంటి షెల్టర్ హోమ్స్ లేవని ఈ సందర్భంగా తెలుసుకున్న ధర్మాసనం దీనిపై విస్మయం వ్యక్తం చేసింది. మహిళల కోసం షెల్టర్ హోమ్స్ ఏర్పాటు విషయంలో ఇకపై ఎలాంటి కాలయాపన చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కోర్టు సహాయకారిగా సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తిని నియమించింది.

యూఎఫ్‌ఎస్‌ను 10లోగా పూర్తి చేయాలి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రజల పూర్తి సమాచారం సేకరించాలనే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్)ను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు జనవరి 10లోగా పూర్తి చేయాలంటూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం సూచించిన ప్రశ్నావళితో డిజిటల్ సర్వే అప్లికేషన్ రూపంలో సర్వేను నిర్ణీత తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు కలెక్టర్లు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో సూచించారు.

ఉర్దూను కాపాడుకుందాం

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి, 'లాంగ్వేజ్ ఆఫ్ లవ్'గా గుర్తింపు పొందిన ఉర్దూ భాషను కాపాడుకుందామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గుర్తు చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం రాత్రి ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకను 'సురూర్ ఏ ఉర్దూ మహోత్సవ్' పేరిట నిర్వహించారు. ఈ సభలో మంత్రి మాట్లాడుతూ.. హస్రత్ మొహానీ, రాంప్రసాద్ బిస్మిల్, మహమ్మద్ ఇక్బాల్, గాలిబ్ వంటి ప్రముఖులు రాసిన ఉర్దూ కవితలు స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రభావితం చేశాయన్నారు. భారతీయ భాషల్లో ఉర్దూ భాషకు ఎంతో చారిత్రాత్మక, విశిష్టత కలిగిన నేపథ్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూక్ షుబ్లీ, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ మౌలానా, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా, షేక్ కార్పొరేషన్ ఛైర్మన్ ముక్తియార్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ తదితరులు మాట్లాడారు. దేశం నలుమూలల నుండి వచ్చిన కవులు నిర్వహించిన ఉర్దూ ముషాయిరా అందరినీ ఆకట్టుకుంది.

ఫ్లవర్ ఫుల్ జోష్

గులాబీలు.. లిల్లీలు.. తులీప్‌లు.. వంటి పూలతో చేసిన బొకేలు ఇచ్చి కొత్త సంవత్సరానికి హార్ట్ ఫుల్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు ఏలూరు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. సాధారణంగా మ్యారేజ్ ఫంక్షన్లు, పబ్లిక్ మీటింగ్‌లు, బర్త్‌డే పార్టీలు, సన్మానాలు ఇలా ఏ అకేషన్ అయినా శుభాకాంక్షలు చెప్పేందుకు బొకేలు ఇస్తుంటారు. ముఖ్యంగా న్యూఇయర్ గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎక్కువ మంది బొకేలపై ఆసక్తి చూపడంతో వీటికి ఫుల్ డిమాండ్ ఏర్పడింది. దీంతో ముందస్తు బుకింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఏలూరులో కొత్త సంవత్సర వేళ బొకేల వ్యాపారం సుమారు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

పుష్పగుచ్ఛం.. స్వాగతిద్దాం

- పూల బొకేలకు యమ డిమాండ్
- న్యూ ఇయర్‌కు ముందస్తు బుకింగ్‌లు
- ఏలూరులో జోరుగా వ్యాపారం

ఏలూరు (టూటౌన్) : ఏలూరులో పూల వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు దండలు మాదిరిగా సాగు తోంది. నగరంలో 30 మంది వరకు హోల్‌సేల్, 70 మంది మంది రిటైల్ పూల వ్యాపారులు ఉన్నారు. వీరంతా ఏటా న్యూఇయర్ సీజన్‌లో పలు రకాల ఆకర్షణీయమైన డిజైన్లలో బొకేలు తయారుచేసి విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రత్యేక పూలను తీసుకువస్తున్నారు. న్యూఇయర్ డిమాండ్ దృష్ట్యా ఇప్పటికే పలువురు ముందస్తు బుకింగ్‌లకు ఇచ్చారు. దీంతో ఆర్డర్లకు అనుగుణంగా సిబ్బందిని సైతం నియమించుకుంటున్నారు. బొకేల తయారీకి సన్నద్ధమయ్యారు. కొన్నిచోట్ల స్టాల్స్ సిద్ధమయ్యా యి. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో బొకేలకు మంచి గిరాకీ ఉంటుందని వ్యాపారులు అంటున్నారు.

ఏలూరులోని పలు ప్రాంతాల్లో..

ప్రధానంగా ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని వైఎంహెచ్ఏ హాలు, మున్సిపల్ ఫ్లవర్ కాంప్లెక్స్‌లో హోల్‌సేల్ పూల వర్తకులు ఉన్నారు. వీరితో పాటు ఫైర్‌స్టేషన్ సెంటర్, ఆర్ఆర్‌పేట, ఎన్ఆర్‌పేట, తంగెళ్లమూడి, వన్‌టౌన్‌లోని మెయిన్ బజార్, చందన బ్రదర్స్ రోడ్డు, పాత బస్టాండ్ వంతెన వద్దతో పాటు పలు ప్రధాన సెంటర్లలో రిటైల్ పూల వర్తకులు బొకేల స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నారు. కస్టమర్లకు నచ్చేలా బొకేలు, దండలు తయారు చేస్తున్నారు.

ఏలూరులో సిద్ధమైన ఫ్లవర్ బొకే స్టాల్

బొకేలకు గిరాకీ

ఏటా న్యూఇయర్ వేడుకల్లో ఫ్లవర్ బొకేలకు డిమాండ్ బాగుంటుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు చెప్పే క్రమంలో పలువురు బొకేలు ఇస్తుండటమే కారణం. వీటి ధరలు రూ.200 నుంచి రూ.1,000 వరకు ఉన్నాయి. కొందరు ఆర్డర్ ఇచ్చి ప్రత్యేకంగా బొకేలు తయారు చేయించుకుంటారు. ఇటువంటి సందర్భాల్లో బొకే ల్లో వినియోగించిన పూలను బట్టి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ధర ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే సాధారణ రోజుల్లో పోలిస్తే బొకేల ధరలు కాస్త ఎక్కువగానే ఉంటాయని అంటున్నారు.

దూర ప్రాంతాల నుంచి పూలు

బెంగళూరు, విజయవాడ, కడియం వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు పూలను తీసుకువసున్నారు. గులాబీ రకాల బొకేలకు మంచి డిమాండ్ ఉండటంతో హైబ్రిడ్ గులాబీలు, తులిప్‌లను బెంగళూరు నుంచి తీసుకువస్తున్నట్టు చెబుతున్నారు.

2 రోజులు.. రూ.2 కోట్లు

ఏలూరు నగరవ్యాప్తంగా డిసెంబర్ 31, జనవరి 1 (రెండు రోజుల్లో)న పూల బొకేల వ్యాపారం రూ.2 కోట్ల వరకు ఉంటుందని అంచనా. హోల్‌సేల్ వ్యాపారులు ఒక్కొక్కరూ రూ.5 లక్షల చొప్పున, రిటైల్ వ్యాపారులు రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల చొప్పున వ్యాపారం చేస్తుంటారు.

ఓ ఎముక... కొన్ని ఖనిజాలు

మన శరీరంలో పళ్లూ, ఎముకలూ... ఈ రెండూ ఒక లాంటివి. రెండూ చాలా గట్టివి. ఈ రెండింటి తాలూకు గట్టిదనానికి క్యాల్షియమ్ చాలా అవసరం. ఇక ఎముకలైతే... ఓ భవానానికి అవసరమైన కాంక్రీటు లోపల ఉండే ఇనుప ఫ్రేమ్ వర్క్ లాగా, కాంక్రీటు పిల్లర్లలాగా ఉంటూ, అవి ఇచ్చే బలాన్నే ఇస్తూ... భవనంలోపలి ఐరన్ సెంట్రింగ్‌లాగే దేహంలోపల స్కెలిటన్‌లా అజ్ఞాతంగా ఉంటూ ఓ ఆకృతిని ఇస్తాయి. ఇక ఆ కాంక్రీటుతో పోలుస్తున్నందు మరో పోలికా చెప్పవచ్చు. అదేమిటంటే... ఎముకల్లోకి ఖనిజాలన్నీ (మినరల్స్) కూరినట్లుగా నిండిపోయి బలిష్టంగా ఉంటాయి. భవనంలోని కాంక్రీటు పిల్లర్‌లో కంకర ఎంత ఎక్కువగా, సాంద్రంగా కూరి కూరి ఉంటే అంతగా బలంగా ఉన్నట్టుగానే... ఎముక సాంద్రత కోసం అందులో మినరల్స్ ఎంత ఎక్కువగా ఉంటే.. ఎముక అంత బలంగా ఉంటుంది. ఇక ఏదైనా కారణాలతో ఎముకలో ఉండాల్సిన క్యాల్షియమ్, ఫాస్ఫరస్ లాంటి ఖనిజాల, లవణాల సాంద్రత తగ్గితే... ఎముక తేలిగ్గా విరిగిపోయేంత పెళుసుగా ఉంటుంది. అయితే ఒక వయసు దాటాక ఎముకకు బలాన్నిన ఇచ్చే ఈ మినరల్ క్రమంగా తగ్గిపోతూ ఉంటాయి. దాంతో ఎముకలో సాంద్రత కూడా క్రమంగా తగ్గుతూ పోతుంది. నిజానికి ఎముకలోని క్యాల్షియమ్, ఫాస్ఫరస్ లాంటి మినరల్స్ వంటి పదార్థాల సంద్రత (బోన్ మినరల్ డెన్సిటీ) అంటే ఏమిటి, ఒక వయసు తర్వాత అది తగ్గకుండా చాలాకాలం కొనసాగాలంటే ఎలాంటి డైట్ తీసుకోవాలి, ఎలాంటి జీవనశైలి అలవరచుకోవాలనే పలు అంశాలను తెలుసుకుందాం.



మన శరీరాలకు అంతర్గత ఫ్రేమ్‌వర్క్‌గా నిలిచి గట్టి సపోర్ట్ ఇచ్చే ఎముకలు ఆ వ్యక్తుల చిన్నతనంలో చాలా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యుక్త వయసు నాటికి అవి బలిష్ఠంగా మారతాయి. అలా క్రమంగా పుంజుకుంటున్న బలం 30 ఏళ్లు వచ్చే వరకు గరిష్ఠ స్థాయికి వెళ్తుంది. అంటే ఆ సమయం వరకు ఎముకల్లో మినరల్ డెన్సిటీ గరిష్ఠానికి చేరి అత్యంత ఎక్కువగా ఉంటుంది. ఇలా ఎముకలు తమ గరిష్ఠ బలాన్ని పుంజుకోవడం అన్నది... తాను తీసుకునే ఆహారం, అందులోని క్యాల్షియమ్, ఫాస్ఫరస్ వంటి అనేక ఖనిజ లవణాలతో పాటు సూర్యరశ్మిపైనా ఆధారపడి ఉంటుంది.

ఆహారం, సూర్యరశ్మితో బలం పుంజుకునే ఎముకలు...

మంచి ఆరోగ్యకరమైన ఆహారం నుంచి ఖనిజలవణాలు లభిస్తే, సూర్యరశ్మి నుంచి విటమిన్ ‘డి’ దొరికి... ఈ రెండు అంశాలతో ఎముకలు బలంగా మారుతాయి. దీనికి శారీరక శ్రమ/వ్యాయామాలు కూడా తోడైతే అవి మరింత బలంగా, ఆరోగ్యకరంగా తయారవుతాయి. ఇలా ఎముకలన్నీ తమ పూర్తి స్థాయి బలం పుంజుకుని, గరిష్ఠమైన స్థాయిలో సాంద్రత పొందడం అన్నది 18 ఏళ్ల నుంచి 30 వరకు ఉంటుంది. ఎముక సాంద్రతను బోన్ మినరల్ డెన్సిటీ (బీఎమ్‌డీ) అంటారు. ఎముకల్లో మినరల్స్ సాంద్రత ఎక్కువగా ఉంటేనే ఆ ఎముక ఆరోగ్యంగా ఉంటుంది. ఈ బోన్ మినరల్ డెన్సిటీ ఎంత ఎక్కువగా కాలం కొనసాగుతుంటే అంత కాలం బలంగా ఉంటాయి. అలాంటప్పుడు ఎముకలు పెళుసుబారిపోయే ఆస్టియోపోరోసిస్ జబ్బుల్లాంటివి కూడా చాలాకాలం వరకు రావు.

డాక్టర్ సుధీర్‌రెడ్డి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

వయసు పెరుగుతున్న కొద్దీ క్రమంగా తగ్గే ఎముక సాంద్రత...

అలా ఒక వ్యక్తికి మూడు పదులప్పుడు బాగా గరిష్ఠస్థాయిలో ఉండే ‘బోన్ డెన్సిటీ’... అటు తర్వాత 30 ఏళ్ల వయసు నాటి నుంచీ క్రమంగా తగ్గుతూ పోతుంటుంది. అయితే కొందరిలో ఈ తగ్గుదల నెమ్మదిగా కొనసాగుతూ ఉండగా... మరికొందరిలో మాత్రం ఈ తగ్గుదల చాలా వేగంగా జరుగుతుంది. ఇలా క్రమంగా ఎముక సాంద్రత తగ్గడాన్ని ‘ప్రోగ్రెసివ్ బోన్ లాస్’ అంటారు. త్వరత్వరగా ఎముకల సంద్రత తగ్గిపోయి క్రమంగా గుల్లగా మారిపోతుంటే... ఆ కండిషన్‌ను ఆస్టియోపోరోసిస్ అంటారు. ఈ ‘ఆస్టియోపోరోసిస్’ అనే కండిషన్‌లో ఎముకలు బాగా పెళుసుబారి తేలిగ్గా విరిగిపోయే ముప్పు / ప్రమాదం పొంచి ఉంటుంది.

ఒకవేళ మినరల్స్ సాంద్రత అన్నది బాగా వేగంగా తగ్గుతూ పోతున్నా లేదా కాస్తంత నెమ్మదిగా తగ్గుతూ పోతున్నా... ఇలా ఎలా తగ్గుతున్నా సాధారణంగా... ఏ వ్యక్తిలోనైనా 30 ఏళ్ల వయసు తర్వాత... ఎముకలు తమ సాంద్రతను క్రమంగా కోల్పోతూనే ఉంటాయి.

ఇలా... మన ఎముకలు ఎంత తక్కువగా తమ సాంద్రత కోల్పోతుంటే.. అంత సుదీర్ఘ కాలం పాటు బలంగా ఉంటాయన్నమాట. అందుకే అవి తమ సాంద్రతను వీలైనంత మెల్లగా కోల్పోయేందుకు ఏయే పనులు చేయాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఏ విధమైన ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలి, అలా బోన్ మాస్/మినరల్ డెన్సిటీ’ తగ్గితే వచ్చే పరిణామాల గురించి వివరంగా తెలుసుకోవడమన్నది ప్రతి ఒక్కరికీ అవసరం. అందునా ఇటీవలి జీవనశైలీ, ఫాస్ట్ ఫుడ్ వంటి ఆహారాల కారణంగా ఎముకల సాంద్రత త్వరత్వరగా తగ్గుతూ ఆస్టియోపోరోసిస్ వంటి కేసులు చాలా ఎక్కువగా పెరుగుతూపోతున్న నేపథ్యంలో ఈ వివరాలు తెలుసుకోవడం మరింత అనివార్యంగా మారింది.

బాల్య, యౌవన దశల్లోనే సాంద్రత పెరగడానికీ, అటు తర్వాత తగ్గుతూపోవడానికి కారణాలివి...

చిన్న వయసులో పిల్లలు ఆరుబయట ఎక్కువగా ఆడుతూ, శారీరకంగా వ్యాయామాన్ని పొందుతుంటారు. అలాగే ఆరుబయట ఆడుతూ ఉండటం వల్ల సూర్యరశ్మికి చాలా ఎక్కువ సేపు ఎక్స్‌పోజ్ అవుతూ... ఎలాంటి బయటి ఆహారాలతో కాకుండా స్వాభావికంగానే తగినంత ‘డీ’ విటమిన్‌ను పొందుతుంటారు. అలాగే యౌవనదశలో ఎక్కువగా మంచి ఆహారాన్ని తీసుకుంటూ ఉండటం, అలాగే చాలా ఎక్కువగానే తీసుకుంటూ ఉండటం పాటు తమ యౌవన దశల్లో చాలామంది వ్యాయామాన్ని కూడా చేస్తుంటారు.

ఇలా ఎక్కువగా క్యాల్షియమ్ ఉండే ఆహారాన్ని తీసుకోవడం, ఆటలూ, బయట తిరగడంలో భాగంగా ఎక్కువగా విటమిన్ ‘డి’ని గ్రహించేలా ఆరుబయట ఎక్కువసేపు ఉండటం వంటి చర్యలన్నీ వారి బాల్యం, కౌమారం, యౌవన దశల్లో వారి ఎముకలను సాంద్రంగానూ, దాంతో బలంగానూ చేస్తాయి. ఆ సమయంలో సమకూర్చుకున్న ఎముక సాంద్రత దాదాపు వారి జీవితకాలమంతా రక్షణ ఇస్తూనే ఉంటుంది.

అందుకే ఆ దశల్లో ఎంత ఎక్కువ సాంద్రతను సమకూర్చుకుంటే, అటుపిమ్మట వారి 30 ఏళ్ల వయసు తర్వాత... ఎముక సాంద్రతను క్రమంగా కోల్పోయే దశ మొదలైనప్పటికీ... అది మెల్ల మెల్లగా జరుగుతూ పోతూ ఎముకలో మినరల్ డెన్సిటీ చాలా కాలం వరకు కొనసాగుతూ ఉండటం సాధ్యపడుతుంది. కానీ ఒకవేళ కీలకమైన ఆ సమయంలో యువకులు పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు బానిసలైతే మాత్రం... ఎముక సాంద్రత త్వరత్వరగా తగ్గిపోతూ... పెద్దవయసు వచ్చాక చాలా త్వరగానే ఆ నష్టాల ఫలితాలు కనిపిస్తాయి. దీనికి తోడు కౌమార, యౌవన దశల్లో ఒకవేళ వ్యాయామానికి దూరంగా ఉంటే... ఎముక సాంద్రత తగ్గిపోవడమన్నది మరింత వేగంగా జరుగుతుంటుంది.

మహిళల్లో ఎముక సాంద్రత మరికాస్త వేగంగా తగ్గడానికి దోహదం చేసే అంశాలివి...

సాధారణంగా పురుషుల కంటే మహిళల్లో ఎముకలు తమ సాంద్రత కోల్పోయే కండిషన్ చాలా వేగంగా జరుగుతుంటుంది. దీనికి అనేక అంశాలు కారణమవుతాయి. అవేమిటంటే... సాధారణంగా మహిళల్లో వ్యాయామం చేస్తూ, దాన్ని కొనసాగించే పరిస్థితి చాలా తక్కువగా ఉండటంతో ఎముకల్లో సాంద్రత తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ అంశాలతో పాటు... 45 ఏళ్లు దాటాక రుతుస్రావం ఏ సమయంలోనైనా ఆగిపోవడమనే కారణంతో మెనోపాజ్ తర్వాత ఎముక తన సాంద్రతను కోల్పోయే వేగం బాగా పెరుగుతుంది. ఈ కారణంగానే మెనోపాజ్ ఆగిన మహిళల్లో ఆస్టియోపోరోసిస్ ముప్పు (రిస్క్) మరింత ఎక్కువ. అందుకే పురుషులతో పోలిస్తే ఆస్టియోపోరోసిస్ కండిషన్ మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది.

కొన్ని రకాల జబ్బులతో ఎముక సాంద్రతపై తీవ్రమైన దుష్ప్రభావాలు

కొన్ని రకాల జబ్బులు ఎముక సాంద్రతను తీవ్రంగా తగ్గిస్తాయి. ఉదాహరణకు... కుషింగ్ సిండ్రోమ్, హైపోగొనాడిజమ్, థైరోటాక్సికోసిస్, అనొరెక్సియా నర్వోజా (తిండిపై ఆసక్తికోల్పోయి అసలు ఆహారం తీసుకోకపోయే రుగ్మత), మాల్ అబ్సార్‌ప్షన్ సిండ్రోమ్ (మనం తీసుకున్న పోషకాలు వంటికి పట్టని రుగ్మత) వంటివి ఎముక సాంద్రతను వేగంగా తగ్గిస్తాయి. ఇవే కాకుండా మరికొన్ని దీర్ఘకాలిక వ్యాధులు అంటే... దీర్ఘకాలిక (క్రానిక్) కాలేయ వ్యాధులు, దీర్ఘకాలికంగా బాధించే మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులు (క్రానిక్ కిడ్నీ డిసీజెస్), ఫిట్స్‌తో బాధపడేవారు తీసుకోవాల్సి వచ్చే మందులైన యాంటీ కన్వల్సెంట్స్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల వల్ల కూడా ఎముక సాంద్రత వేగంగా తగ్గిపోయి, ఆ తర్వాతి దశలో మొదటి వ్యాధుల ఫలితంగా సెకండరీ ఆస్టియోపోరోసిస్‌కు దారితీస్తాయి.

స్వాభావికంగా ఎముక సాంద్రతను పెంచుకోవడం... అలాగే అది చాలాకాలం పాటు కొనసాగడం కోసం...

ఎముక సాంద్రత పెంచుకునే ప్రయత్నాలు కౌమారం నుంచే కొనసాగాలి. ఎముక సాంద్రత పెరగడానికి తీసుకోవాల్సిన చర్యలూ, ప్రయత్నాలన్నీ పెద్దగా డబ్బు ఖర్చు పెట్టకుండా జరిగేందుకు అవకాశం ఉన్నవే ఎక్కువ. డబ్బు ఖర్చుపెట్టాల్సి రావడం చాలా తక్కువ. వాటిలో ముఖ్యమైనవి... చిన్నారులందరికీ వారు తమ యుక్త వయసులోకి వచ్చే ముందర క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని ఇవ్వడం. ఉదాహరణకు... క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారమంటే పాలు, పెరుగు, ముదురు ఆకుపచ్చరంగులో ఉండే ఆకుకూరలతో పాటు బ్రాకలీ వంటివాటిని పిల్లలు ఎక్కువగా తీసుకునేలా చూడాలి.

ఎముక సాంద్రత తెలుసుకోడానికి చేసే పరీక్షలివి...

ఆస్టియోపోరోసిస్ నిర్ధారణకు చేసే పరీక్షే ఎముక సాంద్రత తెలుసుకోడానికి కూడా ఉపయోగపడుతుంది. దీన్ని ‘డ్యుయల్ ఎనర్జీ ఎక్స్–రే అబ్జార్షియోమెట్రీ’ అంటారు. దీనితో కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే ఎముక సాంద్రత తెలిసిపోతుంది. అయితే ఈ విలువ నిర్ధారణ అందరిలో ఒకేలా ఉండదు. వయసును బట్టి మారిపోతూ ఉంటుంది. వయసును పరిగణనలోకి తీసుకుంటారు కాబట్టి దీన్ని ‘టీ’ స్కోర్‌గా చెబుతారు. దీంతో పాటు సీరమ్ లెవల్స్ ఆఫ్ క్యాల్షియమ్, ఫాస్ఫరస్, ఆల్కలైన్ ఫాస్ఫేట్స్, ఇన్‌టాక్ట్ పారాథైరాయిడ్ హార్మోన్ (పీటీహెచ్) వంటి పరీక్షలు కూడా చేయించాల్సి రావచ్చు.



ఎముక సాంద్రత పై దృష్టి పెట్టాల్సిన అవసరమున్నవారు ఎవరంటే...?

- మహిళల్లో 65 ఏళ్లు దాటిన వారు, పురుషులైతే 70 ఏళ్లు దాటినవారంతా ఒకసారి ఎముక సాంద్రత పరీక్ష (బోన్ స్కాన్) చేయించుకోవాలి.

అంతేకాకుండా... ఈ కింది కండిషన్స్ ఉంటే 50 ఏళ్ల పైబడ్డవారంతా ఎముక సాంద్రతపై దృష్టిపెట్టాలి...

- బరువు తక్కువగా ఉన్నవారు
- వెన్నెముకకు సంబంధించిన రుగ్మత లేదా అబ్‌నార్మాలిటీస్ ఉన్నవారు.
- తుంటి ఎముక ఫ్రాక్చర్ అయినవారు
- గతంలో ఏదైనా ప్రమాదం జరిగి ఎముక విరగడం వంటి ట్రామా కేసుల వారు.
- గ్లూకోకార్టికాయిడ్ స్టెరాయిడ్‌ను ఒక మందుగా తీసుకుంటున్నవారు
- హైపర్ థైరాయిడిజమ్‌తో బాధపడుతున్నవారు
- ఆస్టియోపోరోసిస్ జబ్బుకు మందు తీసుకుంటూ అదెంత ప్రభావపూర్వకంగా పనిచేస్తుందో అని డాక్టర్ల అబ్జర్వేషన్‌లో ఉన్నవారు.

ఎముక సాంద్రత పరీక్ష ఎవరెవరు, ఎప్పుడెప్పుడంటే?

- మహిళలు 55 ఏళ్లు దాటితే ప్రతి ఐదేళ్లకోమారు తప్పనిసరిగా ఎముక సాంద్రత పరీక్ష చేయించుకోవాలి.
- తిండికి సంబంధించిన రుగ్మతలు (అంటే తిన్నది సరిగా ఒంటబట్టకపోవడం వంటి ఈటింగ్ డిజార్డర్స్) ఉన్నవారు... విటమిన్ ‘డి’ లోపం ఉన్నవారు తప్పనిసరిగా తమకు 50 – 55 ఏళ్లు పైబడ్డ నాటి నుంచే డాక్టర్ సలహా మేరకు ఎముక సాంద్రత పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

ఎముక సాంద్రత ఎలా సమకూరుతుందంటే...

ఎముక సాంద్రంగా మారడానికి చాలా అంశాలు దోహదపడతాయి. ఇందులో ఆహారం, వ్యాయామం, ఆరుబయట తిరుగుతూ సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ కావడం వంటివి కీలక భూమిక పోషిస్తాయి. అయితే కొందరికి స్వాభావికంగానే వారి జన్యువుల్లోనే ఎముక సాంద్రత చాలా కాలం వరకు గరిష్ఠంగా ఉండే గుణం ఎక్కువగా ఉంటుంది. దాంతో వంశపారంపర్యంగా అలాంటివారి ఎముకలు చాలా పెద్దవయసు వచ్చే వరకు ఆరోగ్యంగానే ఉంటాయి. ముందుగా చెప్పినట్లుగా... వ్యాయామం / శారీరక శ్రమ చేయడం, తీసుకునే ఆహారంలో పాలు, ఆకుకూరల రూపంలో క్యాల్షియమ్ ఎక్కువగా తీసుకోవడం, చర్మానికి హానిచేయని మోతాదులో ఆరుబయట ఎండకు ఎక్స్‌పోజ్ అవుతూ విటమిన్ ‘డి’ని గ్రహించడంతో, విటమిన్ డీ ఎక్కువగా ఉండే పాల వంటి పాటు పలురకాల ఆహారాల ద్వారా కూడా విటమిన్ ‘డి’ని పొందుతూ ఉండటం వంటి అంశాలూ ఎముక సాంద్రత ఎక్కువకాలం నిలిచి ఉండేందుకు కారణమవుతుంటాయి.

వీరిలో ఎముక సాంద్రత తగ్గడం మరింత వేగం...

శరీరానికి చేటు తీసుకొచ్చే చెడు అలవాట్లైన... పొగతాగడం, మద్యం తాగే అలవాటూ, శారీరక శ్రమ చేయకుండా ఒక చోట కూర్చొని పనిచేయడం లేదా ఎక్కువసేపు బద్ధకంగా ఒకే చోట విశ్రాంతిగా ఉండటం, తరచూ జబ్బుల బారిన పడుతూ ఉండటం వంటి అంశాలన్నీ ఎముక సాంద్రతను తగ్గిస్తాయి. ఇవన్నీ ఎముక సాంద్రత తగ్గించడానికి తోడ్పడే స్వాభావిక కారణాలు.

ఇక మరికొన్ని అనివార్యమైన కారణాలు సైతం ఎముక సాంద్రతను వేగంగా తగ్గిస్తాయి. అవేమిటంటే... గ్లూకోకార్టికాయిడ్స్, యాంటీ ఎపిలెప్టిక్ వంటి కొన్ని రకాల మందుల్ని తీసుకోవాల్సి రావడం కూడా ఎముక సాంద్రతను బాగా తగ్గించి, అవి తేలిగ్గా గుల్లబారిపోయేలా చేస్తాయి.

ఎముకల్లో సాంద్రతను తగ్గించే మరికొన్ని అంశాలు...

పొగాకు, ఆల్కహాల్ దురలవాట్లు, వ్యాయామం చేయకపోవడం వంటివి సాంద్రత తగ్గించే అంశాలే అయినప్పటికీ వాటిని మనం ప్రయత్నపూర్వకంగా మార్చుకుని, ప్రయత్నపూర్వకంగా ఆ అలవాట్లు మానుకుని ఎముక సాంద్రత చాలాకాలం వరకు కొనసాగేలా చేసుకోవచ్చు.

అయితే పైన పేర్కొన్నట్టుగా ప్రయత్నపూర్వకంగా మార్చుకోలేని మరికొన్ని రిస్క్ ఫ్యాక్టర్లు కూడా ఉన్నాయి. అవి... జెండర్ కారణాలతో మహిళలల్లో అందునా మెనోపాజ్ తర్వాత ఎముకల సాంద్రత కోల్పోవడం ఎక్కువ. మహిళల్లో వారి ఎత్తు తక్కువైతే రిస్క్ మరింత ఎక్కువ. (అంటే... అరవై కిలోల కంటే లోపు ఉండి, 155 సెం.మీ. కంటే తక్కువ ఎత్తున్న మహిళల్లో ఎముక సాంద్రత తగ్గడం చాలా త్వరగా, వేగంగా జరుగుతుంటుంది).

దీనికి తోడు మనం దక్షిణాసియాలాంటి ప్రాచ్య ప్రాంతాల్లో (ఆసియా ఖండంలోని సదరన్, ఈస్టర్న్ ప్రాంతాల్లో) పుట్టిపెరగడమనే మన ప్రాంతీయత అనే అంశం కూడా ఎముక సాంద్రత వేగంగా తగ్గడానికి ఒక కారణమవుతుంది. ఎందుకంటే... పాశ్చాత్యులతో (గ్లోబులోని వెస్టర్న్ ప్రాంతాల్లోని దేశాలవాసులతో) పోలిస్తే ఆసియన్లు, చైనీయులు, కాకసాయిడ్స్‌లో ఎముక సాంద్రత స్వతహాగానే తక్కువ. అలాగే మన కుటుంబ ఆరోగ్య చరిత్ర కూడా ఒక కారణమవుతుంది. అంటే... కొందరిలో ఎముకలు తేలిగ్గా విరిగే తత్వం ఉంటుంది. ఇక మన ఆధునిక జీవనశైలిలో కాఫీలు ఎక్కువగా తాగడం, స్మోకింగ్ అలవాటు, ఆల్కహాల్ తీసుకోవడం వంటి దురలవాట్లు... ఇవన్నీ ఎముక సాంద్రత త్వరగా తగ్గిపోయేందుకు కారణమవుతుంటాయి.

విటమిన్ డీ కోసం ఆరుబయట ఆడేలా చూడటం వల్ల...

ఇక చిన్నారులందరూ ఆరుబయట ఎండకు ఎక్స్‌పోజ్ అవుతుండాలి. ఎక్కువసేపు సూర్మరశ్మిలో ఆడేలా వారిని ప్రోత్సహించాలి. అయితే నేరుగా తీక్షణమైన ఎండలో కాకుండా వారు భరించగలిగే ఎండలో ఆడేలా చేయడం వల్ల వాళ్ల ఒళ్లు ఎండవేడికి కమిలిపోదు. ఈ జాగ్రత్త తీసుకుంటూ ఎండలో పిల్లలను ఆడేలా చేయడం వల్ల వాళ్ల దేహంలో విటమిన్ ‘డి’ ఎక్కువగా తయారవుతుంది. ఇక ఈ విటమిన్ ‘డి’ అన్నది మనం తీసుకునే ఆహార పదార్థాల్లోని క్యాల్షియమ్‌ను మన ఎముకల్లోకి బాగా ఇంకిపోయేలా చేస్తుంది . పిల్లలూ, యువకులు... చిన్న / యుక్త వయసులో ఎంత ఎక్కువగా వ్యాయామం చేస్తే... అటు తర్వాత చాలాకాలం వరకు ఆ ఎముకల బలం కొనసాగుతూ ఉండటమే కాకుండా... బాగా వయసు పైబడ్డాక కూడా... అంటే వృద్ధాప్యంలోనూ ఎముకల్లో సాంద్రత చాలాకాలం కొనసాగుతుండటం వల్ల... ఎముకల్లో బలం చాలాకాలం వరకు పదిలంగా కొనసాగుతుంది.

చివరగా... పైన పేర్కొన్న వివరాల పట్ల అవగాహనను పెంపొందించుకుని ఆమేరకు ఎముకల సాంద్రత కోసం ప్రయత్నిస్తే... వయసు పెరిగాక కూడా చాలాకాలం వరకు ఎముకల ఆరోగ్యంగా బాగుంటూ... ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను సుదీర్ఘకాలం వరకు రాకుండా చూసుకోవడమూ సాధ్యమవుతుంది.

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

అరవింద్ యూత్‌లో వాటా కొనుగోలు

అరవింద్ ఫ్యాషన్స్ చేతికి 31.25 శాతం ఫ్లిప్‌కార్ట్ వాటా

న్యూఢిల్లీ: అరవింద్ యూత్ బ్రాండ్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌నకుగల 31.25 శాతం వాటాను అరవింద్ ఫ్యాషన్స్ సొంతం చేసుకోనుంది. ఇందుకు రూ. 135 కోట్లు వెచ్చించనున్నట్లు అరవింద్ ఫ్యాషన్స్ వెల్లడించింది. ఫ్లయింగ్ మెషీన్ బ్రాండుతో హోల్‌సేల్, రిటైల్ దుస్తులు, సంబంధిత వస్తువుల బిజినెస్‌ను ప్రస్తుతం అరవింద్ యూత్ నిర్వహిస్తోంది. గతేడాది(2024–25) రూ. 432 కోట్లకుపైగా టర్నోవర్ సాధించింది. గత ఐదేళ్లలో డిజిటల్ చానళ్లలోనూ ఫ్లయింగ్ మెషీన్ బాగా ప్రాచుర్యం పొందినట్లు అరవింద్ ఫ్యాషన్స్ పేర్కొంది. ప్రధానంగా ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కారణంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో టాప్ క్యాజువల్ వేర్ బ్రాండ్లలో ఒకటిగా అవతరించినట్లు తెలియజేసింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌తో అనుబంధం కొనసాగుతుందని, తమ బ్రాండ్ ఇతర డిజిటల్ చానళ్లు, పోర్టళ్లలోనూ అందుబాటులో ఉంటుందని అరవింద్ ఫ్యాషన్స్ ఎండీ, సీఈవో అమీషా జైన్ వివరించారు.

విజిలెన్స్ వ్యవహారాలను వెంటనే వెల్లడించాలి

ప్రభుత్వరంగ బ్యాంక్‌లకు ఆర్థిక శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు హోల్‌టైమ్ డైరెక్టర్లకు (డబ్ల్యూటీడీ) సంబంధించి విజిలెన్స్ వ్యవహారాలను వెంటనే నివేదించాలని కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. బోర్డు స్థాయిలో నియామకాలకు సంబంధించి ప్రతికూల సమాచారాన్ని సకాలంలో నివేదించని పలు సంఘటనల నేపథ్యంలో ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వరంగ సంస్థల చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ల నుంచి విజిలెన్స్ క్లియరెన్స్ కోరినప్పుడే.. ప్రైవేటు ఫిర్యాదులు, కోర్టుల పరిశీలనలు, సీబీఐ లేదా ఇతర చట్టపరమైన దర్యాప్తు సంస్థల సూచనలు వెలుగు చూస్తున్నట్లు పేర్కొంది. ఇందులో హోల్‌టైమ్ డైరెక్టర్లకు సంబంధించి కీలక సమాచారాన్ని విజిలెన్స్ క్లియరెన్స్ ఫార్మాట్‌ల నుంచి తొలగించడాన్ని ప్రస్తావించింది. దీంతో బోర్డు స్థాయిలో అధికారులకు సంబంధించి ప్రతికూల సమాచారాన్ని తక్షణమే తెలియజేయాలంటూ ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలను ఆర్థిక శాఖ ఆదేశించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-12-2025

విశాఖ	660–00
చిత్తూరు	703–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	665–00
విజయవాడ	680–00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	650–00
వరంగల్	652–00
రిటైల్ ధర	7.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	172.3	1.88
TATACONSUM	1,194.40	1.59
ASIANPAINT	2,775.00	1.04
GRASIM	2,846.00	1
NESTLEIND	1,280.00	0.58

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,453.40	-2.27
HCLTECH	1,630.60	-1.82
POWERGRID	260.8	-1.75
TRENT	4,224.20	-1.43
ADANIENT	2,201.00	-1.3

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,712
ఎన్ఎస్ఈ	103,928
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,58,208
ఎఫ్ఐఐ	- 2,760
డీఐఐ	+ 2,644

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	57.93	$	56.74
బ్రెంట్	61.30	$	60.24

4 కంపెనీల లిస్టింగ్‌కు సై

సెబీ గ్రీన్‌సిగ్నల్

- జాబితాలో నాక్ ప్యాకేజింగ్, వర్మోరా గ్రానైటో
- శివాలయ కన్‌స్ట్రక్షన్, బెహరీ లాల్ ఇంజినీరింగ్

కొత్తకేలండర్ ఏడాది రెండు రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో తాజాగా 4 కంపెనీల ప్రాస్పెక్టస్‌లకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోద ముద్ర వేసింది. మరో 3 కంపెనీలు ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వెరసి రెండేళ్లుగా రికార్డులు నెలకొల్పుతూ కదం తొక్కుతున్న ప్రైమరీ మార్కెట్లు 2026లోనూ సరికొత్త చరిత్ర బాటలో సాగనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

ఐపీవో స్ట్రీట్

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు వీలుగా 4 కంపెనీలు దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌లకు సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పబ్లిక్ ఇష్యూ చేపట్టడం ద్వారా నిధుల సమీకరణకు తెరతీయనున్నాయి. ఈ జాబితాలో నాక్ ప్యాకేజింగ్, వర్మోరా గ్రానైటో, శివాలయ కన్‌స్ట్రక్షన్, బెహరీ లాల్ ఇంజినీరింగ్ చేరాయి. ఈ కంపెనీలన్నీ ఐపీవో చేపట్టేందుకు అనుమతించమంటూ సెబీకి ఈ ఏడాది ఆగస్ట్– సెప్టెంబర్ మధ్యకాలంలో దరఖాస్తు చేశాయి. అయితే మరోపక్క గోప్యతా విధానంలో ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన ఇన్ఫీఫ్రెష్ ఫుడ్స్ దరఖాస్తును వెనక్కి తీసుకుంది. ఈ కేలండర్ ఏడాది(2025) ఇప్పటివరకూ ఐపీవోల ద్వారా 103 కంపెనీలు రూ. 1.76 లక్షల కోట్లను సమీకరించాయి. ఇది సరికొత్త చరిత్రకాగా.. 2024లోనూ 90 కంపెనీలు రూ. 1.6 లక్షల కోట్లు సమీకరించి రికార్డ్ నెలకొల్పిన విషయం విదితమే.

లిస్టింగ్‌కు హారిజన్ ఇండస్ట్రియల్

రూ. 2,600 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: గ్లోబల్ పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ గ్రూప్‌నకు పెట్టుబడులున్న హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుమతించమంటూ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 2,600 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఈ నిధుల్లో రూ. 2,250 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. ప్రస్తుతం కంపెనీలో బ్లాక్‌స్టోన్‌కు 89 శాతం వాటా ఉంది. ఐపీవోకు ముందు నిధుల సమీకరణలో భాగంగా 360 వన్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ, రాధాకృష్ణన్ దమానీ, ఈఏఏ, డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు షేర్లు జారీ చేసింది. తద్వారా 20 కోట్ల డాలర్లు(రూ. 1,650 కోట్లు) సమీకరించింది. కంపెనీ ప్రధానంగా ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్, ఆపరేటర్‌గా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ప్యాకేజింగ్ సొల్యూషన్లు

ప్యాకేజింగ్ సొల్యూషన్లు అందించే నాక్ ప్యాకేజింగ్ పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ. 475 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 70 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లతోపాటు ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 435 కోట్లు గుజరాత్ మెహసానాలోని బోరిసానాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న తయారీ యూనిట్‌పై వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

మౌలిక సదుపాయాలు

రహదారులు, బ్రిడ్జిలు తదితర నిర్మించే మౌలిక రంగ సదుపాయాలు కల్పించే ఈపీసీ సంస్థ శివాలయ కన్‌స్ట్రక్షన్స్ ఐపీవోకు వస్తోంది. ఇందుకు అనుగుణంగా రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.48 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 340 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

టైల్స్, బాత్‌వేర్ తయారీ

టైల్స్, బాత్‌వేర్ తయారీ రాజ్‌కోట్ కంపెనీ వర్మోరా గ్రానైటో పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 5.24 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లతోపాటు ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 280 కోట్లు అనుబంధ సంస్థల రుణాలు తీర్చేందుకు కేటాయించనుంది. మిగిలిన రూ. 40 కోట్లు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

కస్టమైజ్‌డ్ ప్రొడక్టులు

క్లయింట్ అవసరాలకు అనుగుణమైన ఐరన్, స్టీల్ ప్రొడక్టులు రూపొందించే బెహరీ లాల్ ఇంజినీరింగ్ ఐపీవోలో భాగంగా రూ. 110 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 78.54 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను పెట్టుబడి వ్యయాలకు, రుణ చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

వాగ్ టెక్నాలజీస్ సైతం

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: పర్యావరణ సంబంధ ఇంజినీరింగ్, టెక్నాలజీ కంపెనీ వాగ్ టెక్నాలజీస్ లిస్టింగ్‌కు వీలుగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 375 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 43.28 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను బెల్ కూలింగ్ టవర్స్‌లో మిగిలిన 50 శాతం వాటా కొనుగోలుకి వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా ఇండస్ట్రియల్, మునిసిపల్ క్లయింట్లకు నీటి సంబంధిత, వృథా నీటి శుద్ధి తదితర సర్వీసులు సమకూర్చుతోంది. వీటిలో వాటర్ ట్రీట్‌మెంట్‌సహా ఆయిల్ సెపరేషన్, వేస్ట్‌వాటర్ రీసైక్లింగ్, బయోగ్యాస్ ఉత్పత్తి తదితరాలున్నాయి. డిజైన్, ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఇన్‌స్టలేషన్ తదితర ఎండ్‌టుఎండ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్‌ను చేపడుతోంది. గతేడాది(2024–25) రూ. 165 కోట్ల ఆదాయం, రూ. 44 కోట్ల నికర లాభం ఆర్జించింది.

నియోలైట్ జెడ్‌కేడబ్ల్యూ రెడీ

రూ. 600 కోట్లపై కన్ను

న్యూఢిల్లీ: ఆటోమోటివ్ లైటింగ్ ప్రొడక్టుల తయారీ కంపెనీ నియోలైట్ జెడ్‌కేడబ్ల్యూ లైటింగ్స్ ఐపీవో చేపట్టేందుకు వీలుగా సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో రూ. 200 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. తద్వారా రూ. 600 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను తమిళనాడులోని కాంచీపురంలో కొత్తగా తయారీ ప్లాంటు ఏర్పాటుకు వినియోగించనుంది.

బీమాకు జీఎస్‌టీ సంస్కరణల జోష్

- ఇన్సూరెన్స్‌పై పెరుగుతున్న అవగాహన
- యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ సుమిత్ మదన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవిత బీమాపై జీఎస్‌టీని తొలగించిన నేపథ్యంలో పాలసీల అమ్మకాలు గణనీయంగా పెరిగాయని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో సుమీత్ మదన్ తెలిపారు. సెప్టెంబర్ 22 (మార్పులు అమల్లోకి వచ్చిన రోజు) తర్వాత నుంచి, దీపావళి రెండు మూడు రోజులు మినహాయిస్తే, వారం వారీగా 30–35 శాతం విక్రయాల వృద్ధి కనిపించిందని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ అనంతరం బీమాపై అవగాహన, పాలసీల కొనుగోళ్లు పెరిగాయని సాక్షి బిజినెస్ బ్యూరోకి సుమిత్ చెప్పారు. క్లెయిమ్ సెటిల్మెంట్లు మెరుగ్గా ఉండటం కూడా ఇందుకు ఒక కారణమని తెలిపారు. మరోవైపు, జెనరేషన్ జెడ్ కూడా బీమాపై ఆసక్తి చూపుతోందని వివరించారు. సౌకర్యవంతంగా డిజిటల్ మాధ్యమంతో పాటు సంప్రదాయ బ్యాంకెష్యూరెన్స్ మాధ్యమం ద్వారా కూడా కొనుగోళ్లు చేస్తోందని పేర్కొన్నారు. అయితే, పరిశ్రమ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ఇతరత్రా కారణాలతో కూడా బీమాపై అవగాహన పెరుగుతున్నప్పటికీ, అది ఆచరణలో (పూర్తి స్థాయిలో పాలసీల కొనుగోళ్ల రూపంలో) కనిపించేందుకు మరి కాస్త సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

తగినంత కవరేజీ కూడా ముఖ్యం..

బీమా తీసుకోవడం ఎంత ముఖ్యమో, తగినంత కవరేజీ తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని సుమిత్ చెప్పారు. చాలా మంది దీనిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదని వివరించారు. పరిస్థితులను బట్టి వార్షికాదాయానికి పది నుంచి పదిహేను రెట్లు కవరేజీ ఉండటం శ్రేయస్కరమని పేర్కొన్నారు. పాలసీదారులకు మరింత చేరువయ్యే క్రమంలో తమ ప్రక్రియల్లో కృత్రిమ మేథ (ఏఐ)ని కూడా వినియోగిస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థకు సంబంధించి దాదాపు 64 శాతం అండర్‌రైటింగ్ ఏఐతోనే జరుగుతోందని సుమిత్ వివరించారు. 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించడమనేది బీమా రంగానికి ప్రయోజనకరమేనని ఆయన చెప్పారు. దీనితో పోటీ పెరిగి, అంతిమంగా కస్టమర్లకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

ఎఫ్‌పీఐ అమ్మకాలలో రికార్డ్

2025లో రూ. 1.6 లక్షల కోట్లు వెనక్కి

దేశీ స్టాక్స్‌లో ఈ కేలండర్ ఏడాది(2025) విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అధిక శాతం అమ్మకాలకే కట్టుబడుతూ వచ్చారు. దీంతో ఈ ఏడాది నికరంగా రూ. 1.6 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇవి దేశీ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అత్యధిక అమ్మకాలుకాగా.. ఇంతక్రితం అత్యధికంగా 2022లో రూ. 1.21 లక్షల కోట్లు విలువైన స్టాక్స్ విక్రయించారు. ఈఏడాది ఏప్రిల్, మే, జూన్, అక్టోబర్‌లో మాత్రమే ఎఫ్‌పీఐలు నికర పెట్టుబడిదారులుగా నిలిచారు. డాలరుతో మారకంలో రూపాయి రికార్డ్ కనిష్టం(90)కు పతనంకావడం, వాణిజ్య(టారిఫ్) ఆందోళనలు, పలు కంపెనీల క్యూ2 ఫలితాలతోపాటు.. షేర్ల విలువలు వంటి అంశాలు ప్రభావం చూపినట్లు మార్కెట్ విశ్లేషకులు వివరించారు. ఈ ఏడాది డాలరుసహా.. యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ బలపడటం, రాజకీయ భౌగోళిక అనిశ్చితులు వర్ధమాన మార్కెట్ల ఈక్విటీ పెట్టుబడులపై ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు తెలియజేశారు. అయితే కొత్త ఏడాది(2026)లో విదేశీ ఇన్వెస్టర్లు దేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు మొగ్గు చూపే వీలున్నట్లు అంచనా వేస్తున్నారు.

2030కల్లా అనుబంధ సంస్థల లిస్టింగ్

- కోల్ ఇండియాను ఆదేశించిన పీఎంవో
- 2026 మార్చికల్లా 2 కంపెనీలు రెడీ

న్యూఢిల్లీ: అనుబంధ కంపెనీలను 2030కల్లా లిస్ట్ చేయవలసిందిగా మైనింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియాను ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో) ఆదేశించింది. కార్పొరేట్ పాలనతోపాటు.. జవాబుదారీతనాన్ని పెంచే బాటలో పీఎంవో తాజా ఆదేశాలు జారీ చేసింది. పాలనను క్రమబద్ధీకరించడం, పాదర్శకతను పెంపొందించడం, అసెట్ మానిటైజేషన్ ద్వారా తగిన విలువను వెలికితీయడం వంటి లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు దిగ్గజానికి మార్గనిర్దేశనం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. వెరసి అన్ని అనుబంధ కంపెనీలనూ 2030కల్లా లిస్ట్ చేసే చర్యలకు తెరతీయవలసిందిగా ఆదేశించినట్లు తెలుస్తోంది. కోల్ ఇండియాకు.. ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, భారత్ కోకింగ్ కోల్, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, నార్తరన్ కోల్‌ఫీల్డ్స్, మహానది కోల్‌ఫీల్డ్స్, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ అనుబంధ కంపెనీలుగా వ్యవహరిస్తున్నాయి. వీటిలో 2026 మార్చికల్లా భారత్ కోకింగ్ కోల్, సెంట్రల్ మైన్ ప్లానింగ్‌ను లిస్ట్ చేసే యోచనలో కోల్ దిగ్గజం ఉంది. ఇందుకు సంబంధించిన సన్నాహాలు పూర్తయ్యాయి.

వీఐటీఐఎల్ నిధుల సమీకరణ పూర్తి

- ఎన్‌సీడీల జారీతో రూ. 3,300 కోట్లు
- వొడాఫోన్ ఐడియా రుణ చెల్లింపులకు వినియోగం

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా అనుబంధ సంస్థ వొడాఫోన్ ఐడియా టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(వీఐటీఐఎల్) నిధుల సమీకరణను పూర్తి చేసినట్లు మొబైల్ టెలికం దిగ్గజం తెలియజేసింది. మార్పిడికి వీలుకాని డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ. 3,300 కోట్లు అందుకున్నట్లు వెల్లడించింది. నిధులను తమ(మాతృ సంస్థ వొడాఫోన్ ఐడియా)కు చెల్లించవలసిన రుణాలకు వెచ్చించనున్నట్లు పేర్కొంది. వెరసి తమ పెట్టుబడి వ్యయాలకు, బిజినెస్ వృద్ధికి నిధులు తోడ్పాటునివ్వనున్నట్లు వొడాఫోన్ ఐడియా(వీఐఎల్) పేర్కొంది. . తాజా నిధుల సమీకరణ కంపెనీ వ్యూహాలు, దీర్ఘకాలిక ప్రణాళికలపట్ల పెట్టుబడిదారులకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నట్లు వీఐఎల్ సీఈవో అభిజిత్ కిషోర్ పేర్కొన్నారు. నెట్‌వర్క్ విస్తరణతోపాటు.. కస్టమర్లకు సర్వీసులను మరింత పెంచనున్నట్లు తెలియజేశారు. భారీ ఎన్‌బీఎఫ్‌సీలుసహా.. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ పెట్టుబడులకు ఆసక్తి చూపినట్లు వెల్లడించింది.

హైదరాబాద్‌లో 23 శాతం తగ్గిన ఇళ్ల విక్రయాలు

- 2025లో 44,885 యూనిట్లకు పరిమితం
- గతేడాది విక్రయాలు 58,540 యూనిట్లు
- ఆరు నగరాల్లో ఈ ఏడాది పడిపోయిన అమ్మకాలు

న్యూఢిల్లీ: హైదరాబాద్ రియల్టీ మార్కెట్ ఈ ఏడాది నీరసించింది. విక్రయాలు క్రితం ఏడాదితో పోల్చి చూసినప్పుడు 23 శాతం తగ్గి 44,885 యూనిట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది అమ్మకాలు 58,540 యూనిట్లుగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఆరు నగరాల్లో ఈ ఏడాది ఇళ్ల అమ్మకాలు 14 శాతం పడిపోయాయి. ఒక్క చెన్నై నగరంలో మాత్రం డిమాండ్ పుంజుకుంది. ఇళ్ల యూనిట్ల అమ్మకాలు తగ్గినప్పటికీ, విలువలో మాత్రం వృద్ధి కనిపించింది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ విడుదల చేసింది. ప్రాపర్టీ ధరలు పెరగడం, ఐటీ రంగంలో ఉద్యోగుల తొలగింపులు, భౌగోళిక రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు విక్రయాలు తగ్గడానికి కారణాలుగా అనరాక్ పేర్కొంది. ఏడు నగరాల్లో ఇళ్ల ధరలు ఈ ఏడాది సగటున 8 శాతం మేర పెరిగినట్టు వెల్లడించింది.

విక్రయాలు ఇలా..

- ➤ మొత్తం ఏడు నగరాల్లో 2025లో ఇళ్ల అమ్మకాలు ఇప్పటి వరకు 3,95,625 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది విక్రయాలు 4,59,645 యూనిట్లుగా ఉండడం గమనార్హం. ఈ ఏడాది అమ్ముడుపోయిన ఇళ్ల విలువ రూ.6 లక్షల కోట్లుగా ఉంది. క్రితం ఏడాది అమ్మకాల విలువ రూ.5.68 లక్షల కోట్లతో పోల్చితే 6 శాతం పెరిగింది.
- ➤ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో 1,27,875 ఇళ్లు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది కంటే 18 శాతం తగ్గాయి.
- ➤ పుణెలోనూ క్రితం ఏడాదితో పోల్చితే 20 శాతం తక్కువగా 65,135 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.
- ➤ బెంగళూరులో 5 శాతం తక్కువగా 65,135 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- ➤ ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో విక్రయాలు 57,220 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది విక్రయాలు 61,900 కంటే 8 శాతం తగ్గాయి.
- ➤ కోల్‌కతాలో 16,125 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు జరిగాయి. క్రితం ఏడాదితో పోల్చితే 12 శాతం పడిపోయాయి.
- ➤ చెన్నైలో మాత్రం అమ్మకాలు క్రితం ఏడాదితో పోల్చితే 15 శాతం పెరిగాయి. 22,180 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి.
- ➤ 2024లో ఇళ్ల ధర చదరపు అడుగునకు రూ.8,590గా ఉంటే, ఈ ఏడాది 8 శాతం పెరిగి రూ.9,260కు చేరుకుంది.

2026 అమ్మకాలు ఎలా ఉండొచ్చు?

క్రితం ఏడాది డబుల్ డిజిట్ స్థాయిలో ఇళ్ల ధరలు పెరగ్గా.. ఈ ఏడాది సింగిల్ డిజిట్ పెరుగుదలతో ఆగినట్టు అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు. 2026లో ఇళ్ల మార్కెట్ పనితీరు ఎన్నో అంశాలపై ఆధారపడి ఉన్నట్టు చెప్పారు. ముఖ్యంగా ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు, ఇళ్ల ధరల తీరు అమ్మకాలను ప్రభావితం చేస్తాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

రియల్టీలో తగ్గిన పీఈ పెట్టుబడులు

- ఈ ఏడాది 3.46 బిలియన్ డాలర్లే
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగంలో ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థల పెట్టుబడులు ఈ ఏడాది చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గుముఖం పట్టాయి. కేవలం 3.46 బిలియన్ డాలర్ల (రూ.31వేల కోట్లు) పెట్టుబడులే వచ్చినట్టు రియల్ ఎస్టేట్ రంగ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది. ముఖ్యంగా ఇళ్లు, గోదాముల ప్రాజెక్టుల్లోకి పెట్టుబడులు పెద్ద మొత్తంలో తగ్గుముఖం పట్టినట్టు తెలిపింది. 2024లో రియల్ ఎస్టేట్ రంగం 4.9 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. దీంతో పోల్చితే ఈ ఏడాది పీఈ పెట్టుబడులు 29 శాతం తగ్గినట్టు తెలుస్తోంది. 2018లో రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చిన 6.73 బిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులే ఇప్పటి వరకు గరిష్ట రికార్డుగా ఉంది. ఈ ఏడాది పీఈ ఇన్వెస్టర్లు అప్రమత్త ధోరణితో వ్యవహరించినట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా పేర్కొంది.

విభాగాల వారీ పెట్టుబడులు..

- → రియల్ ఎస్టేట్‌లో.. ఈ ఏడాది ఆఫీస్ ఆస్తుల విభాగంలోకి వచ్చిన పీఈ పెట్టుబడులు 2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2024లో ఇదే విభాగంలోకి వచ్చిన 1.85 బిలియన్ డాలర్లతో పోల్చితే స్వల్పంగా పెరిగాయి. ఈ ఏడాది మొత్తం పీఈ పెట్టుబడుల్లో ఒక్క ఆఫీస్ ఆస్తుల విభాగమే 58 శాతం ఆకర్షించింది.
- → రిటైల్ రియల్ ఎస్టేట్ విభాగంలోకి 374 మిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులు వచ్చాయి. గతేడాది ఈ విభాగంలోకి అసలు పీఈ పెట్టుబడులే రాలేదు.
- → ఇళ్ల ప్రాజెక్టుల్లోకి 576 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. గతేడాది ఇదే విభాగంలోకి వచ్చిన 1,177 మిలియన్ డాలర్లతో పోల్చితే సగం తగ్గాయి.
- → వేర్‌హౌసింగ్ పార్క్‌ల్లోకి వచ్చిన పీఈ పెట్టుబడులు 510 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గతేడాది ఇదే విభాగంలోకి వచ్చిన 1,877 మిలియన్ డాలర్లతో పోల్చితే గణనీయంగా తగ్గుముఖం పట్టాయి.

2026లో సానుకూలం..

దేశ స్థూల ఆర్థిక పరిస్థితులు (జీడీపీ వృద్ధి బలపడడం, వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం తగ్గడం) సానుకూలంగా ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు తగ్గినట్టు నైట్‌ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ పేర్కొన్నారు. 2026లో మాత్రం పీఈ పెట్టుబడులు 28 శాతం పెరిగి 4.4 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేశారు. అన్ని విభాగాల్లోకి విస్తృత స్థాయిలో కాకుండా, పీఈ పెట్టుబడులు పుంజుకోవడం నెమ్మదిగా ఉండొచ్చన్నారు. రీట్‌లు, ఇన్విట్‌లు, ఆతిథ్యం, డేటా సెంటర్‌లలోకి వచ్చిన పీఈ పెట్టుబడుల లావాదేవీలను ఈ గణాంకాల కోసం పరిగణనలోకి తీసుకోలేదని నైట్‌ఫ్రాంక్ ఇండియా స్పష్టం చేసింది.

హైదరాబాద్ 'హ్యాట్రిక్' ఓటమి

- 310 పరుగులు చేసినా తప్పని పరాజయం
- రాణించిన రాహుల్ సింగ్, అభిరథ్ రెడ్డి, నితేశ్ రెడ్డి

రాహుల్

రాజ్‌కోట్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టుకు వరుసగా మూడో పరాజయం ఎదురైంది. అస్సాం జట్టుతో సోమవారం జరిగిన గ్రూప్ 'బి' మూడో లీగ్ మ్యాచ్‌లో **హైదరాబాద్** నాలుగు వికెట్ల తేడాతో ఓడిపో**యింది. ముం**దుగా బ్యాటింగ్‌కు దిగిన హైద**రాబాద్ నిర్ణీత** 50 ఓవర్లలో 8 వికెట్లు కో**ల్పోయి 310 పరు**గులు సాధించింది. జి.రాహుల్ **సింగ్ (71** బంతుల్లో 79; 14 ఫోర్లు), అభిర**థ్ రెడ్డి (66** బంతుల్లో 54; 6 ఫోర్లు), నితే**శ్ రెడ్డి (25** బంతుల్లో 53; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు**) అర్ధసెం**చరీలు చేశారు. వరుణ్ గౌడ్ (**46 బంతుల్లో** 42; 2 ఫోర్లు, 1 సిక్స్), రాహు**ల్ బుద్ధి (41** బంతుల్లో 35; 1 ఫోర్, 1 సిక్స్) కూడా రాణించారు. అస్సాం బౌలర్లలో అబ్దుల్ అజీజ్ ఖురేషి 3 వికెట్లు, పుర్కాయస్థ, శిబ్‌శంకర్ రాయ్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 311 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అస్సాం జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసి గెలిచింది. శిబ్‌శంకర్ రాయ్ (109 బంతుల్లో 112; 11 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ చేయగా... సారవ్ (112 బంతుల్లో 91; 9 ఫోర్లు, 1 సిక్స్), డెనిష్ దాస్ (46 బంతుల్లో 54; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలతో మెరిపించారు. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ 68 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన హైదరాబాద్ గ్రూప్ 'బి'లో ఏడో స్థానంలో ఉంది. 31న జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో బరోడా జట్టుతో హైదరాబాద్ ఆడుతుంది.

ఆంధ్ర జట్టుకు రెండో ఓటమి

ప్రసాద్

ఆలూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టుకు రెండో పరాజయం ఎదురైంది. గ్రూప్ 'డి'లో భాగంగా సోమవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర ఆరు వికెట్ల తేడాతో ఒడిశా జట్టు చేతిలో ఓటమి పాలైంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 49.2 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. కోన శ్రీకర్ భరత్ (58 బంతుల్లో 32; 3 ఫోర్లు), షేక్ రషీద్ (35 బంతుల్లో 20; 1 ఫోర్) క్రీజులో నిలదొక్కుకుంటున్న దశలో నిష్క్రమించారు. కెప్టెన్ నితీశ్ కుమార్ రెడ్డి (11 బంతుల్లో 6; 1 ఫోర్) నిరాశ పరిచాడు. ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (64 బంతుల్లో 66; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), చివర్లో సౌరభ్ కుమార్ (26 బంతుల్లో 47; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించడంతో ఆంధ్ర స్కోరు 200 దాటింది. ఒడిశా బౌలర్లలో బిప్లాబ్ సామంత్రే, గోవింద పొద్దార్ 3 వికెట్ల చొప్పున తీశారు. 222 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒడిశా జట్టు 43.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 223 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ స్వస్తిక్ సామల్ (0) ఆడిన తొలి బంతికే అవుటైనా... ఓం ముండే (111 బంతుల్లో 91; 7 ఫోర్లు), గోవింద పొద్దార్ (105 బంతుల్లో 89; 9 ఫోర్లు) ఒడిశా విజయాన్ని ఖాయం చేశారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 166 పరుగులు జోడించారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక దాంట్లో నెగ్గిన ఆంధ్ర జట్టు గ్రూప్ 'డి'లో నాలుగు పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. ఈనెల 31న జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టుతో తలపడుతుంది.

బెంగాల్ టైగర్స్ గెలుపు

రాంచీ: మహిళల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో ప్రాచి బెంగాల్ టైగర్స్ జట్టు శుభారంభం చేసింది. జేఎస్‌డబ్ల్యూ సూర్మా హాకీ క్లబ్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ టైగర్స్ 1–0 గోల్ తేడాతో గెలుపొందింది. ఆట 11వ నిమిషంలో అగస్టీనా గొర్జెలానీ చేసిన గోల్‌తో బెంగాల్ టైగర్స్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని సొంతం చేసుకుంది. నేడు జరిగే మ్యాచ్‌లో రాంచీ రాయల్స్‌తో బెంగాల్ టైగర్స్ తలపడుతుంది.

కార్ల్‌సన్‌కు అర్జున్ షాక్

- నార్వే దిగ్గజంపై 45 ఎత్తుల్లో విజయం సాధించిన భారత గ్రాండ్‌మాస్టర్
- ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో 10 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో

దోహా: ర్యాపిడ్ ఫార్మాట్‌లో కాంస్య పతకం సాధించిన భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ అర్జున్ ఇరిగేశి అదే జోరును బ్లిట్జ్ ఫార్మాట్‌లోనూ కొనసాగిస్తున్నాడు. సోమవారం మొదలైన ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తొలి రోజు నిర్ణీత 13 రౌండ్లు ముగిశాక అర్జున్ 10 పాయింట్లతో మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్), ఫాబియానో కరువానా (అమెరికా)లతో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు. నేడు మరో ఆరు రౌండ్లు జరుగుతాయి. అనంతరం టాప్–4లో నిలిచిన వారు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు. సెమీఫైనల్స్ విజేతల మధ్య టైటిల్ పోరు జరుగుతుంది. సోమవారం 13 గేమ్‌లు ఆడిన అర్జున్ 8 గేముల్లో గెలిచి, 4 గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. ఒక గేమ్‌లో ఓడిపోయాడు. ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఆరోసారి విశ్వవిజేతగా అవతరించిన నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో జరిగిన 9వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 45 ఎత్తుల్లో గెలుపొందడం విశేషం. సుయరోవ్ (ఉజ్బెకిస్తాన్), చిగయెవ్ (స్పెయిన్), అమీన్ (ఇరాన్), ప్రణవ్ (భారత్), డెనిస్ మఖ్నెవ్ (కజకిస్తాన్), నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)లపై కూడా అర్జున్ గెలుపొందాడు. అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్), ఫాబియానో కరువానా, మాక్సిమి, డానిల్ దుబోవ్ (రష్యా)లతో 'డ్రా' చేసుకున్న అర్జున్... జోర్డాన్ వాన్ ఫారెస్ట్ (నెదర్లాండ్స్) చేతిలో ఓడిపోయాడు. 13 రౌండ్ల తర్వాత భారత ఇతర గ్రాండ్‌మాస్టర్లు ప్రాణేశ్ 13వ స్థానంలో, గౌతమ్ కృష్ణ 14వ స్థానంలో, ప్రజ్ఞానంద 15వ స్థానంలో, రౌనక్ సాధ్వాని 16వ స్థానంలో... క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 26వ స్థానంలో ఉన్నారు.

దివ్య దేశ్‌ముఖ్ 34వ స్థానంలో

మహిళల విభాగంలో భారత క్రీడాకారిణులు నిరాశ పరిచారు. తొలి రోజు నిర్ణీత 10 రౌండ్లు ముగిశాక భారత క్రీడాకారిణులెవరూ టాప్–30లో కూడా లేకపోవడం గమనార్హం. ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ 6 పాయింట్లతో 34వ స్థానంలో ఉంది. భారత్‌కే చెందిన రక్షిత రవి 41వ స్థానంలో, చర్వీ 49వ స్థానంలో, పద్మిని రౌత్ 53వ స్థానంలో, ద్రోణవల్లి హారిక 57వ స్థానంలో, వైశాలి 58వ స్థానంలో, కోనేరు హంపి 61వ స్థానంలో ఉన్నారు. నేడు మరో ఐదు రౌండ్లు జరుగుతాయి. అనంతరం టాప్–4లో నిలిచిన వారు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

అర్జున్, హంపిలకు ప్రధాని ప్రశంస

న్యూఢిల్లీ: ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, ఆంధ్రప్రదేశ్ స్టార్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిలను భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. 'హంపి మీకు అభినందనలు. దోహాలో జరిగిన 'ఫిడే' టోర్నీలో మీ ప్రదర్శన అద్భుతం. మహిళల విభాగంలో మీరు సాధించిన కాంస్యం మీ అంకితభావం, నిబద్ధతకు నిదర్శనం. ఇలాంటి పతకాలు, ఘన విజయాలు ఇక ముందూ కొనసాగించాలని ఆశిస్తున్నాను'అని ప్రధాన మంత్రి మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఫిడే ప్రపంచ చెస్ ఓపెన్ కేటగిరీలో కాంస్యం గెలిచిన అర్జున్‌ను చూస్తుంటే గర్వంగా ఉంది. టోర్నీ అసాంతం చెప్పుకోదగిన ప్రదర్శన కనబరిచావు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులోనూ రాణించాలి' అని అర్జున్‌ను ఉద్దేశిస్తూ మరో పోస్ట్‌లో ప్రధాని ప్రశంసించారు.

వయస్సు తప్పగా చూపించినందుకు....

హైదరాబాద్ క్రికెటర్ రామ్‌చరణ్‌పై రెండేళ్ల నిషేధం విధించిన బీసీసీఐ

సాక్షి, హైదరాబాద్: వయస్సును తక్కువగా చూపించి దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లో ఆడిన హైదరాబాద్ క్రికెటర్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రెండేళ్ల నిషేధం విధించింది. బోర్డు అధికారిక అండర్–16 టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీలో మర్కట్ట రామ్‌చరణ్ హైదరాబాద్ జట్టు తరఫున బరిలోకి దిగాడు. లీగ్ దశలో హైదరాబాద్ నాలుగు మ్యాచ్‌లు ఆడగా ఢిల్లీ, హరియాణా, మహారాష్ట్రలపై రామ్‌చరణ్ మూడు సెంచరీలు నమోదు చేశాడు. అయితే రామ్‌చరణ్ వయసుకు సంబంధించిన సందేహం కారణంగా వచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) విచారణ జరిపింది. విచారణలో రామ్‌చరణ్‌కు రెండు వేర్వేరు తేదీలతో 'బర్త్ సర్టిఫికెట్'లు ఉన్నట్లు, అతను తన వయసును తక్కువగా చూపించి అండర్–16 టోర్నీలో ఆడినట్లు తేలింది. దాంతో బీసీసీఐ అతడిని రెండేళ్ల పాటు అన్ని రకాల క్రికెట్ నుంచి నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. రెండేళ్ల తర్వాత రామ్‌చరణ్ మళ్లీ ఆడవచ్చని...అయితే ఎలాంటి వయో విభాగంతో సంబంధం లేకుండా కేవలం సీనియర్ స్థాయిలోనే బరిలోకి దిగాల్సి ఉంటుందని కూడా బీసీసీఐ స్పష్టం చేసింది.

7 పరుగులకు 8 వికెట్లు

భూటాన్ స్పిన్నర్ సోనమ్ ప్రపంచ రికార్డు

థింపూ: భూటాన్ స్పిన్నర్ సోనమ్ యెశేయ్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. మయన్మార్‌తో జరిగిన పురుషుల టి20 మ్యాచ్‌లో అతను 7 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. గెలెపు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ (భూటాన్)లో జరిగిన ఈ టి20 మ్యాచ్‌లో మొదట ఆతిథ్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 127 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన మయన్మార్ బ్యాటర్లకు 22 ఏళ్ల లెఫ్టార్మ్ స్పిన్నర్ సోనమ్ స్పిన్ ఉచ్చు బిగించాడు. దీంతో జట్టంతా కలిసి కనీసం 50 పరుగులైనా చేయలేకపోయింది. మయన్మార్ 45 పరుగులకే కుప్పకూలడంతో 82 పరుగుల తేడాతో భూటాన్ గెలుపొందింది. ఓవరాల్ టి20 క్రికెట్ చరిత్రలోనే... అంటే క్లబ్, లీగ్, అంతర్జాతీయ **పురుషులు, మహి**ళల క్రికెట్లో ఇంతవరకు ఏ బౌలర్ **కూడా 8 వికెట్లు** తీయనేలేదు. అయితే తాజాగా **సోనమ్ యెశేయ్** (4–1–7–8) అద్భుతమైన **స్పెల్‌తో క్రికెట్ పు**టలకెక్కాడు.

గత రికార్డు 7!

అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో గతంలో ఇద్దరు **బౌలర్లు 7 వికెట్ల**తో ఘనతకెక్కారు. 2023లో చైనాతో జరిగిన మ్యాచ్‌లో మలేసియాకు చెందిన సియాజ్రుల్ ఇద్రుస్ (7/8) ప్రదర్శనే మెరుగైన రికార్డుగా ఉండేది. ఈ ఏడాది బహ్రెయిన్ బౌలర్ అలీ దావూద్ (7/19) కూడా భూటాన్‌పై ఏడు వికెట్లు పడగొట్టాడు. మహిళల అంతర్జాతీయ టి20ల్లో 7 వికెట్ల ఘనతలు నాలుగున్నాయి. గతేడాది మంగోలియాపై ఇండోనేసియా బౌలర్ రొహ్మాలియా 7/0తో అసాధారణ రికార్డు సృష్టించింది. ఫ్రెడెరిక్ (నెదర్లాండ్స్ 7/3; ఫ్రాన్స్‌పై), అలిసన్ (అర్జెంటీనా 7/3; పెరూపై), సమంతి దునుకెడెనియా (సైప్రస్ 7/15; చెక్ రిపబ్లిక్‌పై) ఈ నలుగురూ 7 వికెట్లు తీశారు. ఇక క్లబ్, లీగ్ క్రికెట్లో అయితే ఏడు వికెట్ల ప్రదర్శనలెన్నో ఉన్నాయి.

10 ఓవర్లలో 123 పరుగులు

పుదుచ్చేరి పేస్ బౌలర్ అమాన్ ఖాన్ చెత్త రికార్డు

అహ్మదాబాద్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో పుదుచ్చేరి కెప్టెన్, ఆల్‌రౌండర్ అమాన్ ఖాన్ కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. అయితే ఇది దురదృష్టవశాత్తూ చెప్పుకోవడానికి ఇష్టపడని అవమానకరమైన రికార్డు కావడం గమనార్హం. జార్ఖండ్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అమాన్ 10 ఓవర్లలో ఏకంగా 123 పరుగులు సమర్పించుకున్నాడు. దేశవాళీ, అంతర్జాతీయ వన్డేలు కలిపి (లిస్ట్–ఎ క్రికెట్)లో ఒక మ్యాచ్‌లో బౌలర్ ఇచ్చిన అత్యధిక పరుగులు ఇవే కావడం విశేషం. ఇదే టోర్నీలో ఈ నెల 24న బిహార్‌తో జరిగిన మ్యాచ్‌లో అరుణాచల్‌ప్రదేశ్ బౌలర్ మిబోమ్ మోసూ 9 ఓవర్లలో ఇచ్చిన 116 పరుగుల రికార్డు ఇప్పుడు తెరమరుగైంది. ఐపీఎల్‌లో రెండు సీజన్ల పాటు కోల్‌కతా, ఢిల్లీ జట్లకు కలిపి 12 మ్యాచ్‌లలో ఆడినా ఒకే ఒక ఓవర్ బౌలింగ్ చేసే అవకాశం వచ్చిన అమాన్ ఖాన్ ఇటీవల జరిగిన 2026 వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ రూ.40 లక్షలకు సొంతం చేసుకుంది. పుదుచ్చేరితో మ్యాచ్‌లో 50 ఓవర్లలో 7 వికెట్లకు 368 పరుగులు చేసిన జార్ఖండ్...ఆ తర్వాత పుదుచ్చేరిని 235 పరుగులకే ఆలౌట్ చేసి 133 పరుగులతో విజయాన్నందుకుంది.

మెల్‌బోర్న్ పిచ్ అసంతృప్తికరం

'యాషెస్' నాలుగో టెస్టు వేదిక ఎంసీజీకి ఒక డిమెరిట్ పాయింట్ విధింపు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మెల్‌బోర్న్ పిచ్‌పై అసంతృప్తి వెలిబుచ్చింది. ఆ్రస్టేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్‌లో నాలుగో టెస్టుకు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) వేదికైంది. రెండు రోజుల్లోనే ముగిసిన ఈ పిచ్ పేలవమని ప్రకటించింది. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో 'ఏకపక్షంగా బౌలర్లకు మాత్రమే సహకరించిన వికెట్' అని ఐసీసీకి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. దీన్నిబట్టి ఐసీసీ ఎంసీజీ అసంతృప్తిపరిచిన వేదిక అని... ఒక డిమెరిట్ పాయింట్ విధించింది. ఏదైనా వేదికకు 6 డిమెరిట్ పాయింట్లు జమ అయితే ఆ స్టేడియాన్ని 12 నెలల పాటు నిషేధిస్తారు. 26న మొదలైన ఈ 'బాక్సింగ్ డే' టెస్టు అత్యంత నిరుత్సాహకరంగా మరునాడే ముగిసింది. ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో గెలిచిన ఈ మ్యాచ్‌లో మొదటి రోజే ఇరు జట్లు ఆలౌటయ్యాయి. 20 వికెట్లు నేలకూలాయి. తర్వాతి రోజు 16 వికెట్లు పడ్డాయి. ఆ్రస్టేలియాలో 'బాక్సింగ్ డే' టెస్టుకున్న ప్రత్యేకతే వేరు. ఏకంగా 90 వేలకు పైగానే ప్రేక్షకులు పోటెత్తిన ఈ మ్యాచ్ అనూహ్యంగా రెండే రోజుల్లో ముగియడం క్రికెట్ అభిమానుల్ని సైతం నిరాశపరిచింది. ఈ టెస్టుకు ముందే యాషెస్‌ను గెలుచుకున్న ఆతిథ్య ఆ్రస్టేలియా... ప్రస్తుతం 3–1తో ఇంగ్లండ్‌పై పైచేయిని కొనసాగిస్తోంది. ఇరు జట్ల మధ్య ఆఖరి టెస్టు వచ్చే నెల 4 నుంచి సిడ్నీలో జరుగుతుంది.

కర్ణాటక జట్టు

తెలంగాణ జట్టు

రన్నరప్ తెలంగాణ
చాంపియన్ కర్ణాటక

సాక్షి, హైద**రాబాద్: సౌత్ జోన్ అక్వాటిక్స్ సబ్** జూనియర్ **చాంపియన్‌షిప్‌లో కర్ణాటక జట్టు** ఓవరాల్ చాంపియన్‌గా **అవతరించింది. ఆతిథ్య** తెలంగాణ **జట్టు రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ** స్విమ్మింగ్ **అసోసియేషన్ (టీఎస్ఏ) ఆధ్వర్యంలో** మూడు రో**జులపాటు ఇక్కడి గచ్చిబౌలి స్విమ్మింగ్** కాంప్లెక్స్‌లో **జరిగిన ఈ పోటీలు సోమవారం** ముగిశాయి. **కర్ణాటక జట్టు మొత్తం 1040** పాయింట్లతో **అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.** తెలంగాణ **జట్టు 453 పాయింట్లతో రెండో** స్థానాన్ని **దక్కించుకుంది. తెలంగాణకే చెందిన** ఇషాన్ దాస్ **'ఫాస్టెస్ట్ స్విమ్మర్' అవార్డు గెల్చు**కున్నాడు. **వాటర్ పోలో ఈవెంట్‌లో కేరళ బాల** బాలికల **విభాగాల్లో టైటిల్ సాధించి 'డబుల్** ధమాకా' **సృష్టించింది. బాలికల ఫైనల్లో కేరళ** 11–8తో కర్ణాటక **జట్టుపై... బాలుర ఫైనల్లో కేరళ** 12–6తో కర్ణాటక జట్టుపైనే గెలుపొందింది. తెలంగాణ పారా స్విమ్మింగ్ అసోసియేషన్ **అధ్యక్షురాలు అలివేలు మంగ ముఖ్యఅతిథిగా** విచ్చేసి విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఏ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ **రెడ్డి, సెక్రటరీ జి.ఉమేశ్, సంయుక్త కార్యదర్శి** గిరిధర్ రావు తదితరులు పాల్గొన్నారు. చివరి రోజు ఫలితాలు ఇలా ఉన్నాయి.

గ్రూప్–1 బాలుర 50 మీటర్ల ఫ్రీస్టయిల్: 1. ఇషాన్ దాస్ (తెలంగాణ; 24.95 సెకన్లు), 2. బి.శ్రీహరి (కేరళ; 25.08 సెకన్లు), 3. కోరె అనీశ్ అనిరుధ (కర్ణాటక; 25.30 సెకన్లు).

గ్రూప్–1 బాలుర 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్: 1. జక్కా గణేశ్ చక్రధర్ (ఆంధ్రప్రదేశ్; 1ని:08.28 సెకన్లు), 2. తనూజ్ సింగ్ (కర్ణాటక; 1ని:09.40 సెకన్లు), 3. జోర్డాన్ డొమినిక్ ఫ్రాంక్లిన్ (తెలంగాణ; 1ని:09.64 సెకన్లు).

గ్రూప్–2 బాలుర 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్: 1. ఎస్.క్రిష్ (కర్ణాటక; 2ని:23.43 సెకన్లు), 2. సచిన్ సాత్విక్ (తెలంగాణ; 2ని:24.45 సెకన్లు), 3. నిఖిల్ (తమిళనాడు; 2ని:27.81 సెకన్లు).

గ్రూప్–2 బాలికల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్: 1. శివాని కర్రా (తెలంగాణ; 2ని:32.71 సెకన్లు), 2. శ్రేయ బినిల్ (కేరళ; 2ని:35.03 సెకన్లు), 3. అవని బెలియప్ప (కర్ణాటక; 2ని:36.33 సెకన్లు).

గ్రూప్–3 బాలికల 400 మీటర్ల ఫ్రీస్టయిల్: 1. నయన మధ్యస్థ (కర్ణాటక; 5ని:00.67 సెకన్లు), 2. విదుల (కర్ణాటక; 5ని:00.77 సెకన్లు), 3. తేజశ్రీ విద్యాసాగర్ (తెలంగాణ; 5ని:21.12 సెకన్లు).

ప్రయాగ్‌రాజ్‌లో సంగమ్ వద్ద ఆదివారం గంగా నదిలో పడవల్లో పర్యాటకుల విహారం..ఆకాశంలో వలస పక్షుల సంచారం

చైనా రాజధాని బీజింగ్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో చైనా సంప్రదాయ అశ్వనామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన భారీ గుర్రం విగ్రహం

ఇటలీలోని సిసిలీ దీవిలో ఉన్న మౌంట్ ఎట్నా అగ్ని పర్వతం ఈశాన్య భాగంలో ఈ నెల 24వ తేదీ నుంచి పెద్ద శబ్దాలతో లావా మండుతూ పొగలు కక్కుతోంది

ఎన్నికల రాష్ట్రాలపై స్పెషల్ ఫోకస్..!

అస్సాం, పుదుచ్చేరిల్లో పర్యటించిన బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్

జనవరిలో కేరళ, తమిళనాడు, బెంగాల్‌లకు వెళ్లనున్న నితిన్ నబిన్

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నియమితులైన నితిన్ నబిన్ అప్పుడే కార్యరంగంలోకి దూకారు. వచ్చే ఏడాదిలో జరుగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణుల్ని సంసిద్ధం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, కీలక నేతలతో వరుస భేటీలు జరుపుతున్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పార్టీని తిరిగి నిలబెట్టడం, బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో ఓటు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. 'జాతీయ పార్టీ అయినా, స్థానికంగానే ఆలోచించాలి'అన్న విధానంతో రాష్ట్రానికో ప్రణాళిక రూపొందించే పనిలో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మూడు రాష్ట్రాల్లో పట్టుకోసం..

కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన నబిన్ ఐదు రాష్ట్రాల ఎన్నికలతో తొలి పరీక్ష ఎదుర్కోనున్నారు. ఇందులో ముఖ్యంగా గడిచిన దశాబ్దాల కాలంగా అధికారం అందుకోలేకపోతున్న బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పాగా వేయడం అంత సులభమయ్యేది కాదు. దీనికి తోడు ఇప్పటికే రెండు మార్లు అధికారంలో ఉన్న అస్సాంలో పార్టీని తిరిగి నిలబెట్టడం కత్తిమీద సాములాంటిదే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను నబిన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రణాళికలు, భవిష్యత్ వ్యూహాలపై ఆయన ఇప్పటికే పార్టీ ప్రధాన కార్యదర్శులు బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్, వినోద్ తావ్డే, అరుణ్ సింగ్, దుష్యంత్ గౌతమ్ తదితరులతో చర్చించారు. ఈ సందర్భంగానే ప్రతి బూత్‌కు ఒక ఇన్‌ఛార్జ్, ఒక డేటా వలంటీర్, ఒక సోషల్ మీడియా వలంటీర్‌లను సిద్ధం చేయాలనే సూచనలు వచ్చాయి. 'ఎన్నికలను స్టేజ్ మీద కాదు..బూత్ వద్ద గెలుస్తాం'అన్న విధానాన్ని అవలంబిస్తూనే..యువత, మహిళలను క్రియాశీలకం చేయాలని నిర్ణయించారు. స్థానిక సామాజిక సమీకరణలపై సర్వేలు, ప్రాంతాల వారీగా అధికంగా ఉండే వర్గాల మ్యాపింగ్, చిన్నచిన్న సమావేశాలు, స్థానిక భాషల్లో పార్టీ కంటెంట్ ప్రచారం వంటి దృష్టి సారించాల్సిన అంశాలపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా బెంగాల్‌లో ప్రభుత్వ ఏర్పాటు అంశాన్ని నబిన్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తున్న బన్సల్ నుంచి నివేదిక కోరినట్లు సమాచారం. కాయస్థ కులస్థుడైన నబిన్ సామాజిక వర్గానికి చెందిన జనాభా పశ్చిమ బెంగాల్‌లో గణనీయమైన రాజకీయ, సామాజిక ప్రభావాన్ని కలిగి ఉంది. కోల్‌కతా, అసన్‌సోల్, సిలిగురి వంటి నగరాల్లోని బిహారీ వలసదారుల జనాభా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం నుంచే తన తొలి రాష్ట్ర పర్యటన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. జాతీయ భద్రత, జీవనోపాధి, శాంతిభద్రతలు, వలసలు వంటి అంశాలతో రాష్ట్రంలోకి చొచ్చుకెళ్లేలా, టీఎంసీకి బలమున్న చోట బీజేపీ ఓటు శాతం పెంచేలా, గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లతో పార్టీకి అనుబంధం పెంచేలా చర్యలు తీసుకోవాలన్న అంశంపై ఇప్పటికే రోడ్‌మ్యాప్ ఖరారైనట్లు చెబుతున్నారు. సంక్రాంతి తర్వాత నబిన్ బెంగాల్ పర్యటన ఉంటుందని అంటున్నారు. ఇక తమిళనాడులో బలమైన ప్రాంతీయ పార్టీలతో కూటమి.. స్థానిక భాష, సంస్కృతి మీద గౌరవం చూపేలా ప్రచారం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలతో బూత్ స్థాయి వరకు పార్టీని చేర్చాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. జనవరి తొలి వారంలో నబిన్ ఇక్కడ పర్యటించేలా షెడ్యూల్ ఖరారైంది. ఇక కేరళలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని నబిన్ భావిస్తున్నారు. తిరువనంతపురం మున్సిపల్ మేయర్ పీఠాన్ని కైవసం అంశాన్ని భవిష్యత్ ఎన్నికలకు పునాదిగా మలుచుకోవాలని నిర్ణయించారు. తొలిసారి ఓటువేసే యువతకు తమ వైపు తిప్పుకోవడంతో పాటు..ఉద్యోగాలు, విద్య అంశాలపై ప్రచారం చేస్తూ ఓటు శాతాన్ని గణనీయంగా పెంచితే గెలుపు సాధ్యమన్నది నబిన్ ఆలోచనగా ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక అస్సాంలో ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పనితీరును హైలెట్ చేయడం, స్థానిక నాయకులను అప్రమత్తం చేయడం, కాంగ్రెస్‌పై మరింత పదునుగా విమర్శలకు దిగేలా ఇప్పటికే రాష్ట్ర పర్యటన సందర్భంగా నేతలకు నబిన్ మార్గదర్శనం చేశారు. ఇప్పటికే పుదుచ్చేరిలోనూ పర్యటించిన నబిన్, పార్టీకి ఉన్న బలాన్ని నిలుపుకునే అంశాలపై నేతలకు కీలక సూచనలు చేశారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పార్టీని నిలబెడుతూనే, కొరగరానికొయ్యగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనే బలమైన పట్టుదలతో నబిన్ ముందుకెళ్తున్నారు.

తైవాన్ జలసంధిలో భారీగా విన్యాసాలు

జపాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా దూకుడు • తామూ సిద్ధంగానే ఉన్నామన్న తైవాన్

బీజింగ్: తైవాన్ ఎప్పటికీ తమదేనంటున్న డ్రాగన్ దేశం చైనా తైవాన్ జలసంధిలో తాజాగా సైనిక విన్యాసాలకు తెరతీసింది. తైవాన్‌కు మద్దతుగా జపాన్ ప్రధానమంత్రి తకాయిచీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దీంతోపాటు, తైవాన్‌కు అమెరికా ఇటీవల భారీగా ఆయుధాలను విక్రయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ పరిణామాల నడుమ చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ) ఈస్టర్న్ థియేటర్ కమాండ్ సోమవారం యుద్ధ విమానాలు, బాంబర్లు, డ్రోన్లతోపాటు లాంగ్ రేంజ్ క్షిపణులతో తైవాన్ జలసంధి మధ్యప్రాంతంలో సముద్రజలాలతోపాటు గగనతలంలోనూ విన్యాసాలు చేపట్టింది. ఈ విషయాన్ని చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. కీలకమైన లక్ష్యాలను కచ్చితంగా ఛేదించేలా బలగాల సామర్థ్యాలకు పదును పెట్టడమే వీటి ఉద్దేశమని పేర్కొంది. చైనా చర్యలపై తైవాన్ వెంటనే స్పందించింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ విన్యాసాలను చేపట్టామని తైవాన్ రక్షణ మంత్రి తెలిపారు. చైనా మిలటరీ చర్యలను శాంతికి తీవ్ర విఘాతం కలిగించే దుందుడుకు వైఖరిగా ఆయన అభివర్ణించారు. తైవాన్ వైమానిక స్థావరంలో ల్యాండవుతున్న పలు మిరేజ్ 2000 యుద్ధ విమానాల వీడియోను విడుదల చేశారు. దీంతో, సోమవారం పీఎల్ఏ చేపట్టిన విన్యాసాలు ఇరు పక్షాల మధ్య ఉద్రిక్తతలను మరింతగా పెంచినట్లయిందని పరిశీలకులు అంటున్నారు.

ఓ వైపు జపాన్.. మరో వైపు అమెరికా

నవంబర్ 7న జపాన్ పార్లమెంటులో ప్రధాన మంత్రి సనాయే తకాయిచీ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. తైవాన్‌లో తలెత్తే ఏదైనా అత్యవసర పరిస్థితి జపాన్ మనుగడకే ముప్పు కలిగించే పరిస్థితిగా మారవచ్చని, అటువంటప్పుడు అమెరికాకు మద్దతుగా జపాన్ సైన్యం రంగంలోకి దిగాల్సిన అవసరం రావచ్చని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తకాయిచీ తక్షణమే తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. చైనా విమాన వాహక నౌకలు, విమానాల సంచారంపై ఓ కన్నేసి ఉంచేందుకు ఒకినావాలోని సుదూర తూర్పు ద్వీపంలో మొబైల్ సర్వెలెన్స్ రాడార్ యూనిట్‌ను మోహరించాలనే జపాన్ నిర్ణయాన్ని కూడా చైనా విమర్శించింది. తైవాన్‌కు సమీపంలో జపాన్ లక్షిత సైనిక మోహరింపులను బలోపేతం చేయడాన్ని, మధ్యశ్రేణి క్షిపణులను మోహరించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై చైనా తీవ్రంగా తప్పుబట్టింది. సైనిక శక్తిని బలోపేతం చేసుకునేందుకు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఈ ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే ఈ నెల 18వ తేదీన తైవాన్‌కు రూ.లక్ష కోట్ల విలువైన అత్యాధునిక ఆయుధాలను విక్రయించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ ఆమోదం తెలిపిన పక్షంలో తైవాన్‌కు ఇచ్చే అతిపెద్ద ఆయుధ ప్యాకేజీ అవుతుంది. అమెరికా చర్య తైవాన్ స్వాతంత్ర్యం కోరే, వేర్పాటువాద శక్తులకు ఊతమిచ్చినట్లేనని చైనా కన్నెర్ర చేసింది. తైవాన్ స్వాతంత్ర్య శక్తులు ఆ దీవిని పేలేందుకు సిద్ధంగా ఉన్న బాంబులాగా మారుస్తారంటూ వ్యాఖ్యానించింది. చైనా స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడు కునేందుకు అవసరమైన అన్ని చర్యలను తప్పక తీసుకుంటుందని స్పష్టం చేసింది. 2022లో అమెరికా హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్‌కు మద్దతు తెలిపేందుకు వచ్చినప్పటి నుంచి డ్రాగన్ దేశం విన్యాసాల పేరుతో తైవాన్‌ను పలుమార్లు దిగ్బంధనం చేసింది.

విన్యాసాల్లో చైనా యుద్ధనౌక

ఒక్కరోజే 118 ఇండిగో విమానాలు రద్దు

ముంబై: దేశవ్యాప్తంగా సోమవారం 118 ఇండిగో విమానాల రాకపోకలు రద్దయ్యాయి. ప్రతికూల వాతావరణంతోపాటు తమ కార్యకలాపాలకు సంబంధించిన కొన్ని కారణాల వల్ల రద్దు చేసినట్లు ఇండిగో యాజమాన్యం వెల్లడించింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్లనే 112 విమానాలను రద్దు చేసినట్లు పేర్కొంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొచ్చిన్, హైదరాబాద్, కోల్‌కతా, అమృత్‌సర్, చండీగఢ్, జైపూర్, భోపాల్ తదితర నగరాల నుంచి రాకపోకలు సాగించాల్సిన ఇండిగో విమానాలు ఆగిపోయాయి. ఈ నెల 10వ తేదీ నుంచి విమానాల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. దట్టమైన పొగ మంచు కారణంగా ఈ పరిస్థితి ఏర్పడినట్లు విమానయాన సంస్థలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీదాకా ఇదే పరిస్థితి ఉంటుందని డీజీసీఏ వర్గాలు పేర్కొన్నాయి.

ఢిల్లీలో 128 విమానాలు రద్దు

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం 128 విమానాలు రద్దయ్యాయి. 8 విమానాలను దారి మళ్లించారు. మరో 470 విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఇందుకు పొగమంచే కారణమని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్నం తర్వాత విమానాల రాకపోకలు దాదాపు సాధారణ స్థితికి చేరుకున్నట్లు తెలిపాయి. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిత్యం 1,300 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

మాతృభాషను మర్చిపోవద్దు

- సొంత వాళ్లతో మాతృభాషలోనే మాట్లాడాలి
- సంథాలీ భాషా దినోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు

జంషెడ్‌పూర్: ప్రజలు తమ మాతృభాషను ఎప్పటికీ మర్చిపోవద్దని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. చుట్టూ ఉన్న సమాజాన్ని ఉన్నతంగా మార్చుకోవడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చెప్పారు. సోమవారం జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో 22వ సంథాలీ పార్సీ మహా(భాషా దినోత్సవం)తోపాటు సంథాలీ భాష ఓల్ చికీ లిపి వందేళ్ల వేడుకలో రాష్ట్రపతి పాల్గొన్నారు. గిరిజన మాత 'జాహెర్ ఆయో'ను ప్రార్థిస్తూ సంథాలీ భాషలో ప్రసంగం ప్రారంభించారు. ఇతర భాషలను నేర్చుకోవడంలో ఎలాంటి తప్పు లేదని, అదే సమయంలో తల్లి భాషను మర్చిపోవద్దని స్పష్టం చేశారు. సొంత రాష్ట్రం లేదా సొంత వర్గానికి చెందిన ప్రజలతో మాతృభాషలోనే మాట్లాడేందుకు ప్రయత్నించాలని చెప్పారు. సంథాలీ భాషలో ఓల్ చికీ లిపి ప్రాధాన్యతను వివరించారు. 1925లో పండిత్ రఘునాథ్ ముర్ము ఈ లిపిని సృష్టించారని తెలిపారు. సంథాల్ ప్రజలకు ఇదొక శక్తివంతమైన గుర్తింపు అని వెల్లడించారు. ఈ లిపి రాకముందు రోమన్, దేవనాగరి, ఒడియా, బెంగాలీ తదితర భాషల లిపిలోనే సంథాలీ భాషను రాసే సంప్రదాయం ఉండేదన్నారు. సొంత లిపిలో కాకుండా మరో లిపిలో రాస్తే భావాన్ని ప్రభావవంతంగా వ్యక్తీకరించలేమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ఓల్ చికీ లిపిని ప్రోత్సహించడంలో టాటా స్టీల్ యాజమాన్యం చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఓల్ చికీ లిపిలో సంథాలీ భాషలో రాసిన భారత రాజ్యాంగాన్ని ఇటీవల తాను ఆవిష్కరించానని గుర్తుచేశారు.

ఢిల్లీలో వీధి కుక్కల లెక్కింపు నోడల్ ఆఫీసర్లుగా టీచర్లు

ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో విద్యా సంస్థల చుట్టూ ఉన్న వీధి కుక్కల లెక్కింపు, ఇతర అంశాలకు సంబంధించి నోడల్ ఆఫీసర్లుగా ఉపాధ్యాయులను నియమిస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేకు నార్త్‌వెస్ట్–ఎ జోన్‌లోని వివిధ స్కూళ్ల నుంచి 118 మంది ఉపాధ్యాయులను నోడల్ అధికారులుగా నియమిస్తూ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలిచ్చారు. వీధి కుక్కల లెక్కింపునకు ఉపాధ్యాయులను ఉపయోగించాలంటూ విద్యాశాఖ డైరెక్టర్ అన్ని జిల్లాల విద్యాధికారులకు డిసెంబర్ 5న సర్క్యులర్ జారీ చేశారు. ఈ ప్రక్రియకు ఉపాధ్యాయుల పేర్లు, వివరాలు పంపాలని, వాటిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపుతామని పేర్కొన్నారు. అంతేకాదు.. ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని ఆదేశాలిచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. పాఠశాలల నుంచి సమాచారం ఇవ్వకూడదు. నామినేట్ చేసిన నోడల్ అధికారుల పేరు, హోదా, కాంటాక్ట్ నంబర్, ఇమెయిల్ ఐడీ వివరాలను జిల్లా పరిధిలోని పాఠశాలలు, స్టేడియంలు, క్రీడా సముదాయాలకు ఇవ్వాలి. ఈ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. వీధికుక్కలను ఉపాధ్యాయులు లెక్కిస్తే, విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బోధనేతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించడం తమ వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంతు సంరక్షణ, అటవీ శాఖ విభాగాలకు ఈ పనులను ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అయితే నవంబర్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే ఈ ప్రక్రియ జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

పీఎంకే సారథిగా రామ్‌దాస్ ఎన్నిక

సాలెం(తమిళనాడు): పట్టాళి మక్కల్ కచ్చి(పీఎంకే) వ్యవస్థాపకుడు ఎస్.రాందాస్(86) ఆ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కుమారుడు, కేంద్ర మంత్రి అన్బుమణితో తీవ్ర విభేదాల నేపథ్యంలో సోమవారం సాలెంలో జరిగిన పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశం రాందాస్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పార్టీ శ్రేణుల్లో అత్యధికులు తనవైపే ఉన్నారని, కనీసం 5శాతం మంది కూడా అన్బుమణికి మద్దతివ్వడం లేదని అనంతరం రాందాస్ చెప్పారు. పార్టీ జనరల్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కమిటీలు రాందాస్ కుమార్తె శ్రీగంధి పరశురామన్‌ను పార్టీ గౌరవాధ్యక్షురాలిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయం దిశగా నడిపించే బాధ్యత, ఇతర పార్టీలతో పొత్తులపై రాందాస్‌దే అంతిమ నిర్ణయమని ప్రకటించాయి.

వాళ్లను తరిమేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

అస్సామీలకు అమిత్ షా పిలుపు



బోర్డోవా/గువాహటి: అస్సాం అభివృద్ధి, సంస్కృతికి ప్రతిబంధకంగా మారిన బంగ్లాదేశ్ చొరబాటుదారులను తరిమికొట్టే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఎన్నుకోవాలని అస్సాం ఓటర్లకు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. సోమవారం అస్సాంలో సుడిగాలి పర్యటన చేసిన అమిత్ షా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గువాహటిలో నూతన పోలీస్ కమీషనరేట్, నిఘా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. చొరబాటుదారులతో పోరాటంతో ప్రాణత్యాగంచేసిన వీరులకు 'స్వాహిద్ స్మారక్ క్షేత్ర'లో నివాళులర్పించారు. 15వ శతాబ్దానికి చెందిన అస్సామీ సాధువు, సంఘ సంస్కర్త శ్రీమంత శంకర్‌దేవ్ 'బతద్రవ థాన్'పుణ్యక్షేత్రంలో రూ.227 కోట్లతో పునరుద్ధరణ పనులను షా ప్రారంభించారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గోపినాథ్ బోర్డోలాయ్, సంగీత సామ్రాట్ భూపెన్ హజారికా, యువ సంగీత తరంగం, దివంగత జుబెన్ గార్గ్, దిగ్గజ అహోం జనరల్ లాచిత్ బోర్ఫుకన్‌లకు షా నివాళులర్పించారు. తర్వాత బోర్డోవా పట్టణంలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ''వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో మీ రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు జరగబోతున్నాయి. రాష్ట్రం నుంచి విదేశీ చొరబాటుదారులందరినీ మూకుమ్మడిగా తరిమికొట్టే సత్తా ఉన్న ప్రభుత్వాన్నే ఎన్నుకోండి. చొరబాటుదారులను అనుమతించని సర్కార్‌ను ఎన్నుకోండి. అస్సాం అభివృద్ధికి పాటుపడే నేతలకే పట్టం కట్టండి. ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడి కాంగ్రెస్ రాష్ట్రంలోకి విదేశీయుల చొరబాట్లను ప్రోత్సహించింది. ఇప్పుడది అస్సాం అస్థిత్వం, గుర్తింపునకు ముప్పుగా పరిణమించింది''అని షా అన్నారు.

మరో ఛాన్స్ ఇవ్వండి

''అస్సాంలో బీజేపీ ప్రభుత్వాల హయంలో గత పదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధ్యమైంది. ఆ అభివృద్ధి సరిపోదు. శ్రీమంత సాధువు జన్మించిన పుణ్యస్థలి నుంచి మీకు వాగ్దానం చేస్తున్నా. మరో ఐదేళ్లు పరిపాలించే అవకాశం ఇవ్వండి. అస్సాం నుంచి చొరబాటుదారులందరినీ వెనక్కి పంపేస్తాం. ఈ రాష్ట్రమేకాదు ప్రతి రాష్ట్రం నుంచి చొరబాటుదారులను తరిమేస్తాం. ప్రధాని మోదీ మీ సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించమేకాదు మీ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతారు'' అని షా అన్నారు.

తారిఖ్ రహ్మాన్ నామినేషన్

ఢాకా: బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ)యాక్టింగ్ చైర్మన్, ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. సెగున్ బాగిచాలోని ఢాకా డివిజనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. రెహమాన్ తరపున బంగ్లాదేశ్ డాక్టర్స్ అసోసియేషన్ (డీఏబీ) ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ డాక్టర్ ఫర్హాద్ హలీమ్ డోనార్‌తో కలిసి బీఎన్‌పీ చైర్ పర్సన్ సలహాదారు అబ్దుస్ సలాం నామినేషన్ సమర్పించారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రెహ్మాన్ ఢాకా–17 నియోజకవర్గం నుండి పోటీ చేయనున్నారు. బీఎన్‌పీ నాయకుడు ఈ నెల 25న లండన్ నుంచి దేశానికి తిరిగి వచ్చి పార్టీ పగ్గాలు చేపట్టారు. 17ఏళ్ల స్వీయ బహిష్కరణకు ముగింపు పలికి స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయనకు నగరవాసులు ఘనస్వాగతం పలికారు. ఆ తరువాత తన కుమార్తె జామియాతో కలిసి ఓటరు జాబితా నమోదు బయోమెట్రిక్ ప్రక్రియను శనివారమే పూర్తి చేశారు.

ఆయుధంగా నదీ జలాలు!

భారత్‌పై పాక్ సెనేటర్ వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు నదీ జలాలను ఆయుధంగా మార్చుకోవడం వల్ల మరింతగా పెచ్చరిల్లు తాయని పాకిస్తాన్ సెనేటర్ షెర్రీ రెహ్మాన్ వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ సెనేటర్ అయిన షెర్రీ రెహ్మాన్..చీనాబ్ నదిపై జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిన వేళ పైవిధంగా వ్యాఖ్యానించారు. భారత్ నిర్ణయం సింధూ జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. వాతావరణ మార్పుల కారణంగా అత్యంత ప్రభావితమవుతున్న ఈ ప్రాంతంలో, నీటిని ఒక ఆయుధంగా మార్చుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదు, ఆమోదయోగ్యం కాదు. ఇప్పటికే శత్రుత్వం, అపనమ్మకంతో నిండిపోయి ఉన్న రెండు దేశాల సంబంధాల్లో ఇది ఉద్రిక్తతలను మరింతగా పెంచుతుంది'అని ఆమె సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల పైశాచిక దాడి నేపథ్యంలో సింధూ నదీ జలాల ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు భారత ప్రభుత్వం ఏప్రిల్ 22న ప్రకటించడం తెల్సిందే. కశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో చీనాబ్ నదిపై 260 మెగావాట్ల దుల్హస్తి స్టేజీ–2 జల విద్యుత్ ప్రాజెక్టుకు భారత ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది.

'అతిపెద్ద నేరగాళ్లు' వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పిన లలిత్ మోదీ

లండన్: విజయ్ మాల్యాను, తనను పరారీలో ఉన్న అతిపెద్ద భారత నేరగాళ్లుగా ఇటీవల అభివర్ణించుకున్న ఐపీఎల్ ఫౌండర్ లలిత్ మోదీ ఇప్పుడు వెనక్కి తగ్గారు. తన మాటలను వక్రీకరించారంటూ ఆయన క్షమాపణ కోరారు. ఈ మేరకు సోమవారం ఒక వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఇటీవల విజయ్ మాల్యా 70వ పుట్టిన రోజు వేడుకను లండన్‌లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా లలిత్ మోదీ.. తామిద్దరూ పరారీలో ఉన్న అతిపెద్ద భారత నేరగాళ్లుగా పేర్కొంటూ మాల్యాతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. తీవ్రమైన ఆర్థిక అవకతవకల ఆరోపణలను ఎదుర్కొంటున్న వీరిద్దరినీ భారత ప్రభుత్వం వెనక్కి రప్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామం పెనుదుమారానికి కారణమైంది. భారత ప్రభుత్వం సైతం ఆ వీడియోపై స్పందించింది. వారిద్దరినీ తీసుకువచ్చి, చట్టం ముందు నిలబెడతామని ప్రకటించింది. తాజాగా లలిత్ మోదీ ఎక్స్‌లో..'నా వ్యాఖ్యలతో భారత ప్రభుత్వం సహా ఎవరైనా ఇబ్బంది పడి ఉంటే క్షమాపణ కోరుతున్నా. భారత ప్రభుత్వం పట్ల నాకు ఎనలేని గౌరవముంది. నాకు ఎవరినీ తక్కువ చేసే ఉద్దేశం లేదు. నా వ్యాఖ్యలను వక్రీకరించారు. నా వ్యాఖ్యలపై క్షమాపణ కోరుతున్నా'అని పేర్కొన్నారు.

ఉత్తరకొరియా క్షిపణి పరీక్షలు

సియోల్: వ్యూహాత్మక దూర శ్రేణి క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించి, పరీక్షించినట్లు ఉత్తర కొరియా సోమవారం ప్రకటించుకుంది. తన మొట్టమొదటి అణు జలాంతర్గామి నిర్మాణం పురోగతిలో ఉందంటూ ప్రదర్శించిన కొద్ది రోజులకే ఈ ప్రయోగం జరపడం గమనార్హం. ఆదివారం దేశ పశ్చిమ తీరంలో చేపట్టిన క్షిపణి ప్రయోగాలపై అధ్యక్షుడు కిమ్ ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారని అధికార కేసీఎన్ఏ వార్తా సంస్థ వెల్లడించింది. ఆదివారం ఉదయం ఉత్తర కొరియా రాజధాని సియోల్ సమీపంలో నుంచి పలు క్రూయిజ్ మిస్సైళ్లను సముద్ర జలాల్లోకి ప్రయోగించడాన్ని తాము గమనించామని దక్షిణ కొరియా తెలిపింది. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మిత్ర దేశం అమెరికాతో కలిసి తగు రీతిలో స్పందిస్తామని స్పష్టం చేసింది.

తుర్కియేలో ఎన్‌కౌంటర్.. ఆరుగురు ఉగ్రవాదులు హతం

అంకారా: వాయవ్య తుర్కియేలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా, ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 8 మంది పోలీసులు, ఒక సెక్యూరిటీ గార్డు గాయపడ్డారు. మిలిటెంట్లు దాగున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు ఆదివారం రాత్రి యలోవా ప్రావిన్స్‌లోని ఇల్మాలిలోని ఓ ఇంటిపై దాడి చేశారు. మహిళలు, చిన్నారులు కూడా ఆ ఇంట్లో ఉండటంతో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. ముందుగా ఆ ఇంటి నుంచి ఐదుగురు మహిళలు, ఆరుగురు చిన్నారులను సురక్షితంగా తీసుకువచ్చారు. రాత్రి 2 గంటల వేళ మొదలైన ఎదురుకాల్పులు ఉదయం 9.30 గంటల వరకు కొనసాగాయన్నారు.

నియామకం ఎలాగైనా ఆపేయండి

- బిహార్ స్టేట్ యూనివర్సిటీ కమిషన్‌కు నితీశ్ సర్కార్ సూచన
- మంత్రిని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్ ఖరారుపై తకరారు

పట్నా: బిహార్ గ్రామీణ పనుల శాఖ మంత్రి అశోక్ చౌదరికి పాటలీపుత్ర విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగంలోకి తీసుకోకుండా ఎలాగైనా అడ్డుకోండని బిహార్ స్టేట్ యూనివర్సిటీ సర్వీస్ కమిషన్‌కు నితీశ్ ప్రభుత్వం సూచించింది. దీంతో ఈ అంశాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సునీల్ కుమార్ ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి అశోక్ పేరులో తేడాలను ప్రస్తావిస్తూ ఆయన ఎంపికను తాత్కాలికంగా పక్కనబెట్టినట్లు వార్తలొచ్చాయి. వర్సిటీలో రాజనీతిశాస్త్ర అధ్యాపక పోస్టుకు మంత్రి గతంలో దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్హత సర్టిఫికెట్లలో ఆయన పేరు అశోక్ కుమార్ అని, ఎన్నికల అఫిడవిట్ పత్రాల్లో అశోక్ చౌదరి అని ఉండటంతో ఎంపికను అర్ధంతరంగా నిలిపేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సునీల్ సోమవారం పట్నాలో మీడియాతో మాట్లాడారు. ''ఎంపిక ప్రక్రియ అనేది కమిషన్ చేతుల్లో ఉంటుంది. మా విద్యాశాఖ ఆయనను ఎంపికచేయలేదు. ఆయన నియామకానికి సంబంధించిన అభ్యంతరాల ఫైల్‌ను తిరిగి స్టేట్ యూనివర్సిటీ సర్వీస్ కమిషన్‌కు పంపించాం''అని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు అప్తుడిగా అశోక్‌చౌదరికి పేరుంది. తనకు అధ్యాపక వృత్తి అంటే ఇష్టమని, అందుకే ప్రొఫెసర్ పోస్టుకు ఐదేళ్ల క్రితమే దరఖాస్తుచేసుకున్నా''అని ఆయన గతంలో చెప్పారు. మంత్రికి ప్రొఫెసర్ పోస్టుపై విపక్ష కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ''రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు రావట్లేదు. కానీ 58 ఏళ్ల వయసులో మంత్రికి అదనంగా వర్సిటీలో ఉద్యోగం వచ్చింది. ఆర్ఎస్ఎస్ కోటాకు ధన్యవాదాలు''అని ఎద్దేవాచేసింది.

వృద్ధాశ్రమంలో అగ్ని ప్రమాదం.. 16 మంది మృతి

మనాడో: ఇండోనేసియాలోని ఓ వృద్ధాశ్రమంలో ఆకస్మికంగా మంటలు చెలరేగి 16 మంది వయోవృద్ధులు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం రాత్రి ఘటన చోటుచేసుకున్న సమయంలో వృద్ధులంతా నిద్రిస్తున్నారని అధికారులు తెలిపారు. ఉత్తర సులవేసి ప్రావిన్స్‌లోని మనాడోలో ఈ దారుణం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకున్న 15 మందిని చుట్టుపక్కల వారు కాపాడారు. గాయాలపాలైన వీరిని వెంటనే ఆస్పత్రులకు తరలించారు. ఆరు ఫైరింజన్లతో రెండు గంటల అనంతరం మంటలను అదుపు చేయగలిగామని ఫైర్ సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. అయితే, దీనిపై దర్యాప్తు చేపట్టామని అధికారులు చెప్పారు.

పార్లమెంటరీ కమిటీల్లో అతి పెద్దది ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. ప్రత్యేక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ మార్లె
సి) లార్డ్ మాంటెగ్ డి) మెక్ డొనాల్డ్
2. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు దేని ఆధారంగా నిర్ణయించారు?
ఎ) అంబేద్కర్, గాంధీజీ డిమాండ్
బి) రౌండ్ టేబుల్ సమావేశాల చర్చలు
సి) సైమన్ కమిషన్ నివేదిక
డి) గాంధీజీ సత్యాగ్రహం
3. భారతదేశంలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏ చట్టం ద్వారా ప్రవేశపెట్టారు?
ఎ) 1909 మార్లె- మింటో సంస్కరణల చట్టం
బి) 1919 మాంటెగ్ – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం
సి) 1935 భారత ప్రభుత్వ చట్టం
డి) పైవన్నీ
4. రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక ఉపాధ్యక్షుడిగా ఎవరు పనిచేశారు?
ఎ) సచ్చిదానంద సిన్హా బి) ఫ్రాంక్ ఆంటోని
సి) హెచ్.సి. ముఖర్జీ డి) వి.టి. కృష్ణమాచారి
5. కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) రచనా సంఘం – బి.ఆర్. అంబేద్కర్
బి) ప్రాథమిక హక్కుల సంఘం – సర్దార్ పటేల్
సి) సారథ్య సంఘం – రాజేంద్రప్రసాద్
డి) రాష్ట్ర వ్యవహారాల సంఘం – జవహర్‌లాల్ నెహ్రూ
6. వివిధ దేశాల రాజ్యాంగాల నుంచి గ్రహించిన అంశాలకు సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
ఎ) ఉమ్మడి జాబితా – ఆస్ట్రేలియా
బి) సమాఖ్య ప్రభుత్వం – కెనడా
సి) ఏకీకృత న్యాయవ్యవస్థ – బ్రిటన్
డి) పైవన్నీ
7. రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెట్టిన వారు?
ఎ) బి.ఆర్. అంబేద్కర్
బి) బి.ఎన్. రావు సి) కె.ఎం.మున్షీ
డి) జి.వి. మౌలాంకర్
8. ప్రముఖులు, వారి వ్యాఖ్యలకు సంబంధించి కిందివాటిలో సరికాని జత ఏది?
ఎ) భారత ప్రభుత్వం అర్ధ సమాఖ్య – కె.సి.వేర్
బి) భారత ప్రభుత్వం కేంద్రీకృత సమాఖ్య – ఐవర్ జెన్నింగ్స్
సి) భారత ప్రభుత్వం బేరమాడే సమాఖ్య – మారిస్ జోన్స్
డి) భారత ప్రభుత్వం సహకార సమాఖ్య – జవహర్‌లాల్ నెహ్రూ
9. కిందివారిలో ముసాయిదా సంఘంలో సభ్యుడు కానివారు?
ఎ) బి.ఆర్. అంబేద్కర్ బి) కె.ఎం. మున్షీ
సి) మాధవరావు డి) బి.ఎన్. రావు
10. పదో షెడ్యూల్‌లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు?
ఎ) 42వ సవరణ బి) 44వ సవరణ
సి) 61వ సవరణ డి) 52వ సవరణ
11. 'ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదు' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పును ఇచ్చింది?
ఎ) బేరుబారి Vs భారత ప్రభుత్వం– 1960
బి) కేశవానంద భారతి Vs కేరళ రాష్ట్రం – 1973
సి) గోలక్‌నాథ్ Vs పంజాబ్ ప్రభుత్వం– 1967
డి) ఎస్.ఆర్. బొమ్మై Vs భారత ప్రభుత్వం – 1993
12. కిందివాటిలో సమాఖ్య ప్రభుత్వ లక్షణం ఏది?
ఎ) ద్వంద్వ ప్రభుత్వం
బి) అధికార విభజన
సి) లిఖిత రాజ్యాంగం
డి) స్వయం ప్రతిపత్తి ఉన్న న్యాయశాఖ
13. ఏ ప్రభుత్వ విధానంలో దేశాధినేత నియంతగా మారే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది?
ఎ) పార్లమెంటరీ ప్రభుత్వం
బి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
సి) సమాఖ్య ప్రభుత్వం
డి) ఏకకేంద్ర ప్రభుత్వం
14. ప్రాథమిక విధుల దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
ఎ) జనవరి 3 బి) జనవరి 9
సి) డిసెంబరు 10 డి) అక్టోబరు 24
15. అల్ప సంఖ్యాక వర్గాల కోసం చేర్చిన ప్రత్యేక హక్కు ఏది?
ఎ) సమానత్వ హక్కు
బి) పీడనాన్ని నిరోధించే హక్కు
సి) మత స్వాతంత్ర్య హక్కు
డి) విద్య, సాంస్కృతిక హక్కు
16. రాజ్యాంగ అధికరణలు – అంశాలకు సంబంధించి కిందివాటిలో సరికానిది?
ఎ) అధికరణ – 16: విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశం
బి) అధికరణ – 20: నేరాన్ని బట్టి శిక్ష
సి) అధికరణ – 25: మత స్వేచ్ఛ
డి) అధికరణ–23:బాల కార్మిక వ్యవస్థ నిషేధం
17. కిందివాటిలో ప్రాథమిక విధి కానిది ఏది?
ఎ) భౌతిక సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయడం
బి) మహిళలను గౌరవించడం
సి) సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం
డి) సోదరభావాన్ని పెంపొందించడం
18. ప్రభుత్వాల కర్తవ్య నిర్వహణకు మార్గదర్శకాలుగా పనిచేసేవి ఏవి?
ఎ) ప్రాథమిక విధులు
బి) ప్రాథమిక హక్కులు
సి) ఆదేశిక సూత్రాలు డి) రిజర్వేషన్లు
19. హెబియస్ కార్పస్ అనేది ఏ భాషా పదం?
ఎ) లాటిన్ బి) గ్రీకు
సి) రోమన్ డి) ఇంగ్లిష్
20. రాష్ట్రపతి ఎన్నికల్లో కింద పేర్కొన్న వారిలో ఎవరికి ఓటు హక్కు ఉండదు?
ఎ) విధాన పరిషత్ సభ్యులు
బి) లోక్‌సభకు రాష్ట్రపతి నియమించిన సభ్యులు
సి) రాజ్యసభకు రాష్ట్రపతి నియమించిన సభ్యులు
డి) పైవారందరూ
21. ఉప రాష్ట్రపతి కాకుండానే రాష్ట్రపతి అయిన మొదటి వ్యక్తి ఎవరు?
ఎ) వి.వి. గిరి బి) జాకీర్ హుస్సేన్
సి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
డి) నీలం సంజీవరెడ్డి
22. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
1. మంత్రిమండలి సలహా మేరకు అధికరణ 123 ప్రకారం రాష్ట్రపతి ఆర్డినెన్సులను జారీ చేస్తారు
2. రాజ్యాంగపరమైన సమస్యల పరిష్కారానికి అధికరణ – 143 ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరవచ్చు
ఎ) 1, 2 బి) పై రెండూ కావు
సి) 1 మాత్రమే డి) 2 మాత్రమే
23. రాష్ట్రపతి రాజీనామా లేఖను ఎవరికి సమర్పిస్తారు?
ఎ) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
బి) ప్రధానమంత్రి సి) ఉప రాష్ట్రపతి
డి) అటార్నీ జనరల్
24. జాతీయ అత్యవసర సమయంలో అన్ని హక్కులు రద్దయినా, రద్దు కానివి ఏవి?
ఎ) అధికరణ – 23, 24
బి) అధికరణ – 29, 30
సి) అధికరణ – 20, 21
డి) పైవేవీ కాదు
25. రాజ్యసభకు పదవిరీత్యా అధ్యక్షుడిగా ఎవరు కొనసాగుతారు?
ఎ) రాజ్యసభ డిప్యూటీ చైర్మన్
బి) ఉప రాష్ట్రపతి
సి) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
డి) పైన పేర్కొన్న వారెవరూ కాదు
26. కిందివారిలో రాజ్యసభకు నామినేట్ చేసిన సభ్యత్వంతో ప్రధాని పదవి చేపట్టిన వారెవరు?
ఎ) ఇందిరాగాంధీ బి) ఐ.కె. గుజ్రాల్
సి) హెచ్.డి. దేవేగౌడ
డి) పి.వి. నరసింహారావు
27. జాతీయ ప్రభుత్వాన్ని నడిపిన ఏకైక ప్రధాని ఎవరు?
ఎ) పి.వి.నరసింహారావు
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) లాల్ బహదూర్ శాస్త్రి
డి) మొరార్జీ దేశాయ్
28. ఉప ప్రధానమంత్రికి సంబంధించి కిందివాటిలో సరైన వరుసక్రమం ఏది?
ఎ) సర్దార్ పటేల్, మొరార్జీ దేశాయ్, వై.బి. చవాన్
బి) సర్దార్ పటేల్, వై.బి. చవాన్, మొరార్జీ దేశాయ్
సి) సర్దార్ పటేల్, చరణ్‌సింగ్, ఎల్.కె. అద్వానీ
డి) సర్దార్ పటేల్, మొరార్జీ దేశాయ్, జగ్జీవన్‌రామ్
29. మంత్రిమండలి సమష్టి నిర్ణయాన్ని వ్యతిరేకించి మంత్రి పదవికి రాజీనామా చేసిన మొదటి కేబినెట్ మంత్రి ఎవరు?
ఎ) బి.ఆర్. అంబేద్కర్ బి) సి.డి. దేశ్‌ముఖ్
సి) గోవింద వల్లభపంత్
డి) శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ
30. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 'కేబినెట్' అనే పదాన్ని ఎన్నో అధికరణలో చేర్చారు?
ఎ) 74 బి) 75 సి) 352 డి) 360
31. భారతదేశంలో భౌగోళిక ప్రదేశం ఆధారంగా అతిపెద్ద నియోజక వర్గం ఏది?
ఎ) లడఖ్ బి) మల్కాజ్‌గిరి
సి) చాందినీ చౌక్
డి) అండమాన్ నికోబార్ దీవులు
32. అధికరణ 330 ప్రకారం లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక సీట్లు కేటాయించారు. ప్రస్తుతం వాటి సంఖ్య?
ఎ) ఎస్సీ – 80, ఎస్టీ – 40
బి) ఎస్సీ – 85, ఎస్టీ – 45
సి) ఎస్సీ – 90, ఎస్టీ – 50
డి) ఎస్సీ – 84, ఎస్టీ – 47
33. ఉత్తరప్రదేశ్ తర్వాత ఎస్సీలకు అత్యధిక సీట్లు ఏ రాష్ట్రంలో కేటాయించారు?
ఎ) బిహార్ బి) తమిళనాడు
సి) పశ్చిమ బెంగాల్ డి) రాజస్థాన్
34. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
1. అధికరణ–110 ప్రకారం ఒక బిల్లు సాధారణమైందా లేదా ఆర్థికపరమైందా అనేది స్పీకర్ నిర్ణయిస్తారు
2. అధికరణ–88 ప్రకారం అటార్నీ జనరల్ పార్లమెంట్ సమావేశాల్లో, చర్చల్లో పాల్గొనవచ్చు
ఎ) 1, 2 సరికావు బి) 1, 2 సరైనవే
సి) 1 మాత్రమే సరైంది
డి) 2 మాత్రమే సరైంది
35. రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఎంత?
ఎ) మూడేళ్లు బి) నాలుగేళ్లు
సి) అయిదేళ్లు డి) ఆరేళ్లు
36. పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తున్న అంశాలను నిలిపివేసి మరో ముఖ్యమైన అంశంపై చర్చించాల్సిందిగా ప్రవేశపెట్టే తీర్మానాన్ని ఏమంటారు?
ఎ) అవిశ్వాస తీర్మానం
బి) వాయిదా తీర్మానం
సి) సావధాన తీర్మానం
డి) ఏదీకాదు
37. పార్లమెంటరీ కమిటీల్లో అతి పెద్దది ఏది?
ఎ) ప్రభుత్వ ఖాతాల సంఘం
బి) ప్రభుత్వ అంచనాల సంఘం
సి) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
డి) ఏదీకాదు
38. గవర్నర్‌కు కింది ఏ సందర్భంలో విచక్షణ అధికారం ఉంటుంది?
ఎ) రాష్ట్రంలో అధికరణ 356ను విధించడానికి రాష్ట్రపతికి సిఫారసు చేయడం
బి) విధానసభను రద్దు చేయడం
సి) బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు పంపడం
డి) పైవన్నీ
39. సుప్రీంకోర్టు ప్రారంభ అధికార పరిధిలోకి రాని అంశం?
ఎ) కేంద్ర–రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
బి) రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
సి) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) సి; 4) బి; 5) డి; 6) డి; 7) బి; 8) డి; 9) డి; 10) డి; 11) ఎ; 12) బి; 13) బి; 14) ఎ; 15) డి; 16) డి; 17) ఎ; 18) సి; 19) ఎ; 20) డి; 21) సి; 22) ఎ; 23) సి; 24) సి; 25) బి; 26) ఎ; 27) బి; 28) డి; 29) ఎ; 30) సి; 31) ఎ; 32) డి; 33) సి; 34) బి; 35) డి; 36) బి; 37) బి; 38) డి; 39) డి.

తెలంగాణ జనసాంద్రత ఎంత?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ జాగ్రఫీ

తెలంగాణ రాష్ట్ర జనాభా-2011

భారతదేశంలో 1872 నుంచి 2011 వరకు మొత్తం 15 పర్యాయాలు జనగణన చేశారు.2011లో 15వ సారి 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనగణన నిర్వహించారు. అప్పటికి తెలంగాణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. భారతదేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత జనగణన ఒక్కసారి కూడా చేపట్టలేదు.

- కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోపాలకృష్ణ పిళ్లై, జాతీయ జనాభా గణాంకాల రిజిస్ట్రార్ జనరల్ 'చంద్రమౌళి' 2011 జనాభా లెక్కల వివరాలను 2011 మార్చి 30న విడుదల చేశారు.
- ప్రపంచ జనాభాలో భారతీయులు 17.7 శాతం ఉన్నారు.
- జనాభా పరంగా భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద దేశంగా ఉంది. చైనా మొదటి స్థానంలో ఉంది.
- 2011 గణాంకాల ప్రకారం దేశ జనాభా 121 కోట్లు

2011 జనాభా గణాంకాల ప్రధానాంశాలు

- 2011 జనాభా లెక్కల రిజిస్ట్రార్ జనరల్ – చంద్రమౌళి
- 2011 జనాభా లెక్కల నినాదం 'అవర్ సెన్సస్ – అవర్ ఫ్యూచర్'.
- 2011 జనగణన స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏడోసారి నిర్వహించింది.
- దేశంలో మొట్టమొదటిసారిగా జనాభా వివరాలను 1872లో లార్డ్ మేయో కాలంలో లెక్కించారు.
- 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా గణాంకాలు సేకరిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర జనాభా

సం.	జనాభా (కోట్లలో)	జన సాంద్రత	లింగ నిష్పత్తి
1961	1.27	111	975
1971	1.58	138	961
1981	2.02	176	971
1991	2.61	227	967
2001	3.10	270	971
2011	3.51	307	988
ప్రస్తుతం	3.50	312	

రాష్ట్ర జనాభా - 2011

- 2011 గణాంకాల ప్రకారం భారతదేశ జనాభా 1,21,05,69,573.
- తెలంగాణ రాష్ట్ర జనాభా 3,51,93,978.

గమనిక: ప్రస్తుతం తెలంగాణ జనాభా 3,50,03,674. ఖమ్మం జిల్లాలో 327 గ్రామాలను(7 మండలాలు) ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. దీంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 1.90 లక్షల మంది ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వచ్చారు. ఫలితంగా జనాభా సంబంధిత విషయాల్లో మార్పులు జరిగాయి.

- రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం అధిక జనాభా ఉన్న జిల్లాలు 1) రంగారెడ్డి, 2) మహబూబ్‌నగర్.
- రాష్ట్రంలో అత్యల్ప జనాభా ఉన్న జిల్లాలు 1) నిజామాబాద్, 2) ఖమ్మం.

భాష ఆధారంగా జనాభా వివరాలు

- రాష్ట్రంలో తెలుగు మాట్లాడేవారు 76 శాతం మంది ఉన్నారు.
- తెలంగాణలో ఉర్దూ మాట్లాడేవారు 12 శాతం ఉన్నారు.
- ఇతర భాషలు మాట్లాడేవారు 12శాతం ఉన్నారు

గమనిక: 1948కు ముందు హైదరాబాద్ ప్రాంతంలో అధికార భాష 'ఉర్దూ'.

జనాభా పరిమాణం: రాష్ట్రంలో ఉన్న మొత్తం జనాభాను 'రాష్ట్ర జనాభా పరిమాణం' అంటారు.

జనసాంద్రత: ఒక చదరపు కిలోమీటర్ వైశాల్యంలో నివసించే వారి సంఖ్యను లేదా జనాభాను 'జనసాంద్రత'గా పేర్కొంటారు.

- 2011 లెక్కల ప్రకారం రాష్ట్ర జనసాంద్రత 307 (ప్రస్తుతం 312).

గమనిక: ఖమ్మం జిల్లా జనసాంద్రత 175 నుంచి 197కు పెరిగింది.

లింగ నిష్పత్తి: ప్రతి వేయి మంది పురుషులకు ఉండే స్త్రీల సంఖ్యనే 'లింగ నిష్పత్తి' అంటారు.

- 2011 లెక్కల ప్రకారం రాష్ట్ర లింగ నిష్పత్తి 988 (1000 : 988).
- 2011 గణాంకాల ప్రకారం రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి అధికంగా ఉన్న జిల్లాలు – 1) నిజామాబాద్ (1040), 2) ఖమ్మం, కరీంనగర్ (1008).
- 2011 లెక్కల ప్రకారం రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు.. 1) హైదరాబాద్ (954), 2) రంగారెడ్డి (961).

గమనిక: దేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి 943.

- దేశంలో అధిక స్త్రీ, పురుష నిష్పత్తి ఉన్న రాష్ట్రం కేరళ (1084).
- దేశంలో అత్యల్ప స్త్రీ,పురుష నిష్పత్తి ఉన్న రాష్ట్రం – హర్యానా (879).
- తెలంగాణలో అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లాలు 1) హైదరాబాద్ (18,172), 2) రంగారెడ్డి (707).
- రాష్ట్రంలో అత్యల్ప జనసాంద్రత ఉన్న జిల్లాలు 1) ఆదిలాబాద్ (170), 2) ఖమ్మం 175 (ప్రస్తుతం – 197).

గమనిక: భారతదేశ సగటు జనసాంద్రత 382.

- దేశంలో అత్యధిక జనసాంద్రత ఉన్న రాష్ట్రం బిహార్ (1106).
- దేశంలో అత్యల్ప జనసాంద్రత ఉన్న రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్ (17).
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాలు 1) ఉత్తరప్రదేశ్, 2) మహారాష్ట్ర.
- దేశంలో అత్యల్ప జనాభా ఉన్న రాష్ట్రాలు 1) సిక్కిం, 2) మిజోరాం.

తెలంగాణ జనాభా వృద్ధిరేటు

దశాబ్దం	వృద్ధిరేటు (శాతాల్లో)
1961–71	24.43
1971–81	27.58
1981–91	29.27
1991–2001	18.77
2001–2011	13.58

తెలంగాణలో జిల్లాల వారీగా జనాభా పరిమాణం

జిల్లాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం జనాభా
మహబూబ్‌నగర్	20,50,386	20,02,642	40,53,028
రంగారెడ్డి	27,01,008	25,95,733	52,96,741
హైదరాబాద్	20,18,575	19,24,748	39,43,323
మెదక్	15,23,030	15,10,258	30,33,288
నిజామాబాద్	12,50,641	13,00,694	25,51,335
ఆదిలాబాద్	13,69,597	13,71,642	27,41,239
కరీంనగర్	18,80,800	18,95,469	37,76,269
వరంగల్	17,59,281	17,53,295	35,12,576
ఖమ్మం	12,98,543	13,08,523	26,07,066
నల్లగొండ	17,59,772	17,29,037	34,88,809
మొత్తం	3,50,03,674	1,73,92,041	3,50,03,674

జిల్లాల వారీగా జనసాంద్రత, లింగ నిష్పత్తి

జిల్లాలు	జనసాంద్రత	లింగ నిష్పత్తి
మహబూబ్‌నగర్	220	977
రంగారెడ్డి	707	961
హైదరాబాద్	18,172	954
మెదక్	313	992
నిజామాబాద్	321	1,040
ఆదిలాబాద్	170	1,001
కరీంనగర్	319	1,008
వరంగల్	273	997
ఖమ్మం	197	1,008
నల్లగొండ	245	983
మొత్తం	312	988

గమనిక: ఖమ్మం జిల్లాలోని ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడానికి ముందు తెలంగాణ జనసాంద్రత 307.

జనాభా వృద్ధిరేటు

ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట కాలంలో పెరిగే జనాభాను 'జనాభా వృద్ధి' అంటారు. ఏడాది కాలంలో ప్రతి వంద మంది జనాభాకు అదనంగా ఎంత మంది చేరుతున్నారో తెలిపే రేటును 'జనాభా వృద్ధిరేటు'గా పేర్కొంటారు.

- రాష్ట్రంలో 2001–11 మధ్య కాలంలో జనాభా వృద్ధిరేటు 13.58 శాతం.
- తెలంగాణలో 2001–11 దశాబ్ద కాలంలో అధిక జనాభా వృద్ధిరేటు ఉన్న జిల్లాలు.. 1) రంగారెడ్డి (48.16 శాతం), 2) మహబూబ్‌నగర్ (15.34 శాతం).
- రాష్ట్రంలో 2001–11 దశాబ్ద కాలంలో అల్ప జనాభా వృద్ధిరేటు నమోదైన జిల్లాలు.. 1) హైదరాబాద్ (2.97%) 2) నల్లగొండ (7.41%).

గమనిక: 2001–11లో భారతదేశ జనాభా వృద్ధిరేటు 17.7 శాతం.

- దేశంలో అధిక జనాభా వృద్ధిరేటు ఉన్న రాష్ట్రం మేఘాలయ (27.9 శాతం)
- దేశంలో అల్ప జనాభా వృద్ధిరేటు ఉన్న రాష్ట్రం నాగాలాండ్ (–0.6 శాతం).
- తెలంగాణలో పురుషుల జనాభా 1.77 కోట్లు. రాష్ట్ర మొత్తం జనాభాలో 50.2 శాతం పురుషులు ఉన్నారు.
- రాష్ట్రంలో పురుషుల జనాభా అత్యధికంగా ఉన్న జిల్లాలు.. 1) రంగారెడ్డి (27.01 లక్షలు), 2) మహబూబ్‌నగర్ (20.50 లక్షలు).
- రాష్ట్రంలో పురుషుల జనాభా తక్కువగా ఉన్న జిల్లాలు.. 1) నిజామాబాద్ (12.50 లక్షలు), 2) ఆదిలాబాద్ (13.69 లక్షలు).
- రాష్ట్రంలో స్త్రీల జనాభా 1.74 కోట్లు. మొత్తం జనాభాలో 49.8 శాతం స్త్రీలు ఉన్నారు.
- రాష్ట్రంలో అత్యధిక స్త్రీ జనాభా ఉన్న జిల్లాలు 1) రంగారెడ్డి (25.95 లక్షలు), 2) మహబూబ్‌నగర్ (20.03 లక్షలు).
- రాష్ట్రంలో అత్యల్ప స్త్రీ జనాభా ఉన్న జిల్లాలు 1) నిజామాబాద్ (13.00 లక్షలు), 2) ఆదిలాబాద్ (13.71 లక్షలు).

మాదిరి ప్రశ్నలు

1. 2001–11 దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్ర జనాభా వృద్ధిరేటు ఎంత?
1) 14.58 2) 13.58
3) 12.58 4) 15.58
2. తెలంగాణ రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి సగటున అత్యల్పంగా ఉన్న జిల్లా ఏది?
1) రంగారెడ్డి 2) ఆదిలాబాద్
3) హైదరాబాద్ 4) కరీంనగర్
3. జనాభా పరంగా (2011 గణాంకాల ప్రకారం) దేశంలో తెలంగాణ రాష్ట్ర స్థానం?
1) 10 2) 11 3) 12 3) 13
4. 2011 జనాభా లెక్కల నినాదం ఏమిటి?
1) అవర్ సెన్సస్ – అవర్ ప్రాపర్టీ
2) అవర్ సెన్సర్ – గ్రోత్
3) అవర్ లైఫ్ – అవర్ ప్రాపర్టీ
4) అవర్ సెన్సస్ – అవర్ ఫ్యూచర్
5. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి రెండు జిల్లాలు వరసగా?
1) రంగారెడ్డి, మహబూబ్‌నగర్
2) నిజామాబాద్, ఖమ్మం
3) మహబూబ్‌నగర్, నిజామాబాద్
4) రంగారెడ్డి, హైదరాబాద్
6. జనాభా గణాంకాలను ఎన్నేళ్లకు ఒకసారి సేకరిస్తున్నారు?
1) 5 2) 10 3) 15 4) ఏడాది
7. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనసాంద్రత ఎంత?
1) 270 2) 352 3) 307 4) 299
8. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర లింగ నిష్పత్తి ఎంత?
1) 967 2) 975 3) 971 4) 988
9. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనాభా వృద్ధిరేటు ఉన్న జిల్లా ఏది?
1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
3) హైదరాబాద్ 4) నల్లగొండ

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 1; 6) 2; 7) 3; 8) 4; 9) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ మద్రాస్‌లో రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), మద్రాస్ ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్ /ఎమ్మెస్సీ /పీహెచ్‌డీ(ఫిజిక్స్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ మైక్రోవేవ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.75,000 నుంచి రూ.1,25,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2025
» **వెబ్‌సైట్:** https://icsrstaff.iitm.ac.in

పారాదీప్ పోర్ట్ అథారిటీ, ఒడిశాలో ట్రైనీ పైలట్ పోస్టులు

ఒడిశాలోని పారాదీప్ పోర్ట్ అథారిటీ(పీపీఏ) ఒప్పంద ప్రాతిపదికన ట్రైనీ పైలట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **అర్హత:** భారత ప్రభుత్వ షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన, విదేశాలకు వెళ్లే ఓడకు మాస్టర్‌గా కాంపిటెన్సీ సర్టిఫికేట్ లేదా షిప్పింగ్ మంత్రిత్వ శాఖ గుర్తించిన దానికి సమానమైన అర్హతను కలిగి ఉండటంతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 55 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.01.2026
» **వెబ్‌సైట్:** www.paradipport.gov.in

లక్నో యూనివర్శిటీలో డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

లక్నో యూనివర్శిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైల్డ్ సైన్సెస్‌లో ఒప్పంద ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.16,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, గేట్ నెం.05, లక్నో యూనివర్శిటీ, లక్నో–226007 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.01.2026.
» **వెబ్‌సైట్:** https://www.lkouniv.ac.in

మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం?

గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్

1. బెంజిమన్ హిగ్గిన్స్ అల్పాభివృద్ధి దేశాలకు సంబంధించిన ఏ అంశం గురించి పేర్కొన్నారు?
ఎ) సామాజిక ద్వంద్వత్వం
బి) సాంకేతిక ద్వంద్వత్వం
సి) అల్పస్థాయి సమతౌల్య స్తంభన
డి) వస్తుమార్పిడి విధానం
2. ఆధునిక అభివృద్ధిలో సాంకేతిక ప్రగతి ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నవారు?
ఎ) కుజ్‌నట్స్ బి) హరాడ్ - డోమార్
సి) మాధుర్ డి) షుంపీటర్
3. రోస్టో వృద్ధి సిద్ధాంతం ప్రకారం స్వయం సమృద్ధి సాధించిన దశగా దేన్ని భావించవచ్చు?
ఎ) అధిక వినియోగ దశ బి) ప్లవన దశ
సి) ప్లవన దశకు ముందున్న పరిస్థితి
డి) పరిపక్వ దశకు గమనం
4. కార్ల్‌మార్క్స్ కింది వాటిలో దేనికి ప్రాముఖ్యం ఇచ్చారు?
ఎ) మూలధన ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు - మూలధన నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
5. రోస్టో రచించిన "The stages of Economic Growth" గ్రంథాన్ని ఏ విధంగా వ్యవహరిస్తారు?
ఎ) కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
బి) నాన్ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
సి) మూలధన సంచయనం
డి) పైవన్నీ
6. ప్రపంచంలో అధిక జనాభా వల్ల కలిగే దుష్పరిణామాలను మొదటగా వివరించింది?
ఎ) డాల్టన్ బి) థామస్ మాల్థస్
సి) రాబిన్‌సన్ డి) డ్యూసెన్‌బరి
7. 2013-14లో దేశంలో స్థూల దేశీయ పొదుపు రేటు ఎంత?
ఎ) జీడీపీలో 30.6 శాతం
బి) జీడీపీలో 32 శాతం
సి) జీడీపీలో 33 శాతం
డి) జీడీపీలో 34 శాతం
8. "The problems of Industrialization in Eastern & South Eastern European Nations" గ్రంథకర్త?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) రొసెన్‌స్టీన్ రోడాన్ డి) థామస్ మన్రో
9. రాగ్నర్‌నర్క్స్ సిద్ధాంతం ప్రకారం డిమాండ్ కోణంలో విష వలయాన్ని ఛేదించడానికి పేద దేశాల్లో వేటికి డిమాండ్ పెరగాలి?
ఎ) పెట్టుబడి బి) పొదుపు
సి) ఆదాయం డి) వస్తువులు, సేవలు
10. 2016-17లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ప్రపంచ బ్యాంకు ఎంత శాతంగా అంచనా వేసింది?
ఎ) 7.7 బి) 7.8 సి) 7.9 డి) 8.0
11. మూడో ప్రపంచ దేశాలు అనే పదాన్ని మొదటి సారిగా ఉపయోగించినవారు?
ఎ) ఆల్‌ఫ్రెడ్ సవి బి) మార్షల్
సి) ఫిషర్ డి) జాన్ రాబిన్‌సన్
12. స్థిర మూల ధనానికి, చర మూలధనానికి మధ్య నిష్పత్తిని తెలిపేది?
ఎ) మూలధన - ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు - మూలధన ఉత్పత్తి నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
13. అభిలషణీయ జనాభా సిద్ధాంతాన్ని మొదటగా చెప్పిన శాస్త్రవేత్త?
ఎ) మాల్థస్ బి) ఎడ్వర్డ్ వెస్ట్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) షుంపీటర్
14. 'జనాభా పెరుగుదల సమాజంలో ఆదర్శవంతమైన మార్పునకు సహకరిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) డ్యూసెన్‌బరి
సి) గౌతమ్ మాధుర్ డి) మాల్థస్
15. బలహీన Spread effects గురించి వివరించినవారెవరు?
ఎ) హరాడ్ బి) ఫీల్డ్‌మన్
సి) గున్నార్ మిర్డాల్ డి) ఎడ్వర్డ్ వెస్ట్
16. వనరులతో పోలిస్తే తక్కువ పెట్టుబడులు ఉన్న దేశాలను అల్పాభివృద్ధి దేశాలుగా అభిప్రాయపడినవారు?
ఎ) ఫీల్డ్‌మన్ బి) హెబర్లర్
సి) మార్షల్ డి) రాగ్నర్‌నర్క్స్
17. కమ్యూనిజం, సోషలిజం ఆధారిత దేశాలను ఏ దేశాలుగా వర్ణించవచ్చు?
ఎ) మొదటి ప్రపంచ దేశాలు
బి) రెండో ప్రపంచ దేశాలు
సి) మూడో ప్రపంచ దేశాలు
డి) నాలుగో ప్రపంచ దేశాలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

18. అంతర్జాతీయ వాణిజ్యం అల్పాభివృద్ధి దేశాల పారిశ్రామికీకరణకు అవరోధమని భావించింది?
ఎ) గున్నార్ మిర్దాల్ బి) హర్షమన్
సి) డాల్టన్ డి) హెబర్లర్
19. విద్యా ప్రమాణాలు, శ్రామిక నైపుణ్యం పెరిగితే మూలధన - ఉత్పత్తి నిష్పత్తి?
ఎ) పెరుగుతుంది బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది
డి) పెరుగుదలలో పెరుగుదల రేటు ఎక్కువ
20. మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం ఏది?
ఎ) శ్రమ బి) మూలధనం
సి) వ్యవస్థాపన డి) తక్కువ సాంకేతిక ప్రగతి
21. ద్వి అంతర నమూనాను ప్రతిపాదించింది?
ఎ) చినరీ బి) కార్ల్ మార్క్స్
సి) మహలనోబిస్ డి) ఫీల్డ్‌మన్
22. 'శ్రమ విభజన ప్రత్యేకీకరణను పెంపొందిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) ఆడమ్ స్మిత్
సి) మహలనోబిస్ డి) గౌతమ్ మాధుర్
23. 2013-14లో స్థూల దేశీయ పొదుపులో ప్రభుత్వ రంగం వాటా ఎంత?
ఎ) జీడీపీలో 1% బి) జీడీపీలో 1.3%
సి) జీడీపీలో 1.5% డి) జీడీపీలో 1.6%
24. అంతర్జాతీయ వాణిజ్యం వెనుకబడిన దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నది?
ఎ) మార్షల్ బి) హెబర్లర్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) గౌతమ్ మాధుర్
25. Incremental Capital - Output Ratio (ICOR)ను ఎలా రాబట్టవచ్చు?
ఎ) (పొదుపులో మార్పు) (పెట్టుబడిలో మార్పు)
బి) (మూలధనంలో మార్పు) (ఉత్పత్తిలో మార్పు)
సి) (పెట్టుబడిలో మార్పు) (శ్రమలో మార్పు)
డి) ఏదీకాదు
26. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి ప్రధాన పాత్ర పోషించిన కారకం ఏది?
ఎ) మూలధన సంచయనం
బి) జనాభా పెరుగుదల
సి) సహజ వనరుల లభ్యత డి) పైవన్నీ
27. మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా వృద్ధిరేటును తగ్గించేది?
ఎ) ప్రకృతి బి) తక్కువ ఉపాధి
సి) తక్కువ ఆదాయం డి) పైవన్నీ
28. "Towards A dynamic Economics" గ్రంథకర్త?
ఎ) డోమార్ బి) హరాడ్
సి) రాబిన్‌సన్ డి) ఫీల్డ్‌మన్
29. ట్రికిల్ డౌన్ వ్యూహాన్ని ప్రతిపాదించింది?
ఎ) ఫీల్డ్‌మన్ బి) రాబిన్‌సన్
సి) షుంపీటర్ డి) మహలనోబిస్
30. అల్పాభివృద్ధి దేశాలను ప్రపంచ మురికి వాడలుగా పేర్కొన్నవారు?
ఎ) మార్షల్ బి) ఆడమ్‌స్మిత్
సి) రాబిన్‌సన్ డి) కైరన్‌క్రాస్
31. 'అదృశ్య హస్తం' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించినవారు?
ఎ) మార్షల్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) ఆడమ్ స్మిత్ డి) మీడ్
32. అల్ప స్థాయి సమతౌల్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు చాలా కాలం చిక్కుకొని ఉన్నాయని పేర్కొన్నవారు?
ఎ) నెల్సన్ బి) లూయిస్
సి) డాల్టన్ డి) జె.బి. సే
33. అల్పాదాయం అనేది అల్పాభివృద్ధి దేశాల్లో విష వలయాలకు కారణమవుతోందని పేర్కొన్నవారు?
ఎ) డాల్టన్ బి) రాబిన్‌సన్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) హెబర్లర్
34. వెనుకబడ్డ దేశాల్లో అమల్లో ఉన్న సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి నిరోధకాలుగా ఉంటాయి. వీటిని ఏమంటారు?
ఎ) సాంకేతిక పూర్వక నిరోధకాలు
బి) వ్యవస్థాపూర్వక నిరోధకాలు
సి) మార్కెట్ సంపూర్ణతలు
డి) పైవన్నీ
35. ఆసియా దేశాల్లో ఉద్యమత్వం లోపించడానికి మూలధన కొరత లేదా ముడి సరకుల కొరత కారణం కాదని పేర్కొన్నది ఎవరు?
ఎ) గున్నార్ మిర్దాల్ బి) ఆడమ్ స్మిత్
సి) జె.బి. సే డి) హెబర్లర్
36. అధిక స్థాయి తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన జనాభా స్థాయిని అభిలషణీయ జనాభాగా పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్, జె.బి. సే
బి) మార్షల్, ఆడమ్ స్మిత్
సి) డాల్టన్, ఎడ్విన్ కానన్
డి) ఏదీకాదు
37. 'పొదుపును ప్రోత్సహించడం ద్వారా లభించే మూలధనాన్ని గుర్తించిన రంగాల్లో పెట్టుబడులుగా మార్చాలి' అనేది ఏ రకమైన వృద్ధి వ్యూహం?
ఎ) ప్లవన దశ బి) సంతులిత
సి) అసంతులిత
డి) పరిపక్వ దశకు గమనం
38. "Rate of Growth and Employment" గ్రంథకర్త?
ఎ) హరాడ్ బి) డోమార్
సి) రాబిన్‌సన్ డి) రాగ్నర్‌నర్క్స్
39. మహలనోబిస్ నాలుగు రంగాల నమూనా ఏ సిద్ధాంతంపై ఆధారపడి ఉంది?
ఎ) ట్రికిల్ డౌన్ వ్యూహం
బి) సోలో సిద్ధాంతం
సి) డోమార్ సిద్ధాంతం
డి) అధిక పెట్టుబడుల సిద్ధాంతం
40. ఆదాయం, డిమాండ్ పెరగడం వల్ల లాభోద్దేశంతో సమకూరే పెట్టుబడి?
ఎ) స్వయం ప్రేరిత పెట్టుబడి
బి) ప్రేరిత పెట్టుబడి
సి) స్థూల పెట్టుబడి డి) నికర పెట్టుబడి
41. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ పోటీ, స్వేచ్ఛా వ్యాపారం, వేతన సరళత ఉండాలని పేర్కొన్నవారు?
ఎ) కీన్స్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) ఫ్రీడ్‌మన్
డి) సాంప్రదాయ ఆర్థికవేత్తలు
42. 'అభివృద్ధి లక్ష్యం అభిలషణీయ స్వర్ణయుగాన్ని సాధించడం' అని పేర్కొన్నవారు?
ఎ) గౌతం మాధుర్ బి) ఆడమ్ స్మిత్
సి) రాబిన్‌సన్ డి) జె.బి. సే
43. 'ఆర్థికాభివృద్ధి నిత్యం కొనసాగే అంతులేని ప్రక్రియ' అని పేర్కొన్నవారెవరు?
ఎ) మార్షల్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) హెగల్ డి) డాల్టన్
44. ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ ఒక స్థాయి నుంచి పై స్థాయికి కదలడాన్ని ఆర్థికాభివృద్ధిగా అభివర్ణించినవారు?
ఎ) షుంపీటర్ బి) గున్నార్ మిర్దాల్
సి) కీన్స్ డి) డ్యూసెన్‌బరి
45. 'ఆర్థికాభివృద్ధి ప్రారంభంలో శ్రమ సాంద్రత పద్ధతులు, ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న తర్వాత మూలధన సాంద్రత పద్ధతులు ఉపయోగించాలి' అని పేర్కొన్నవారు?
ఎ) ఐక్యరాజ్య సమితి నిపుణులు
బి) ప్రపంచ బ్యాంకు
సి) IMF డి) WTO
46. చిరకాలంలో వాస్తవిక తలసరి ఆదాయం పెరుగుదలను ఆర్థికాభివృద్ధిగా పేర్కొన్నది?
ఎ) డాల్టన్ బి) కానన్
సి) హెగల్ డి) ఆచార్య ఎల్లిస్
47. భారీ పరిశ్రమలు స్థాపించడం వల్ల దశల వారీగా వాటి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులోకి వచ్చి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని చెప్పినవారు?
ఎ) ఆడమ్‌స్మిత్ బి) ఫీల్డ్‌మన్
సి) డాల్టన్ డి) హెగల్
48. "Business cycles, Capitalism, Socialism and Democracy" గ్రంథకర్త?
ఎ) షుంపీటర్ బి) కానన్
సి) హెగల్ డి) ఎల్లిస్
49. పొదుపు, పెట్టుబడుల మధ్య అంతరాన్ని పూరించడానికి అల్పాభివృద్ధి దేశాలు సాధారణంగా ఏ సాధనాన్ని ఉపయోగిస్తాయి?
ఎ) పన్నుల రేటు పెంచడం
బి) లోటు బడ్జెట్ సి) విదేశీ సహాయం
డి) అంతర్గత రుణాలు
50. "An Operational Research Approach to Indian Planning of 4 sector model" పుస్తక రచయిత?
ఎ) ఆడమ్ స్మిత్ బి) కార్ల్‌మార్క్స్
సి) మహలనోబిస్ డి) మార్షల్

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి; 5) బి;
6) బి; 7) ఎ; 8) సి; 9) డి; 10) బి;
11) ఎ; 12) సి; 13) బి; 14) ఎ; 15) సి;
16) డి; 17) బి; 18) ఎ; 19) సి; 20) బి;
21) ఎ; 22) బి; 23) డి; 24) బి; 25) బి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) ఎ; 30) డి;
31) సి; 32) ఎ; 33) సి; 34) బి; 35) ఎ;
36) సి; 37) సి; 38) బి; 39) ఎ; 40) బి;
41) డి; 42) ఎ; 43) సి; 44) బి; 45) ఎ;
46) డి; 47) బి; 48) ఎ; 49) బి; 50) సి.

Whose rank is first in a class test?

MODEL QUESTIONS

BANK EXAMS

REASONING

Directions (Q. No. 1-5): Study the following information carefully and answer the following questions.

P, Q, R, S, T and U are six members of a group in which there are three female members. Females work in three departments - Accounts, Administration and HR - and sit on three different floors - Ground floor, first floor and second floor. Person working in the same department are not on the same floor. On each floor two persons work. No two females working in the same department or sit on the same floor. Q and T work in the same department but not in HR. S works in Administration. T and P are on the ground floor and second floor respectively and work in the same department. S, a female does not sit on the first floor. R, a male works on ground floor. U, works on the first floor; and S and P work on the same floor.

1. Which of the following group of members are female?
1) S, T, U 2) R, S, T
3) Q, T, U 4) P, S, U
5) Can't be determined
2. Which of the following pair of person work in Administration?
1) R, S 2) Q, S 3) R, T
4) Data inadequate
5) None of these
3. Which of the following pair works on second floor?
1) P, S 2) R, S 3) Q, U
4) S, T 5) None of these
4. U works in which department?
1) Accounts 2) HR
3) Administration
4) Either HR or Administration
5) None of these
5. If U is transferred to Accounts and T is transferred to Administration, who is to be transferred to HR to maintain the original distribution of female on each floor.
1) R 2) S 3) Q or S
4) Data inadequate
5) None of these

Directions (Q. No. 6-8): Study the following information carefully and answer the given questions:

Six students A, B, C, D, E and F wrote an exam and the following is the data regarding their marks (maximum marks is 20).

- E got twice as much as A.
- A got one-and-a-half times as much as C.
- B got one-third of the marks scored by E.
- D got double that of C.
- F scored 6 marks more than A but is not the topper of the class. (All marks are integers)

6. Who is the topper of the class & how many marks did he obtain?
1) D - 15 2) E - 12 3) A - 18
4) D - 12 5) E - 18
7. How much marks does A have to score to be the topper? (if only one person is on 1st position.)
1) 9 2) 6 3) 8 4) 10 5) 12
8. What is the difference between the marks obtained by C and F?
1) 6 2) 7 3) 5 4) 8 5) 9

Directions (Q. No. 9-13): Each of the questions below consists of a question and three statements numbered I, II and III given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question and then mark the appropriate option as answer.

9. Six friends M, T, S, R, U and W are sitting around a circular table facing the centre. What is the position of S with respect to M?
I) M is between R and T.
II) R sits second to the left of W.
III) U does not sit on the immediate right of R.
1) Only I and II 2) Only II and III
3) Only III
4) Only I and III
5) All I, II and III together
10. What is the code for 'cold' in a code language?
I) 'icecream is cold' is written as 'tic jic lic'.
II) 'fruits are healthy' is written as 'mic fic eic'.
III) 'healthy is icecream' is written as 'jic mic lic'.
1) Only I 2) Only II
3) Only I and II 4) Only III and I
5) None of these
11. Among P, Q, R, S, T and U, whose rank is first in a class test?
I) P scored more than only R and S.
II) T's rank is 3rd highest.
III) U did not score the highest marks.
1) Only I 2) Only II 3) Only III
4) I, II and III even together are not sufficient to answer the question.
5) All I, II and III
12. Five persons Jitesh, Jeevan, Jeet, Jai and Jeena sit on a straight line, facing north, but not necessarily in the same order. How many persons sit between Jitesh and Jai?
I) Jeet sits second to the right of Jitesh. Jai is not an immediate neighbour of Jitesh.
II) Jeena sits on the extreme end of the line.
III) Jeet sits on the immediate right of Jeevan.
1) Only II 2) Only III
3) Only I and II 4) Only I and III
5) All I, II and III together
13. How is N related to X?
I) M is brother of N; M is grandson of W.
II) S is sister of N.
III) X is mother of M's father.
1) Only I 2) Only II 3) Only III
4) All I, II and III together
5) Even I, II and III together are not sufficient

Directions (Q. No. 14 - 18): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: set near 14 19 went 20 78 ago 80 toy 36 pink 42 colour
Step I: went set near 19 20 78 ago 80 toy 36 pink 42 colour 14
Step II: went toy set near 20 78 ago 80 36 pink 42 colour 14 19
Step III: went toy set pink near 78 ago 80 36 42 colour 14 19 20
Step IV: went toy set pink near colour 78 ago 80 42 14 19 20 36
Step V: went toy set pink near colour ago 78 80 14 19 20 36 42
Step VI: went toy set pink near colour ago 80 14 19 20 36 42 78
Step VII: went toy set pink near colour ago 14 19 20 36 42 78 80

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 near.

(All the numbers are two-digit numbers.)

14. Which step number is the following output?
two thus so one near and 90 88 make 56 12 15 18 21
1) Step V 2) Step VI
3) Step IV 4) Step III
5) There is no such step
15. How many elements (words or numbers) are there between 'make' and '18' as they appear in last but one step?
1) 3 2) 4 3) 5 4) 2 5) 6
16. How many steps would be required to get the final output?
1) Five 2) Six 3) Four
4) Seven 5) None of these
17. Which of the following represents the position of 'and' in the fifth step?
1) Sixth from the left
2) Seventh from the left
3) Fourth from the right
4) Eighth from the left
5) Sixth from the right
18. Which word/number would be at fifth position from the right in Step VI?
1) 12 2) 18 3) 90
4) and 5) 15

Answers With Explanations

Person	Sex	Floor	Department
P	Male	Second floor	Accounts
Q	Male	First floor	Accounts
R	Male	Ground floor	HR/Administration
S	Female	Second floor	Administration
T(-)	Female	Ground floor	Accounts
U(-)	Female	First floor	HR

(1-5):
1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 2.

(6-8): E → 18
F → 15
D → 12
A → 9
B/C → 6

6) 5; 7) 4; 8) 5; 9) 5;

From I



From I and II



From I, II and III



From all three statements, M sits second to the left of S. So, all three statements are necessary to answer the question.

10. 4; From I and III,
icecream is cold → tic jic lic ...(1)
healthy is icecream → jic mic lic ...(2)
icecream → jic or lic
is → lic or jic
So, the code for 'cold' is 'tic'.
Thus, statements **I** and **III** are sufficient

11. 5; From I. P > R, S
From I and II. – > – > T > P > R, S
From I, II and III.
Q > U > T > P > R, S
Hence all together are sufficient

12. 3; **Form I.**
Jitesh Jeet Jai
Jitesh Jeet Jai
or
Jitesh Jeet Jai
Form I& II
Jeena Jitesh Jeevan Jeet Jai
or
Jitesh Jeevan Jeet Jai Jeena
Thus **I** and **II** together are sufficient.

13. 5; **From I.** M is Brother of N and Grand-son of W and M is male.
From II. S is female and Sister of M,
From III. X is Grand mother of M.
So, in family tree, the sum of all three statements is as follows:



Here N's gender is not defined So, we can't say whether N is Grandson or Granddaughter of X.

(14-18):
The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.
Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 nears.
Step I: two one 15 and 90 88 make 18 so 21 thus 56 near 12
Step II: two thus one and 90 88 make 18 so 21 56 near 12 15
Step III: two thus so one and 90 88 make 21 56 near 12 15 18
Step IV: two thus so one near and 90 88 make 56 12 15 18 21
Step V: two thus so one near make and 90 88 12 15 18 21 56
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88
Step VII: two thus so one near make and 12 15 18 21 56 88 90
14. 3;
15. 2;
Sixth step is the last but one.
There are four elements between 'make' and '18'.
The elements are : and, 90, 12 and 15
16. 4;
17. 2; **Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
Thus, Seventh from the left is 'and'.
18. 5;
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88.
Thus fifth from the right is 15